# మార్క్స్
# ఎంగెల్స్
# లెనిన్

# కమ్యూనిస్టు సమాజం గురించి

సంకలనం

సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!

# మార్క్స్, ఎంగెల్స్, లెనిన్

# కమ్యూనిస్టు సమాజం గురించి

## సంకలనం

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో

సంకలనకర్త: టి. బొరొదూలిన్

అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి

ప్రథమ ముద్రణ 1976
ద్వితీయ ముద్రణ 1984

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1976

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

МЭЛ $\frac{0101010000-0101020000}{014(01)-84}$ 343—84

# విషయసూచిక

## కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్


మార్క్స్, ఎంగెల్స్. పవిత్ర కుటుంబం (కొంత భాగం) . . . . . 7
ఎంగెల్స్. ఎల్బెర్‌ఫెల్డ్ ఉపన్యాసాలు (కొంత భాగం) . . . . . . 9
ఎంగెల్స్. కమ్యూనిజం సూత్రాలు (కొంత భాగం) . . . . . . 17
మార్క్స్, ఎంగెల్స్. కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక (కొంత భాగం) . . 21
మార్క్స్. గోతా కార్యక్రమ విమర్శ (కొంత భాగం) . . . . . . 32
ఎంగెల్స్. ఆంటీ డ్యూరింగ్ (కొంత భాగం) . . . . . . . . 42
ఎంగెల్స్. ప్రకృతిలోని పరస్పరవాదం (కొంత భాగం) . . . . . . 56
ఎంగెల్స్. ఫ్రాన్సు, జర్మనీలలో రైతు సమస్య (కొంత భాగం) . . . 58


## ఉత్తరాలు


జె. వేడిమేయర్‌కు మార్క్స్ రాసిన ఉత్తరం, మార్చి 5, 1852 (కొంత భాగం) 67
కె. కౌట్స్కీకి ఎంగెల్స్ రాసిన ఉత్తరం, ఫిబ్రవరి 1, 1881 (కొంత భాగం) . 68
పి. వన్ పాట్టెన్‌కు ఎంగెల్స్ రాసిన ఉత్తరం, ఏప్రెల్ 18, 1883 (కొంత భాగం) . . . . . . . . . . . . . . . 70
ఓ. ఫన్ బోనిగ్‌కు ఎంగెల్స్ రాసిన ఉత్తరం, ఆగస్టు 21, 1890 (కొంత భాగం) . . . . . . . . . . . . . . 71

మార్క్సిజంయొక్క మూడు మూలాలూ, మూడు భాగాలూ (కొంత భాగం) . 75
కార్ల్ మార్క్స్ (కొంత భాగం) . . . . . . . . . . . 82
స్వయంనిర్ణయంమీద జరిగిన చర్చ సారాంశం (కొంత భాగం) . . . . . 86
రాజ్యమూ, విప్లవమూ (కొంత భాగం) . . . . . . . . . . 92
రాజ్యం గురించి మార్క్సిజం (కొంత భాగం) . . . . . . . . . 112
పోటీని యేర్పరచడం యెలా? . . . . . . . . . . . . . 114
ఆర్థిక కౌన్సిళ్ల మొదటి అఖిల రష్యా మహాసభలో ఉపన్యాసం, మే 26, 1918 125
మహా ప్రారంభం (కొన్ని భాగాలు) . . . . . . . . . . . 134
కార్మికవర్గ నియంతృత్వ యుగంలో ఆర్థిక విధానమూ, రాజకీయాలూ (కొంత భాగం) . . . . . . . . . . . . . . 145
ఆర్.సి.పి.(బి.) మాస్కో నగర కాన్ఫరెన్సుకు "సుబ్బోత్నిక్కుల" మీద యిచ్చిన నివేదిక, డిసెంబర్ 20, 1919 (కొంత భాగం) . . . . . 148
పాత సామాజిక వ్యవస్థ విధ్వంసంనుండి కొత్త సామాజిక వ్యవస్థ సృష్టివరకు . 151
మాస్కో-కజాన్ రైల్వేమీది మొదటి "సుబ్బోత్నిక్కు" నుండి అఖిల రష్యా మే డే "సుబ్బోత్నిక్కు" దాకా . . . . . . . . . . . 154
సహకారంమీద . . . . . . . . . . . . . . . 157
తక్కువే మేలు, కానీ మేలుగా వుండాలి . . . . . . . . . 166

# కార్ల్ మార్క్స
# ఫ్రెడరిక్ ఎంగెల్స్

# మార్క్స్, ఎంగెల్స్

# పవిత్ర కుటుంబం

(కొంత భాగం)

మానవుల జన్మసిద్ధమైన మంచితనం గురించీ, సమాన బౌద్ధిక శక్తిని గురించీ, అనుభవంయొక్కా, అలవాటుయొక్కా, విద్యయొక్కా సర్వసమర్థత గురించీ, మానవుని మీద పరిసరాల ప్రభావం గురించీ, శ్రమశీలతయొక్క మహా ప్రాముఖ్యం గురించీ, ఆనందంయొక్క సమర్థనీయత గురించీ, వగైరాల గురించి భౌతికవాదం* బోధించిన దాన్నిబట్టి, భౌతికవాదం యెలా కమ్యూనిజంతోనూ, సోషలిజంతోనూ అవశ్యంగా లంకింపబడివుండేదీ గమనించడానికి పెద్ద పరిశీలనా శక్తి అక్కర లేదు. మానవుడు తన జ్ఞానమూ, యింద్రియానుభూతీ, వగైరాలన్నిటినీ యింద్రియాల ప్రపంచంనుండీ, దానిలో లభ్యమైన అనుభవంనుండీ గ్రహిస్తే, మానవుడు నిజంగా మానవీయమైనదానిని అనుభవించేటట్లుగానూ, దానికి అలవాటుపడేటట్లుగానూ, మానవునికి తాను మానవుణ్ణనే స్పృహ కలిగేటట్లుగానూ ప్రత్యక్ష ప్రపంచాన్ని యేర్పాటుచేయాలి. సరిగా అర్థం చేసుకోబడిన ప్రయోజనం సకల నీతుల సూత్రం అయితే, మానవుని సొంత ప్రయోజనం మానవజాతియొక్క ప్రయోజనంతో సమవసించేటట్లు చేయాలి. మానవుడు భౌతిక

---

* భౌతికవాదం — తత్వశాస్త్రంలోని రెండు ప్రధాన ధోరణులలో ఒకటి. భావవాదానికి భిన్నంగా, భౌతికవాదం ప్రపంచం భౌతికమైనదనీ, పదార్థమూ, ప్రకృతీ, ఉనికీ ప్రాథమికమైనవి కాగా, చైతన్యమూ, ఆలోచనా, యింద్రియానుభూతీ ద్వితీయమైనవనీ చెపుతుంది. తత్వశాస్త్ర చరిత్ర అంతా భౌతికవాదమూ, భావవాదమూ అనే రెండు ప్రధాన పక్షాల మధ్య జరిగే పోరాటపు చరిత్రే. యిక్కడ మార్క్స్, ఎంగెల్సు 18వ శతాబ్దపు ఫ్రెంచి భౌతికవాదులైన డిడ్రో, గోల్బాహ్, హెల్వెటియున్‌లను ప్రస్తావిస్తున్నారు. వీళ్ల భావాలను ఊహాస్వర్గ సోషలిస్టులైన సెంట్‌సైమన్, ఫోరియర్, కాబెట్, తదితరులు ఉపయోగించుకొన్నారు. — సం.

వాద అర్థంలో స్వేచ్ఛారహితుడైతే — అనగా, స్వేచ్ఛ అనేది దీనినో దానినో పరిహరించే రుణాత్మక శక్తి కాక, తన అసలైన వ్యక్తిత్వాన్ని స్థిరపరచుకొనే ధనాత్మక శక్తి అయితే — నేరానికి వ్యక్తిని శిక్షించకూడదు, నేరంయొక్క సమాజ వ్యతిరేక మూలాన్ని ధ్వంసం చేయాలి, తన వ్యక్తిత్వాన్ని జీవవంతంగా వ్యక్తీకరించుకోడానికి ప్రతి మానవునికీ సామాజిక అవకాశం యివ్వాలి. మానవుడు తన పరిసరాలచేత రూపుదిద్దబడితే, అతని పరిసరాలను మానవీయం చేయాలి. మానవుడు స్వభావతః సమాజ జీవి అయితే, అతను తన అసలైన స్వభావాన్ని సమాజంలో మాత్రమే అభివృద్ధి చేసుకుంటాడు, అతని స్వభావంయొక్క శక్తిని విడివిడి వ్యక్తుల శక్తితో కాక, సమాజంయొక్క శక్తితో కొలవాలి.

1844 సెప్టెంబర్ — నవంబర్‌లో రచించబడింది

ఎంగెల్స్

# ఎల్బెర్ ఫెల్డ్ ఉపన్యాసాలు

(కొంత భాగం)

వ్యక్తుల ప్రయోజనాలు పరస్పరం వ్యతిరేకంగా వుండకపోవడమే కాక, పరస్పరం సమవసించే కమ్యూనిస్టు సమాజంలో పోటీ అనేది తొలగింపబడుతుంది. తేటతెల్లంగా తెలుస్తున్నట్లు, ఫలానా వర్గాలు చితికిపోవడమనే సమస్యే యిక యెంత మాత్రం వుండ జాలదు, యీనాటి ధనిక, బీద వర్గాలలాంటి వర్గాలు వుండడమనే సమస్య కూడా వుండ జాలదు. జీవితావసర వస్తువుల ఉత్పత్తి, పంపకాలనుండి సొంత లాభం అనేది, వ్యక్తి తన పాటికి తాను ధనవంతుడు కావాలనే లక్ష్యం, అదృశ్యమైన వెంటనే వాణిజ్య సంక్షోభాలు వాటిపాటికవే అదృశ్యవౌతాయి. కమ్యూనిస్టు సమాజంలో ఉత్పత్తిని గురించీ, వినియోగం గురించీ సమాచారం తెలుసుకోవడం సులభంగా వుంటుంది. సగటున ఒకొక మనిషికి యెంత అవసరమైనదీ మనకు తెలుసు గనుక, యింతమంది మనుషులకు యెంత అవసర మయ్యేదీ లెక్కచేయడం సులభం; ఉత్పత్తి యిక యెంత మాత్రమూ సొంత ఉత్పాదకుల చేతుల్లో వుండక, సమాజం చేతుల్లోనూ, దాని నిర్వాహక సంస్థల చేతుల్లోనూ వుంటుంది గనుక, అవసరాలనుబట్టి ఉత్పత్తిని నియంత్రించడం స్వల్ప విషయంగా వుంటుంది.

యీ విధంగా, యీనాటి సామాజిక సన్నివేశంలోని ప్రధానమైన కీడులు కమ్యూనిస్టు వ్యవస్థీకరణలో యెలా అదృశ్యమయ్యేదీ మనకు కనపడుతుంది. కానీ, మరి కాస్త వివరాలలోకి పోతే, అలాంటి సామాజిక వ్యవస్థీకరణయొక్క సౌకర్యాలు యింత మాత్రమే కాదనీ, బోలెడు యితర లోపాలు కూడా తొలగిపోతాయనీ మనకు అర్థమౌతుంది. యీ రోజు నేను కొద్ది ఆర్థిక లోపాలను మాత్రమే ప్రస్తావిస్తాను. ఆర్థిక దృష్ట్యా చూస్తే, సమాజం యీనాడు యేర్పాటైన పద్ధతి మనం ఊహించజాలనంత హేతు రహితంగా, అనాచరణీయంగా వుంది. ప్రయోజనాల పరస్పర వ్యతిరేకత ఫలితంగా, సమాజానికి యేమీ ఉపయోగం లేని పద్ధతిలో పెద్ద మొత్తం శ్రమశక్తి వినియోగింపబడుతున్నది,

గణనీయమైన మొత్తం పెట్టుబడి పునరుత్పాదకం కాకుండా అనవసరంగా నష్టమౌ తున్నది. వాణిజ్య సంక్షోభాలలో యిది యిప్పటికే మనకు కనపడుతున్నది. మనుషులు యెంతో ప్రయత్నంతో ఉత్పత్తి చేసిన సరుకుల రాసులు అమ్మకందార్లకు నష్టం వచ్చే ధరలకు పారవేయబడడం మనం చూస్తున్నాము; యెంతో ప్రయత్నంతో ప్రోగు చేయబడిన పెట్టుబడి రాసులు, దివాలాల ఫలితంగా, వాటి సొంతదార్ల కనుల ముందరే అదృశ్యం కావడం మనం చూస్తున్నాము. యీనాటి వాణిజ్యాన్ని మరి కాస్త వివరంగా చర్చిద్దాం. ప్రతి సరుకూ వాస్తవ వినియోగదారుని చేరేటప్పటికి యెన్ని చేతులు మార వలసి వుందో యోచించండి. ఉత్పత్తిదారునికీ, వినియోగదారునికీ మధ్య యీనాడు యెంత మంది సట్టా వ్యాపారపు, దగాకోరు, అనవసర దళారులు దూరినారో యోచించండి! ఉదాహరణకు, ఉత్తర అమెరికాలో ఉత్పత్తి అయిన ఒక బేలు దూదిని తీసుకుందాం. బేలు రైతు చేతుల్లోనుండి మిసిసిపి నదీ తీరంలోని యేదో ఒక స్టేషన్‌లో వున్న యేజంటు చేతుల్లోకి పోయి, నదిమీద న్యూ ఆర్లియన్సుకు ప్రయాణం చేస్తుంది. యిక్కడ అది రెండవ సారి అమ్మకమౌతుంది — అప్పటికే యేజంటు రైతునుండి కొన్నాడు గనుక, యిది రెండవ అమ్మకం. యీ రెండవ అమ్మకం బహుశా సట్టా వ్యాపారస్తునికి జరుగుతుంది. అతను మళ్లీ అమ్ముతాడు — యెగుమతిదారునికి. బేలు యిప్పుడు లివర్‌పూల్‌కు ప్రయాణం చేస్తుంది. అక్కడ మళ్లీ ఒక దురాశాపరుడైన సట్టా వ్యాపారస్తుడు చేతులు చాచి దానిని లాక్కుంటాడు. యీ మనిషి దానిని ఒక కమిషన్ యేజంటుకు అమ్ము తాడు; యీ యేజంటు ఒక జర్మన్ వ్యాపారసంస్థ తరఫున కొనేవా డనుకుందాం. అలా బేలు రోటర్‌డామ్‌కు చేరి, రైన్ నదిమీద ప్రయాణం చేసి, మరొక డజన్ రవాణా యేజంట్ల చేతులు మారి, డజన్‌సార్లు అన్‌లోడింగూ, లోడింగూ చేయబడి, అప్పుడు మాత్రమే చేరుతుంది, వినియోగదారుని చేతుల్లోకి కాదు, ఉత్పత్తిదారుని చేతుల్లోకి. అతను మొదట దానిని వినియోగ వస్తువుగా చేస్తాడు, బహుశా తన నూలును నేతపని వానికి అమ్ముతాడు. యితను తాను నేసినదానిని రంగు లద్దేవానికి అమ్ముతాడు. అతను దానిని టోకు వర్తకునికీ, అతను చిల్లర వర్తకునికీ అమ్ముతారు. చిల్లర వర్తకుడు ఆ సరుకును అంతిమంగా వినియోగదారునికి అమ్ముతాడు. యీ లక్షలమంది మధ్యంతర దగాకోర్లూ, సట్టా వ్యాపారస్తులూ, యేజంట్లూ, యెగుమతిదార్లూ, కమిషన్ యేజంట్లూ, రవాణా యేజంట్లూ, టోకు వర్తకులూ, చిల్లర వర్తకులూ, అసలు సరుకుకు వాస్తవంగా యేమీ చేర్చనివాళ్లు — వాళ్లందరూ బతక గోరుతారు, లాభం సంపా యించ గోరుతారు — మొత్తంమీద సంపాయిస్తారు కూడా, లేకపోతే బతకలేరు. మిత్రు లారా, అమెరికానుండి జర్మనీకి దూదిని తేవడానికీ, దానినుండి తయారైన సరుకును నిజమైన వినియోగదారుని చేతుల్లోకి చేర్చడానికీ, పదిసార్లు అమ్మకమూ, వందసార్లు

లోడింగూ, అన్‌లోడింగూ, ఒక గిడ్డంగినుండి మరొక గిడ్డంగికి రవాణా చేసే యీ జటిలమైన వ్యవహారంకంటె సరళమైన, చౌక అయిన మార్గం లేదా? ప్రయోజనాల భిన్నత్వం మూలంగా జరిగే శ్రమశక్తియొక్క బహువిధ దుర్వ్యయానికి యిది కన్నులకు కట్టినట్లున్న ఉదాహరణ కాదా? హేతుబద్ధంగా వ్యవస్థీకరింపబడిన సమాజంలో అలాంటి జటిలమైన రవాణా పద్ధతి ఊహించరానిది. మన ఉదాహరణను కొనసాగిద్దాం. ఒక వూరికి యెంత దూది, లేదా యెన్ని జవులీ సరుకులు అవసరమైనదీ తెలుసుకోవడం సులభమైనట్లే, దేశంలోని అన్ని గ్రామాలకూ, పట్టణాలకూ యెన్ని అవసరమైనదీ నిర్ణయించడం కేంద్ర అధికారానికి సులభం. ఒకసారి అలాంటి లెక్కలు తయారుచేస్తే — వాటిని ఒకటి, రెండేండ్లలో సులభంగా తయారుచేయవచ్చు — సగటు సాలుసరి వినియోగం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మాత్రమే మారుతుంది. కనుక, ప్రజలకు ప్రతి సరుకూ యెంత మొత్తం కావలసిందీ తగిన సమయంలో ముందుగా నిర్ణయించడం సులభం. మొత్తం యావత్తూ సరఫరా మూలంనుండి నేరుగా తెప్పించబడుతుంది. అప్పుడు దళారులు లేకుండా, ప్రయాణ స్వభావంచేత నిజంగా అవసరమైనంతకంటె యెక్కువ ఆలస్యమూ, అన్‌లోడింగూ లేకుండా, అనగా శ్రమశక్తిని యెంతో మిగిలించుకొని, దానిని సూటిగా సంపాయించడం సాధ్యమౌతుంది. సట్టా వ్యాపారస్తులకూ, చిన్న, పెద్ద వర్తకులకూ వాళ్ల లాభాలను చెల్లించవలసిన అవసరం వుండదు. కానీ, యింతే కాదు — యీ విధంగా యీ దళారులు సమాజానికి అపకారులు కాకుండా చేయబడడమే కాక, వాస్తవంగా సమాజానికి ఉపయోగకరంగా చేయబడతారు. యిప్పుడు వీళ్లు ప్రతివొకరికీ అసౌకర్యం కలిగిస్తూ, మహా అయితే అనవసరం అనదగిన పని చేస్తున్నారు; అయినప్పటికీ యీ పని వీళ్లకు జీవనాధారం యిస్తున్నది, నిజానికి అనేక సందర్భాలలో గొప్ప ఐశ్వర్యం యిస్తున్నది. యీవిధంగా వీళ్లు ప్రస్తుతం సమష్టి క్షేమానికి సూటిగా హానికరంగా వుండగా, అప్పుడు ఉపయోగకరమైన పనిలో నిమగ్నులు కావడానికి స్వేచ్ఛను పొంది, యెలాంటి వృత్తిని చేపట్టుతారంటే, ఆ వృత్తిలో వీళ్లు కేవలం సమాజపు నామకార్థపు సభ్యులు కాక, కపట సభ్యులు కాక, నిజమైన సభ్యులుగా, దాని మొత్తం కార్యకలాపాలలో భాగస్వాములుగా నిరూపించుకోగలరు.

వ్యష్టి మానవునికీ, యితర ప్రతివొకనికీ మధ్య శత్రుత్వాన్ని సృష్టించే యీనాటి సమాజం యీ విధంగా అందరూ అందరితోనూ పోరాడే సామాజిక యుద్ధాన్ని కలిగిస్తుంది. యీ యుద్ధం వ్యష్టి సందర్భాలలో, ముఖ్యంగా విద్యావిహీనులలో, పాశవికమైన, కిరాతకంగా హింసాత్మకమైన రూపం ధరిస్తుంది — నేరం అనే రూపం. నేరంనుండి, సూటి హింసా చర్యలనుండి, తన్ను తాను కాపాడుకోడానికి సమాజానికి విస్తారమైన, జటిలమైన పరిపాలనా సంస్థల, న్యాయ స్థానాల వ్యవస్థ

అవసరవౌతుంది; వీటికి అపారమైన అంగబలం కావాలి. కమ్యూనిస్టు సమాజంలో యిది కూడా అపారంగా సరళీకరింపబడుతుంది. యెందుకంటే — విడ్డూరంగా కనిపించవచ్చు గానీ — సరిగ్గా, యీ సమాజంలోని పరిపాలనా సంస్థ సమాజ జీవితపు వ్యష్టి పార్శ్వాలను మాత్రమే కాక, మొత్తం సమాజ జీవితాన్ని, దాని వివిధ కార్యకలాపాలనన్నిటినీ, దాని పార్శ్వాల నన్నిటినీ, నిర్వహించవలసి వుంటుంది గనుక. మనం వ్యష్టి మానవునికీ, యితరు లందరికీ మధ్య వున్న వైరుధ్యాన్ని తొలగిస్తాము, సామాజిక యుద్ధానికి సామాజిక శాంతిని పోటీగా పెడతాము, నేరంయొక్క వేరును నరికివేస్తాము — తద్వారా, పరిపాలనా సంస్థలయొక్క, న్యాయ స్థానాలయొక్క ప్రస్తుత కార్యకలాపాలలో అత్యధిక భాగాన్ని, అపారమైన అత్యధిక భాగాన్ని, అనవసరం చేస్తాము. యిప్పుడు కూడా, ఉద్దేశపూర్వకమైన నేరాలతో, స్వప్రయోజనపు నేరాలతో పోలిస్తే, ఆవేశపు నేరాలు అంతకంతకూ తక్కువౌతున్నాయి — వ్యక్తులమీద నేరాలు తగ్గిపోతున్నాయి, ఆస్తిమీద నేరాలు పెరుగుతున్నాయి. పురోగమిస్తున్న నాగరికత, యుద్ధ స్థితిలో వున్న మన యీనాటి సమాజంలో కూడా, ఉద్దండమైన ఆవేశ ప్రజ్వలనాలను తగ్గిస్తుంది. శాంతియుత కమ్యూనిస్టు సమాజంలో యిది మరెంత యెక్కువగా జరుగుతుందో! తన సహజ కాంక్షలనూ, ఆత్మిక కాంక్షలనూ తీర్చుకోడానికి అవసరమైన దంతా ప్రతివొకనికీ అందేచోట, సామాజిక అంతస్తులూ, భేదాలూ అంతమైనచోట, ఆస్తిమీద నేరాలు వాటంతకవే అంతరిస్తాయి. క్రిమినల్ కేసులకు సంబంధించిన న్యాయ విచారణ దానిపాటికదే అంతరిస్తుంది. సివిల్ కేసులు దాదాపు అన్నీ ఆస్తి సంబంధాల మూలంగా, లేదా, కనీసం, సామాజిక యుద్ధ సన్నివేశంనుండి ఉత్పన్నమయ్యే సంబంధాల మూలంగా యేర్పడుతాయి; అలాంటి సివిల్ కేసుల న్యాయ విచారణ కూడా అంతరిస్తుంది. ఘర్షణలు యిప్పుడు సార్వత్రిక శత్రుత్వంయొక్క సహజ ఫలితం కాగా, అప్పుడు అరుదైన మినహాయింపులుగా మాత్రమే వుండి, పెద్దమనుషులచేత సులభంగా పరిష్కరింపబడతాయి. పరిపాలనా సంస్థల కార్యకలాపాలు ప్రస్తుతం నిరంతర సామాజిక యుద్ధ సన్నివేశంనుండి ఉద్భవిస్తున్నాయి — పోలీసులూ, యావత్తు ప్రభుత్వమూ చేసేదేమిటంటే, యుద్ధం ప్రచ్ఛన్నంగా, పరోక్షంగా వుండేటట్లూ, బహిరంగ దౌర్జన్యంగా, నేరాలుగా ప్రజ్వలించకుండా వుండేటట్లూ చూడడం తప్ప మరేమీ కాదు. కానీ, యుద్ధాన్ని కొన్ని హద్దుల లోపల వుంచడంకంటె శాంతిని కాపాడడం అపారంగా సులభమైతే, పోటీ సమాజాన్ని పాలించడంకంటె కమ్యూనిస్టు సమాజాన్ని పాలించడం యెంతో సులభం. సమాజ శాంతినీ, సమాజ భద్రతనూ, సమాజ ప్రయోజనాన్నీ కాపాడడంలో తమ ప్రయోజనం యిమిడివుందనీ, కనుక పోలీసులనూ, పరిపాలననూ, న్యాయ విచారణనూ అనవసరమయ్యేటట్లు చేయండనీ నాగరికత యిప్పటికే మానవులకు నేర్పింది. ప్రయోజనాల

యేకత్వం మౌలిక సూత్రమై, సమాజ ప్రయోజనం ప్రతి వ్యక్తియొక్క ప్రయోజనం కంటె యిక యెంత మాత్రమూ భిన్నం కానట్టి సమాజంలో యిది మరెంత యెక్కువగా నిజ మౌతుందో! సామాజిక నిర్మాణం వ్యతిరేకంగా వున్నప్పటికీ యిప్పటికే వున్నట్టిది సామాజిక సంస్థలు దానికి ఆటంకం కలిగించకుండా అండదండలు యిచ్చినప్పుడు అది మరెంతగా వుంటుందో! యీ విధంగా, యీ విషయంలో కూడా శ్రామిక అంగ బలం గణనీయంగా పెరుగుతుందని మనం నమ్మవచ్చు. శ్రామిక అంగబలంలో కొంత భాగం ప్రస్తుత సామాజిక స్థితిద్వారా సమాజానికి నష్టమైపోయింది; ఆ భాగం అప్పుడు విడుదల అవుతుంది.

ప్రస్తుత సమాజం విసర్జించజాలనట్టి అత్యంత వ్యయపూరితమైన సంస్థలలో ఒకటి యేమిటంటే స్థాయీ సైన్యాలు. వీటిద్వారా, ప్రజానీకంలో అత్యంత చురుకైన, ఉపయోగకరమైన భాగం జాతికి నష్టమైపోయింది. ఆ భాగం నిరుత్పాదకమయింది గనుక, దానిని జాతి పోషించవలసి వచ్చింది. స్థాయీ సైన్యానికి యెంత ఖర్చయ్యేదీ మన బడ్జెట్‌ద్వారా మనకు తెలుస్తున్నది — యేడాదికి యిరవై నాలుగు మిలియన్లూ, బాగా కండలు గలిగిన చేతులలో రెండు లక్షలు ఉత్పత్తినుండి ఉపసంహరింపబడడమూ. స్థాయీ సైన్యం వుండాలని కమ్యూనిస్టు సమాజంలో యెవరికీ ఆలోచన రాదు. అయినా, దేని కోసం? దేశంలో శాంతిని కాపాడడానికా? మనం పైన గమనించినట్లు, ఆంతరంగిక శాంతికి భంగం కలిగించాలని యెవరికీ ఆలోచన రాదు. విప్లవాల భయం, సహజంగానే, ప్రయోజనాల వైరుధ్యంయొక్క ఫలితం మాత్రమే; ప్రయోజనాలు సమవసించే చోట అలాంటి భయాల వూసే వుండదు. — దురాక్రమణ యుద్ధాల కొరకా? కానీ, కమ్యూనిస్టు సమాజానికి దురాక్రమణ యుద్ధం చేయాలనే ఊహ యెలా రాగలదు? యుద్ధంలో తనకు జనమూ, పెట్టుబడీ నష్టం కావడం మాత్రమే జరుగుతుందనీ, మహా అయితే తనకు వచ్చే లాభం విధేయంగా వుండని రెండు రాష్ట్రాలనీ, తత్పర్యవసానంగా అవి సామాజిక శాంతికి భంగకరంగా వుంటాయనీ బాగా యెరిగిన యీ సమాజానికి ఆ ఊహ యెలా రాగలదు? — ఆత్మరక్షణ యుద్ధం కొరకా? దాని కొరకు స్థాయీ సైన్యం అవసరం లేదు; యెందుకంటే, సమాజంలోని ఆరోగ్యవంతుడైన ప్రతి సభ్యునికీ, అతని యితర వృత్తులకు తోడుగా, దేశ రక్షణకు అవసరమైన స్థాయిలో, బారకాసు చౌకు పద్ధతిలో కాక, నిజమైన పద్ధతిలో ఆయుధాలు ఉపయోగించే తర్ఫీదు యివ్వడం సులభం. యిక, మిత్రులారా, యీ విషయం ఆలోచించండి: యుద్ధం వస్తే — యేమైనప్పటికీ అది కమ్యూనిస్టు వ్యతిరేక జాతులతో మాత్రమే జరగగలదు — ఆ సమాజంలోని సభ్యునికి నిజమైన మాతృదేశం వుంటుంది, రక్షించుకోడానికి నిజమైన యిల్లూ వాకిలీ వుంటాయి, అందువలన అతను ఉత్సాహంతో, ఓర్పుతో, ధైర్యంతో

పోరాడుతాడు, ఆ గుణాలముందు యాంత్రికంగా తర్ఫీదు పొందిన ఆధునిక సైన్యపు సైనికులు పొట్టులాగ చెదరిపోతారు. 1792 నుండి 1799 వరకు విప్లవ సైన్యాల ఉత్సాహం సాధించిన అద్భుతాలను పరిగణించండి.* ఆ సైన్యాలు ఒక భ్రమ కోసం, మాతృదేశ భ్రాంతి కోసం మాత్రమే పోరాడినాయి; అది పరిగణిస్తే, భ్రమ కోసం కాక, ప్రత్యక్ష వాస్తవం కోసం పోరాడే సైన్యం యెంత శక్తివంతంగా వుండేదీ మీరు గుర్తించక తప్పదు. యీ అపారమైన శ్రమశక్తి రాసులు, సైన్యాల మూలంగా నాగరిక జాతులకు నష్టమై పోతున్నట్టివి, కమ్యూనిస్టు సమాజంలో తిరిగి శ్రమ చేస్తాయి. అవి తాము ఖర్చుచేసేటంత ఉత్పత్తి చేయడం మాత్రమే కాదు, తమ పోషణకు అవసరమైన వాటికంటె యెంతో యెక్కువ సరుకులను సామాజిక గిడ్డంగులకు సరఫరా చేయగలుగుతాయి.

యింతకంటె అధ్వాన్నమైన శ్రమశక్తి దుర్వ్యయం యీనాటి మన సమాజంలో వుంది. యేమిటంటే, ధనికులు తమ సామాజిక స్థానాన్ని వినియోగించుకొనే పద్ధతి. కేవలం ఆడంబర లక్ష్యంతో ఉత్పన్నమై, యెంతో శ్రమశక్తిని వినియోగించుకొనే నిరుపయోగమైన, పరమ పరిహాసాస్పదమైన విలాసాల నన్నిటినీ గురించి నేనేమీ చెప్పను. కానీ, మిత్రులారా, ఒక ధనికుని యింటిలోకి, యింటి లోపలి భాగంలోకి, పోయి చూడండి. అక్కడ ఒకేఒక వ్యక్తికి పెక్కుమంది సేవలు చేస్తూ, తమ కాలాన్ని నిష్క్రియగా గానీ, మహా అయితే, ప్రతి మనిషీ తన నాలుగు గోడల మధ్య యేకాకి అయిన ఫలితంగా యేర్పడే పనిలో గానీ ఖర్చు చేస్తూవుండడం అత్యంత మతిహీనమైన శ్రమశక్తి దుర్వ్యయం కాదేమో చెప్పండి. యీ గుంపెడు పని మనుషులూ, వంట మనుషులూ, నౌకర్లూ, బండి మనుషులూ, గృహ పరిచారకులూ, తోట మాలీలూ, వీళ్ల పేర్లు యేమైనా కానీ, వీళ్లు నిజంగా చేసేది యేమిటి? దినంలో యెంత కొద్ది క్షణాలు వీళ్లు తమ యజమానుల జీవితాలను నిజంగా ఆహ్లాదమయం చేయడంలో, తమ మానవ స్వభావమూ, సహజ సామర్థ్యాలూ స్వేచ్ఛగా అభివృద్ధి కావడానికీ, పనిచేయడానికీ తోడ్పడడంలో నిమగ్నులైనారు! దినంలో యెన్ని యెక్కువ గంటలు వీళ్లు మన సామాజిక సంబంధాల చెడ్డ యేర్పాటునుండి మాత్రమే ఉత్పన్నమయ్యే కర్తవ్యాలలో నిమగ్నులైనారు — బండి వెనుక నిలుచుకోవడమూ, తమ యజమానుల ప్రతి చిత్త చాంచల్యానికీ సేవ చేయడమూ, పెంపుడు కుక్కలను యెత్తుకోవడమూ, మొదలైన అసంబద్ధపు పనులు! హేతుబద్ధంగా

---

*1789–1794 నాటి ఫ్రెంచి బూర్జువా విప్లవ విజయాలను రద్దుచేసే లక్ష్యం గల ప్రగతి వ్యతిరేక యూరపియన్ రాజ్యాల కూటమితో విప్లవ ఫ్రాన్సు చేసిన యుద్ధాలకు ప్రస్తావన యిది. — సం.

వ్యవస్థీకరింపబడిన సమాజంలో, ప్రతివొకడూ ధనికుల చిత్త చాంచల్యాలకు సేవలు చేయకుండా, తానే అలాంటి చిత్త చాంచల్యాలకు లోబడకుండా బతికే స్థితిలో వుండే సమాజంలో — అలాంటి సమాజంలో, యిప్పుడు విలాసాలు సమకూర్చడానికి యీవిధంగా దుర్వ్యయమయ్యే శ్రమశక్తి సహజంగానే అందరికీ లాభకరంగా, దానికీ లాభకరంగా ఉపయోగించబడగలదు.

మరి కొంత శ్రమశక్తి దుర్వ్యయం యీనాటి మన సమాజంలో పోటీ ఫలితంగా జరుగుతున్నది; సంతోషంగా పనిచేయడానికి యిష్టపడినా, యే పనీ సంపాయించ జాలని దౌర్భాగ్య కార్మికులను యెంతోమందిని యిది సృష్టిస్తున్నది. శ్రామిక అంగ బలాన్ని నిజంగా వినియోగించుకోవడంపట్ల శ్రద్ధ వహించగల విధంగా సమాజం యే మాత్రమూ యేర్పాటు కాలేదు గనుక, ప్రతి వ్యక్తీ ఒక ఆదాయ మార్గం చూసు కోవలసి వుంది గనుక, నిజంగా ఉపయోగకరమైన పనో, అలా కనిపించే పనో పంపకం చేయబడేటప్పుడు, పెక్కుమంది కార్మికులకు పని లేకుండా పోవడం చాలా సహజం. పోటీ పోరాటం మూలంగా ప్రతివొకడూ తన కార్మికులనుండి సాధ్యమైనంత యెక్కువ కృషిని పొందడమూ, లభ్యమైన సౌకర్యాల నన్నిటినీ వినియోగించుకోవడమూ, ప్రియ మైన శ్రమను తొలగించి చౌక శ్రమను పెట్టుకోవడమూ — పురోగమించే నాగరికత దీనికి అంతకంతకూ యెక్కువ మార్గాలు సమకూరుస్తుంది — యివన్నీ తప్పవు గనుక, మరొక విధంగా చెప్పాలంటే, ప్రతివొకడూ యితరులను దౌర్భాగ్యులను చేయడానికీ, యేదో ఒక మార్గాన యితరుల శ్రమను తొలగించడానికీ కృషిచేయవలసి వుంది గనుక, పై పరిస్థితి మరింతగా యేర్పడుతుంది. యీ విధంగా ప్రతి నాగరిక సమాజంలోనూ, సంతోషంగా పనిచేయడానికి యిష్టపడినా పని సంపాయించుకోజాలనట్టి నిరుద్యోగ కార్మి కులు పెద్ద సంఖ్యలో వున్నారు; సాధారణంగా అనుకునేదానికంటె వాళ్ల సంఖ్య యెక్కు వగా వుంది. యిలా వీళ్లు యేదో ఒక మార్గాన సానితనం సాగించడం మనకు కనపడు తుంది — బిచ్చ మెత్తుకోవడమో, వీధులూడ్వడమో, వీధి మలుపుల్లో నిలుచుకోవడమో, అప్పుడప్పుడు దొరికే చిన్న పనులద్వారా ప్రాణం పట్టుకోవడమో, రకరకాల చిల్లర సరుకులు వీధులు తిరిగి అమ్ముకోవడమో, లేదా, యీ సాయంత్రం యిద్దరు బీద అమ్మాయిలు చేస్తూవుండడం మేము చూసినట్లు, గిటార్ పట్టుకొని ఒకచోటనుండి మరొకచోటికి పోతూ, డబ్బు కోసం ఆడుతూ, పాడుతూ, నాలుగు పైసలు సంపాయించుకోడానికి రకరకాల సిగ్గుమాలిన మాటలనూ, ప్రతి అవమానకరమైన సూచననూ భరించడమో. చివరకు యెంతమంది నిజమైన సాని వృత్తికి లోబడతారో! మిత్రులారా, యేదో ఒక మార్గాన సానితనం సాగించడం తప్ప గత్యంతరం లేని యీ బీద జనుల సంఖ్య చాలా పెద్దదిగా వుంది — మన బీదల సహాయ సంస్థ అధికారులు

దీన్ని గురించి అంతా మీకు చెప్పగలరు — వీళ్ళు నిరుపయోగమైనప్పటికీ వీళ్లకు యేదో ఒక విధంగా సమాజం తిండి పెట్టుతున్నదని మరచిపోకండి. మరి, సమాజం వీళ్ల పోషణ ఖర్చును భరించవలసి వుంటే, యీ నిరుద్యోగులు తమ తిండి ఖర్చును గౌరవంగా సంపాయించుకోవడం వీలయ్యేటట్లు కూడా అది చేయాలి. కానీ, ప్రస్తుత పోటీ సమాజం యిది చేయ జాలదు.

మిత్రులారా, యీ అంతటిని గురించి మీరు ఆలోచిస్తే — మరి, మన ప్రస్తుత సమాజం తన శ్రామిక అంగబలాన్ని దుర్వ్యయం చేయడానికి యితర ఉదాహరణలు చాలా యివ్వగలను — దీన్ని గురించి మీరు ఆలోచిస్తే, మానవ సమాజం వశంలో పుష్కలమైన ఉత్పాదక శక్తులు వున్నాయనీ, అవి అందరికీ అత్యంత ఉపకారకంగా పని చేసేటందుకు హేతుబద్ధమైన వ్యవస్థీకరణా, క్రమబద్ధమైన పంపకమూ మాత్రం జరగవలసి వుందనీ మీకు కనపడుతుంది. సామాజిక కార్యకలాపాల న్యాయమైన పంపకం జరిగితే, వ్యక్తులు యితర పని యేదీ చేయడానికి సాధ్యం కానంత శ్రమ భారం మోయవలసి వుంటుందనే భయం యెంత పూర్తిగా నిరాధారమైనదో, దీని తర్వాత మీరు తేల్చుకోగలరు. తద్విరుద్ధంగా, యిలాంటి వ్యవస్థీకరణ వుంటే, బొత్తిగా ఉపయోగింపబడకుండా గానీ, అసౌకర్యంగా ఉపయోగింపబడుతూ గానీ వున్న శ్రమను ఉపయోగించడంద్వారా, కేవలం యీ పని చేయడంద్వారా, వ్యక్తులయొక్క యీనాటి మామూలు శ్రమ కాలం సగానికి తగ్గిపోతుందని మనం అనుకోవచ్చు.

కానీ, దుర్వ్యయమయ్యే శ్రమశక్తిని వినియోగించడంద్వారా కమ్యూనిస్టు వ్యవస్థీకరణ యిచ్చే ఉపకారాలు అత్యంత ముఖ్యమైనవి కూడా కావు. శ్రమశక్తి అన్నిటికంటె యెక్కువగా మిగులుబాటు జరిగేది యెక్కడంటే, వ్యష్టి శక్తులు సామాజిక, సమష్టి శక్తిగా సమ్మేళనం చెందడంలోనూ, యింతకు మునుపు పరస్పరం వ్యతిరేకంగా వుండిన శక్తుల యీ సాంద్రీకరణమీద ఆధారపడిన వ్యవస్థీకరణ లాంటిదానిలోనూ.

1845 ఫిబ్రవరి 8న యిచ్చిన ఉపన్యాసం

ఎంగెల్స్

# కమ్యూనిజం సూత్రాలు

(కొంత భాగం)

ప్రశ్న 14: యిది యెలాంటి నూతన సామాజిక వ్యవస్థగా వుండవలసి వుంది?

జవాబు: మొట్టమొదట, నూతన సామాజిక వ్యవస్థ పరిశ్రమలయొక్క, సకల ఉత్పత్తి శాఖలయొక్క నిర్వహణను తమలో తాము పోటీపడే విడివిడి వ్యక్తుల చేతుల్లో నుండి మొత్తంమీద తీసుకొని, యీ ఉత్పత్తి శాఖల నన్నిటినీ మొత్తం సమాజం తరపున, అనగా ఒక సామాజిక పథకం ప్రకారం, సమాజ సభ్యు లందరూ పాల్గొనడంతో, నడుపుతుంది. ఆ విధంగా అది పోటీని అంతమొందించి, దాని స్థానంలో సంయోగాన్ని పెట్టుతుంది. వ్యక్తులచేత జరిగే పరిశ్రమల నిర్వహణ అనివార్యంగా సొంత ఆస్తి స్వామ్యానికి దారితీస్తుంది గనుక, పోటీ అనేది వ్యష్టి సొంత ఆస్తిపరులు పరిశ్రమలను నిర్వహించే పద్ధతి తప్ప మరేమీ కాదు గనుక, పరిశ్రమలమీద వ్యక్తులు చేసే నిర్వహణనుండీ, పోటీనుండీ సొంత ఆస్తి స్వామ్యాన్ని విడదీయలేము. కనుక, సొంత ఆస్తి స్వామ్యం కూడా రద్దు కావలసివుంది; దానికి బదులు ఉత్పత్తి సాధనా లన్నిటినీ సమష్టిగా ఉపయోగించుకోవడమూ, సమష్టి అంగీకారంద్వారా ఉత్పత్తు లన్నిటినీ పంపకం చేయడమూ, లేదా సరుకుల సమష్టి ఆస్తి అనేది, వుంటుంది. సొంత ఆస్తి స్వామ్యం రద్దు అనేది పరిశ్రమల అభివృద్ధి ఫలితంగా అనివార్యంగా జరిగే యావత్తు సామాజిక వ్యవస్థయొక్క రూపాంతరీకరణకు అత్యంత సంగ్రహమైన, అత్యంత విలక్షణమైన సంక్షిప్త వ్యక్తీకరణ. కనుక, యిది కమ్యూనిస్టులు చేసే ప్రధాన డిమాండుగా వుండడం ఉచితమే.

ప్రశ్న 20: సొంత ఆస్తి స్వామ్యం అంతిమంగా రద్దు కావడంయొక్క పర్యవసానాలు యేమిటి?

జవాబు: సకల ఉత్పాదక శక్తులయొక్క, రవాణా సాధనాలయొక్క వినియోగాన్నీ, ఉత్పాదితాల మారకాన్నీ, పంపకాన్నీ ప్రైవేటు పెట్టుబడిదారులనుండి సమాజం హరించడమూ, లభ్యమయ్యే సాధనాలమీదా, మొత్తం సమాజపు అవసరాల

మీదా ఆధారపడిన పథకం ప్రకారం సమాజం వాటిని నిర్వహించడమూ మొట్టమొదట పెద్ద పరిశ్రమలు ప్రస్తుతం కలిగించే దుష్ట పర్యవసానాలను తొలగిస్తాయి. సంక్షోభాలు ఆగిపోతాయి; ప్రస్తుత సామాజిక వ్యవస్థలో అమితోత్పత్తిని కలిగిస్తూ, దారిద్ర్యానికి అంత శక్తివంతమైన కారణంగా వున్న విస్తరించబడిన ఉత్పత్తి అప్పుడు చాలను కూడా చాలదు, యింకా విస్తరించబడవలసి వుంటుంది. సమాజపు తక్షణ అవసరాలను మించి జరిగే అమితోత్పత్తి తనవెంట దారిద్ర్యాన్ని తీసుకరావడానికి బదులు అందరి అవసరాలనూ తీరుస్తుంది, కొత్త అవసరాలను సృష్టించి, అదే సమయంలో వాటిని తీర్చడానికి సాధనాలను సృష్టిస్తుంది. యితోధిక పురోగతికి అది షరతూ, దోహదమూ అవుతుంది. యింతకు ముందు లాగ సామాజిక వ్యవస్థను నిత్యం గందరగోళంలో పడవేయకుండా అది పురోగతిని సాధిస్తుంది. సొంత ఆస్తి స్వామ్యపు సంకెళ్లనుండి విముక్తి చెందితే పెద్ద పరిశ్రమలు యే ప్రమాణంలో అభివృద్ధి చెందుతాయంటే, మన కాలపు పెద్ద పరిశ్రమలతో పోలిస్తే కార్ఖానా వ్యవస్థ యెంత స్వల్పంగా కనపడుతుందో అంత స్వల్పంగా ఆ ప్రమాణం ముందర ప్రస్తుత అభివృద్ధి స్థాయి కనపడుతుంది. పరిశ్రమల ఆ అభివృద్ధి అందరి అవసరాలనూ తీర్చడానికి చాలిన పరిమాణంలో ఉత్పాదితాలను సమాజానికి సమకూరుస్తుంది. లభ్యమయ్యే మెరుగుదలలనూ, శాస్త్ర విజయాలనూ ప్రవేశపెట్టకుండా సొంత ఆస్తి స్వామ్యపు ఒత్తిడిచేతా, భూమి ముక్కలు ముక్కలు కావడంచేతా అరికట్టబడిన వ్యవసాయం కూడా కొత్త పురోగతిని సాధించి, పుష్కలమైన ఉత్పాదితాల సముదాయాన్ని సమాజ వశంలో వుంచుతుంది. ఆ విధంగా సమాజం తన సభ్యు లందరి అవసరాలను తీర్చే పంపకాన్ని యేర్పాటుచేయడానికి చాలినన్ని ఉత్పాదితాలను ఉత్పత్తి చేస్తుంది. వివిధ శత్రు వర్గాలుగా సమాజం విభజింపబడడం తద్వారా అనవసర మౌతుంది. అది అనవసరం కావడమే కాదు, నూతన సామాజిక వ్యవస్థతో పొసగను కూడా పొసగదు. వర్గాలు శ్రమ విభజనద్వారా పుట్టినాయి; మరి శ్రమ విభజన, యింతకు మునుపు వున్న రూపంలో, సంపూర్ణంగా అదృశ్య మౌతుంది. పారిశ్రామిక, వ్యావసాయిక ఉత్పత్తిని పైన వర్ణించిన శిఖరాలకు అభివృద్ధి చేయడానికి యాంత్రిక, రసాయనిక సహాయకాలు మాత్రమే చాలవు; యీ సహాయకాలను నడిపించే మనుషుల సామర్థ్యాలు కూడా తదనుగుణంగా అభివృద్ధి కావాలి. గత శతాబ్దిలో రైతులూ, కార్ఖానా కార్మికులూ పెద్ద పరిశ్రమలలోకి లాగ బడినప్పుడు, వాళ్లు యెలా తమ యావత్తు జీవిత విధానాన్ని మార్చుకోవలసి వచ్చిందో, యెలా తామే పూర్తిగా భిన్నమైన మనుషు లైనారో, అలాగే ఉత్పత్తిమీద మొత్తం సమాజంయొక్క ఉమ్మడి నిర్వహణా, తత్ఫలితమైన ఉత్పత్తియొక్క నూతన అభి వృద్ధీ పూర్తిగా భిన్నమైన మనుషులను ఆపేక్షిస్తాయి, వాళ్లను తయారుచేస్తాయి కూడా. ఉత్పత్తిమీద ఉమ్మడి నిర్వహణ యీనాడున్న మనుషులతో సాగజాలదు. యీనాడు

ప్రతి వ్యక్తీ ఒకేఒక ఉత్పత్తి శాఖకు కేటాయించబడినాడు, దానికి బందీ అయినాడు, దానిచేత దోపిడీ చేయబడుతున్నాడు; ప్రతివొకడూ తన సామర్థ్యాలలో ఒకద్దానిని మాత్రమే అభివృద్ధి చేసుకున్నాడు, తక్కిన అన్నింటినీ నష్టపరచుకొని; ప్రతివొకనికీ మొత్తం ఉత్పత్తిలో ఒక శాఖ మాత్రమే తెలుసు, లేదా ఒక శాఖలోని ఒక శాఖ మాత్రమే తెలుసు. అలాంటివాళ్లు సమకాలిక పరిశ్రమలకు కూడా అంతకంతకూ తక్కువ ఉపయోగకరంగా వున్నారు. ఉమ్మడిగా, ఒక పథకం ప్రకారం మొత్తం సమాజంచేత నడిపించబడే పరిశ్రమలు వుండాలంటే, తమ సామర్థ్యాలు సర్వతోముఖంగా అభివృద్ధి చెందిన మనుషులు, యావత్తు ఉత్పత్తి వ్యవస్థనూ పర్యాలోకనం చేయగలవాళ్లు, వుండాలి. తత్పర్యవసానంగా, ఒక మనిషిని రైతుగానూ, మరొకణ్ని చర్మకారునిగానూ, యింకొకణ్ని ఫాక్టరీ కార్మికునిగానూ, వేరొకణ్ని స్టాక్ బ్రోకర్‌గానూ చేసే శ్రమ విభజన, యంత్ర వ్యవస్థచేత యిప్పటికే బలహీనపరచబడినట్టిది, ఆ విధంగా సంపూర్ణంగా అదృశ్యమౌతుంది. విద్యద్వారా యువజనులు మొత్తం ఉత్పత్తి వ్యవస్థతో వేగంగా పరిచయం చేసుకోగలుగుతారు, సామాజిక అవసరాలనుబట్టి, లేదా తమ సొంత అభీష్టాలనుబట్టి ఒక పరిశ్రమ శాఖనుండి మరొక శాఖకు మారగలుగుతారు. కనుక విద్య ప్రస్తుత శ్రమ విభజన అందరి మీదా రుద్దిన యేకపక్ష వికాసాన్ని రద్దుచేస్తుంది. ఆ విధంగా, కమ్యూనిస్టు పద్ధతిలో వ్యవస్థీకరింపబడిన సమాజం తన సభ్యు లందరికీ సమగ్రంగా అభివృద్ధి చెందిన తమ సామర్థ్యాలను సమగ్రమ్మైన పద్ధతిలో వాడుకునే అవకాశాన్ని సమకూర్చ గలుగుతుంది. దానితో పాటు వివిధ వర్గాలు విధిగా అదృశ్యమౌతాయి. ఆ విధంగా, ఒకవైపున, కమ్యూనిస్టు పద్ధతిలో వ్యవస్థీకరింపబడిన సమాజం వర్గాల ఉనికితో పొసగదు, మరొకవైపున, యీ సమాజం నిర్మింపబడడమే యీ వర్గ విభేదాలను తొలగించడానికి సాధనాలను సమకూరుస్తుంది.

పట్టణానికీ, గ్రామానికీ మధ్య గల భేదం అలాగే అదృశ్యమౌతుందని దీన్నిబట్టి యేర్పడుతుంది. రెండు భిన్న వర్గాలకు బదులు అదే మనుషులు వ్యవసాయాన్నీ, పారిశ్రామిక ఉత్పత్తినీ సాగించడం, శుద్ధ భౌతిక కారణాలవల్ల కూడా, కమ్యూనిస్టు సంయోగానికి ముఖ్యమ్మైన షరతు. వ్యావసాయిక ప్రజానీకం దేశమంతటా చెల్లాచెదరుగా వుండడమూ, పారిశ్రామిక ప్రజానీకం పెద్ద పట్టణాలలో గుమికూడి వుండడమూ — యిది వ్యవసాయంయొక్కా, పరిశ్రమలయొక్కా అవికసిత దశకు మాత్రమే చాలిన స్థితి, యిది యితోధిక అభివృద్ధి అంతటికీ ఆటంకం; యీ ఆటంకం యిప్పుడు కూడా బాగా కనపడుతున్నది.

ఉత్పాదక శక్తుల సమష్టి, ప్రణాళికాబద్ధ వినియోగం కొరకు సమాజ సభ్యు లందరి సార్వత్రిక సంయోగం, అందరి అవసరాలనూ తీర్చడానికి చాలినట్టి స్థాయికి

ఉత్పత్తియొక్క విస్తరణ, కొందరి నష్టంతో మరికొందరి అవసరాలు తీరే పరిస్థితి అంతం కావడం, వర్గాలూ, వాటి వైరుధ్యాలూ సంపూర్ణంగా రద్దు కావడం, యింతకు మునుపు వ్యాప్తిలో వుండిన శ్రమ విభజన రద్దుద్వారానూ, పారిశ్రామిక విద్యద్వారానూ, కార్యకలాపాల మార్పుద్వారానూ, అందరూ ఉత్పత్తిచేసిన వరాలలో అందరూ పాలు పంచుకోవడంద్వారానూ, పట్టణమూ, గ్రామమూ సమ్మేళనం చెందడంద్వారానూ సమాజ సభ్యు లందరి సామర్థ్యాల సర్వతోముఖ వికాసం — యివి సొంత ఆస్తి రద్దుద్వారా యెదురు చూడబడే ప్రధాన ఫలితాలు.

ప్రశ్న 21: కమ్యూనిస్టు సమాజ వ్యవస్థకు కుటుంబంమీద యెలాంటి ప్రభావం వుంటుంది?

జవాబు: ఆ వ్యవస్థ స్త్రీ పురుష సంబంధాలను కేవలం సొంత వ్యవహారంగా, ఆ వ్యక్తులకు మాత్రమే సంబంధించినదిగా చేస్తుంది, సమాజంనుండి యెలాంటి జోక్యాన్నీ అపేక్షించదు. అది యీ పని యెలా చేయగలుగుతుందంటే, అది సొంత ఆస్తిని రద్దుచేసి, పిల్లలకు సామాజికంగా విద్యాబోధన చేస్తుంది గనుక, తద్వారా, యింత వరకు వున్న వివాహ వ్యవస్థయొక్క పునాదిరాళ్లను రెంటినీ — భర్తమీద భార్య ఆధార పడడాన్నీ, తల్లిదండ్రులమీద పిల్లలు ఆధారపడడాన్నీ, సొంత ఆస్తిచేత నిర్ణయించబడి నట్టివాటిని — ధ్వంసం చేస్తుంది గనుక. కమ్యూనిస్టు సమాజపు సమష్టి భార్యలకు వ్యతిరేకంగా నీతిబోధక అల్పబుద్ధులు వేసే గావుకేకలకు యిది సమాధానం. సమష్టి భార్యలు వుండడం పూర్తిగా బూర్జువా సమాజానికి చెందిన సంబంధం, పడుపు వృత్తిగా సమగ్రమైన రూపంలో యీనాడు వున్నట్టిది. కానీ, పడుపు వృత్తి సొంత ఆస్తిలో వేర్లూనికొని వుంది, దానితోపాటు కూలిపోతుంది. కనుక, కమ్యూనిస్టు వ్యవస్థీకరణ సమష్టి భార్యల పద్ధతిని నెలకొల్పడానికి బదులు, అంతమొందిస్తుంది.

1847 అక్టోబర్ — నవంబర్ అంతంలో రచింపబడింది

# మార్క్స్, ఎంగెల్స్

# కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక

## II

## కార్మికులూ – కమ్యూనిస్టులూ

మొత్తం కార్మికవర్గంతో కమ్యూనిస్టుల సంబంధం యే విధంగా వుంటుంది?

కమ్యూనిస్టులు యితర కార్మికవర్గ పార్టీలకు వ్యతిరేకమైన మరొక ప్రత్యేక పార్టీగా యేర్పడరు.

కార్మికవర్గ సమష్టి ప్రయోజనాలకు భిన్నంగా, విడిగా కమ్యూనిస్టుల కే ప్రయోజనాలూ లేవు.

వాళ్ళు కార్మికవర్గ ఉద్యమాన్ని తమకు నచ్చిన మూసలో పోత పోయడానికి యే సొంత సంకుచిత సూత్రాలనూ రూపొందించరు.

కమ్యూనిస్టులకూ యితర కార్మికవర్గ పార్టీలకూ గల భేదం యింత మాత్రమే: 1. వివిధ దేశాల కార్మికులు చేసే జాతీయ పోరాటాలలో, జాతి యేదైనప్పటికీ సమస్త కార్మికవర్గానికీ గల సమష్టి ప్రయోజనాలను కమ్యూనిస్టులు గుర్తుచేసి, వాటికి ప్రాధాన్యం యిస్తారు. 2. బూర్జువావర్గంతో కార్మికవర్గం చేసే పోరాటం వివిధ దశలుగా అభివృద్ధి చెందుతుంది; ఆ అన్ని దశల్లోనూ కమ్యూనిస్టులు సర్వదా, సర్వత్రా మొత్తం ఉద్యమంయొక్క ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

కాబట్టి కమ్యూనిస్టులు ఒకవైపున, ఆచరణరీత్యా, ప్రతి దేశంలోనూ వున్న కార్మికవర్గ పార్టీ లన్నిటిలోకీ అత్యంత పురోగామీ, అత్యంత దీక్షాపూరితమూ ఐన భాగంగానూ, యితర భాగా లన్నిటినీ ముందుకు తోసే భాగంగానూ వుంటారు; మరొక వైపున, సిద్ధాంతరీత్యా, కార్మికోద్యమం పయనించే మార్గమూ, దాని నియమాలూ, దాని సాధారణ అంతిమ ఫలితాలూ స్పష్టంగా అర్థం చేసుకుంటారు గనుక, ఆ విషయంలో బహు సంఖ్యాక కార్మిక జనసామాన్యానికి లేని సౌకర్యం కలిగి వుంటారు.

కమ్యూనిస్టుల తక్షణ లక్ష్యం యితర కార్మికవర్గ పార్టీల కున్నదే: కార్మికులు ఒక

వర్గంగా రూపొందడం, బూర్జువా ఆధిపత్యాన్ని కూలదోయడం, కార్మికవర్గం రాజకీయాధికారాన్ని గెలుచుకోవడం.

జగత్తు నంతటినీ సంస్కరించదలచిన యే మహానుభావుడో సృష్టించో, ఆవిష్కరించో యిచ్చిన భావాలమీదనో, సూత్రాలమీదనో ఆధారపడవు కమ్యూనిస్టుల సిద్ధాంత నిర్ణయాలు.

యీ నిర్ణయాలు ప్రస్తుత వర్గ పోరాటంనుండి, సాక్షాత్తుగా మన కండ్లముందు జరుగుతున్న ఒక చారిత్రక పరిణామంనుండి ఉత్పన్నమౌతున్న వాస్తవ సంబంధాలను స్థూలంగా వ్యక్తపరుస్తాయి — అంతే. అమల్లో వున్న ఆస్తి సంబంధాలను రద్దు చేయడ మనేది కమ్యూనిజంయొక్క ప్రత్యేక లక్షణ మేమీ కాదు.

చారిత్రక పరిస్థితులలో వచ్చిన మార్పుల ఫలితంగా, గతంలో కూడా, ఆస్తి సంబంధాలన్నీ నిరంతరం మారుతూనే వచ్చినాయి.

ఉదాహరణకు, ఫ్రెంచి విప్లవం ఫ్యూడల్ ఆస్తిని రద్దుచేసి, బూర్జువా ఆస్తిని నిలబెట్టింది. *

కమ్యూనిజంయొక్క ప్రత్యేక లక్షణం యే ఆస్తినైనా రద్దుచేయడం కాదు, బూర్జువా ఆస్తిని రద్దుచేయడం. కానీ, వర్గ వైరుధ్యాలమీదా, అధిక సంఖ్యాకులను అల్ప సంఖ్యాకులు చేసే దోపిడీమీదా ఆధారపడి ఉత్పాదితాలను ఉత్పత్తి చేసి సొంత పరచుకొనే వ్యవస్థయొక్క రూపాలలోకెల్లా ఆధునిక బూర్జువా సొంత ఆస్తి అనేది ఆఖరిదీ, అత్యంత పరిపూర్ణమైనదీ.

యీ అర్థంలో కమ్యూనిస్టుల సిద్ధాంతం ఒక్క వాక్యంలో చెప్పవచ్చు: సొంత ఆస్తిని రద్దుచేయడం.

మనుషులు స్వయంకృషిచేత స్వయంగా ఆస్తి సంపాయించుకునే హక్కును రద్దు చేయదలచుకున్నామని కమ్యూనిస్టులమైన మామీద నిందలు వేస్తున్నారు; మనుషుల సకల విధ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకూ, సకల విధ కార్యకలాపాలకూ అటువంటి ఆస్తే మూలాధారమని అంటున్నారు.

కష్టపడి సంపాయించిన ఆస్తి అట! స్వయంగా సంపాయించిన ఆస్తి అట! బూర్జువా ఆస్తి అనేది రాక పూర్వమే చిన్న రైతులూ, చిల్లర చేతిపనులవాళ్లూ సంపాయిన్నూ వుండిన ఆస్తిని గురించేనా మీ రనేది? అదే ఐతే, దాన్ని రద్దుచేయవలసిన

---

* 1789–1794 విప్లవం ఫ్రాన్సులో ఫ్యూడల్ భూస్వామ్యాన్ని రద్దుచేసి, రైతులనుండి పెద్ద భూస్వాములు గుంజుకొన్న సమష్టి భూములను రైతులకు తిరిగి యిచ్చి, ఫ్యూడల్ విధుల నన్నిటినీ రద్దు చేసింది. — సం.

అవసరం లేదు; పరిశ్రమల అభివృద్ధివల్ల అది యిప్పటికే చాలావరకు నాశనమయింది, తక్కిందిరోజూ నాశనమౌతూనే వుంది.

లేక, మీరనేది ఆధునిక బూర్జువా సొంత ఆస్తిని గురించా?

ఐతే, కూలిపనివల్ల కార్మికునికి ఆస్తి యేమైనా కలుగుతున్నదా? లేదు, అణు మాత్రం కూడా లేదు. కూలిపని పెట్టుబడిని సృష్టిస్తుంది. పెట్టుబడి అంటే కూలి పనిని దోపిడీ చేసేటటువంటి ఆస్తి, కొత్తగా దోపిడీ చేయడానికి కొత్త కార్మికులను సృష్టిస్తే తప్ప వృద్ధి కాలేని ఆస్తి. యీనాడు అమల్లో వున్న ఆస్తి పెట్టుబడికీ కూలిపనికీ గల వైరుధ్యంమీద ఆధారపడి వుంది. యీ వైరుధ్యంయొక్క యిరు పక్షాలనూ పరిశీలించుదాం.

పెట్టుబడిదారుడుగా వుండడమంటే ఉత్పత్తిలో కేవలం వ్యక్తిగత హోదాయే గాక, ఒక సామాజిక హోదా కూడా కలిగి వుండడమన్నమాట. పెట్టుబడి అనేది సమష్టి ఉత్పాదితం; అనేకమంది కలిసి చేసే సమైక్య కృషి వల్లనే, యింకా చెప్పాలంటే, సమాజంలోని సభ్యు లందరూ కలిసి చేసే సమైక్య కృషి వల్లనే, పెట్టుబడి సచేతనంగా వుంటుంది.

కాబట్టి పెట్టుబడి అనేది వ్యక్తియొక్క శక్తి కాదు; అది ఒక సామాజిక శక్తి.

కాబట్టి పెట్టుబడిని సమష్టి ఆస్తిగా మార్చినప్పుడు, సమాజంలోని సభ్యులందరి ఆస్తిగా మార్చినప్పుడు, అందుమూలంగా వ్యక్తిగత ఆస్తి సామాజిక ఆస్తిగా మారడం లేదు. ఆస్తియొక్క సామాజిక స్వభావంలో మాత్రమే మార్పు వస్తుంది. ఆస్తి తన వర్గ స్వభావం కోల్పోతుంది.

యిక కూలిపనిని పరిశీలిద్దాం.

కూలిపనియొక్క సగటు ఖరీదు యెంతంటే కార్మికుని కిచ్చే కనీస వేతనం; అంటే, కార్మికుడు కార్మికుడుగా బతకాలంటే తప్పనిసరిగా కావలసిన తిండి తీర్థాల ఖరీదు. కాబట్టి కూలిపని చేసే కార్మికుడు తన శ్రమద్వారా సంపాయించేది కేవలం శరీరాన్ని నిలుపుకోడానికీ, కేవలం శరీరాన్ని నిలుపుకునే సంతానాన్ని కనడానికీ బొటాబొటిగా సరి పోతుంది. శ్రమ ఫలితమైన యీ సొంత సంపాదన — కేవలం శరీర నిర్వహణకూ, వంశవృద్ధికీ సరిపోయే సొంత సంపాదన — అందులో కొంత మిగిలించుకొని ఆ మిగులు డబ్బును పెట్టుబడిగా మార్చి యితరులను కూలివాళ్లుగా ఉపయోగించుకోడానికి యే మాత్రమూ విలు లేని సొంత సంపాదన — దీన్ని రద్దుచేయడం యెంత మాత్రమూ మా ఉద్దేశం కాదు. మేము రద్దు చేయదలచుకున్నదల్లా యీ ఆస్తి సంపాదనా విధానంలోని యే దౌర్భాగ్య స్వభావంవలన కార్మికుడు పెట్టుబడిని వృద్ధి చేయడానికి మాత్రమే బతుకుతాడో, యే దౌర్భాగ్య స్వభావంవలన పాలకవర్గం తనకు లాభకరంగా వున్నంత వరకు మాత్రమే కార్మికుని బతకనిస్తుందో, ఆ దౌర్భాగ్య స్వభావాన్ని మాత్రమే.

బూర్జువా సమాజంలో, ప్రాణంగల శ్రమ కూడబెట్టిన శ్రమను వృద్ధి చేసే సాధనం మాత్రమే. కమ్యూనిస్టు సమాజంలో కూడబెట్టిన శ్రమ శ్రమపడేవాని జీవితాన్ని విస్తృతపరచడానికీ, సంపన్నం చేయడానికీ, ప్రోత్సహించడానికీ సాధనం మాత్రమే.

కాబట్టి, బూర్జువా సమాజంలో గతం వర్తమానాన్ని శాసిస్తుంది; కమ్యూనిస్టు సమాజంలో వర్తమానం గతాన్ని శాసిస్తుంది. బూర్జువా సమాజంలో పెట్టుబడికి స్వాతంత్ర్యమూ, వ్యక్తిత్వమూ వుంటాయి గానీ, ప్రాణంగల మనిషికి స్వాతంత్ర్యమూ వుండదు, వ్యక్తిత్వమూ వుండదు.

యీ స్థితినే మేము రద్దుచేయాలనేది. దీన్ని రద్దుచేయడమే వ్యక్తిత్వాన్ని రద్దు చేయడమనీ, స్వేచ్ఛను రద్దుచేయడమనీ బూర్జువాలు అంటారు! నిజమే మరి. నిస్సంశయంగా మా లక్ష్యం బూర్జువా వ్యక్తిత్వాన్నీ, బూర్జువా స్వాతంత్ర్యాన్నీ, బూర్జువా స్వేచ్ఛనూ రద్దుచేయడమే.

ప్రస్తుత బూర్జువా ఉత్పత్తి వ్యవస్థలో స్వేచ్ఛ అంటే వ్యాపారానికి స్వేచ్ఛ, క్రయ విక్రయాలకు స్వేచ్ఛ.

కానీ క్రయ విక్రయాలే అంతరించినప్పుడు క్రయ విక్రయాల స్వేచ్ఛ కూడా అంతరిస్తుంది. క్రయ విక్రయాల స్వేచ్ఛను గురించి మాట్లాడే యీ మాటలకూ, యింకా సామాన్య వాచకమైన స్వేచ్ఛను గురించి మన బూర్జువాలు చేసే "గంభీరోపన్యాసా"లకూ యేమైనా అర్థం వుంటే మధ్యయుగాలనాటి వర్తకులమీద వుండిన నిర్బంధాలతోనూ, వాళ్ల క్రయ విక్రయాలమీద వుండిన పరిమితులతోనూ పోల్చి చూసినప్పుడు మాత్రమే అర్థం వుందనవచ్చు. కానీ, క్రయ విక్రయాలనే రద్దుచేయాలనీ, బూర్జువా ఉత్పత్తి వ్యవస్థనే రద్దుచేయాలనీ, అసలు బూర్జువావర్గాన్నే రద్దు చేయాలనీ అనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని వ్యతిరేకించేటప్పుడు ఆ మాటలకు అర్థమే లేదు.

సొంత ఆస్తిని మేము రద్దుచేయాలనడం మీకు యెంతో వెలపరం పుట్టిస్తున్నది. కానీ యిప్పుడున్న మీ సమాజంలో నూటికి తొంభైమందికి సొంత ఆస్తి యిప్పటికే రద్దయిపోయింది; నూటికి తొంభైమందికి లేదు గనుకనే తక్కిన కొద్దిమందికీ వుండగలుగుతున్నది. అనగా, సమాజంలో అత్యధిక సంఖ్యాకులకు యే విధమైన ఆస్తీ లేనప్పుడు మాత్రమే బతకగల ఆస్తి వ్యవస్థను మేము రద్దు చేయదలచుకున్నందుకు మీరు మమ్మల్ని నిందిస్తున్నా రన్నమాట.

ఒక్క మాటలో చెప్పాలంటే, మీ ఆస్తిని రద్దు చేయదలచుకున్నామని మమ్మల్ని మీరు నిందిస్తున్నారు. ఔను, సరిగ్గా అదే మేము చేయదలచుకున్నది.

కార్మిక శ్రమను పెట్టుబడిగానూ, డబ్బుగానూ, కౌలుగానూ మార్చడం యెప్పుడు సాధ్యం కాదో, కార్మిక శ్రమను గుత్తగొనబడగల సాంఘిక శక్తిగా మార్చడం యెప్పుడు

సాధ్యం కాదో, అనగా వ్యక్తిగత ఆస్తిని బూర్జువా ఆస్తిగా, పెట్టుబడిగా, మార్చడం యెప్పుడు సాధ్యం కాదో, అప్పుడు, ఆ క్షణంనుండే, వ్యక్తుల వ్యక్తిత్వం అదృశ్యమౌతుం దని మీ వాదన.

అనగా, మీ అవగాహనలో "వ్యక్తి" అంటే బూర్జువా వ్యక్తేనన్నమాట, మధ్య తరగతి * ఆస్తిపరుడు తప్ప మరెవ్వరూ కాదన్నమాట. యీ విషయం మీరు ఒప్పకోక తప్పదు. అయితే, ఆ వ్యక్తిని తప్పక యీడ్చి పారవేయవలసిందే, ఆ వ్యక్తి వుండడానికే వీలు లేకుండా చేయవలసిందే.

కమ్యూనిజం యే వ్యక్తికీ సమాజ ఉత్పాదితాలను సొంతపరచుకునే హక్కు లేకుండా చేయదు. అలా సొంతపరచుకోవడంద్వారా యితరులను కూలివాళ్లుగా మార్చే హక్కును మాత్రమే అది తొలగిస్తుంది.

సొంత ఆస్తి రద్దయితే పని చేయడం అనేదే ఆగిపోతుందనీ, ప్రపంచమంతా సోమరి తనం అలముకొంటుందనీ మరొక ఆక్షేపణ వుంది.

యీ వాదం నిజమే ఐతే, వట్టి సోమరితనంతో బూర్జువా సమాజం యేనాడో భ్రష్టుపట్టి పోయివుండేది; యీ సమాజంలో పనిచేసేవాళ్లు యేమీ సంపాయించుకో లేకపోవడమూ, యేమైనా సంపాయించుకునేవాళ్లు పనిచేయక పోవడమూ మనం చూస్తు న్నదే కదా. పెట్టుబడి రద్దయినప్పుడు కూలిపని అనేది కూడా రద్దౌతుంది అనే చర్విత చర్వణాన్నే యింకో రూపంలో వల్లించడం తప్ప యీ ఆక్షేపణలో పస యేమీలేదు.

భౌతిక ఉత్పాదితాలను కమ్యూనిస్టు పద్ధతిలో ఉత్పత్తి చేయడంమీదా, సొంతపరచు కోవడంమీదా యే ఆక్షేపణలు చేస్తున్నారో, ఆ ఆక్షేపణలే బౌద్ధిక ఉత్పాదితాలను కమ్యూనిస్టు పద్ధతిలో ఉత్పత్తి చేయడంమీదా, సొంతపరచుకోవడంమీదా కూడా చేస్తు న్నారు. బూర్జువా దృష్టికి యే విధంగా వర్గ ఆస్తి అదృశ్యం కావడం అసలు ఉత్పత్తే అదృశ్యం కావడంగా కనిపిస్తుందో, అదే విధంగా ఆ దృష్టికి వర్గ సంస్కృతి అదృ శ్యం కావడం మొత్తం సంస్కృతి అంతా అదృశ్యం కావడంగా కనిపిస్తుంది.

ఏ సంస్కృతి పోతుందని బూర్జువా విలపిస్తున్నాడో ఆ సంస్కృతి సమాజంలో అధికాధిక సంఖ్యాకులకు యంత్రాలలాగా పనిచేసే శిక్షణ మాత్రమే.

---

* మధ్యతరగతి (middle-class): మార్క్సు కాలంనాటికి పెట్టుబడిదార్ల నంద రినీ మధ్యతరగతి అనే అనేవాళ్లు. ఫ్యూడల్ యుగంలో పుట్టిన పదం గనుక యీ అర్థం వచ్చింది. ఫ్యూడల్ సమాజంలో ఫ్యూడల్ ప్రభువులూ, భూస్వాములూ పైవర్గం; బూర్జువా వర్గమంతా మధ్యతరగతి. — సం.

స్వేచ్ఛ, సంస్కృతి, న్యాయశాస్త్రం మొదలైన వాటిని గురించి మీకున్న మీ బూర్జువా అభిప్రాయాలనే ప్రమాణాలుగా చేసి, బూర్జువా ఆస్తిని రద్దుచేయాలనే మా ఉద్దేశాన్ని ఆ ప్రమాణాలతో కొలిచేటట్లయితే, మీరు మాతో కీచులాడకండి. అసలు మీ భావాలే మీ బూర్జువా ఉత్పత్తి వ్యవస్థనుండీ, మీ బూర్జువా ఆస్తి వ్యవస్థనుండీ ఉద్భవించినవి. అదే విధంగా మీ న్యాయశాస్త్రం కూడా మీ వర్గంయొక్క ఇచ్ఛే. మీ వర్గంయొక్క ఇచ్ఛ సమస్త జనులూ అనుసరించవలసిన చట్టంగా చేయబడి న్యాయశాస్త్రమైంది. ఆ యిచ్ఛయొక్క సారాంశమూ, గమ్యమూ మీ వర్గం బతకడానికి అవసరమైన ఆర్థిక నియమాలచేత నిర్ణయింపబడుతున్నాయి.

మీ ప్రస్తుత ఉత్పత్తి విధానమూ, మీ ప్రస్తుత ఆస్తి వ్యవస్థా ఉత్పత్తి పురోగతిలో ఒకానొక దశలో ఉద్భవించి అంతరించిపోయే చారిత్రక సంబంధాలు మాత్రమే. వాటినుండి ఉత్పన్నమైన సామాజిక రూపాలను ప్రకృతి సిద్ధమూ తర్కబద్ధమూ ఐన నిత్య సత్యాలుగా మార్చాలనుకోవడం మీ స్వార్థపూరిత దురవగాహన ఫలితమే. ఈ దురవగాహన చరిత్రలో మీరు రాకముందు కూడా ప్రతి పాలకవర్గానికీ వుండిందే. ప్రాచీన ఆస్తి విషయంలో మీరు దేన్ని స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతున్నారో, ఫ్యూడల్ ఆస్తి విషయంలో మీరు దేన్ని అంగీకరిస్తున్నారో, దాన్నే మీ సొంత బూర్జువా ఆస్తి విషయంలో మీరు ఒప్పుకోలేక పోవడం సహజమే.

కుటుంబం రద్దు! కమ్యూనిస్టులు చేసే యీ దారుణమైన ప్రతిపాదనమీద అత్యంత అతివాదులు కూడా మండిపడుతున్నారు.

యీనాటి కుటుంబం — అనగా బూర్జువా కుటుంబం — యే పునాదులమీద నిలబడివుంది? పెట్టుబడిమీద, వ్యక్తిగత లాభంమీద. యీ కుటుంబంయొక్క పరిపూర్ణ రూపం బూర్జువాలలో మాత్రమే వుంది. కానీ యీ స్థితికి అనుబంధంగా రెండు అంశాలు వున్నాయి: కార్మికుల్లో కుటుంబం అనేది ఆచరణలో లేకపోవడమూ, బహిరంగంగా సాగే సాని వృత్తీ.

బూర్జువా కుటుంబంయొక్క యీ అనుబంధ అంశాలు అంతరించినప్పుడు బూర్జువా కుటుంబం దానంతటు అదే అంతరిస్తుంది; పెట్టుబడి అంతరించినప్పుడు రెండూ అంతరిస్తాయి.

తలిదండ్రులు తమ పిల్లలమీద సాగించే దోపిడీని మేము అంతం చేయాలనుకున్నామని మీరు మమ్మల్ని నిందిస్తున్నారా? యీ విషయంలో మేము నేరస్తులమే.

కానీ, యింటివద్ద చెప్పే విద్యకు బదులు సామాజిక విద్య ప్రవేశపెట్టడంద్వారా మేము అత్యంత పవిత్రమైన సంబంధాలు ధ్వంసం చేస్తున్నామని మీరు అంటారు. మరి మీ విద్యో? అది కూడా సామాజిక విద్య కాదా? పాఠశాలలూ, మొదలైన వాటిద్వారా సమాజం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విద్యలో జోక్యం కలిగించుకోవడం లేదా? తద్వారా

దాన్ని సామాజిక పరిస్థితులు నిర్ణయించడం లేదా? విద్యలో సమాజ జోక్యం అనేది కమ్యూనిస్టులు సృష్టించింది కాదు. ఐతే కమ్యూనిస్టులు ఆ జోక్యంయొక్క స్వభావాన్ని మార్చాలంటారు, పాలకవర్గ ప్రభావంలో చిక్కుకున్న విద్యను రక్షించాలంటారు.

కుటుంబం గురించీ, విద్యను గురించీ, తలిదండ్రులకూ పిల్లలకూ గల పవిత్ర అనుబంధాలను గురించీ మీరు చెప్పేవన్నీ వట్టి బూర్జువా కబుర్లు. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ మూలంగా కార్మికుల కుటుంబ సంబంధాలన్నీ తునాతునక లయ్యేకొద్దీ, కార్మికుల బిడ్డలు వట్టి వ్యాపార వస్తువులుగానూ కూలిపనిచేసే సాధనాలుగానూ మారేకొద్దీ, మీ బూర్జువా కబుర్లు మరీ రోత పుట్టిస్తాయి.

కమ్యూనిస్టులు స్త్రీలను సమష్టి ఆస్తిగా చేస్తారో అని బూర్జువా లందరూ ఒకే గొంతుకతో పొలికేకలు పెడుతున్నారు.

బూర్జువాకు తన భార్య కేవలం ఉత్పత్తి సాధనంగా మాత్రమే కనపడుతుంది. ఉత్పత్తి సాధనాలను సమష్టిగా ఉపయోగించుకుంటారని అతని చెవుల బడుతూనే, స్త్రీలకు కూడా అదే గతి సంభవిస్తుందని అతను నిర్ణయించుకుంటాడు. బూర్జువా బుద్ధికి అంతకు మించిన ఆలోచన యెలా వస్తుంది!

స్త్రీలు కేవల ఉత్పత్తి సాధనాలుగా వుండే యీ దుస్థితిని రద్దుచేయడమే మా అసలు లక్ష్యమని బూర్జువాకు కించిత్తు అనుమానమైనా రాదు.

కమ్యూనిస్టులు బహిరంగంగా శాసనరీత్యా స్త్రీలను సమష్టి ఆస్తిగా చేస్తారని తామే కల్పించి, ఆ కల్పనమీద ధర్మైక పరాయణుల మాదిరీ ఆగ్రహోదగ్రులయ్యే యీ బూర్జువాల ప్రవర్తనకంటె అపహాస్యకరమైనది మరొకటి వుండదు. కమ్యూనిస్టులు కొత్తగా స్త్రీలను సమష్టి ఆస్తిగా చేయవలసిన అవసరమేమీ లేదు; అది దాదాపు అనాది కాలంనుండి సమాజంలో వుంటూనే వుంది.

మన బూర్జువాలు, బజారు వేశ్యలమాట అటుంచి, తమ చేతికింది కార్మికుల పెండ్లాలూ కూతుర్లూ తమ అభీష్టానువర్తు లయ్యేది చాలక, ఒకరి పెండ్లాల నొకరు చెరచడంలో అపారమైన ఆనందం పొందుతున్నారు.

బూర్జువా వివాహ వ్యవస్థే నిజానికి సమష్టి పెండ్లాల వ్యవస్థ. కాబట్టి కమ్యూనిస్టులమీద బూర్జువాలు నింద వేయదలచుకుంటే, మహా ఐతే, బూర్జువాలు ప్రచ్ఛన్నంగా సాగించే కపట నాటకాన్ని కమ్యూనిస్టులు బహిరంగంగా చట్టబద్ధంగా చేస్తారని మాత్రమే నింద వేయగలరు. యిక చెప్పవలసిందేమంటే: ప్రస్తుత ఉత్పత్తి వ్యవస్థ రద్దు కావడంతోనే యిందులోనుండి ఉత్పన్నమైన సమష్టి భార్యా వ్యవస్థ కూడా — అనగా బహిరంగ వేశ్యావృత్తీ, ప్రచ్ఛన్న వేశ్యావృత్తీ — రద్దు ఔతుంది అనేది స్పష్టంగా తెలుస్తూనే వుంది.

కమ్యూనిస్టులు దేశాలనూ జాతులనూ రద్దుచేయగోరుతున్నారని మరొక నింద కూడా వుంది.

కార్మికులకు దేశం అనేది లేదు. కాబట్టి వాళ్లకు లేనిదాన్ని యెవరూ లాక్కో లేరు. కార్మికవర్గం ప్రప్రథమంగా రాజకీయ ఆధిపత్యం సంపాయించుకొని, తన జాతిలో తాను ప్రధాన వర్గంగా అభివృద్ధి చెంది, జాతి అంటే తానే అనే స్థితికి రాక తప్పదు గనుక, ఆ మేరకు కార్మికవర్గమే జాతీయమైనది — కానీ, ఆ మాటకు బూర్జువాలు చెప్పే అర్థంలో కాదు.

బూర్జువావర్గ అభివృద్ధి మూలంగానూ, స్వేచ్ఛా వాణిజ్యం మూలంగానూ, ప్రపంచ మార్కెట్ మూలంగానూ, ఉత్పత్తి విధానంలోనూ దాన్ని అనుసరించి వుండే జీవిత విధానంలోనూ వచ్చే ఏకత్వం మూలంగానూ, దినదినానికీ వివిధ జాతులమధ్య వుండే జాతీయ విభేదాలూ, జాతీయ వైరుధ్యాలూ అంతరించిపోతున్నాయి.

కార్మికవర్గ ఆధిపత్యంలో అవి యింకా వేగంగా అంతరించిపోతాయి. కార్మికవర్గ విమోచనకు గల ఒక ముఖ్య షరతు యేమంటే వివిధ దేశాలు సమైక్యంగా కృషి చేయడం — కనీసం ప్రముఖ నాగరిక దేశాలు సమైక్యంగా కృషి చేయడం.

ఒక వ్యక్తిమీద మరొక వ్యక్తి చేసే దోపిడీ యే మేరకు అంతమౌతుందో ఆ మేరకు ఒక జాతిమీద మరొక జాతి చేసే దోపిడీ కూడా అంతమౌతుంది. ఒక జాతిలోని భిన్న వర్గాల మధ్య వైరుధ్యం యే మేరకు అంతరిస్తుందో ఆ మేరకు జాతికీ జాతికీ మధ్య వుండే శత్రుత్వం కూడా అంతరిస్తుంది.

యిక మతదృష్ట్యానో, తత్వశాస్త్రదృష్ట్యానో, లేక యేదో ఒక సిద్ధాంత దృష్ట్యానో కమ్యూనిజంమీద వేసే ఆరోపణలు అంత శ్రద్ధగా పరిశీలించ దగినవి కావు.

మానవుని భౌతిక జీవిత పరిస్థితులలోనూ, అతని సాంఘిక సంబంధాలలోనూ, అతని సాంఘిక జీవితంలోనూ మార్పు వచ్చినప్పుడల్లా అతని ఊహలూ, అభిప్రాయాలూ, భావాలూ, ఒక్క మాటలో చెప్పాలంటే, అతని చైతన్యం మారుతుందని గ్రహించడానికి అంత పెద్ద అతీంద్రియ జ్ఞానం అవసరం లేదు కదా?

మానవ భావాల చరిత్ర రుజువు చేస్తున్న దేమిటి? భౌతిక వస్తూత్పత్తి యే మేరకు మారుతుందో ఆ మేరకు బౌద్ధిక ఉత్పత్తుల స్వభావంలో కూడా మార్పు వస్తుందని కాకపోతే మరేమిటి? ప్రతి యుగంలోనూ ప్రజలను పాలించే భావాలు ఆనాటి పాలకవర్గంయొక్క భావాలే.

సమాజంలో విప్లవం తెచ్చే భావాలు అని యెవరైనా అన్నప్పుడు, పాత సమాజం లోపల కొత్త సమాజపు బీజాలు ఉద్భవించినాయనీ, పాత జీవితవిధానం యే మేరకు క్షీణిస్తే అదే మేరకు పాత భావాలు కూడా క్షీణిస్తాయనీ అనే వాస్తవాన్ని మాత్రమే ఆ మాటలు వ్యక్తం చేస్తాయి.

ప్రాచీన ప్రపంచం మరణ వేదన పడేటప్పుడు ప్రాచీన మతాలను క్రైస్తవ మతం ఓడించింది. 18వ శతాబ్దిలో క్రైస్తవ భావాలు హేతువాద భావాలకు ఓడిపోయినప్పుడు* ఫ్యూడల్ సమాజం అనాటికి విప్లవకరమైన బూర్జువావర్గంతో చావు పోరాటం చేసింది. మత స్వాతంత్ర్యమూ, అంతఃకరణ స్వాతంత్ర్యమూ అనే భావాలు యేమి వెల్లడిస్తే యంటే నిర్నిబంధ పోటీ అనే (బూర్జువా) సూత్రం జ్ఞానరంగంలో కూడా రాజ్యం చేసిందని మాత్రమే వెల్లడిస్తాయి.

''మత విశ్వాసాలూ, నైతికాభిప్రాయాలూ, తాత్వికాభిప్రాయాలూ, న్యాయశాస్త్ర భావాలూ చారిత్రక పురోగమనంలో మారిన మాట విస్పందేహంగా నిజమే. కానీ మతం అనేదీ, నీతి అనేదీ, తత్వశాస్త్రం అనేదీ, రాజకీయ శాస్త్రం అనేదీ, న్యాయశాస్త్రం అనేదీ ఆ మార్పులలో యెప్పుడూ నశించి పోకుండా బతికే వున్నాయిగదా'' అని మీరు అనవచ్చు.

''అంతేకాక స్వేచ్ఛ, న్యాయం మొదలైన నిత్య సత్యాలు సమాజంయొక్క అన్ని దశల్లోనూ వుండేవి వున్నాయి. కానీ కమ్యూనిజం ఆ నిత్య సత్యాలనే రద్దుచేస్తుంది; మతాన్నీ, నీతినీ నూతన పునాదులపైన నిర్మించే బదులు సమస్త మతాన్నీ, సమస్త నీతినీ రద్దుచేస్తుంది. కాబట్టి కమ్యూనిజం గత చరిత్రలోని సమస్త అనుభవానికీ వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంది'' అని మీరు అనవచ్చు.

యీ ఆరోపణయొక్క తాత్పర్యం యేమిటి? గత సమాజపు చరిత్ర అంతా వివిధ దశలలో వివిధ రూపాలు ధరించిన వర్గ వైరుధ్యాల అభివృద్ధే.

కానీ, ఆ వైరుధ్యాలు యే రూపం ధరించినప్పటికీ, ఒక విషయం మాత్రం గతించిన యుగాలన్నిటికీ సమాన లక్షణంగా వుంది; యేదంటే, సమాజంలో ఒక భాగాన్ని మరొక భాగం దోపిడీ చేయడం. కాబట్టి గత యుగాల సామాజిక చైతన్యం యెంత బహుళత్వమూ, యెంత వైవిధ్యమూ ప్రదర్శించినా, అది కొన్ని సామాన్య రూపాలలోనే, లేదా కొన్ని సాధారణ భావాల మధ్యనే సంచరిస్తూ వుంటుంది; సమస్త వర్గ వైరుధ్యాలూ సమూలంగా అంతరించినప్పుడు తప్ప యీ రూపాలు, లేక భావాలు సంపూర్ణంగా అంతరించిపోవు. యిందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

కమ్యూనిస్టు విప్లవం అనేది సాంప్రదాయిక ఆస్తి సంబంధాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవడం. కనుక కమ్యూనిస్టు విప్లవంయొక్క అభివృద్ధిలో సాంప్రదాయిక భావాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవడం యిమిడి వుంది. యిందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

---

* 18వ శతాబ్దికి చెందిన ఫ్రెంచి జ్ఞాన భాస్కరులైన వోల్టేర్, డిడ్రో, రూసో, హెల్వెటియస్, గొల్బాహ్ తదితరుల భావాలకు ప్రస్తావన. — సం.

కమ్యూనిజంమీద బూర్జువాలకు గల ఆక్షేపణల గురించి యింతటితో చాలు.

కార్మికవర్గ విప్లవంలో మొదటి మెట్టు కార్మికవర్గం పాలకవర్గం కావడమనీ, ప్రజాస్వామ్యాన్ని గెలుచుకోవడమనీ పైన తెలుసుకున్నాం.

కార్మికవర్గం తన రాజకీయ ఆధిపత్యం ఉపయోగించి బూర్జువావర్గంనుండి సమస్త పెట్టుబడినీ క్రమక్రమంగా గుంజుకొని, ఉత్పత్తి సాధనాలన్నిటినీ రాజ్యం చేతుల్లో — అనగా పాలక వర్గంగా సంఘటితపడిన కార్మికవర్గం చేతుల్లో — కేంద్రీకరించి, మొత్తం ఉత్పాదక శక్తులను సాధ్యమైనంత వేగంగా వృద్ధి చేస్తుంది.

సహజంగానే ప్రారంభంలో ఆస్తి హక్కులమీదా, బూర్జువా ఉత్పత్తి విధానంమీదా నిరంకుశమైన దాడులు చేస్తే తప్ప యిది సాధ్యం కాదు. నిరంకుశమైనవి గనుక, యీ చర్యలు ఆర్థికంగా అరకొరగానూ, అసమర్థనీయంగానూ కనపడతాయి. కానీ యీ చర్యలు కాలక్రమాన యింకా పెద్ద వౌతాయి, పాత సామాజిక వ్యవస్థమీద యింకా దాడులు చేయవలసిన అవసరం కలిగిస్తాయి, మొత్తం ఉత్పత్తి విధానాన్ని విప్లవాత్మకంగా మార్చడానికి అనివార్య మైనవి.

ఈ చర్యలు భిన్న దేశాల్లో భిన్న భిన్నంగా వుండడం సహజమే.

ఐనప్పటికీ, అత్యంత పురోగామి దేశాలకు యీ కిందివి సాధారణంగా వర్తిస్తాయి.

1. భూములమీద ఆస్తి హక్కు రద్దుచేసి, భూములమీద వచ్చే కౌలు డబ్బు అంతా సామాజిక కార్యాలకు వినియోగించడం.

2. క్రమప్రవర్ధమానంగా వుండే భారమైన ఆదాయపు పన్ను.

3. వారసత్వపు హక్కు సంపూర్ణంగా రద్దు.

4. దేశాంతరగతుల ఆస్తీ, తిరుగుబాటుదార్ల ఆస్తీ ప్రభుత్వ స్వాధీనం చేసుకోవడం.

5. ప్రభుత్వ పెట్టుబడితో జాతీయ బాంకి యేర్పరచి, పరపతి అంతా గుత్తాధికారంతో ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించడం.

6. వార్తా రవాణా సాధనాలు ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించడం.

7. ప్రభుత్వ ఫాక్టరీలూ, ఉత్పత్తి సాధనాలూ విస్తరింప జేయడం; బంజరు భూములు సాగుచేయడం, ఒక సమష్టి పథకం ప్రకారం భూములు సారవంతం చేయడం.

8. పని చేసే బాధ్యత అందరికీ సమానంగా వుండడం. కార్మిక సైన్యాలు యేర్పరచడం — ముఖ్యంగా వ్యవసాయం కొరకు.

9. వ్యవసాయాన్నీ పరిశ్రమలనూ సమ్మేళనం చేయడం; జనసంఖ్య విషయంలో వివిధ ప్రాంతాల అసమానతలు తగ్గించడంద్వారా పట్టణాలకూ పల్లెలకూ గల భేదం క్రమక్రమంగా రద్దుచేయడం.

10. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్ల లందరికీ ఉచిత విద్య. ఇప్పుడు చేస్తున్నట్లు పిల్లలు ఫాక్టరీలలో పని చేయడం రద్దు. విద్యను పారిశ్రామిక ఉత్పత్తితో మేళవించడం వగైరా, వగైరా.

సమాజ అభివృద్ధి క్రమంలో వర్గ విభేదాలు అంతరించి, ఒక విస్తారమైన సద స్సుగా రూపొందిన మొత్తం జాతి చేతిలో సమస్త ఉత్పత్తి సాంద్రీకరింపబడినప్పుడు, ప్రభుత్వ అధికారం రాజకీయ స్వభావాన్ని కోల్పోతుంది. అసలు రాజకీయ అధికారమనేది, సరైన అర్థంలో, ఒక వర్గాన్ని పీడించడానికి మరొక వర్గం ఉపయోగించే సంఘటిత శక్తి మాత్రమే. కార్మికవర్గం, బూర్జువావర్గంతో తాను పోరాటం చేసే కాలంలో, పరిస్థితుల ప్రాబల్యం వల్ల, తానే ఒక వర్గంగా సంఘటితం కావలసి వస్తే, విప్లవంద్వారా తానే పాలక వర్గ స్థానం అధిష్ఠిస్తే, తన్మూలంగా పాత ఉత్పత్తి విధానాన్ని బలవంతంగా వూడ్చి పారవేస్తే, అప్పుడు ఆ విధానంతోపాటు మొత్తం వర్గాలూ వర్గ విభేదాలూ బతకడానికి అవసరమైన పరిస్థితులను కూడా వూడ్చి పారవేసి వుంటుంది, తన్మూలంగా తన వర్గాధిపత్యాన్నే రద్దుచేసుకొని వుంటుంది.

వర్గాలూ, వర్గ విభేదాలూ గల పాత బూర్జువా సమాజానికి బదులు మన కొక నూతన సదస్సు లభిస్తుంది; ప్రతి ఒకడూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందినప్పుడే అందరూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందగల సదస్సు అది.

1847 డిసెంబర్ – 1848 జనవరిలో
రచింపబడింది

మార్క్స్

# గోతా కార్యక్రమ విమర్శ

(కొంత భాగం)

3. ''శ్రమ పరికరాలను సమాజపు సమష్టి ఆస్తిగా ప్రమోట్ చేయడమూ, శ్రమ ఉత్పాదితాల న్యాయమైన పంపకంతో మొత్తం శ్రమ మీద సహకార నియంత్రణా శ్రమయొక్క విమోచనకు అవసరం.'' *

''శ్రమ పరికరాలను సమాజపు సమష్టి ఆస్తిగా ప్రమోట్ చేయడం'' అనేది వాటిని ''సమష్టి ఆస్తిగా మార్చడం'' అని వుండాలనేది తేటతెల్లం; కానీ యిది ప్రసంగ సందర్భంలో వచ్చిన విషయం.

''శ్రమ ఉత్పాదితాలు'' అంటే యేమిటి? శ్రమచేత ఉత్పత్తి చేయబడిన వస్తువా లేక దాని విలువా? విలువ అయితే, ఆ వస్తువుయొక్క మొత్తం విలువా, లేక ఆ విలువలో యే భాగాన్నైతే ఖర్చైన ఉత్పత్తి సాధనాల విలువకు శ్రమ కొత్తగా కలిపిందో ఆ భాగం మాత్రమేనా?

''శ్రమ ఉత్పాదితాలు'' అనేదీ నిశ్చితమైన ఆర్థిక భావాల స్థానంలో లాసాల్ ** పెట్టిన సళ్ళు భావం.

---

* యిక్కడా, ముందూ మార్క్స్ 1875లో గోతాలో జరిగిన మహాసభ సందర్భంలో జర్మన్ సోషలిస్టులు తయారుచేసిన ముసాయిదా కార్యక్రమాన్ని ఉటంకిస్తాడు. ఆ మహాసభలో బేబెల్, లీబ్క్నెఖ్ట్‌ల అనుచరులు లాసాల్ అనుచరులతో లీనమై జర్మన్ ఐక్య సోషల్ డెమొక్రటిక్ పార్టీని సృష్టించినారు. – సం.

** లాసాల్, ఫెర్డినాండ్ (1825–1864) – జర్మన్ సోషలిస్టు, అఖిల జర్మన్ కార్మికుల సంఘం అనే జర్మన్ కార్మికుల మొదటి సామూహిక సంస్థను స్థాపించిన వాళ్ళలో ఒకడు. లాసాల్‌యొక్కా, అతని అనుచరులయొక్కా రాజకీయ, సిద్ధాంత పొరపాట్లను మార్క్స్, ఎంగెల్స్‌లు పదేపదే విమర్శించినారు. – సం.

"న్యాయమైన పంపకం" అంటే యేమిటి?

యీనాటి పంపకం "న్యాయమైన"దని బూర్జువాలు ఉద్ఘాటించడం లేదా? నిజానికి యిది యీనాటి ఉత్పత్తి విధానపు ప్రాతిపదికమీద ఒకేఒక "న్యాయమైన" పంపకం కాదా? ఆర్థిక సంబంధాలు న్యాయశాస్త్ర భావాలచేత నియంత్రించబడతాయా, లేక, తద్విరుద్ధంగా, న్యాయశాస్త్ర సంబంధాలు ఆర్థిక సంబంధాలనుండి ఉద్భవించవా? సోషలిస్టు ఒంటెత్తువాదులకు కూడా "న్యాయమైన" పంపకం గురించి అత్యంత వివిధమైన అభిప్రాయాలు లేవా?

యీ సందర్భంలో "న్యాయమైన పంపకం" అనే నుడికారానికి అర్థం యేమైందీ గ్రహించడానికి మనం మొదటి పారగ్రాపునూ, యీ పారగ్రాపునూ కలిపి చూడాలి. యే సమాజంలో "శ్రమ పరికరాలు సమష్టి ఆస్తిగా వుండి, మొత్తం శ్రమమీద సహకార నియంత్రణ వుందో," ఆ సమాజం యేర్పడివున్నట్లు యీ పారగ్రాపు ఊహిస్తుంది. "శ్రమ ఉత్పాదితాలు తగ్గించబడకుండా సమాజ సభ్యు లందరికీ సమాన హక్కుతో చెందుతాయి" అని మొదటి పారగ్రాపు తెలుపుతుంది.

"సమాజ సభ్యు లందరికీ"నా? పనిచేయనివాళ్లకు కూడానా? అప్పుడు "శ్రమ ఉత్పాదితాలు తగ్గించబడకుండా" అనే మాట యేవవౌతుంది? పనిచేసే సమాజ సభ్యులకు మాత్రమేనా? అప్పుడు సమాజ సభ్యు లందరి "సమాన హక్కు" యేవవౌతుంది?

కానీ, "సమాజ సభ్యు లందరికీ" అనేదీ, "సమాన హక్కు" అనేదీ తేటతెల్లంగా వట్టి మాటలు. గుజ్జు యేమిటంటే: యీ కమ్యూనిస్టు సమాజంలో ప్రతి కార్మికుడూ లాసాల్ చెప్పే "శ్రమ ఉత్పాదితాలను తగ్గించబడకుండా" పొందాలి.

మొట్టమొదట "శ్రమ ఉత్పాదితాలు" అనే మాటలను శ్రమయొక్క ఉత్పాదితం అనే అర్థంలో తీసుకుందాం. అప్పుడు సహకార శ్రమ ఉత్పాదితాలు మొత్తం సామాజిక ఉత్పాదితంగా వుంటాయి.

దీనినుండి యిప్పుడు వీటిని తీసివేయాలి:

మొదటిది, ఖర్చైన ఉత్పత్తి సాధనాలను భర్తీచేయడానికి భర్తీ మొత్తం.

రెండవది, ఉత్పత్తి విస్తరణ కొరకు అదనపు భాగం.

మూడవది, దుర్ఘటనలూ, ప్రకృతి విపత్తులచేత కలిగే అస్తవ్యస్తాలూ, వగైరాల కొరకు రిజర్వు నిధులు, లేదా భీమా నిధులు.

"తగ్గించబడని శ్రమ ఉత్పాదితాల" నుండి యీ తీసివేతలు చేయడం ఆర్థిక అవశ్యకత; వీటి పరిమాణం లభ్యమయ్యే సాధనాలచేతా, శక్తులచేతా, పాక్షికంగా ప్రాయికతల (probabilities) లెక్కాచారంచేతా నిర్ణయింపబడాలి, కానీ న్యాయం అనేదాని చేత వీటిని లెక్కవేయడం సాధ్యం కాదు.

మొత్తం ఉత్పాదితంలో తక్కిన భాగం వుంది, వినియోగ వస్తువులుగా ఉద్దేశింప బడినట్టిది.

వ్యక్తుల మధ్య దీనిని పంపకం చేసేముందు, దీనినుండి మళ్లీ యివి తీసివేయాలి: మొదటిది, ఉత్పత్తికి సంబంధం లేని సాధారణ పరిపాలన ఖర్చులు.

నేటి సమాజంతో పోలిస్తే యీ భాగం మొట్టమొదటినుండి చాలా గణనీయంగా పరిమితపరచబడుతుంది; నూతన సమాజం అభివృద్ధి చెందే కొద్దీ యిది ఆ నిష్పత్తిలో తగ్గుతుంది.

రెండవది, పాఠశాలలు, ఆస్పత్రులు, వగైరా లాంటి సమష్టి అవసరాలు తీర్చడానికి ఉద్దేశింపబడినది.

నేటి సమాజంతో పోలిస్తే యీ భాగం మొట్టమొదటినుండి గణనీయంగా పెరుగుతుంది; నూతన సమాజం అభివృద్ధి చెందే కొద్దీ యిది ఆ నిష్పత్తిలో పెరుగుతుంది.

మూడవది, పనిచేయలేనివాళ్లూ, వగైరాల కొరకు నిధులు; టూకీగా చెప్పాలంటే, యీనాడు అధికారిక బీదల సహాయం అనబడేదానికింద చేరే నిధులు.

లాసాల్ ప్రభావంకింద యీ కార్యక్రమానికి, దాని సంకుచిత పద్ధతిలో, దృష్టిలో గల ఒకేఒక విషయమైన "పంపకా"నికి యిప్పుడు మాత్రమే మనం వస్తాము; అది యేదంటే, వినియోగ వస్తువులలో యే భాగం సహకార సమాజపు వ్యష్టి ఉత్పత్తిదారుల మధ్య పంచబడుతుందో ఆ భాగం.

"తగ్గించబడని శ్రమ ఉత్పాదితాలు" యిప్పటికే కండ్లకు కనిపించకుండా "తగ్గించబడిన" ఉత్పాదితాలుగా మారినాయి — ఉత్పత్తిదారుడు ప్రైవేటు వ్యక్తి హోదాలో పోగొట్టుకున్నది అతనికి సమాజ సభ్యుని హోదాలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపకరించి నప్పటికీ.

"తగ్గించబడని శ్రమ ఉత్పాదితాలు" అనే నుడికారం యెలా అదృశ్యమైందో అలాగే యిప్పుడు "శ్రమ ఉత్పాదితాలు" అనే నుడికారం పూర్తిగా అదృశ్యమౌతుంది.

ఉత్పత్తి సాధనాల సమష్టి స్వామ్యంమీద ఆధారపడిన సహకార సమాజం లోపల ఉత్పత్తిదారులు తమ ఉత్పాదితాలను సాటా చేసుకోరు. అలాగే, ఉత్పాదితాలమీద వినియోగింపబడిన శ్రమ యీ ఉత్పాదితాల విలువగా, వీటికి గల భౌతిక గుణంగా, కనిపించదు; యెందుకంటే, యిప్పుడు, పెట్టుబడిదారీ సమాజానికి భిన్నంగా, వ్యష్టి శ్రమ యిక యెంత మాత్రమూ పరోక్ష పద్ధతిలో వుండదు, ప్రత్యక్షంగా మొత్తం శ్రమలో భాగంగా వుంటుంది. యీ విధంగా, "శ్రమ ఉత్పాదితాలు" అనే నుడికారం, దాని సందిగ్ధత మూలంగా యీనాడు కూడా ఆక్షేపణీయమైనట్టిది, అర్థ మంతా కోల్పోతుంది.

యిక్కడ మనం చూడవలసింది యేమిటంటే, తన సొంత పునాదులమీద

అభివృద్ధి చెందిన కమ్యూనిస్టు సమాజాన్ని కాదు, తద్వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ సమాజంనుండి అప్పుడప్పుడే ఉద్భవిస్తున్న కమ్యూనిస్టు సమాజాన్ని; కనుక, ప్రతి విషయంలోనూ, ఆర్థికంగా, నైతికంగా, బౌద్ధికంగా, దేని గర్భంనుండి తాను వస్తుందో ఆ పాత సమాజపు ముద్రలను యింకా కలిగివున్నట్టిదాన్ని. అందువలన, వ్యష్టి ఉత్పత్తిదారుడు సరిగ్గా సమాజానికి యిచ్చినంత — తీసివేతలు చేసిన తర్వాత — సమాజంనుండి తిరిగి పొందుతాడు. అతను సమాజానికి యిచ్చింది తన వ్యష్టి భాగం శ్రమను. ఉదాహరణకు, సామాజిక పని దినం వ్యష్టి పని గంటల మొత్తంచేత యేర్పడుతుంది. వ్యష్టి ఉత్పాదకుని వ్యష్టి శ్రమ కాలం అనేది సామాజిక పని దినానికి అతను చేర్చిన భాగం, దానిలో అతని వంతు. అతను ఫలానా మొత్తం శ్రమ యిచ్చినాడని (సమష్టి నిధులకు గాను అతని శ్రమను తీసివేసిన తర్వాత) అతను సమాజంనుండి సర్టిఫికెట్ పొందుతాడు. యీ సర్టిఫికెట్‌తో అతను వినియోగ వస్తువుల సామాజిక నిల్వనుండి ఆ మొత్తం శ్రమ యెంత ఖరీదు చేస్తుందో అంత ఖరీదు చేసేదానిని పొందుతాడు. అతను సమాజానికి ఒక రూపంలో యెంత మొత్తం శ్రమ యిచ్చినాడో అంత మరొక రూపంలో తిరిగి పొందుతాడు.

తేటతెల్లంగా, సరుకుల సాటాను నియంత్రించే సూత్రమే యిక్కడ అమలులో వుంది, యిది సమాన విలువల సాటా అయినంత మేరకు. సారమూ, రూపమూ మారినాయి; యెందుకంటే, మారిన పరిస్థితులలో యెవడూ తన శ్రమను తప్ప యేమీ యివ్వజాలడు గనుక, మరొకవైపున, వ్యష్టి వినియోగ వస్తువులు తప్ప యేదీ వ్యక్తుల స్వామ్యానికి మారదు గనుక. కానీ, వ్యష్టి ఉత్పత్తిదారుల మధ్య వినియోగ వస్తువుల పంపకానికి సంబంధించినంతవరకు, సమాన విలువ గల సరుకుల సాటాలో వున్న సూత్రమే అమలులో వుంటుంది: ఒక రూపంలో ఫలానా మొత్తం శ్రమ మరొక రూపంలో అదే మొత్తం శ్రమకు సాటా చేసుకోబడుతుంది.

కనుక, సూత్రరీత్యా యిక్కడ యింకా సమాన హక్కు వుంది. యిది బూర్జువా హక్కు — సూత్రమూ, ఆచరణా యిక యెంత మాత్రమూ విరోధులు కాకపోయినప్పటికీ. కాగా, సరుకుల సాటాలో సమాన విలువల సాటా అనేది సగటున మాత్రమే వుంటుంది, వ్యష్టి విషయంలో కాదు.

యీ పురోగతి జరిగినప్పటికీ, యీ సమాన హక్కు యింకా నిత్యం బూర్జువా పరిమితిచేత కళంకితమై వుంటుంది. ఉత్పత్తిదార్ల హక్కు వాళ్ళు సరఫరాచేసే శ్రమకు అనుగుణమైన నిష్పత్తిలో వుంటుంది. సమానత్వం యెక్కడ వుందంటే, శ్రమ అనే సమాన ప్రమాణంతో కొలత చేయడంలో వుంది.

కానీ, ఒక మనిషి మరొకనికంటె శారీరికంగానో, బౌద్ధికంగానో మేలుగా వుంటాడు,

అందువలన అదే సమయంలో యెక్కువ శ్రమ సరఫరా చేస్తాడు, లేదా యెక్కువ సేపు శ్రమ చేయగలడు. మరి, శ్రమ అనేది కొలమానంగా పనిచేయాలంటే, దానిని దాని కాల దైర్ఘ్యం (duration)చేత గానీ, తీవ్రతచేత గానీ నిర్వచించాలి; లేకపోతే అది కొలతకు ప్రమాణంగా వుండజాలదు. యీ సమాన హక్కు అనేది అసమాన శ్రమకు గల అసమాన హక్కు. యిది వర్గ భేదాలను గుర్తించదు; యెందుకంటే, ప్రతి వొకడూ యితర ప్రతి వొకనిలాగ కార్మికుడు మాత్రమే. కానీ, అసమాన వ్యక్తిగత ప్రజ్ఞనూ, తద్వారా అసమాన ఉత్పాదక సామర్థ్యాన్నీ సహజ సౌకర్యాలుగా యిది మౌనంగా గుర్తిస్తుంది. కనుక యిది, దీని సారాన్నిబట్టి, ప్రతి హక్కు లాగే, అసమాన హక్కు. స్వభావతః హక్కు అనేది సమానమైన ప్రమాణాన్ని వర్తింపజేయడంగా మాత్రమే వుండగలదు. కానీ అసమాన వ్యక్తులు (అసమానంగా లేకపోతే భిన్న వ్యక్తులుగా వుండరు గదా), వాళ్ళు సమాన దృక్పథంతో చూడబడిన మేరకు, సమాన ప్రమాణంతో మాత్రమే కొలవబడగలరు, ఒక నిశ్చిత పార్శ్వంనుండి మాత్రమే చూడబడతారు, ఉదాహరణకు ప్రస్తుత సందర్భంలో కార్మికులుగా మాత్రమే పరిగణింపబడతారు, వాళ్లలో మరేదీ చూడబడదు, యితర ప్రతిదీ ఉపేక్షింపబడుతుంది. అంతే కాక, ఒక కార్మికుడు వివాహితుడు, మరొకడు కాదు; ఒకనికి మరొకనికంటె యెక్కువమంది పిల్ల లుంటారు, యిలాగే యింకా. ఆ విధంగా, సమాన శ్రమ నిర్వహణతో, తత్ఫలితంగా సామాజిక వినియోగ నిధిలో సమాన భాగంతో, వాస్తవంలో ఒకనికంటె ఒకడు యెక్కువ పొందుతాడు, ఒకనికంటె ఒకడు ధనవంతుడుగా వుంటాడు, వగైరా. యీ లోపాలన్నీ పరిహరించడానికి, హక్కు సమానంగా కాక, అసమానంగా వుండాలి.

కానీ, దీర్ఘ ప్రసవవేదన తర్వాత పెట్టుబడిదారీ సమాజంనుండి అప్పుడే ఆవిర్భవించిన కమ్యూనిస్టు సమాజపు మొదటి దశలో యీ లోపాలు అనివార్యం. హక్కు అనేది సమాజంయొక్క ఆర్థిక నిర్మాణంకంటె, తద్వారా నిర్ణయించబడిన దాని సాంస్కృతిక అభివృద్ధికంటె ఉన్నతంగా యెన్నడూ వుండజాలదు.

కమ్యూనిస్టు సమాజపు మరింత ఉన్నతమైన దశలో, శ్రమ విభజనకు మనిషి బానిసలాగ లోబడడమూ, దానితో పాటు మానసిక శ్రమకూ, శారీరిక శ్రమకూ మధ్య గల భేదమూ అదృశ్యమైన తర్వాత, శ్రమ అనేది జీవనోపాధి మాత్రమే కాక, జీవితపు ప్రాథమిక అవసరం అయిన తర్వాత, వ్యక్తి సర్వతోముఖ వికాసం జరిగి, ఉత్పాదక శక్తులు పెరిగి, సమష్టి ఐశ్వర్యపు జలలన్నీ సమృద్ధిగా ప్రవహిస్తున్న తర్వాత — అప్పుడు మాత్రమే బూర్జువా హక్కు అనే సంకుచిత దిఙ్మండలం సంపూర్ణంగా అధిగమింపబడి, సమాజం తన పతాకమీద యిలా రాసుకోగలదు: "ప్రతివానినుండీ వాని సామర్థ్యాన్ని బట్టి, ప్రతివానికీ వాని అవసరాలను బట్టి!"

ఒకవైపున ''తగ్గించబడని శ్రమ ఉత్పాదితా''లను గురించీ, మరొకవైపున ''సమాన హక్కు''ను గురించీ, ''న్యాయమైన పంపకం'' గురించీ నేను దీర్ఘంగా చెప్పింది యెందు కంటే: ఒకవైపున, ఒకానొక కాలంలో కొంత అర్థం కలిగివుండి, యిప్పుడు కాలం తీరిన నిరర్థకపు మాటలుగా మారిన భావాలను మత సూత్రాలుగా మన పార్టీమీద రుద్ద డానికి చేసే ప్రయత్నమూ, మరొకవైపున, మన పార్టీకి ఒంటబట్టించడానికి అంత శ్రమ భరితంగా వుండి, యిప్పుడు పార్టీలో వేరూనినట్టి వాస్తవిక దృక్పథాన్ని హక్కును గురించిన భావాల చెత్తతోనూ, యితర చెత్తతోనూ — ప్రజాతంత్రవాదులలోనూ, ఫ్రెంచి సోషలిస్టులలోనూ అంత సామాన్యంగా వున్నవాటితో — వికృతపరచడానికి చేసే ప్రయ త్నమూ యెంత నేరం అయిందీ చూపేటందుకు.

యింతవరకు యిచ్చిన పరిశీలన అటుంచి, పంపకం అనేదాన్ని గురించి రభస చేయడమూ, దానిని ప్రధానంగా నొక్కిచెప్పడమూ దరహంమీద తప్పు.

వినియోగ వస్తువుల పంపకం యేదైనా అసలు ఉత్పత్తి అవసరాల పంపకంయొక్క పర్యవసానం మాత్రమే. కానీ, వీటి పంపకం అసలు ఉత్పత్తి విధానంయొక్క లక్షణం. ఉదాహరణకు, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం దేనిమీద ఆధారపడుతుందంటే, పాదా ర్థిక ఉత్పత్తి అవసరాలు పెట్టుబడిగా, భూమిగా వున్న ఆస్తి రూపంలో కార్మికేతరుల చేతుల్లో వుండడమూ, జనాలు కేవలం వ్యక్తి నిష్ఠమైన ఉత్పత్తి అవసరంయొక్క, శ్రమ శక్తియొక్క, సొంతదారులుగా వుండడమూ అనే విషయంమీద ఆధారపడుతుంది. ఉత్పత్తి అంశాలు అలా పంపకమైతే, వినియోగ వస్తువుల యీనాటి పంపకం దానిపాటి కదే ఫలితంగా యేర్పడుతుంది. పాదార్థిక ఉత్పత్తి అవసరాలు స్వయంగా కార్మికుల సమష్టి ఆస్తి అయితే, అప్పుడు తత్ఫలితంగా వినియోగ వస్తువుల పంపకం కూడా ప్రస్తుత మున్నదానికంటె భిన్నమైనది యేర్పడుతుంది. పంపకాన్ని ఉత్పత్తి విధానంమీద ఆధా రపడనిదానిగా పరిగణించడమూ, వివరించడమూ బూర్జువా అర్థశాస్త్రజ్ఞులనుండి వెకిలి సోషలిజం (దానినుండి ప్రజాస్వామ్యంలో ఒక భాగం) తీసుకున్నది; అందువల్లనే, సోషలిజంను ప్రధానంగా పంపకంమీద ఆధారపడేదానిగా చూపించడం. నిజమైన సంబంధం యేనాడో స్పష్టం చేయబడిన తర్వాత, మళ్లీ తిరోగమనం యెందుకు?...

## IV

యిప్పుడు ప్రజాస్వామ్య విభాగానికి వస్తాను.

### అ. ''రాజ్యంయొక్క స్వేచ్ఛాయుత ప్రాతిపదిక.''

మొట్టమొదట, II ప్రకారం, జర్మన్ కార్మిక పార్టీ ''స్వేచ్ఛాయుత రాజ్యం'' కొరకు పాటుపడుతుంది.

స్వేచ్ఛాయుత రాజ్యం — యేమిటిది?

రాజ్యాన్ని స్వేచ్ఛాయుతం చేయడం నమ్ర పాలితుల సంకుచిత మనస్తత్వాన్ని వదలించుకున్న కార్మికుల లక్ష్యం యే మాత్రమూ కాదు. జర్మన్ సామ్రాజ్యంలో "రాజ్యం" దాదాపు రష్యాలో వున్నంత "స్వేచ్ఛాయుతం"గా వుంది. స్వేచ్ఛ యెక్కడుందంటే, సమాజంమీద పైన మోపబడిన అంగంగా వున్న రాజ్యాన్ని పూర్తిగా సమాజానికి లోబడినదానిగా మార్చడంలో వుంది. యీనాడు కూడా రాజ్యంయొక్క రూపాలు "రాజ్యం యొక్క స్వేచ్ఛ"ను పరిమితపరచే మేరకు అవి యెక్కువ స్వేచ్ఛాయుతంగానో, తక్కువ స్వేచ్ఛాయుతంగానో వున్నాయి.

జర్మన్ కార్మిక పార్టీ — కనీసం అది యీ కార్యక్రమాన్ని అవలంబిస్తే — తన సోషలిస్టు భావాలు పైపూత మాత్రమే అని తెలియజేస్తుంది; యెందుకంటే, అది ప్రస్తుత సమాజాన్ని (యీ మాట యే భావి సమాజానికైనా వర్తిస్తుంది) ప్రస్తుత రాజ్యానికి (భావి సమాజమైతే భావి రాజ్యానికి) పునాదిగా చూడడానికి బదులు, రాజ్యాన్ని తన సొంత "బౌద్ధిక, నైతిక, స్వేచ్ఛాకాముక ప్రాతిపదికలు" గల స్వతంత్ర వస్తువుగా చూస్తున్నది గనుక.

యీ కార్యక్రమం "యీనాటి రాజ్యం," "యీనాటి సమాజం" అనే మాటలను బరి తెగించి దుర్వినియోగించడం సంగతి యేమిటి? అది తన డిమాండ్లను దేనికి వినిపిస్తున్నదో ఆ రాజ్యం గురించి అది సృష్టించే మరింత బరి తెగించిన దురభిప్రాయం సంగతి యేమిటి?

"యీనాటి సమాజం" పెట్టుబడిదారీ సమాజం, మధ్యయుగపు కల్తీ దాదాపు లేకుండా, ప్రతి దేశంయొక్క నిర్దిష్ట చారిత్రక అభివృద్ధిచేత కొద్దో గొప్పో మార్పు చెంది, కొద్దో గొప్పో అభివృద్ధి అయి, అన్ని నాగరిక దేశాలలోనూ వున్నట్టిది. మరో వైపున, "యీనాటి రాజ్యం" అనేది దేశం సరిహద్దులను బట్టి మారుతుంది. అది స్విట్జర్లండులో వున్నట్లు ప్రష్యన్ జర్మన్ సామ్రాజ్యంలో లేదు, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వున్నట్లు ఇంగ్లండులో లేదు. కనుక "యీనాటి రాజ్యం" అనేది కట్టుకథ.

అయినప్పటికీ, భిన్న నాగరిక దేశాలలోని భిన్న రాజ్యాలకు రూపంలో యెంత వైవిధ్యం వున్నా, అన్నిటికీ యీ సామాన్య గుణం వుంది: అవి ఆధునిక బూర్జువా సమాజం మీద ఆధారపడతాయి, కాకపోతే ఒక సమాజం మరొకదానికంటె యెక్కువగానో, తక్కువగానో పెట్టుబడిదారీ పద్ధతిలో అభివృద్ధి చెందినాయి. కనుక, వాటికి కొన్ని ముఖ్యమైన సామాన్య లక్షణాలు కూడా వున్నాయి. యీ అర్థంలో, భావి రాజ్యంకంటె

భిన్నమైనదిగా, ''యీనాటి రాజ్యం'' గురించి మాట్లాడడానికి వీలుంది; భావి రాజ్యంలో దాని ప్రస్తుత మూలమైన బూర్జువా సమాజం కృశించిపోయివుంటుంది.

అప్పు డీ ప్రశ్న ఉత్పన్నవౌతుంది: కమ్యూనిస్టు సమాజంలో రాజ్యం యే మార్పుకు లోనౌతుంది? మరొక విధంగా చెప్పాలంటే, యీనాటి రాజ్య విధులతో సామ్యం గల యే సామాజిక విధులు మిగిలివుంటాయి? యీ ప్రశ్నకు శాస్త్రీయంగా మాత్రమే జవాబు వుండగలదు; ప్రజలు అనే మాటను రాజ్యం అనే మాటతో వెయ్యిసార్లు కలిపినా, వెంద్రుకవాసి కూడా యీ సమస్య పరిష్కారం దగ్గరకు యెవరూ పోలేరు.

పెట్టుబడిదారీ సమాజానికీ కమ్యూనిస్టు సమాజానికీ మధ్య ఒకటి మరొకటిగా విప్లవాత్మక రూపాంతరం చెందే దశ వుంది. దీనికి అనుగుణంగా ఒక రాజకీయ పరివర్తన దశ కూడా వుంది; యీ దశలో రాజ్యం అనేది కార్మికవర్గ విప్లవ నియంతృత్వం తప్ప మరొకటి కాజాలదు.

యీ కార్యక్రమం దీన్ని గురించి గానీ, కమ్యూనిస్టు సమాజపు భావి రాజ్యం గురించి గానీ చెప్పదు.

దీని రాజకీయ డిమాండ్లలో అందరికీ పరిచితమైన పాత ప్రజాతంత్ర అభ్యర్థనలను మించి యేమీ లేదు: సార్వజనీన వోటు హక్కు, ప్రత్యక్ష శాసన నిర్మాణం, ప్రజల హక్కులు, ప్రజా సైన్యం, వగైరా. అవి కేవలం బూర్జువా ప్రజా పార్టీ* యొక్క, శాంతి, స్వేచ్ఛల లీగు** యొక్క ప్రతిధ్వని. అవన్నీ, ఊహా కల్పిత రూపంలో అతిశయోక్తులుగా చేయబడనంత మేరకు, యిప్పటికే సాధింపబడినాయి. కాకపోతే, అవి సాధింపబడిన రాజ్యం జర్మన్ సామ్రాజ్యపు సరిహద్దుల లోపల లేదు, అది స్విట్జర్లండు, సంయుక్త రాష్ట్రాలు, వగైరాలలో వుంది. యీ రకం ''భావి రాజ్యం'' యీనాటి రాజ్యమే, జర్మన్ సామ్రాజ్యపు ''చట్రానికి'' వెలుపల వున్నప్పటికీ.

కానీ ఒక విషయం మరచిపోబడింది. జర్మన్ కార్మిక పార్టీ తాను ''యీనాటి జాతీయ రాజ్యం'' లోపల, కనుక ప్రష్యన్ జర్మన్ సామ్రాజ్యమైన తన సొంత రాజ్యం లోపల, పనిచేస్తానని స్పష్టంగా ప్రకటిస్తుంది గనుక — అలా కాకపోతే నిజంగా దాని డిమాండ్లు యెక్కువగా అర్థ రహితంగా వుంటాయి, యెందుకంటే తనకు లేనివి

---

* ప్రజా పార్టీ — జర్మన్ మధ్య, చిన్న బూర్జువాలలోని ప్రజాతంత్ర పౌరుల పార్టీ. యిది సార్వజనీన వోటు హక్కు, ఫెడరల్ జర్మన్ రాజ్య సృష్టి, వగైరాలను ప్రచారం చేసింది. — సం.

** శాంతి, స్వేచ్ఛల లీగు — స్విట్జర్లండులో 1867లో రిపబ్లికన్లు, ఉదారవాదులూ నెలకొల్పిన బూర్జువా శాంతివాద పార్టీ. — సం.

మాత్రమే యెవరైనా డిమాండు చేస్తారు — అది ముఖ్య విషయాన్ని మరచిపోయి వుండకూడదు; యేదంటే, ఆ చిల్లర విషయాలన్నీ ప్రజల సర్వసత్తాకత అవబడేదాన్ని గుర్తించడంమీద ఆధారపడి, తన్మూలంగా ప్రజాతంత్ర రిపబ్లిక్‌లో మాత్రమే ఉచితంగా వుంటాయనే విషయాన్ని.

లూయీ ఫిలిప్ కాలంలోనూ, లూయీ నెపోలియన్ కాలంలోనూ* ఫ్రెంచి కార్మికుల కార్యక్రమం డిమాండు చేసినట్లు ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను డిమాండు చేసే ధైర్యం యీ కార్యక్రమానికి లేదు గనుక — లేకపోవడం వివేకమే, యెందుకంటే వెనుకముందులు చూసుకునే జాగ్రత్త అవసరమని పరిస్థితులు చెపుతున్నాయి — గనుక, యీ కార్యక్రమం "నిజాయితీగల"ది** గానీ, గౌరవనీయమైనది గానీ కానట్టి యీ జిత్తుకు పూనుకొని వుండకూడదు. జిత్తు యేమిటంటే, ప్రజాతంత్ర రిపబ్లిక్‌లో మాత్రమే అర్థం గల విషయాలను యీ రాజ్యంనుండి — పార్లమెంటరీ రూపాలచేత అలంకరింపబడి, ఫ్యూడల్ కల్తీ గలిగి, యిప్పటికే బూర్జువావర్గంచేత ప్రభావితం చేయబడి, బ్యూరాక్రటిక్‌గా తీర్చిదిద్దబడినట్టి, పోలీసు కాపలా గల మిలిటరీ నియంతృత్వం తప్ప మరేమీ కానట్టి యీ రాజ్యంనుండి — డిమాండు చేయడమూ, అది చాలక, ఆ తర్వాత, అలాంటి విషయాలను "చట్టబద్ధ పద్ధతులద్వారా" ఆ రాజ్యంమీద రుద్దగలనని తాను ఊహిస్తున్నట్లు దానికి నమ్మజెప్పడమూ.

వెకిలి ప్రజాస్వామ్యం కూడా — ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను రామరాజ్యంగా యెంచేదీ, సరిగ్గా బూర్జువా సమాజానికి చెందిన యీ చివరి రాజ్య రూపంలోనే వర్గ పోరాటం పరిసమాప్తిదాకా పోరాడబడవలసి వుందనే అనుమానం కూడా రానిదీ అయిన వెకిలి ప్రజాస్వామ్యం కూడా — పోలీసులు అనుమతించినవీ, తర్కశాస్త్రం అనుమతించనివీ అయిన హద్దుల లోపల వుండే యీ రకం ప్రజాస్వామ్యవాదంకంటె యెన్నో యోజనాల యెత్తున వుంది.

"రాజ్యం" అనే మాటకు ప్రభుత్వ యంత్రాంగం అని, లేదా శ్రమ విభజనద్వారా సమాజంనుండి వేరుచేయబడిన ప్రత్యేక వ్యవస్థగా అది రూపొందిన మేరకు రాజ్యం అని అర్థం చేసుకోబడినట్లు, "రాజ్యంయొక్క ఆర్థిక ప్రాతిపదికగా ఒకేఒక క్రమ ప్రవర్ధమానమైన ఆదాయపు పన్నును జర్మన్ కార్మిక పార్టీ డిమాండు చేస్తున్నది," వగైరా మాటలు తెలుపుతాయి. పన్నులు ప్రభుత్వ యంత్రాంగంయొక్క ఆర్థిక ప్రాతి

---

* అనగా ఫ్రాన్సులోని రాజరికంలో. లూయీ ఫిలిప్ 1830–1848లో ఫ్రెంచి రాజు. లూయీ నెపోలియన్ 1852–1870లో ఫ్రెంచి చక్రవర్తి. — సం.

** "నిజాయితీగల" అనేది ఐసెనాఖర్‌లకు వుండిన విశేషణం. యిక్కడ శ్లేష. — సం.

పదిక, మరి దేనిదీ కాదు. భావి రాజ్యంలో — స్విట్జర్లండులో వున్నట్టిదానిలో — యీ డిమాండు బాగా తీర్చబడింది. ఆదాయం పన్ను వుండాలంటే, వివిధ సామాజిక వర్గాల వివిధ ఆదాయ మార్గాలు వుండాలి, కనుక పెట్టుబడిదారీ సమాజం వుండాలి. కనుక, లివర్‌పూల్ ఫైనాన్షల్ సంస్కరణవాదులు, గ్లాడ్‌స్టన్ సోదరుని* బూర్జువా నాయకత్వాన, యీ కార్యక్రమం చేసే డిమాండునే ప్రతిపాదిస్తున్నారంటే, అందులో విశేషమేమీ లేదు.

1875 ఏప్రెల్‌లో గానీ, మే తొలి భాగంలో గానీ
రచింపబడింది

---

*బ్రిటిష్ వర్తకుడూ, దానశీలీ అయిన రాబర్ట్ గ్లాడ్‌స్టన్ (1811–1872)కు ప్రస్తావన. లిబరల్ పార్టీ నాయకుడూ, పలుసార్లు ప్రధాన మంత్రీ అయిన విలియమ్ గ్లాడ్‌స్టన్‌కు యితను బంధువు. — సం.

ఎంగెల్స్

# అంటీ డ్యూరింగ్

(కొంత భాగం)

క్రియాశీలమైన సామాజిక శక్తులు సరిగ్గా ప్రకృతి శక్తుల లాగే పనిచేస్తాయి: మనం వాటిని అర్థం చేసుకోనంత కాలం, వాటిని లెక్కలోకి తీసుకోనంత కాలం గుడ్డిగా, బలీయంగా, విధ్వంసకరంగా పనిచేస్తాయి. కానీ, ఒకసారి మనం వాటిని అర్థం చేసుకుంటే, ఒకసారి మనం వాటి చర్యనూ, వాటి దిశనూ, వాటి ఫలితాలనూ గ్రహిస్తే, వాటిని అధికాధికంగా మన యిచ్ఛకు లోబరచడమూ, వాటిద్వారా మన సొంత లక్ష్యాలను సాధించడమూ మనమీద మాత్రమే ఆధారపడుతుంది. యీనాటి మహా శక్తివంతమైన ఉత్పాదక శక్తులకు యిది ప్రత్యేకంగా వర్తిస్తుంది. యీ ఉత్పాదక శక్తుల స్వభావాన్నీ, లక్షణాన్నీ అర్థం చేసుకోడానికి మనం మొండిగా నిరాకరించినంత కాలం — మరి యీ అర్థం చేసుకోవడం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంయొక్క, దాని సమర్థకులయొక్క స్వభావానికి విరుద్ధం — అంత కాలం యీ శక్తులు మనం వద్దన్నా, మనల్ని వ్యతిరేకించి పనిచేస్తాయి, మేము పైన వివరంగా చూపించినట్లు, అంత కాలం మనమీద ఆధిపత్యం వహిస్తాయి.

కానీ, ఒకసారి వాటి స్వభావాన్ని అర్థం చేసుకుంటే, కలిసికట్టుగా పనిచేసే ఉత్పాదకుల చేతుల్లో అవి రాక్షస అధిపతుల రూపంనుండి యిష్టపడి పనిచేసే సేవకుల రూపానికి మారగలవు. భేదం, తుఫాను మెరుపులోని విద్యుచ్ఛక్తియొక్క విధ్వంసక శక్తికీ, టెలిగ్రాఫ్‌లోనూ, విద్యుద్ఘటంలోనూ మన అధీనంలో వున్న విద్యుచ్ఛక్తికీ మధ్య గల భేదం లాంటిదే; దావానలానికీ, మానవునికి సేవచేసే మంటకూ మధ్య గల భేదం లాంటిదే. చివరకు, యీనాటి ఉత్పాదక శక్తుల నిజమైన స్వభావం గురించిన యీ గుర్తింపుతో, ఉత్పత్తిలోని సామాజిక అరాజకత్వం పోయి, దాని స్థానంలో, సమాజంయొక్క, ప్రతి వ్యక్తియొక్క అవసరాలకు అనుగుణంగా, ఒక నిశ్చితమైన పథకం ప్రకారం ఉత్పత్తి మీద సామాజిక నియంత్రణ వస్తుంది. అప్పుడు సొంతపరచుకోవడంలోని పెట్టు

బడిదారీ పద్ధతి — యే పద్ధతిలో ఉత్పాదితం మొదట ఉత్పాదకునీ, తరువాత సొంతపరచుకునేవాణ్నీ బానిసను చేస్తుందో ఆ పద్ధతి — పోయి, దాని స్థానంలో ఉత్పాదితాలను సొంతపరచుకునే పద్ధతి యెలాంటిది వస్తుందంటే, ఆధునిక ఉత్పత్తి సాధనాల స్వభావంమీద ఆధారపడినట్టిది వస్తుంది; అది ఒకవైపున సూటిగా సమాజం సొంతపరచుకోవడం, ఉత్పత్తిని సాగించడానికీ, విస్తృతపరచడానికీ సాధనంగా — మరొకవైపున సూటిగా వ్యక్తి సొంతపరచుకోవడం, జీవనానికీ, సౌఖ్యానికీ సాధనంగా.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రజానీకంలోని గొప్ప మెజారిటీని అంతకంతకూ పూర్తి నిరాస్తిపరులను (proletarians)గా మారుస్తూ, యెలాంటి శక్తిని సృష్టిస్తుందంటే, ఆ శక్తి, తన సొంత విధ్వంసమే మార్గాంతరం గనుక, యీ విప్లవాన్ని నిర్వర్తించక తప్పదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అప్పటికే సామాజికీకరింపబడిన అపారమైన ఉత్పత్తి సాధనాలను రాజ్యంయొక్క ఆస్తిగా అంతకంతకూ యెక్కువగా రూపాంతరీకరణ పొందడాన్ని నిర్బంధిస్తూ, యీ విప్లవాన్ని నిర్వర్తించే మార్గాన్ని తానే చూపిస్తుంది. కార్మికవర్గం రాజకీయ అధికారాన్ని కైవసం చేసుకొని, ఉత్పత్తి సాధనాలను మొదట రాజ్యంయొక్క ఆస్తిగా మారుస్తుంది.

కానీ, యీ పని చేయడంలో అది కార్మికవర్గంగా తన్ను తాను రద్దుచేసుకుంటుంది, సకల వర్గ విభేదాలనూ, వర్గ వైరుధ్యాలనూ రద్దుచేస్తుంది, రాజ్యంగా రాజ్యాన్ని కూడా రద్దుచేస్తుంది. యింతవరకు వుండిన సమాజానికి, వర్గ వైరుధ్యాల నడుమ వ్యవహరిస్తూ వుండినదానికి, రాజ్యం — అనగా, ఆ నిర్దిష్ట పీడక వర్గంయొక్క సంస్థ — తన బాహ్య ఉత్పత్తి పరిస్థితులను నిలిపివుంచడానికీ, కనుక, ముఖ్యంగా, ఆ నిర్దిష్ట ఉత్పత్తి విధానం (బానిసత్వం, ఫ్యూడల్ దాస్యం, కూలి శ్రమ)చేత నిర్ణయింపబడిన పీడన పరిస్థితులలో పీడిత వర్గాన్ని బలవంతంగా నొక్కిపెట్టి వుంచడానికీ అవసరమైంది. రాజ్యం మొత్తం సమాజంయొక్క ఆధికారిక ప్రతినిధిగా, కనులకు కనపడే రూపంలో సమాజంయొక్క సాంద్రీకరణగా వుండింది. కానీ యే వర్గం, తాను వున్నంత కాలం, తానే మొత్తం సమాజంయొక్క ప్రతినిధిగా వుండిందో, ఆ వర్గంయొక్క రాజ్యంగా వుండిన మేరకు మాత్రమే అది అలా వుండింది: ప్రాచీన కాలంలో బానిస యజమాన పౌరుల రాజ్యం; మధ్య యుగాలలో ఫ్యూడల్ ప్రభువుల రాజ్యం; మన కాలంలో బూర్జువాల రాజ్యం. చివరకు అది మొత్తం సమాజంయొక్క నిజమైన ప్రతినిధి అయినప్పుడు, అది తన్ను తాను అనవసరం చేసుకుంటుంది. అణచిపెట్టబడవలసిన సామాజిక వర్గం యేదీ యిక యెంత మాత్రమూ లేకపోయిన వెంటనే, వర్గ పాలనా, ఉత్పత్తిలోని ప్రస్తుత అరాజకత్వంమీద ఆధారపడిన వైయక్తిక జీవన పోరాటమూ, యీ పోరాటంనుండి ఉత్పన్నమయ్యే ఘర్షణలూ, అత్యాచారాలూ తొలగించబడిన వెంటనే, అణచిపెట్టబడవల

సిందేదీ యిక వుండదు — నిర్బంధపరచే ప్రత్యేక శక్తి అయిన రాజ్యాన్ని అవసరం చేసేది యేదీ యిక వుండదు. రాజ్యం మొత్తం సమాజంయొక్క ప్రతినిధిగా యే మొదటి చర్యద్వారా ముందుకు వస్తుందో అది — సమాజం తరపున ఉత్పత్తి సాధనాలను సొంత పరచుకోవడం — అదే రాజ్యంగా దాని చివరి స్వతంత్ర చర్య కూడా. సామాజిక సంబంధాలలో, ఒక రంగం తర్వాత మరొక రంగంలో, రాజ్య జోక్యం అనవసర మైపోయి, తరువాత తనంతకు తానే కృశించిపోతుంది. మనుషులమీద పాలన పోయి, దాని స్థానంలో వస్తువుల నియమనమూ, ఉత్పత్తి కమాలను నడిపించడమూ వస్తాయి. రాజ్యం ''రద్దుచేయబడదు.'' అది కృశించిపోతుంది. యిది ''స్వేచ్ఛాయుత ప్రజా రాజ్యం''* అనే నుడికారానికి యెంత విలువ వున్నదీ తెలియజేస్తుంది, ఆందోళన దృష్ట్యా ఆ నుడికారాన్ని అప్పుడప్పుడు సమర్థనీయంగా వాడే విషయంలోనూ, అంతిమంగా దాని శాస్త్రీయ అరకొరతనం విషయంలోనూ; అలాగే, రాజ్యాన్ని తక్షణం రద్దు చేయాలనే అరాజకవాదు లనబడేవాళ్ల డిమాండుకు యెంత విలువ వున్నదీ కూడా యిది తెలియజేస్తుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం చారిత్రకంగా అవతరించి నప్పటినుండి వ్యక్తులూ, బృందాలూ భావి కాలపు ఆదర్శంగా ఉత్పత్తి సాధనాల నన్నిటినీ సమాజం సొంతపరచుకోవడం గురించి అంతో యింతో అస్పష్టంగా కలలుగన్నారు. కానీ, దాని వాస్తవీకరణకు కావలసిన యధార్థ పరిస్థితులు వున్నప్పుడు మాత్రమే అది సాధ్యం కాగలదు, చారిత్రక అవశ్యకత కాగలదు. ప్రతి యితర సామాజిక పురోగతి లాగే అది యెలా ఆచరణీయ మౌతుందంటే, వర్గాలు ఉండడం న్యాయానికీ, సమానత్వానికీ, వగైరాలకు విరుద్ధమని మనుషులు గ్రహించడంచేత కాదు, యీ వర్గాలను రద్దు చేయడానికి కేవలం ఒప్పుకోవడంచేత కాదు, మరి, కొన్ని నిర్దిష్ట ఆర్థిక పరిస్థితుల కారణంగా. సమాజం దోపిడీ వర్గంగానూ, దోపిడీచేయబడే వర్గంగానూ విడిపోవడం, పాలక వర్గంగానూ, పీడిత వర్గంగానూ విడిపోవడం, మునుపటి కాలాలలోని ఉత్పత్తి యొక్క అరకొర, పరిమిత అభివృద్ధియొక్క అవశ్య పర్యవసానం. మొత్తం సామాజిక శ్రమ అందరి ఉనికికీ బొటాబొటిగా సరిపడేటంతకంటె కొద్దిగా యెక్కువైన ఉత్పత్తిని మాత్రమే యిచ్చేటంత కాలం, కనుక, శ్రమ అనేది సమాజ సభ్యులలో గొప్ప మెజారిటీ యొక్క కాలం అంతటినీ, లేక దాదాపు అంతటినీ హరించినంత కాలం — అంత కాలం,

* ''స్వేచ్ఛాయుత ప్రజా రాజ్యం'' 1870లో జర్మన్ సోషల్ డెమొక్రట్ల కార్యక్రమంయొక్క డిమాండు. 'గోతా కార్యక్రమ విమర్శ' అనే రచనలో మార్క్స్ ఆ నినాదాన్ని ఖండించినాడు. — సం.

అవశ్యంగా, యీ సమాజం వర్గాలుగా విభజింపబడి వుంటుంది. పూర్తిగా శ్రమకు బానిసలైన గొప్ప మెజారిటీ పక్కనే, ప్రత్యక్షంగా ఉత్పాదకమైన శ్రమనుండి విముక్తమైన వర్గం ఒకటి ఉద్భవిస్తుంది. అది సమాజంయొక్క సాధారణ వ్యవహారాలను చూసుకుంటుంది: శ్రమమీద దర్శకత్వమూ, రాజ్య వ్యవహారమూ, చట్టమూ, శాస్త్రవిజ్ఞానమూ, కళలూ, వగైరాలను. కనుక, వర్గ విభజనకు ప్రాతిపదికగా వున్నది యేమిటంటే, శ్రమ విభజన అనే నియమం. కానీ, హింసద్వారా, దొంగతనంద్వారా, మోసంద్వారా, దగాద్వారా యీ వర్గ విభజనను నిర్వహించడాన్ని యిది అరికట్టదు. పాలక వర్గం ఒకసారి పైచేయి సంపాయించిన తర్వాత, అది కార్మికవర్గానికి నష్టకరంగా తన అధికారాన్ని దృఢపరచుకోవడాన్నీ, తన సామాజిక నాయకత్వం మూలంగా జనాలను [మరింత] దోపిడీ చేయడాన్నీ యిది అరికట్టదు.

కానీ, దీన్నిబట్టి వర్గ విభజనకు ఒకానొక చారిత్రక సమర్థన వుంటే, అది నిర్దిష్ట కాలం పాటు మాత్రమే, నిర్దిష్ట సామాజిక పరిస్థితులలో మాత్రమే వుంది. ఉత్పత్తి చాలమిమీద అది ఆధారపడివుండింది. ఆధునిక ఉత్పాదక శక్తుల సంపూర్ణ అభివృద్ధిచేత అది వూడ్చిపారవేయబడుతుంది. నిజానికి, సమాజంలోని వర్గాల రద్దు జరగాలంటే, కేవలం యీ నిర్దిష్ట పాలక వర్గమో, ఆ నిర్దిష్ట పాలక వర్గమో కాక, యే పాలక వర్గమైనా వుండడమూ, కనుక వర్గ విభేదం అనేదే వుండడమూ కాలం తీరినదయ్యే మేరకు చారిత్రక పరిణామం జరిగివుండాలి. కనుక, వర్గాల రద్దు జరగాలంటే, సమాజంలోని ఒక నిర్దిష్ట వర్గం ఉత్పత్తి సాధనాలనూ, ఉత్పాదితాలనూ, వాటితో పాటు రాజకీయ పెత్తనాన్నీ, సాంస్కృతిక గుత్తాధిపత్యాన్నీ, రాజకీయ పెత్తనాన్నీ, బౌద్ధిక నాయకత్వాన్నీ సొంతపరచుకోవడం అనవసరం మాత్రమే కాక, ఆర్థికంగా, రాజకీయంగా, బౌద్ధికంగా అభివృద్ధికి ఆటంకమైవుండే మేరకు ఉత్పత్తి అభివృద్ధి జరిగివుండాలి.

యీ మేర యిప్పుడు వచ్చింది. తమ రాజకీయ, బౌద్ధిక దివాలా బూర్జువాలకే యిక యెంతమాత్రమూ రహస్యం కాదు. వాళ్ల ఆర్థిక దివాలా ప్రతి పదేండ్లకొకసారి క్రమబద్ధంగా పునరావృత్తమౌతున్నది. ప్రతి ఆర్థిక సంక్షోభంలోనూ సమాజం తాను ఉపయోగించజాలని తన సొంత ఉత్పాదక శక్తులయొక్కా, ఉత్పాదితాలయొక్కా భారంకింద ఉక్కిరిబిక్కిరి అవుతుంది; అనుభోక్తలు (consumers) లేరు గనుక ఉత్పాదకులకు అనుభోగించడానికి యేమీ లేనట్టి అసంబద్ధపు అంతర్వైరుధ్యం యెదుట సమాజం నిస్సహాయంగా నిలబడుతుంది. ఉత్పత్తి సాధనాల విస్తరించే శక్తి వాటిమీద పెట్టబడిదారీ ఉత్పత్తి విధానం మోపిన బంధనాలను బద్దలుచేస్తుంది. యీ బంధనాలనుండి అవి విముక్తి కావడం ఉత్పాదక శక్తుల అవిచ్ఛిన్న, నిత్య ప్రవర్ధమాన అభి

వృద్ధికీ, దానివెంట ఉత్పత్తే దాదాపు పరిమితి లేకుండా పెరగడానికీ గల యేకైక షరతు. యింతే కాదు. ఉత్పత్తి సాధనాలను సమాజం సొంతపరచుకోవడంతో ఉత్పత్తిమీద వున్న ప్రస్తుత కృత్రిమ నిర్బంధాలు మాత్రమే అంతరించడం కాక, ఉత్పాదక శక్తులయొక్కా, ఉత్పాదితాలయొక్కా పచ్చి దుర్వ్యయమూ, విధ్వంసమూ — ప్రస్తుత కాలంలో ఉత్పత్తియొక్క అనివార్య సహచరాలై, సంక్షోభాలలో తారా స్థాయి నందుకొనేవి — కూడా అంతరిస్తాయి. యింతే కాక, యీనాటి పాలక వర్గాలయొక్కా, వాటి రాజకీయ ప్రతినిధులయొక్కా మతి లేని ఆడంబర ఖర్చులు తుదముట్టించబడి, విస్తారమైన ఉత్పత్తి సాధనాలూ, ఉత్పాదితాలూ మొత్తం సమాజం కొరకు విడుదల చేయబడతాయి. సామాజికీకరింపబడిన ఉత్పత్తిద్వారా సమాజంలోని ప్రతి సభ్యునికీ పాదార్థికంగా పూర్తిగా చాలినదీ, దినదినానికీ మరింత పరిపూర్ణమయ్యేదీ అయిన మనుగడను మాత్రమే కాక, అందరికీ తమ శారీరిక, మానసిక శక్తుల అభివృద్ధినీ, వినియోగాన్నీ హామీయిచ్చే మనుగడను కూడా కట్టుదిట్టం చేసే అవకాశం — యీ అవకాశం యిప్పుడు మొట్టమొదటి సారిగా యిక్కడ వుంది, యిక్కడ వుంది. *

ఉత్పత్తి సాధనాలను సమాజం వశం చేసుకోవడంతో విక్రయ సరుకుల ఉత్పత్తీ, అదే సమయంలో ఉత్పాదకునిమీద ఉత్పాదితంయొక్క ఆధిపత్యమూ అంతమొందించబడతాయి. సామాజిక ఉత్పత్తిలో అరాజకం పోయి, దాని స్థానంలో ప్రణాళికకు లోబడిన, ఉద్దేశపూర్వకమైన వ్యవస్థీకరణ వస్తుంది. వైయక్తిక జీవన పోరాటం అదృశ్యమౌతుంది. అప్పుడు, మొట్టమొదటి సారిగా, మానవుడు, ఒకానొక అర్థంలో, తక్కిన జంతు ప్రపంచంనుండి అంతిమంగా విడివడి, కేవల జంతు జీవన పరిస్థితులనుండి

---

* పెట్టుబడిదారీ ఒత్తిడికింద కూడా ఆధునిక ఉత్పత్తి సాధనాల అపారమైన విస్తరించే శక్తిని గురించి ఒక రమారమి అవగాహన యివ్వడానికి కొద్ది అంకెలు ఉపయోగపడవచ్చు. గిఫెన్ ప్రకారం గ్రేట్ బ్రిటన్, ఐర్లండుల మొత్తం ఐశ్వర్యం, గుండు మొత్తాలలో, ఆయా సంవత్సరాలలో యీవిధంగా వుండింది:

1814లో 220 కోట్ల పౌండ్లు
1865లో 610 కోట్ల పౌండ్లు
1875లో 850 కోట్ల పౌండ్లు.

సంక్షోభ కాలంలో ఉత్పత్తి సాధనాలయొక్కా, ఉత్పాదితాలయొక్కా వ్యర్థ వ్యయానికి ఉదాహరణ: గత సంక్షోభంలో, ఒక్క జర్మన్ యినుము పరిశ్రమలో మాత్రమే 2,27,50,000 పౌండ్లు నష్టమైనట్లు రెండవ జర్మన్ పారిశ్రామిక మహాసభలో (బెర్లిన్, ఫిబ్రవరి 21, 1878) తెలియజేయబడింది. — ఎంగెల్స్ వివరణ.

బయటపడి, నిజంగా మానవీయమైన జీవన పరిస్థితులలోకి వస్తాడు. మానవుని ఆవరించి, యింతవరకు మానవుని పాలించిన జీవిత పరిస్థితుల రంగం యావత్తూ యిప్పుడు మానవుని పాలనకిందికీ, అజమాయిషీకిందికీ వస్తుంది. మానవుడు మొట్టమొదటిసారిగా ప్రకృతిమీద నిజమైన, చైతన్యపూరితమైన ప్రభువు అవుతాడు, యెందుకంటే, అతను యిప్పుడు తన సొంత సామాజిక వ్యవస్థకు అధిపతి అయినాడు గనుక. అతని సొంత సామాజిక కార్యాచరణకు చెందిన నియమాలు, యింతకు మునుపు ప్రకృతి నియమాలుగా అతనికి పరాయివిగా, అతనిమీద పెత్తనం చేసేవిగా అతని యెదుట నిలబడినట్టివి, అప్పుడు పూర్తి అవగాహనతో అతనిచేత ఉపయోగించుకోబడి, అతని ఆధిపత్యంకిందికి వస్తాయి. మానవుని సొంత సామాజిక వ్యవస్థ, యింతకు మునుపు ప్రకృతిచేతా, చరిత్రచేతా అతనిమీద విధించబడిన అవశ్యకతగా అతన్ని యెదిరించినట్టిది, అతని సొంత స్వేచ్ఛాయుత కార్యాచరణయొక్క ఫలితం అవుతుంది. యింతకు మునుపు చరిత్రను పాలించిన బాహ్య వస్తుగత శక్తులు మానవుని సొంత అజమాయిషీకిందికి మారుతాయి. ఆ సమయంనుండి మాత్రమే పూర్తి చైతన్యంతో మానవుడే తన సొంత చరిత్రను నిర్మిస్తాడు — ఆ సమయంనుండి మాత్రమే అతనిచేత నడిపించబడే కారణాలకు అత్యధికంగా, నిత్య ప్రవర్ధమాన ప్రమాణంలో, అతను ఉద్దేశించిన ఫలితాలు కలుగుతాయి. అది అవశ్యకత రాజ్యంనుండి స్వేచ్ఛా రాజ్యానికి మానవుని ఆరోహణ.

యీ సార్వజనీన విమోచన చర్యను నిర్వహించడం ఆధునిక కార్మికవర్గపు చారిత్రక కర్తవ్యం. యీ చర్యకు అవసరమైన చారిత్రక పరిస్థితులనూ, తద్వారా దీని అసలు స్వభావాన్నీ సమగ్రంగా అవగతం చేసుకోవడమూ, యిప్పుడు పీడితమైన కార్మిక వర్గానికి అది నిర్వహించవలసివున్న మహత్తర చర్యకు అవసరమైన పరిస్థితులనూ, ఆ చర్యయొక్క అర్థాన్నీ తెలియజేయడమూ — యిది కార్మికవర్గ ఉద్యమపు సిద్ధాంత వ్యక్తీకరణ అయిన శాస్త్రీయ సోషలిజంయొక్క కర్తవ్యం.

...ఉత్పత్తి సద్యోజనితంగా అభివృద్ధి చెందిన ప్రతి సమాజంలోనూ — మరి మన ప్రస్తుత సమాజం యీ రకందే — సన్నివేశం యెలా వుంటుందంటే, ఉత్పాదకులు ఉత్పత్తి సాధనాలను అదుపుచేయరు, ఉత్పత్తి సాధనాలు ఉత్పాదకులను అదుపుచేస్తాయి. అలాంటి సమాజంలో ప్రతి కొత్త ఉత్పత్తి కీలూ ఉత్పాదకులను ఉత్పత్తి సాధనాలకు లోబరచే కొత్త సాధనంగా అవశ్యంగా రూపాంతరం చెందుతుంది. ఆధునిక పరిశ్రమలను ప్రవేశపెట్టడానికి ముందు యే ఉత్పత్తి కీలు అత్యంత శక్తివంతమైనదిగా వుండిందో దానికి — శ్రమ విభజనకు — యిది అన్నిటికంటె యెక్కువగా వర్తిస్తుంది. మొదటి గొప్ప శ్రమ విభజన, పట్టణమూ, గ్రామమూ వేరుపడడం, గ్రామీణ ప్రజానీకాన్ని వేల సంవత్సరాల మానసిక జడత్వంలోనూ, పట్టణ ప్రజలను ప్రతివొకనీ తన

సొంత వ్యష్టి వృత్తిలోనూ బంధించింది. గ్రామీణ ప్రజల బౌద్ధిక అభివృద్ధికీ, పట్టణ ప్రజల శారీరిక అభివృద్ధికీ ప్రాతిపదికను అది ధ్వంసంచేసింది. రైతు తన భూమినీ, పట్టణవాసి తన వృత్తినీ సొంతపరచుకున్నప్పుడు, అదే మేరకు రైతును అతని భూమీ, పట్టణవాసిని అతని వృత్తీ సొంతపరచుకుంటాయి. శ్రమ విభజనలో మానవుడు కూడా విభజింపబడతాడు. ఒకేఒక కార్యాచరణ కోసం తక్కిన శారీరిక, మానసిక శక్తులన్నీ బలిచేయబడుతాయి. మానవుని యీ మరుగుజ్జుతనం శ్రమ విభజన యే మేరకు పెరిగితే ఆ మేరకు పెరుగుతుంది. శ్రమ విభజన కార్ఖానా ఉత్పత్తిలో అత్యున్నత అభివృద్ధి నందుకుంటుంది. కార్ఖానా ఉత్పత్తి ప్రతి వృత్తినీ వేరువేరు పాక్షిక చర్యలుగా చీల్చి, ఒకొక చర్యను ఒకొక శ్రామికునికి అతని జీవిత ధర్మంగా అప్పగిస్తుంది, తద్వారా అతన్ని ఒక నిర్దిష్టమైన చిల్లర కార్యానికీ, నిర్దిష్టమైన పనిముట్టుకూ యావజ్జీవితం బంధిస్తుంది. ''అశేషమైన ఉత్పాదక సామర్థ్యాలనూ, అంతఃప్రవృత్తులనూ బలిపెట్టి, అతని చిల్లర నైపుణ్యాన్ని ఊదరబెట్టడంద్వారా, అది శ్రామికుని అవిటిభూతంగా మారుస్తుంది.... వ్యక్తే ఆంశిక చర్య చేసే స్వయంచలిత యంత్రంగా మార్చబడుతాడు'' (మార్క్స్).* అనేక సందర్భాలలో శ్రామికుని శారీరికంగానూ, మానసికంగానూ అక్షరాలా అవిటివాణ్ని చేయడంద్వారా మాత్రమే సర్వసమగ్రంగా చేయబడే యంత్రం యిది. ఆధునిక పరిశ్రమల యంత్రావళి శ్రామికుని యంత్రంగా వుండే స్థితినుండి కేవలం యంత్రంయొక్క తోకగా వుండే స్థితికి దిగదోస్తుంది. ''ఒకే పనిముట్టుతో పనిచేసే యావజ్జీవిత ప్రత్యేకత యిప్పుడు ఒకే యంత్రానికి సేవచేసే యావజ్జీవిత ప్రత్యేకత అవుతుంది. శ్రామికుని చిన్నప్పటినుండి ఆంశిక యంత్రంలో భాగంగా మార్చే లక్ష్యంతో యంత్రావళి దుర్వినియోగింపబడుతుంది'' (మార్క్స్).** శ్రామికులు మాత్రమే కాదు, శ్రామికులను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దోపిడీచేసే వర్గాలు కూడా, శ్రమ విభజనద్వారా తమ వృత్తికి చెందిన పనిముట్టుకు బందీ లౌతారు: అల్పబుద్ధి బూర్జువా తన సొంత పెట్టుబడికీ, లాభాలపట్ల తన ఉన్మాదపు వ్యామోహానికీ; న్యాయవాది స్వతంత్ర శక్తిగా తనమీద ఆధిపత్యం వహించే, చచ్చి శల్యమైన న్యాయశాస్త్ర భావాలకూ; ''విద్యాధిక వర్గాలు'' దరహంమీద తమ అనేక రకాల స్థానిక సంకుచిత మనస్తత్వానికీ, యేకపక్షతకూ, తమ సొంత శారీరిక, మానసిక హ్రస్వదృష్టికీ, తమ సంకుచిత ప్రత్యేక విద్య మూలంగానూ, యీ ప్రత్యేక కార్యాచరణకు యావజ్జీవితం బంధింపబడిన మూలంగానూ — యే పనీ చేయకపోవడమే యీ ప్రత్యేక కార్యాచరణ అయినప్పుడు కూడా — కలిగిన తమ మరుగుజ్జుతనానికీ.

---

* *Capital*, సంపుటి 1, మాస్కో, 1961, పుట 360. — సం.

** పూర్వోక్తం, పుట 422. — సం.

శ్రమ విభజన ఫలితాల గురించి — ఒకవైపున శ్రామికుని మరుగుజ్జుగా చేయడమూ, మరొకవైపున, అదే చర్యయొక్క యావజ్జీవిత, యేకరూప, యాంత్రిక పునశ్చరణకు పరిమితమైన శ్రమ విధిని (function) మరుగుజ్జుగా చేయడమూ అనే ఫలితాల గురించి — ఊహాస్వర్గవాదులకు* అప్పటికే పరమ స్పష్టమైన అవగాహన వుండింది. పాత శ్రమ విభజన పూర్తిగా రద్దు కావడానికి మొదటి షరతుగా, పట్టణానికీ గ్రామానికీ మధ్య గల భేదాన్ని రద్దుచేయాలని, ఓవెన్ లాగే, ఫోరియర్ డిమాండు చేసినాడు. ప్రజానీకం పదారు వందలనుండి మూడు వేలదాకా గల బృందాలుగా దేశంలో చెల్లాచెదరుగా వుండాలని ఆ యిద్దరూ అనుకున్నారు; ప్రతి బృందమూ ఒక బ్రహ్మాండమైన భవనంలో నివసిస్తుంది, ఆ భవనం వాళ్లకు చెందిన భూమికి మధ్యలో వుంటుంది, యింటి పనులు సమష్టి పద్ధతులలో నడుస్తాయి. ఫోరియర్ అప్పుడప్పుడు పట్టణాలను ప్రస్తావిస్తాడు; కానీ, దగ్గర దగ్గరగా వున్న అలాంటి నాలుగైదు భవనాలే పట్టణాలుగా యేర్పడుతాయి. సమాజంలోని ప్రతి సభ్యుడూ వ్యవసాయంలోనూ, పరిశ్రమలోనూ నిమగ్నుడు కావాలని యిద్దరు రచయితలూ అంటారు. ఫోరియర్ ఉద్దేశంలో, పరిశ్రమలంటే ప్రధానంగా చేతిపనులూ, కార్ఖానాలూ; కానీ ఓవెన్ ప్రధాన పాత్రను ఆధునిక పరిశ్రమలకు యిచ్చి, యింటి పనులలో ఆవిరిశక్తినీ, యంత్రాలనూ ప్రవేశపెట్టాలని అప్పటికే డిమాండు చేస్తాడు. కానీ, వ్యవసాయం లోపలా, పరిశ్రమల లోపలా ప్రతి వ్యక్తికీ సాధ్యమైనంత వృత్తి వైవిధ్యం వుండాలనీ, దీనికి అనుగుణంగా సాధ్యమైనంత గరిష్ఠంగా సర్వతోముఖ సాంకేతిక క్రమాల కొరకు యువజనుల తర్ఫీదు వుండాలనీ యిద్దరూ డిమాండు చేస్తారు కూడా. సార్వత్రిక ఆచరణాత్మక కార్యకలాపాలద్వారా

---

* 19వ శతాబ్ది ప్రథమార్ధంలోని సోషలిస్టులకు — చార్లెస్ ఫోరియర్ (1772–1837), అన్రీ సెంట్ సైమన్ (1760–1825), రాబర్ట్ ఓవెన్ (1771–1858), తదితరులకు — ప్రస్తావన. వీళ్లు పెట్టుబడిదారీ వ్యవస్థను విమర్శించినారు, ఆ వ్యవస్థలో శ్రామిక ప్రజలు పడే ఘోరమైన బాధలను చూపించినారు, సమాజంయొక్క సోషలిస్టు రూపాంతరీకరణకు పథకాలు రచించినారు. కానీ, వాళ్లు ఊహాస్వర్గ సోషలిస్టులుగానే నిలిచిపోయినారు; యెందుకంటే, వాళ్లు సామాజిక అభివృద్ధి నియమాలను గమనించలేక పోయినారు, పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు జరిగే పరివర్తన మార్గాలను చూడలేదు; సమాజపు సోషలిస్టు రూపాంతరీకరణను నిర్వహించగల సామాజిక శక్తి యేదో గ్రహించలేదు. సమాజ పాలకులకు సోషలిజంయొక్క అవసరాన్ని వివరించగలిగితే, వాళ్లే దానిని ప్రవేశపెట్టుతారని ఊహాస్వర్గ సోషలిస్టులు పొరపాటుగా నమ్మినారు. — సం.

మానవుడు సార్వత్రిక అభివృద్ధిని పొందాలనీ, శ్రమ విభజన ధ్వంసం చేసినట్టి ఆకర్ష ణీయతను శ్రమ తిరిగి పొందాలనీ యిద్దరూ భావిస్తారు — మొదట వృత్తిలోని యీ మార్పుద్వారానూ, తదనుగుణంగా ప్రతి నిర్దిష్ట రకం పనికీ (ఫోరియర్ మాటల్లో చెప్పాలంటే) "ఒక్కొక్క దఫా" స్వల్ప కాలాన్ని మాత్రమే అర్పించడంద్వారానూ. డ్యూరింగ్‌కు* సంక్రమించిన దోపిడీ వర్గాల ఆలోచనా విధానంకంటె ఫోరియరూ, ఓవెనూ యిద్దరూ యెంతో ముందున్నారు. ఆ ఆలోచనా విధానం ప్రకారం పట్టణా నికీ గ్రామానికీ మధ్య భేదం స్వభావతః అనివార్యం; యేమైనప్పటికీ పలు "ధాతువులు" ఒకేఒక వస్తువుయొక్క ఉత్పత్తికి విధింపబడక తప్పదనే సంకుచిత అభిప్రాయం; తమ జీవిత విధానంచేత విలక్షణంగా వున్న మానవుల "ఆర్థిక జాతి"ని చిరస్థాయి చేయాలనే అభిప్రాయం — మరే పనినీ కాక సరిగ్గా యీ పనినే చేయడంలో సంతోషం పొందే మానవుల జాతిని, కనుక తమ దాస్యానికీ, యేకపక్షతకూ ఆనందించేటంత హీన స్థితికి దిగజారిన మానవుల జాతిని. "మూర్ఖ" ఫోరియర్‌యొక్క అత్యంత నిర్భీక సాహసిక ఊహాకల్పనలతో పోలిస్తే, "మొరటు, దుర్బల, కించిత్తు" ఓవెన్‌యొక్క అత్యంత కించిత్తు భావాలతో పోలిస్తే కూడా — యింకా శ్రమ విభజన భావానికి పూర్తిగా లోబడిన డ్యూరింగ్ అసందర్భపు మరుగుజ్జును మించి యేమీ కాదు.

సమాజం ఉత్పత్తి సాధనా లన్నిటినీ ఒక సామాజిక పథకం ప్రకారం వినియోగించ డానికి వాటిమీద తనను తాను యజమానిగా చేసుకోవడంలో, తమ సొంత ఉత్పత్తి సాధనాలకు మానవుల మునుపటి అధీనతను అంతమొందిస్తుంది. ప్రతి వ్యక్తీ విముక్తి చెందితే తప్ప సమాజం తనను తాను విముక్తి చేసుకోజాలదని చెప్పనక్కర లేదు. కనుక, పాత ఉత్పత్తి విధానం పైనుండి కిందిదాకా విప్లవీకరింపబడాలి, ప్రత్యేకంగా మునుపటి శ్రమ విభజన అదృశ్యం కావాలి. దాని స్థానంలో యెలాంటి ఉత్పత్తి వ్యవస్థ రావాలంటే, ఆ వ్యవస్థలో, ఒకవైపున, యే వ్యక్తీ ఉత్పాదక శ్రమలోని తన భాగాన్ని, మానవుని మనుగడయొక్క యీ ప్రకృతి సిద్ధమైన అవసరాన్ని, యితరుల భుజాలమీదికి తోయ జాలడు; మరొకవైపున, ఉత్పాదక శ్రమ మానవులను అణచివేసే సాధనంగా వుండడానికి బదులు, ప్రతి వ్యక్తికీ తన శారీరిక, మానసిక శక్తు లన్నిటినీ అన్ని రంగాలలోనూ అభివృద్ధి చేసుకోడానికీ, వాటిని పూర్తిగా ఉపయోగించడానికీ అవకాశం యివ్వడంద్వారా, వాళ్ల విమోచనకు సాధనం అవుతుంది — కనుక, ఆ వ్యవస్థలో ఉత్పాదక శ్రమ భారంగా వుండడానికి బదులు హాయిగా వుంటుంది.

---

* ఒయ్‌గెన్ డ్యూరింగ్ (1833–1921) — జర్మన్ ప్రొఫెసర్, పృథక్కలవాద తత్వవేత్త, వెకిలి అర్థశాస్త్రజ్ఞుడు; ప్రగతివ్యతిరేక పెటీబూర్జువా సోషలిజంకు ప్రతినిధి. — సం.

యీనాడు యిది యిక యెంత మాత్రమూ ఊహాకల్పన కాదు, యిక యెంత మాత్రమూ పవిత్రమైన ఆకాంక్ష కాదు. ఉత్పాదక శక్తుల ప్రస్తుత అభివృద్ధితో, ఉత్పాదక శక్తుల సామాజికీకరణ అనే విషయంనుండే యేర్పడే ఉత్పత్తి పెరుగుదల పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు ఫలితాలైన అడ్డంకులనూ, ఆటంకాలనూ, ఉత్పాదితాలయొక్క, ఉత్పత్తి సాధనాలయొక్క దుర్వ్యయాన్నీ రద్దు చేయడంతో కలిసి, ప్రతివాడూ తన భాగం పనిని చేస్తూవుండగా, శ్రమకు అవసరమైన కాలాన్ని యెంత వరకు తగ్గించడానికి సరిపోతుందంటే, మన యీనాటి భావాలతో కొలిస్తే అది తప్పక స్వల్ప కాలంగా వుంటుంది.

పాత శ్రమ విభజనను రద్దుచేయాలనేది శ్రమయొక్క ఉత్పాదకతకు నష్టకరంగా మాత్రమే నిర్వహించబడ గల డిమాండు కూడా కాదు. తద్వ్యతిరేకం. ఆధునిక పరిశ్రమల ఫలితంగా అది ఉత్పత్తికే అవసర పరిస్థితి అయింది. "ఫలానా మనిషిని ఫలానా క్రమానికి నిత్యం అనుబంధించడంద్వారా, కార్ఖానాలో లాగ, యీ పంపకాన్ని ఘనీభవింపజేసే అవసరాన్ని యంత్రాల వినియోగం తుదముట్టిస్తుంది. మొత్తం వ్యవస్థయొక్క చలనం కార్మికునినుండి కాక, యంత్రాలనుండి ప్రారంభవౌతుంది గనుక, వ్యక్తుల మార్పిడి పని భంగం లేకుండా యెప్పుడైనా జరగగలదు.... చివరి విషయం, యువజనులు యంత్రాల పనిని వేగంగా నేర్చుకుంటారు గనుక, కేవలం యంత్రాలకింద పనిచేయడానికి ఒక ప్రత్యేక వర్గం పనివాళ్లను పెంచవలసిన అవసరం అంతరిస్తుంది." * కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ యంత్రాలను వినియోగించుకొనే పద్ధతి ఘనీభవించిన ప్రత్యేక నైపుణ్యాలతో సహా పాత శ్రమ విభజనను, అది సాంకేతిక దృష్ట్యా అనవసరమైనప్పటికీ, అవశ్యంగా చిరస్థాయి చేయగా, యంత్రావళే యీ కాల వైపరీత్యంమీద తిరుగుబాటు చేస్తుంది. ఆధునిక పరిశ్రమల సాంకేతిక ప్రాతిపదిక విప్లవకరమైనది. "యంత్రాలూ, రసాయనిక ప్రక్రియలూ, తదితర పద్ధతులద్వారా అది ఉత్పత్తియొక్క సాంకేతిక ప్రాతిపదికలోనే కాక, శ్రామికుని క్రియలలోనూ, శ్రమ ప్రక్రియయొక్క సామాజిక సమ్మేళనాలలోనూ కూడా నిరంతరం మార్పులు కలిగిస్తున్నది. అదే సమయంలో అది తద్వారా సమాజం లోపల శ్రమ విభజనను విప్లవీకరిస్తుంది, ఒక ఉత్పత్తి శాఖనుండి మరొక ఉత్పత్తి శాఖకు పెట్టుబడి రాసులనూ, శ్రామికుల సమూహాలనూ నిరంతరం తోస్తుంది. కనుక, ఆధునిక పరిశ్రమ తన స్వభావంచేతనే పనిలో మార్పునూ, క్రియలో ప్రవాహ గుణాన్నీ, శ్రామికుని సార్వత్రిక చలనాన్నీ విధాయకం చేస్తుంది.... యీ పరమమైన వైరుధ్యంయొక్క ఆగ్రహం ఫలితంగా కార్మికవర్గానికి చెందినవాళ్లు నిరంత

---

* *Capital*, సంపుటి 1, మాస్కో, 1961, పుట 421. – సం.

రం బలి కావడమూ, శ్రమశక్తి అత్యంత నిర్లక్ష్యంగా వ్యర్థం కావడమూ, సామాజిక అరాజకత్వం మూలంగా యేర్పడే విధ్వంసమూ యెలా కలిగేదీ మనం గమనించినాం. యిది రుణాత్మక పార్శ్వం. కానీ, ఒకవైపున, పనిలో మార్పు ప్రస్తుతం సర్వదమనమైన ప్రకృతి నియమం లాగ, అన్ని వైపులా ప్రతిఘటనను యెదుర్కొన్న ప్రకృతి నియమం యొక్క గుడ్డి విధ్వంసక ఆచరణతో పెత్తనం చేస్తూవుంటే, మరొకవైపున, ఆధునిక పరిశ్రమ పనిలో మార్పును, తత్పర్యవసానంగా రకరకాల పనికి శ్రామికుని యోగ్యతను, తత్పర్యవసానంగా అతని రకరకాల అభిరుచులు వీలైనంత యెక్కువగా అభివృద్ధి చెందడాన్ని ఉత్పత్తియొక్క మౌలిక నియమంగా గుర్తించవలసిన అవశ్యకతను తన విధ్వంసాల ద్వారా విధిస్తుంది. యీ నియమంయొక్క మామూలు ఆచరణకు అనుగుణంగా ఉత్పత్తి విధానాన్ని మలచడం సమాజానికి జీవన్మరణ సమస్య అవుతుంది. అవును, యీనాటి ఆంశిక కార్మికుని, ఒకేఒక చిల్లర చర్యను యావజ్జీవితం పునశ్చరణ చేయడంచేత అవిటివాడై, తద్వారా కేవలం మానవ శకలంగా కుదించబడినవాణ్ని, తొలగించి, వాని స్థానంలో పూర్తిగా అభివృద్ధి చెందిన వ్యక్తిని, అనేక రకాల పనులకు యోగ్యుడైనవాణ్ని, ఉత్పత్తిలో యే మార్పు నైనా యెదుర్కోడానికి సిద్ధంగా వున్నవాణ్ని, తాను చేసే భిన్న సామాజిక క్రియలు తన సొంత సహజ శక్తులకూ, అలవరచుకొన్న శక్తులకూ నిర్బంధం లేని అవకాశం యిచ్చే అనేక పద్ధతులు మాత్రమే అయినట్టివాణ్ని, పెట్టేటట్లు ఆధునిక పరిశ్రమ సమాజాన్ని నిర్బంధించి, మరణమే మార్గాంతరంగా చేస్తుంది" (మార్క్స్, "పెట్టుబడి").*

దాదాపు సార్వత్రికంగా ఆచరణ సాధ్యమైనట్టి అణువుల చలనాన్ని సాంకేతిక ప్రయోజనాల కొరకు పదార్థ రాసుల చలనంగా మార్చడం మనకు నేర్పిన ఆధునిక పరిశ్రమ తద్వారా ఉత్పత్తిని స్థానిక నిర్బంధాలనుండి గణనీయమైన మేరకు విముక్తి చేసింది. నీటి శక్తి స్థానికంగా వుండింది; ఆవిరి శక్తి స్వేచ్ఛ గలది. నీటి శక్తి అవశ్యంగా గ్రామీణం, ఆవిరి శక్తి అవశ్యంగా పట్టణ సంబంధి కానే కాదు. దానిని ప్రధానంగా పట్టణాలలో సాంద్రీకరించేదీ, ఫాక్టరీ గ్రామాలను ఫాక్టరీ పట్టణాలుగా మార్చేదీ యేమిటంటే, ఆవిరి శక్తియొక్క పెట్టుబడిదారీ వినియోగం. కానీ, అలా చేయడంలో అది, అదే సమయంలో, తాను యే పరిస్థితులలో పనిచేస్తుందో ఆ పరిస్థితులను బలహీన పరుస్తుంది. ఆవిరి యింజనుయొక్క ప్రథమ అవసరమూ, ఆధునిక పరిశ్రమలలో దాదాపు అన్ని శాఖలయొక్క ఒక ప్రధాన అవసరమూ సాపేక్షంగా శుభ్రమైన నీరు. కానీ ఫాక్టరీ పట్టణం నీటి నంతటినీ కంపు కొట్టే యెరువుగా మారుస్తుంది. కనుక, పెట్టు

*Capital*, సంపుటం 1, మాస్కో, 1961, పుటలు 487–488. – సం.

బడిదారీ ఉత్పత్తికి పట్టణ సాంద్రీకరణ యెంతగా మౌలిక షరతు అయినప్పటికీ, ప్రతి వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడిదారుడూ యీ సాంద్రీకరణచేత అవశ్యంగా సృష్టింపబడిన పెద్ద పట్టణాలనుండి దూరంగా పోడానికీ, తన కర్మాగారాన్ని గ్రామీణ ప్రాంతానికి బదలాయించడానికీ నిత్యం పాటుపడుతున్నాడు. జవుళీ పరిశ్రమ జిల్లాలైన లాంకష్షైర్ లోనూ, యార్క్‌షైర్‌లోనూ యీ క్రమాన్ని సవివరంగా అధ్యయనం చేయవచ్చు; అక్కడ ఆధునిక పెట్టుబడిదారీ పరిశ్రమ పట్టణాలనుండి గ్రామాలకు నిత్యం పరుగెత్తడంద్వారా నిత్యం కొత్త పెద్ద పట్టణాలను సృష్టిస్తున్నది. లోహ పరిశ్రమ జిల్లాలలో యిలాంటి పరిస్థితే వుంది; అక్కడ, పాక్షికంగా, యితర కారణాలు యివే ఫలితాలను కలిగిస్తాయి.

మళ్లీ అంతే: ఆధునిక పరిశ్రమల పెట్టుబడిదారీ స్వభావపు రద్దు మాత్రమే మనల్ని యీ కొత్త విషవలయంనుండి వెలికి తేగలదు, నిత్యం తన్ను తాను పునరుత్పత్తి చేసుకుంటున్న యీ ఆధునిక పరిశ్రమల అంతర్వైరుధ్యాన్ని పరిష్కరించగలదు. ఒకేఒక విస్తారమైన పథకం ప్రాతిపదికపైన తన ఉత్పాదక శక్తులు ఒకదానితో ఒకటి పొందికగా అమరేటట్లు చేయగల సమాజం మాత్రమే పరిశ్రమలు తమ సొంత అభివృద్ధికీ, యితర ఉత్పత్తి అంశాల మనుగడకూ, అభివృద్ధికీ అత్యుత్తమంగా తగిన మార్గంలో దేశ మంతటా పంపకం కావడాన్ని అనుమతించగలదు.

కనుక, పట్టణానికీ, గ్రామానికీ మధ్య గల భేదాన్ని రద్దుచేయడం సాధ్యం మాత్రమే కాదు. అది పారిశ్రామిక ఉత్పత్తికే సూటి అవసరం అయింది, అలాగే వ్యవసాయ ఉత్పత్తికీ, అంతే కాక పౌర ఆరోగ్యానికీ అవసరం అయింది. ప్రస్తుతం గాలీ, నీరూ, నేలా విషమయం కావడాన్ని పట్టణంయొక్కా, గ్రామంయొక్కా సంలీనం మాత్రమే అంతమొందించ గలదు. అలాంటి సంలీనం మాత్రమే యిప్పుడు పట్టణాలలో మగ్గుతున్న జనాల పరిస్థితిని మార్చి, వాళ్ల మల మూత్రాలు రోగాలను ఉత్పత్తి చేయడానికి బదులు మొక్కలను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించబడేటట్లు చేస్తుంది.

పెట్టుబడిదారీ పరిశ్రమ తనకు అవసరమైన ముడి పదార్థాల మూలాల స్థలాన్ని బట్టి యేర్పడే స్థానిక పరిమితులనుండి యిప్పటికే సాపేక్షంగా స్వాతంత్ర్యం పొందింది. జవుళీ పరిశ్రమ ప్రధానంగా దిగుమతి అయిన ముడి పదార్థాలను వాడుకుంటున్నది. స్పెయిన్‌లోని ముడి యినుము ఇంగ్లండులోనూ, జర్మనీలోనూ శుద్ధిచేయబడుతున్నది; స్పెయిన్, దక్షిణ అమెరికాల ముడి రాగి ఇంగ్లండులో శుద్ధిచేయబడుతున్నది. ప్రతి బొగ్గు క్షేత్రమూ యిప్పుడు తన సరిహద్దుల కావల వున్న పారిశ్రామిక ప్రాంతానికి యింధనం సరఫరా చేస్తున్నది, యీ ప్రాంతం యేటికేటికీ విస్తృతమౌతున్నది. మొత్తం యూరప్ తీరం పొడవునా ఆవిరి యింజన్లు ఇంగ్లీషు బొగ్గుచేతా, కొంతవరకు జర్మన్,

బెల్జియన్ బొగ్గుచేతా నడపబడుతున్నాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి హద్దులనుండి విముక్తమైన సమాజం యింకా చాలా దూరం పోగలదు. సర్వతోముఖమైన తర్ఫీదు గలిగి, మొత్తం పారిశ్రామిక ఉత్పత్తియొక్క శాస్త్రీయ ప్రాతిపదికను అర్థంచేసుకొని, ప్రతిఒకడూ ఉత్పత్తి శాఖల పరంపర మొత్తంలో ఆచరణాత్మక అనుభవం పొందినట్టి ఉత్పాదకుల జాతిని సృష్టించడంద్వారా యీ సమాజం ముడి పదార్థాలనూ, యింధనాన్నీ పెద్ద దూరాలనుండి రవాణా చేయడానికి అవసరమైన శ్రమకు పుష్కలంగా ఫలితం యిచ్చే కొత్త ఉత్పాదక శక్తిని ఉత్పన్నం చేస్తుంది.

కనుక, పట్టణంయొక్కా, గ్రామంయొక్కా వేరుపాటును రద్దుచేయడం, అది ఆధునిక పరిశ్రమలను మొత్తం దేశమంతటా సాధ్యమైనంత సమానంగా పంపకం చేయడంమీద ఆధారపడుతుంది గనుక కూడా, ఊహాస్వర్గాత్మకం కాదు. గొప్ప పట్టణా లలో నాగరికత మన కిచ్చిన వారసత్వాన్ని తొలగించుకోడానికి చాలా కాలమూ, శ్రమా అయ్యే మాట నిజమే. కానీ, అది యెంత దీర్ఘ క్రమం అయినా, అది తొలగించబడక తప్పదు, తొలగించబడుతుంది. ప్రష్యన్ జాతియొక్క జర్మన్ సామ్రాజ్యపు భవిష్యత్తు యెలా వుండబోయినా, తన హృదయ కాంక్ష తప్పక నెరవేరుతుందనే విశ్వాసంతో బిస్మార్క్ సగర్వంగా పరలోకానికి పోగలడు: గొప్ప పట్టణాలు నశిస్తాయి.*

డ్యూరింగ్ భావాలు యెంత శైశవంగా వున్నాయో యిప్పుడు చూడండి — పాత ఉత్పత్తి విధానాన్ని పైనుండి కిందిదాకా విప్లవీకరించకుండా, అన్నిటికంటె ముందు పాత శ్రమ విభజనను అంతమొందించకుండా, ఉత్పత్తి సాధనా లన్నిటినీ మొత్తంగా సమాజం స్వాధీనపరచుకోగల దనేదీ; ఒకసారి "సహజ అభిరుచులనూ, వ్యక్తిగత సామర్థ్యాలనూ లెక్కలోకి తీసుకుంటే," అన్నీ సక్రమంగా వుంటాయనేదీ — కనుక, మొత్తం వ్యక్తుల సమూహాలు, గతంలో లాగే, ఒకేఒక వస్తువుయొక్క ఉత్పత్తికి లోబడివుంటా రనేదీ. మొత్తం "ప్రజానీకాలు" ఒకేఒక ఉత్పత్తి శాఖలో నిమగ్నులై వుంటారట, మానవ జాతి గతంలో లాగే పలు భిన్న అవిటి "ఆర్థిక జాతులు"గా విభజింపబడడం కొనసాగుతుందట, యెందుకంటే, యింకా "బరువులు మోసేవాళ్లూ," "వాస్తుశిల్పులూ"

---

*ఒట్టో బిస్మార్క్ (1815–1890) – ప్రగతి వ్యతిరేక జర్మన్ రాజనీతిజ్ఞుడు. 1862–1871లో ప్రష్యా మంత్రి, అధ్యక్షుడు. 1871–1890లో జర్మన్ సామ్రాజ్యపు చాన్సలర్ (ప్రధాన మంత్రి).

విప్లవోద్యమ కేంద్రాలైన పెద్ద నగరాలను ద్వేషించిన బిస్మార్క్ కొత్త విప్లవోద్యమం వస్తే వాటిని ధ్వంసం చేయాలని 1852 మార్చి 20న ప్రష్యన్ లండ్‌టాగ్ (పార్లమెంటు)లో యిచ్చిన ఉపన్యాసంలో సూచించినాడు. — సం.

వుంటారట. మొత్తం ఉత్పత్తి సాధనాలకు సమాజం యజమాని అయ్యేది యెందుకంటే, ప్రతి వ్యక్తీ తన ఉత్పత్తి సాధనాలకు బానిసగానే వుండి, యే ఉత్పత్తి సాధనం తనను బానిసీకరించేదీ యెన్నుకొనే స్వేచ్ఛ మాత్రమే కలిగివుండేటందుకట. డ్యూరింగ్ పట్టణంయొక్కా, గ్రామంయొక్కా వేరుపాటును యెలా "స్వభావతః అనివార్యం"గా పరిగణించేదీ, అతనికి ష్నాప్స్* తయారీలోనూ, బీట్ చక్కెర తయారీలోనూ — వాటి సంబంధాన్ని బట్టి నిర్దిష్టంగా ప్రష్యన్ వైన రెండు పరిశ్రమల శాఖలలో — మాత్రమే యెలా అతనికి కించిత్తు ఉపశమనం కనపడేదీ కూడా చూడండి. దేశమంతటా పరిశ్రమలు పంపకం కావడం కొన్ని భావి సృజనలమీదా, పరిశ్రమలను ముడి పదార్థాల లభ్యంతో సూటిగా జతపరచవలసిన అవశ్యకతమీదా ఆధారపడుతుందని అతను అనడం కూడా చూడండి — ముడి పదార్థాలు యిప్పటికే తమ జన్మస్థలంనుండి అంతకంతకూ యెక్కువౌతున్న దూరంలో ఉపయోగించబడుతుండగా! నిడివిమీద సామాజిక అవసరాలు వ్యవసాయానికీ, పరిశ్రమలకూ మధ్య సంయోగాన్ని, అది ఆర్థికంగా నష్టమైనప్పటికీ, నిర్వహిస్తాయని — అదేదో ఆర్థికంగా త్యాగమైనట్లు — మనకు నమ్మజెప్పుతూ డ్యూరింగ్ చివరకు తన తిరోగమనాన్ని సమర్థించుకోడానికి ప్రయత్నిస్తాడు!

నిశ్చయంగా, పాత శ్రమ విభజననూ, దానితోపాటు పట్టణంయొక్కా, గ్రామంయొక్కా వేరుపాటునూ అంతమొందించి, మొత్తం ఉత్పత్తిని విప్లవీకరించే అంశాలు ఆధునిక పెద్ద పరిశ్రమల ఉత్పత్తి పరిస్థితులలో యిప్పటికే పిండ రూపంలో వున్నాయనీ, వాటి అభివృద్ధిని ప్రస్తుత పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అడ్డగిస్తున్నదనీ చూడగలగడానికి — యీ విషయాలను చూడగలగడానికి ప్రష్యన్ న్యాయశాస్త్ర రంగంకంటె, ష్నాప్స్ తయారీ, బీట్ చక్కెర తయారీ కీలక పరిశ్రమలుగా వున్న దేశంకంటె, ఆర్థిక సంక్షోభాలను పుస్తకాల మార్కెట్‌లో అధ్యయనం చేయగల దేశంకంటె కాస్త విశాలమైన దిఙ్మండలం కలిగివుండడం అవసరం. యీ విషయాలను చూడగలగడానికి నిజమైన పెద్ద పరిశ్రమల — ముఖ్యంగా అవి యెక్కడ పుట్టి పెరిగినాయో, యెక్కడ మాత్రమే తన లాక్షణిక అభివృద్ధిని పొందినాయో ఆ ఒకేఒక దేశంలోని పెద్ద పరిశ్రమల — చారిత్రక పెరుగుదలనూ, ప్రస్తుత వాస్తవ రూపాన్నీ గురించి కొంత తెలుసుకొనివుండడం అవసరం. అప్పుడు ఆధునిక శాస్త్రీయ సోషలిజంను అపభ్రంశంచేయడానికీ, డ్యూరింగ్‌యొక్క నిర్దిష్టమైన ప్రష్యన్ సోషలిజంగా హీనపరచడానికీ ప్రయత్నించాలని యెవడూ అనుకోడు.

సెప్టెంబర్ 1876 — జూన్ 1878లో రచింపబడింది

*జర్మనీలో బాగా వాడుకలో వున్న మద్యం. — సం.

ఎంగెల్స్

# ప్రకృతిలోని పరస్పరవాదం

(కొంత భాగం)

మానవునితో చరిత్ర ప్రారంభమౌతుంది. జంతువులకు కూడా చరిత్ర వుంది — వాటి అవతరణకూ, ప్రస్తుత స్థితికి వాటి క్రమక్రమ పరిణామానికీ చెందిన చరిత్ర. యీ చరిత్ర అవి నిర్మించిన చరిత్ర కాదు; దీనిలో అవి స్వయంగా పాల్గొనే మేరకు, వాటికి ఆ జ్ఞానమూ, కోరికా లేకుండానే జరుగుతుంది. మరొకవైపున, మానవులు జంతువులనుండి సంకుచిత అర్థంలో దూరమయ్యే కొద్దీ, ఆ మేరకు వాళ్లు తమ చరిత్రను తామే స్పృహతో నిర్మిస్తారు, ఆ మేరకు యీ చరిత్రమీద ముందుగా తెలియని ఫలితాలయొక్కా, అదుపులో లేని శక్తులయొక్కా ప్రభావం తగ్గుతుంది, ఆ మేరకు చారిత్రక ఫలితం కచ్చితంగా ముందుగా పెట్టుకోబడిన లక్ష్యానికి అనుగుణంగా వుంటుంది. కానీ, యీ కొలమానాన్ని మనం మానవ చరిత్రకు అన్వయిస్తే, యీనాటి అత్యంత అభివృద్ధి చెందిన జాతుల చరిత్రకైనా సరే అన్వయిస్తే, పెట్టుకోబడిన లక్ష్యాలకూ, లభించిన ఫలితాలకూ మధ్య అపారమైన వ్యత్యాసం యిక్కడ యింకా వుందనీ, ముందుగా తెలియని ప్రభావాలు ప్రాబల్యం వహిస్తాయనీ, పథకం ప్రకారం ఉపయోగించబడిన శక్తులకంటె అదుపులో లేని శక్తులు యెంతో యెక్కువ శక్తివంతంగా వున్నాయనీ మనకు అర్థమౌతుంది. యిది మరొకవిధంగా వుండజాలదు కూడా; యెందుకంటే, మానవుల అత్యంత ముఖ్యమైన చారిత్రక కార్యరంగం, వాళ్లను జంతు స్థితినుండి మానవ స్థితికి యెత్తినట్టిది, వాళ్ల యితర కార్యరంగాల కన్నిటికీ పాదార్థిక పునాది అయినట్టిది, యేదంటే వాళ్ల జీవితావసరాల ఉత్పత్తి, అనగా మన కాలంలో సామాజిక ఉత్పత్తి — యిది, అన్నిటినీ మించి, అదుపులో లేని శక్తులు కలిగించే అనుద్దిష్ట ఫలితాల చర్యా ప్రతిచర్యలకు గురై, మినహాయింపుగా మాత్రమే తాను కోరిన ఫలితాన్ని సాధిస్తూ, అంతకంటె యెంతో తరుచుగా పూర్తి వ్యతిరేక ఫలితాన్ని సాధిస్తున్నది గనుక. అత్యంత పురోగామి పారిశ్రామిక దేశాలలో మనం ప్రకృతి శక్తులను అణచినాం, వాటిని మానవ

సేవలో వినియోగించినాం, తద్వారా ఉత్పత్తిని అనంతంగా పెంచినాం, ఫలితంగా యిప్ప డొక పిల్లవాడు గతంలో నూరుమంది పెద్దవాళ్లు చేసినంతకంటె యెక్కువ చేస్తాడు. మరి ఫలిత మేమిటి? జనాలకు పెరుగుతున్న అధిక శ్రమ, పెరుగుతున్న దారిద్ర్యం, ప్రతి పదేండ్ల కొక మహా పతనం. నిర్నిబంధ పోటీ, జీవన పోరాటం, అత్యున్నత చారిత్రక విజయంగా అర్థశాస్త్రజ్ఞులు ప్రశంసించేది, జంతు ప్రపంచంలోని మామూలు స్థితి అని డార్విన్* చూపించినప్పుడు, మానవ జాతిమీదా, ముఖ్యంగా తన దేశీయులమీదా తాను యెంత నిశితమైన వెక్కిరింత రాసిందీ ఆయన యెరగడు. సామాజిక ఉత్పత్తి యొక్క చైతన్యపూరిత వ్యవస్థీకరణ — దేనిలో ఉత్పత్తీ, పంపకమూ ప్రణాళికాబద్ధంగా నిర్వహించబడతాయో అది — మాత్రమే మానవ జాతిని సామాజిక పార్శ్వంలో తక్కిన జంతు ప్రపంచంనుండి పైకెత్తగలదు — సాధారణ ఉత్పత్తి నిర్దిష్ట జీవశాస్త్ర పార్శ్వంలో మానవ జాతికి యీ పని యెలా చేసిందో అలాగే. చారిత్రక పరిణామం అలాంటి వ్యవస్థీకరణను రోజురోజుకూ యెక్కువ అవిసర్జనీయమయ్యేటట్లు చేస్తున్నది, అంతే కాక రోజురోజుకూ యెక్కువ సాధ్య మయ్యేటట్లు చేస్తున్నది. అప్పటినుండి చరిత్రలో కొత్త యుగం ప్రారంభ మౌతుంది; ఆ యుగంలో మానవ జాతే, మానవ జాతితో పాటు దాని కార్యకలాపాలకు చెందిన అన్ని శాఖలూ, ముఖ్యంగా ప్రకృతి శాస్త్రాలూ యెంత పురోగతిని సాధిస్తాయంటే, అంతకు మునుపు జరిగిన పురోగతి అంతా తృణప్రాయ మౌతుంది.

అత్యధిక భాగం 1873–1883లో రచింపబడింది,
1885–1886లో పూర్తిచేయబడింది

---

* చార్లెస్ డార్విన్ (1809–1882) — గొప్ప ఇంగ్లీషు ప్రకృతి శాస్త్రజ్ఞుడు, శాస్త్రీయ జీవశాస్త్ర ప్రారంభకుడు, పరిణామ సిద్ధాంతాన్ని ఆవిష్కరించినవాడు. — సం.

## ఎంగెల్స్

# ఫ్రాన్సు, జర్మనీలలో రైతు సమస్య

(కొంత భాగం)

అయితే, సన్నకారు రైతాంగంపట్ల మన వైఖరి యేమిటి? మనం అధికారంలోకి వచ్చిన రోజున వాళ్లతో యెలా వ్యవహరిస్తాం?

మొదటిది. సన్నకారు రైతుయొక్క అనివార్యమైన వినాశనాన్ని మనం భవిష్య ద్దర్శనం చేస్తాం, కానీ మన జోక్యంద్వారా ఆ వినాశనాన్ని త్వరపరచడం మన కర్తవ్యం కాదు, అని ఫ్రెంచి కార్యక్రమం* ప్రకటించడం పూర్తిగా సరైనది.

రెండవది. రాజ్యాధికారం మన వశంలో వున్నప్పుడు, పెద్ద భూస్వాముల విషయంలో చేయవలసి వున్నట్లు, సన్నకారు రైతులను బలవంతంగా (నష్ట పరిహారం యిచ్చి గానీ, యివ్వకుండా గానీ) నిరాస్తిపరులను చేయాలని మనం అనుకోను కూడా అనుకోం, అనేది పైదానిలాగే తేటతెల్లం. సన్నకారు రైతుకు సంబంధించి మన కర్తవ్యం యేమి టంటే, ప్రప్రథమంగా, అతని సొంత కృషీ, సొంత ఆస్తీ సహకార కృషిగా, సహకార ఆస్తిగా పరివర్తన చెందేటట్లు చేయడం — బలవంతంగా కాక, ఉదాహరణలద్వారానూ, యీ పనికి సామాజిక సహాయం యివ్వడంద్వారానూ. తరువాత, సహజంగానే, సన్నకారు రైతుకు యీనాడు కూడా తేటతెల్లంగా వుండక తప్పని భావి సౌక ర్యాలను అతనికి చూపించడానికి మనకు బోలెడు మార్గాలు వుంటాయి.

తమ దేశంలో ఒకటి మాత్రమే నిజమైన నగరం — కోపెన్‌హాగెన్ — కలిగి, అందు వలన దానికి వెలుపల రైతు ప్రచారంమీద పూర్తిగా ఆధారపడవలసివున్న డేనిష్ సోష లిస్టులు దాదాపు యిరవై యేండ్ల క్రితం అప్పటికే అలాంటి పథకాలను రచిస్తూవుండినారు. ఒక గ్రామంలోని, లేదా ప్రాంతంలోని రైతులు — డెన్మార్క్‌లో పెద్ద వ్యష్టి కమతాలు

---

*ఫ్రెంచి సోషలిస్టుల కార్యక్రమం, 1892లో మార్సేల్స్ మహాసభలో అవలం బించబడి, 1894లో నాంట్ మహాసభలో పూర్తిచేయబడినట్టిది. — సం.

చాలా వున్నాయి — తమ భూమిని కలిపి, ఒకేఒక పెద్ద క్షేత్రంగా చేసి, దానిని సమష్టిగా సాగుచేసి, తాము యిచ్చిన భూమికీ, డబ్బుకూ, శ్రమకూ అనుగుణంగా పంటను పంచుకోవాలి. డెన్మార్క్‌లో సన్నకారు భూ ఆస్తి అప్రధానమైన పాత్ర మాత్రమే నిర్వహిస్తుంది. కానీ యీ భావాన్ని సన్నకారు కమతాలు గల ఒక ప్రాంతానికి అన్వయిస్తే, మనకు కనపడే దేమిటంటే, యీ కమతాలను కలిపి, మొత్తం విస్తీర్ణాన్ని భారీ స్థాయిలో సాగుచేసినప్పుడు, యింతకు మునుపు వినియోగింపబడిన శ్రమశక్తిలో కొంత భాగం అనవసరం అవుతుంది. సరిగ్గా శ్రమలో యీ మిగులుబాటే భారీ స్థాయి వ్యవసాయపు ప్రధాన సౌకర్యాలలో ఒకటి. యీ శ్రమశక్తిని రెండు విధాలుగా వినియోగించవచ్చు. పరిసర ప్రాంతంలోని పెద్ద యెస్టేట్లనుండి తీసుకున్న భూమి అదనంగా యీ రైతు సహకార సంఘాల వశంలో పెట్టబడుతుంది; లేదా ప్రధానంగానూ, సాధ్యమైనంతవరకూ సొంత ఉపయోగార్థం సహాయక వృత్తిగా పరిశ్రమలలో నిమగ్నం కావడానికి మార్గాలూ, అవకాశమూ యీ రైతులకు సమకూర్చబడతాయి. రెండు సందర్భాలలోనూ వాళ్ల ఆర్థిక స్థితి మెరుగౌతుంది. అదే సమయంలో, రైతు సహకార సంఘాన్ని ఉన్నత రూపానికి మార్చడానికీ, మొత్తం సహకార సంఘంయొక్క, దాని వ్యష్టి సభ్యులయొక్క హక్కులనూ, విధులనూ మొత్తం సమాజంలోని యితర శాఖలకూ, విధులకూ సమానం చేయడానికీ అవసరమైన పలుకుబడి సాధారణ సామాజిక దర్శక సంస్థకు తప్పక వుంటుంది. ప్రతి నిర్దిష్ట సందర్భంలోనూ యిది ఆచరణలో యెలా నిర్వహించబడేదీ ఆ సందర్భపు పరిస్థితులమీదా, మనం రాజకీయ అధికారాన్ని యే పరిస్థితులలో వశపరచుకుంటామో ఆ పరిస్థితులమీదా ఆధారపడుతుంది. ఆ విధంగా మనం యీ సహకార సంఘాలకు మరికొన్ని సౌకర్యాలు యిచ్చే స్థితిలో వుండవచ్చు: వాటి మొత్తం తనఖా రుణాన్ని జాతీయ బాంకి మోసుకోవడమూ, అదే సమయంలో వడ్డీ రేటును తీవ్రంగా తగ్గించడమూ; భారీ స్థాయి ఉత్పత్తిని నెలకొల్పేటందుకు ప్రజా విధులనుండి అడ్వాన్సులూ (విధిగా గానీ, ప్రధానంగా గానీ డబ్బు రూపంలో కాదు, అవసరమైన వస్తువుల రూపంలో: యంత్రాలు, రసాయనిక యెరువులు, వగైరా), యితర సౌకర్యాలూ.

వాళ్ల యిండ్లనూ, పొలాలనూ సహకార రీత్యా పనిచేసే సహకార ఆస్తిగా మార్చడంద్వారా మాత్రమే వాటిని కాపాడి, నిలబెట్టగలమని రైతులు గ్రహించేటట్లు చేయడం ప్రధాన విషయంగా వుంది, వుంటుంది. రైతులను వినాశనానికి తరిమేది యేమిటంటే, సరిగ్గా వ్యష్టి స్వామ్యానికి లోబడిన వ్యష్టి వ్యవసాయమే. వాళ్లు వ్యష్టి చర్యమీద పట్టుబట్టితే, అనివార్యంగా యిల్లూ వాకిలీ కోల్పోతారు, వాళ్ల కాలం తీరిన ఉత్పత్తి విధానాన్ని పెట్టుబడిదారీ భారీ స్థాయి ఉత్పత్తి తొలగిస్తుంది. అదీ పరిస్థితి. యిప్పుడు మనం వచ్చి, భారీ స్థాయి ఉత్పత్తిని తామే ప్రవేశపెట్టే అవకాశాన్ని

రైతులకు యిస్తాం — పెట్టుబడిదార్ల కొరకు కాక, సమష్టిగా తమ సొంతానికి. యిది తమకే ప్రయోజనకరమనీ, తమ మోక్షానికి యేకైక మార్గమనీ రైతులు గ్రహించేటట్లు చేయడం నిజంగా అసాధ్యంగా వుండాలా?

పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క సర్వదమనపు శక్తినుండి వాళ్ల వ్యష్టి ఆస్తినీ, వ్యష్టి కమతాలనూ కాపాడగలమని మనం సన్నకారు రైతులకు యిప్పుడు గానీ, భవిష్యత్తులో యెప్పుడైనా గానీ వాగ్దానం చేయలేం. వాళ్ల ఆస్తి సంబంధాలలో బలవంతంగా, వాళ్ల యిచ్ఛకు వ్యతిరేకంగా జోక్యం కలిగించుకోమని మాత్రమే మనం వాగ్దానం చేయగలం. అంతే కాక, సన్నకారు రైతులమీద పెట్టుబడిదారులూ, పెద్ద భూస్వాములూ చేసే పోరాటం యిప్పటినుండి కనీసపు అక్రమ పద్ధతులతో జరగాలనీ, యిప్పుడు అతి తరుచుగా జరుగుతున్న సూటి దొంగతనమూ, వంచనా సాధ్యమైనంతవరకు అరికట్టబడాలనీ మనం వాదించగలం. దీనిలో మనం అసాధారణ సందర్భాలలో మాత్రమే కృతకృత్యుల మౌతాం. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో యెక్కడ నిజాయితీ అంతమౌతుందో, యెక్కడ వంచన ఆరంభమౌతుందో యెవడూ చెప్పలేడు. కానీ, రాజకీయ అధికారం వంచకుని పక్షంలో వున్నదా, వంచితుని పక్షంలో వున్నదా అనేది యెప్పుడూ గణనీయమైన భేదం కలిగిస్తుంది. మనం సహజంగానే నిశ్చయంగా సన్నకారు రైతు పక్షంలో వున్నాం. అతని స్థితిని మరింత భరించదగినదిగా చేయడానికీ, సహకార సంఘానికి మారాలని అతను నిర్ణయించుకుంటే ఆ పరివర్తనను సుకరం చేయడానికీ, అతను ఆ నిర్ణయానికి రాలేకపోతే ఆ విషయాన్ని పర్యాలోచించుకోడానికి దీర్ఘ కాలం పాటు తన చిన్న కమతంమీద నిలిచి వుండడం సాధ్యం చేయడానికి కూడా మనం చేయదగినదంతా చేస్తాం. మనం యిది యెందుకు చేస్తామంటే, మనం తన సొంత శ్రమచేత బతికే సన్నకారు రైతును అర్థాత్తూ మనకు చెందినవాడుగా పరిగణించడంవల్ల మాత్రమే కాదు, పార్టీయొక్క సూటి ప్రయోజనం కొరకు కూడా. కార్మికవర్గంలోకి వాస్తవంగా దిగదోయబడకుండా మనం రక్షించగల రైతుల సంఖ్య, యింకా రైతులుగా వుండగానే మన పక్షానికి తిప్పుకోగల వాళ్ల సంఖ్య, యెంత యెక్కువగా వుంటే అంత వేగంగా, అంత సులభంగా సామాజిక రూపాంతరీకరణ సాధించబడుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రతిచోటా తన గరిష్ఠ పర్యవసానాలదాకా అభివృద్ధి చెందిందాకా, చివరి సన్నకారు చేతిపనివాడూ, చివరి సన్నకారు రైతూ పెట్టుబడిదారీ భారీ స్థాయి ఉత్పత్తికి బలి అయిందాకా మనం యీ రూపాంతరీకరణ కొరకు ఆగడం నిరుపయోగం. యీ పనికిగాను రైతుల ప్రయోజనార్థం ఆర్థిక త్యాగం చేసి, సమష్టి నిధులనుండి ఆ నష్టాన్ని భర్తీ చేయడం, పెట్టుబడిదారీ అర్థశాస్త్రం దృష్ట్యా, డబ్బు పారవేయడంగా మాత్రమే పరిగణించబడగలదు; కానీ యిది

శ్రేష్ఠమైన పెట్టుబడిగా వుంటుంది, యెందుకంటే దరహంమీద సామాజిక పునర్ని ర్మాణపు ఖర్చును యిది బహుశా పదిరెట్లు తగ్గిస్తుంది. కనుక, యీ అర్థంలో, మనం రైతులతో చాలా ఉదారంగా వ్యవహరించగలం. వివరాలలోకి పోడానికీ, ఆ లక్ష్యంతో నిర్దిష్ట ప్రతిపాదనలు చేయడానికీ యిది స్థలం కాదు; యిక్కడ సాధారణ సూత్రాలను మాత్రమే మనం చర్చించగలం.

కనుక, చిన్న కమతాలను మనం శాశ్వతంగా నిలిపివుంచ దలచుకున్నామనే అభిప్రాయం మాత్రమే కలిగించే వాగ్దానాలు చేయడంకంటె మనం పార్టీకీ, సన్నకారు రైతులకూ చేయగల అపకారం వుండబోదు. అది రైతుల విమోచన మార్గాన్ని సూటిగా అడ్డగించడ మౌతుంది, పార్టీని ఆకతాయి యూదు వ్యతిరేకత స్థాయికి దించడ వౌతుంది. తద్వ్యతిరేకంగా, మన పార్టీయొక్క విధి యేమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ పెత్తనం చేసినంత కాలం రైతుల స్థితి పరమ దిక్కుమాలినదనీ, తమ చిన్న కమతాలను తమ కోసం అలాగే నిలిపివుంచడం పరమ అసంభవమనీ, తోపుడు బండిని రైలు బండి నలగదొక్కినట్లు కాలం తీరిన తమ నిర్వీర్యపు సన్నకారు ఉత్పత్తి వ్యవస్థను పెట్టుబడిదారీ భారీ స్థాయి ఉత్పత్తి నలగదొక్కడం పరమ నిశ్చయమనీ రైతులకు పదేపదే స్పష్టం చేయడం. యిది చేస్తే మనం ఆర్థిక అభివృద్ధియొక్క అనివార్య ధోరణికి అనుగుణంగా ఆచరిస్తాం; యీ అభివృద్ధి మన మాటలను రైతుల మనస్సులలోకి యెక్కించక మానదు.

అన్నట్లు, నాంట్ కార్యక్రమ రచయితలు కూడా సారభూతంగా నా అభిప్రాయం కలిగివున్నారన్న నా విశ్వాసాన్ని వ్యక్తం చేయకుండా యీ విషయాన్ని వదలిపెట్టజాలను. యిప్పుడు చిన్న కమతాలుగా విభజింపబడివున్న విస్తీర్ణాలు సమష్టి ఆస్తి కాక తప్పదని తెలుసుకోకుండా వుండలేనంత గొప్పది వాళ్ల అవగాహన శక్తి. చిన్న కమతాల స్వామ్యం అదృశ్యం కాక తప్పదని వాళ్లే అంగీకరిస్తారు. జాతీయ సమితి తరపున లాఫార్గ్*చేత రచింపబడి, నాంట్ మహాసభలో యివ్వబడిన నివేదిక కూడా యీ అభిప్రాయంతో పూర్తిగా యేకీభవిస్తుంది. అది జర్మన్ భాషలో యీ సంవత్సరం అక్టోబర్ 18నాటి బెర్లిన్ *Sozialdemokrat*లో ప్రచురింపబడింది. రచయితలు వాస్తవంగా చెప్పేది వాళ్లు చెప్పదలచుకున్నది కాదని నాంట్ కార్యక్రమంలోనే ఉపయోగించబడిన నుడికారాల పరస్పర వైరుధ్యం వెల్లడిస్తుంది. వాస్తవంగా యిప్పటికే జరిగినట్లు, వాళ్లు చెప్పేది

---

*లాఫార్గ్, పాల్ (1841–1911) – ఫ్రెంచి కార్మిక పార్టీ స్థాపకులలో, నాయకులలో ఒకడు; తత్వవేత్త, అర్థశాస్త్రజ్ఞుడు, మార్క్సిజంను ప్రతిభతో ప్రచారం చేసినవాడు. – సం.

అర్థం చేసుకోబడలేదంటే, వాళ్ల ప్రకటనలు దుర్వినియోగపరచబడినాయంటే, సహజంగానే అది వాళ్ల తప్పే. యేమైనా, వాళ్లు తమ కార్యక్రమాన్ని విశదపరచవలసి వుంది, వచ్చే ఫ్రెంచి మహాసభ దానిని పూర్తిగా సవరించవలసి వుంది.

యిప్పుడు పెద్ద రైతుల వద్దకు వస్తాం. యిక్కడ సంక్రమిత ఆస్తి విభాగాలైన ఫలితంగానూ, రుణగ్రస్తత ఫలితంగానూ, బలవంతపు భూమి అమ్మకాల ఫలితంగానూ, చిన్న కమతపు రైతు మొదలుకొని, తన పిత్రార్జితాన్ని నిలుపుకొన్నట్టి, లేదా దాన్ని యింకా పెంచుకొన్నట్టి పెద్ద రైతు ఆస్తిపరుని దాకా రకరకాల మధ్యంతర దశలున్నాయి. మధ్య తరగతి రైతు చిన్న కమతపు రైతుల మధ్య జీవించేచోట, అతని ప్రయోజనాలూ, అభిప్రాయాలూ వాళ్లవాటికంటె యెక్కువ భిన్నంగా వుండవు; తనలాంటివాళ్లు యెంతమంది యిప్పటికే చిన్న రైతుల స్థాయికి దిగజారిపోయిందీ అతనికి స్వానుభవంద్వారా తెలుసు. కానీ మధ్య తరగతి రైతులూ, పెద్ద రైతులూ ప్రబలంగా వుండి, దరహంమీద వ్యవసాయానికి స్త్రీ పురుష సేవకుల సాయం అవసరమైనచోట, పరిస్థితి భిన్నంగా వుంటుంది. సహజంగానే, కార్మిక పార్టీ, మొట్టమొదట కూలికార్మికుల తరఫున పోరాడాలి, అనగా స్త్రీ పురుష సేవకుల కొరకూ, దిన కార్మికుల కొరకూ. కార్మికుల వేతన బానిసత్వం కొనసాగుతుందని చెప్పే యెలాంటి వాగ్దానాలైనా రైతులకు చేయడం నిస్సందేహంగా నిషిద్ధం. కానీ, పెద్ద రైతులూ, మధ్య తరగతి రైతులూ అదే రూపంలో వుండడం కొనసాగినంత కాలం, వేతన కార్మికులు లేకుండా వాళ్లు నిర్వహించలేరు. కనుక, చిన్న కమతపు రైతులకు శాశ్వతంగా అలాగే కొనసాగే అవకాశాన్ని మనం వాగ్దానం చేయడం సిసలైన తప్పు అయితే, పెద్ద రైతులకూ, మధ్య తరగతి రైతులకూ మనం అదే వాగ్దానం చేయడం ద్రోహానికి దగ్గరలో వుంటుంది.

యిలాంటిదే మళ్లీ నగరాలలో చేతిపనివాళ్ల విషయం వుంది. నిజమే, వాళ్లు రైతులకంటె యెక్కువగా చితికిపోయినారు, కానీ అప్రెంటిస్‌లకు తోడు దినకూలి వాళ్లను వినియోగించుకొనేవాళ్లూ, అప్రెంటిస్‌లతో దినకూలివాళ్ల పని చేయించుకొనే వాళ్లూ యింకా కొంద రున్నారు. యీ చేతిపని యజమానులలో తమ మనుగడను అలాగే శాశ్వతపరచుకో దలచుకున్నవాళ్లు యూదు వ్యతిరేకులలో కలిసిపోనీ — అక్కడ కూడా తమ కే సాయమూ లభించదని నమ్మకం కుదిరిందాకా. తక్కినవాళ్లు, తమ ఉత్పత్తి విధానానికి అనివార్యంగా కాలం మూడిందని గుర్తించినవాళ్లు, మన వైపుకు వస్తున్నారు, అంతే కాక, యితర కార్మికు లందరికీ రానున్న గతిని భవిష్యత్తులో పంచుకోడానికి సిద్ధంగా వున్నారు. పెద్ద రైతులకూ, మధ్య తరగతి రైతులకూ యిదే వర్తిస్తుంది. మనకు వాళ్లమీదకంటె వాళ్ల స్త్రీ పురుష సేవకులమీదా, వాళ్ల దిన కార్మికులమీదా యెక్కువ ఆసక్తి వుందని చెప్పనక్కరలేదు. యీ రైతులు తమ వృత్తి

యిలాగే కొనసాగుతుందనే హామీ కోరితే, ఆ హామీ యిచ్చే స్థితిలో మనం లేము. వాళ్ళ యూదు వ్యతిరేకులలోనూ, రైతు సంఘాలలోనూ, అన్నీ వాగ్దానం చేసి, యే వాగ్దానమూ నిలుపుకోకుండా వుండడంలో ఆనందం పొందే అలాంటి పార్టీలలోనూ చేరాలి. పెద్ద, మధ్య తరగతి రైతులు కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క పోటీకీ, సముద్రాంతరాల చౌక ధాన్యపు పోటీకీ అనివార్యంగా హతం కాక తప్పదని ఆర్థికంగా మనకు నిశ్చయంగా తెలుసు; యీ రైతులలో కూడా పెరుగుతున్న రుణగ్రస్తతా, సర్వత్రా తేటతెల్లంగా వున్న క్షీణతా దీనిని రుజువుచేసింది. యీ క్షీణతకు వ్యతిరేకంగా మనం చేయగలదేమీ లేదు, యిక్కడ కూడా క్షేత్రాలను కలిపి, సహకార సంఘాలు యేర్పరచండని సలహా యివ్వడం తప్ప; ఆ సంఘాలలో కూలి శ్రమ వినియోగం అంతకంతకూ తొలగించబడుతుంది, ప్రతి శాఖా సమాన హక్కులూ, విధులూ కలిగిన గొప్ప జాతీయ ఉత్పాదకుల సహకార సంస్థలో శాఖలుగా అవి క్రమక్రమంగా రూపాంతరం చెందడం ప్రారంభింపబడగలదు. యీ రైతులు తమ ప్రస్తుత ఉత్పత్తి విధానానికి కాలం మూడడం అనివార్యమని గుర్తించి, అవశ్యమైన నిర్ధారణలు లాగితే, వాళ్ళ మనవద్దకు వస్తారు, మారిన ఉత్పత్తి విధానానికి వాళ్ళ పరివర్తనను కూడా మన శక్తి కొలది సుకరం చేయడం మన బాధ్యతగా వుంటుంది. లేకపోతే, మనం వాళ్ళ గతికి వాళ్ళను వదలేసి వాళ్ళ కూలి కార్మికుల విషయం చూడాలి; వీళ్ళలో మనకు తప్పక సానుభూతి కనపడుతుంది. బహుశా యిక్కడ కూడా మనం బలవంతపు ఆస్తి హరణకు దిగకుండా వుండగలం; తక్కిన విషయాల మాట యేమిటంటే, యీ దుర్భేద్యమైన బుర్రలు కూడా హేతువాదానికి లోబడేటట్లు భావి ఆర్థిక ఘటనలు చేస్తాయని నమ్ముదాం.

పెద్ద భూ యెస్టేట్లు మాత్రమే పరమ సరళమైన విషయం. యిక్కడ మనం వ్యవహరించేది ముసుగు లేని పెట్టుబడిదారీ ఉత్పత్తితో; యెలాంటి నైతిక సందేహాలూ మనల్ని అడ్డగించ నక్కరలేదు. యిక్కడ మనకు యెదురయ్యేది సమూహాలుగా గ్రామీణ నిరాస్తిపరులు; మన కర్తవ్యం స్పష్టం. మన పార్టీ రాజకీయ అధికారం వశపరచుకున్న వెంటనే అది పరిశ్రమలలో ఉత్పత్తిదారులను చేసినట్లే పెద్ద భూ ఆస్తిపరులను ఆస్తి హరణం చేయాలి, అంతే. యీ ఆస్తి హరణానికి నష్ట పరిహారం యివ్వాల్నా లేదా అనేది చాలా మేరకు మనమీద ఆధారపడదు, మనం యే పరిస్థితులలో అధికారం సంపాయిస్తామో ఆ పరిస్థితులమీదా, ముఖ్యంగా యీ కులీనులే, పెద్ద భూస్వాములే, అవలంబించే వైఖరిమీదా ఆధారపడుతుంది. నష్ట పరిహారం యెట్టి పరిస్థితులలోనూ కూడదు, అని మనం అనుకోవడమే లేదు. వాళ్ళను మొత్తంగా మనం కొనేయగలిగితే మన కది అన్నిటికంటె చౌకగా వుంటుందని తన అభిప్రాయమైనట్లు మార్క్స్ నాతో చెప్పినాడు (యెన్ని సార్లో!). కానీ యిక్కడ యిది మనకు సంబంధం లేదు. ఆ విధంగా

సమాజానికి తిరిగి అప్పగించబడిన పెద్ద యెస్టేట్లను మనం వాటిని యిప్పటికే యెవరు సాగుచేస్తున్నారో ఆ గ్రామీణ కార్మికులకు యివ్వాలి, అవి సహకార సంఘాలుగా వ్యవస్థీకరింపబడాలి. సమాజపు అజమాయిషీకింద వాళ్ల ఉపయోగార్థం, ఉపకారార్థం, అవి వాళ్లకు అప్పగించబడాలి. వాళ్ల కౌలు షరతులను గురించి యిప్పు డేమీ చెప్పలేం. యేమైనా, పెట్టుబడిదారీ క్షేత్రం సమష్టి క్షేత్రంగా రూపాంతరం చెందడానికి యిక్కడ పూర్తిగా సన్నాహాలు చేయబడినాయి, తెల్లవారే లోపల అది అమలు జరగగలదు, సరిగ్గా క్రుప్ ఫాక్టరీలోనో, ఫన్ ష్టుమ్ ఫాక్టరీలోనో జరిగినట్లు. యీ వ్యవసాయ సహకార సంఘాల ఉదాహరణ సహకార, భారీ స్థాయి ఉత్పత్తియొక్క సౌకర్యాలను గురించి యింకా ప్రతిఘటించే చిన్న కమతపు రైతులలో చివరివాళ్లను కూడా, తప్పకుండా అనేక పెద్ద రైతులను కూడా నమ్మిస్తుంది.

1894 నవంబర్ 15కూ 22కూ మధ్య
రచింపబడింది

# ఉత్తరాలు

# జె. వేడిమేయర్‌కు మార్క్స్ రాసిన ఉత్తరం

(కొంత భాగం)

లండన్, మార్చి 5, 1852

యిక నా విషయం యేమిటంటే, ఆధునిక సమాజంలో వర్గాలు వున్నాయని గానీ, వాటిమధ్య పోరాటం వుందని గానీ ఆవిష్కరించినందుకు యే ప్రశంసకూ నేను తగను. నాకంటె చాలా ముందు బూర్జువా చరిత్రకారులు యీ వర్గపోరాటపు చారిత్రక అభివృద్ధినీ, బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు వర్గాల ఆర్థిక స్వభావాన్నీ వర్ణించివుండినారు. నేను కొత్తగా చేసింది యేమిటంటే, యివి రుజువు చేయడం: 1) వర్గాల ఉనికి ఉత్పత్తి అభివృద్ధిలోని నిర్దిష్ట చారిత్రక దశలతో ముడివడి మాత్రమే వుందనీ, 2) వర్గపోరాటం విధిగా కార్మికవర్గ నియంతృత్వానికి దారితీస్తుందనీ, 3) యీ నియంతృత్వమే సకల వర్గాల రద్దుకూ, వర్గరహిత సమాజానికీ పరివర్తనగా మాత్రమే వుంటుందనీ. వర్గ పోరాటాన్ని మాత్రమే కాక, వర్గాల ఉనికిని కూడా నిరాకరించే హైంత్సెన్‌లాంటి అజ్ఞానపు మూర్ఖులు రుజువు చేసేది యేమిటంటే, వాళ్ళ హృదయ విదారకమైన ఆర్త నాదాలు యెన్ని చేసినా, మానవతావాదపు భేషజాలు యెన్ని ధరించినా, యే సామాజిక పరిస్థితులలో బూర్జువావర్గం పాలిస్తుందో అవి చరిత్రయొక్క అంతిమ ఫలితంగా, non plus ultra* గా వాళ్ళు పరిగణిస్తారనీ, వాళ్ళు బూర్జువావర్గపు సేవకులు మాత్రమే అనీ.

---

* non plus ultra — పరాకాష్ఠ. — సం.

# కె. కౌట్స్కీకి ఎంగెల్స్ రాసిన ఉత్తరం

(కొంత భాగం)

లండన్, ఫిబ్రవరి 1, 1881
122, రీజెంట్స్ పార్క్ రోడ్డు

2. రాబోతున్నదని చెప్పబడే అమిత జనాభానూ, దానినుండి యేర్పడే ఆధునిక సామాజిక సువ్యవస్థ పతనం అనే ప్రమాదాన్నీ నివారించడం యెలా అనే సమస్యను వాళ్ల కొరకు పరిష్కరించడానికి కార్మికవర్గ సోషలిస్టులమైన మనల్ని కథేడర్ సోషలిస్టులు* మొండిగా అభ్యర్థించినా కూడా, వాళ్లకు యీ ఉపకారం చేయవలసిన కారణం నాకేమీ కనిపించడం లేదు. తమ గంద్రగోళపు అతితెలివి మూలంగా కలిగిన వీళ్ల అంతరంగ సంకోచాలనూ, సందేహాలనూ వీళ్ల కొరకు పరిష్కరించడం గానీ, లేదా ఉదాహరణకు షాఫ్లె** ఒక్కడే తన అనేక లావుపాటి పుస్తకాలలో పేర్చిన దారుణమైన చెత్త నంతటినీ పూర్వపక్షం చేయడం గానీ శుద్ధ దండగమారి పని అని నేను అనుకుంటున్నాను. యీ పెద్దమనుషులు 'పెట్టుబడి'నుండి కొటేషన్ మార్కులలో యిచ్చే తప్పు ఉల్లేఖనల నన్నిటినీ దిద్దదలచుకుంటే, అదే ఒక పెద్ద సంపుటం అవుతుంది. తమ ప్రశ్నలకు జవాబులు డిమాండు చేసే ముందు వీళ్లు చదవడమూ, యెత్తి రాయడమూ మొదట నేర్చుకోవాలి.

అంతే కాక, యీ సమస్యను యిప్పుడు నేను జరూరుగా భావించడం లేదు, యిప్పుడిప్పుడే ప్రారంభవౌతున్న అమెరికన్ సామూహిక ఉత్పత్తీ, నిజంగా భారీ స్థాయి అయిన

---

* కథేడర్ సోషలిస్టులు — సోషలిస్టులమని చెప్పుకుంటూ, వాస్తవంలో యూనివర్సిటీ పీఠాలనుండి బూర్జువా ఉదారవాదాన్ని సిఫారస్ చేసే జర్మన్ ప్రొఫెసర్ల పేరు (జర్మన్ భాషలో 'కథేడర్' అనగా యూనివర్సిటీ అధ్యాపక పదవి). — సం.

** షాఫ్లె, ఆల్బర్ట్ (1831–1903) — జర్మన్ వెకిలి అర్థశాస్త్రజ్ఞుడు, సామాజికశాస్త్రజ్ఞుడు, కార్మికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య ''వర్గ శాంతి''నీ, ''సహకారా''న్నీ స్థాపించాలని చెప్పినాడు. — సం.

వ్యవసాయమూ ఉత్పత్తి అయ్యే ఆహార పదార్థాల బరువుకింద మనల్ని నిజంగా నలిపి వేసే ప్రమాదం వున్న యీ తరుణంలో, ఉత్పతనం జరగబోతున్న యీ తరుణంలో. యీ ఉత్పతనపు పర్యవసానాలలో ఒకటి భూమిని మొదట జన సంపన్నం చేయడంగా వుండాలి — దీన్ని గురించి మీరు 169, 170 పుటలలో చెప్పేది యీ అంశాన్ని మరీ పైపైన స్పృశిస్తున్నది. యీ ఉత్పతనం నిశ్చయంగా యూరప్‌లో కూడా పెద్ద జనాభా పెరుగుదలను అవశ్యంగా అపేక్షిస్తుంది....

మానవ జనాభా పెరుగుదలకు ఆటంకాలు నిర్మించవలసినంతగా ఆ జనాభా యెక్కువౌతున్నదనే అభౌతిక సంభావ్యత నిజంగా వుంది. కానీ, కమ్యూనిస్టు సమాజం తాను అప్పటికే వస్తువుల ఉత్పత్తిని నియంత్రించినట్లు, మానవుల ఉత్పత్తిని నియంత్రించవలసి వస్తే, కష్టం లేకుండా అలా చేసేది సరిగ్గా ఆ కమ్యూనిస్టు సమాజమే, అది మాత్రమే. యిప్పటికే ఫ్రాన్సులోనూ, దిగువ ఆస్ట్రియాలోనూ స్వయంజనితంగా, యే పథకమూ లేకుండా అభివృద్ధి అయిన ఫలితాన్ని ఆ సమాజంలో పథకం ప్రకారం సాధించడం యేమంత కష్టంగా నాకు కనిపించదు. యేమైనా, అందుకుగాను యెప్పుడు, యెలా, యే సాధనాలు తాము ఉపయోగించేదీ లేనిదీ ఆ మనుషుల వ్యవహారం. ఆ విషయంమీద వాళ్లకు సలహాలూ, సూచనలూ యిచ్చే కర్తవ్యం నామీద వున్నట్లు నాకు అనిపించడం లేదు. వాళ్లకు తప్పకుండా మన కున్నంత తెలివితేటలు వుంటాయి.

తక్కిన విషయం మాట యేమిటంటే, 1844లోనే నేను (*Deutsch-Französische Jahrbücher*, పుట 109) యిలా రాసినాను: ''మాల్తస్* చెప్పింది బేషరతుగా నిజమైతే కూడా, అప్పుడు యీ (సోషలిస్టు) రూపాంతరీకరణకు వెంటనే పూనుకోవాలి; యెందుకంటే, అది మాత్రమే, జనాలకు అది యిచ్చే విద్య మాత్రమే, సంతానోత్పాదక ప్రేరణకు నైతిక పరిమితిని — అమిత జనాభాకు అత్యంత ఫలవంతమైన, అత్యంత సులభమైన విరుగుడుగా మాల్తుసే చెప్పేదానిని — సాధ్యం చేస్తుంది.''

---

* మాల్తస్, థామస్ (1766–1834) — ఇంగ్లీషు మతగురువు, అర్థశాస్త్రజ్ఞుడు, పెట్టుబడిదారీ వ్యవస్థ సమర్థకుడు, ప్రగతి వ్యతిరేకమైన జనాభా సిద్ధాంతపు కర్తలలో ఒకడు. శ్రామిక వర్గాల దైన్యానికి కారణం పెట్టుబడిదారీ దోపిడీ కాదనీ, జనాభా పెరుగుదల అనీ, అది వినియోగ వస్తువులకంటె వేగంగా పెరుగుతుందనీ అతను చెప్పినాడు. ''పెట్టుబడి''లో మార్క్సు మాల్తస్ సిద్ధాంతాన్ని తీవ్ర విమర్శకు గురిచేసి, దాని నిర్ధారణలు తప్పు లెక్కలమీద ఆధారపడినాయనీ, దాని లక్ష్యం పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అచంచలత్వాన్నీ, శ్రామిక ప్రజలమీద పెట్టుబడిదారీ దోపిడీ యొక్క అనివార్యతనూ ''రుజువుచేయడ''మనీ నిరూపించినాడు. — సం.

# పి. వన్ పాట్టెన్‌కు ఎంగెల్స్ రాసిన ఉత్తరం

(కొంత భాగం)

లండన్, ఏప్రెల్ 18, 1883

రాజ్యం అనే రాజకీయ సంస్థయొక్క క్రమక్రమ విచ్ఛిత్తీ, అంతిమ అదృశ్యమూ భావి కార్మికవర్గ విప్లవపు అంతిమ ఫలితాలలో ఒకటి అనేది 1845 నాటినుండి మార్క్సుకూ నాకూ వున్న భావం. శ్రామిక మెజారిటీ ధనిక మైనారిటీకి ఆర్థికంగా లోబడివుండడాన్ని ఆయుధ బలంద్వారా సాధించడం యెల్లప్పుడూ యీ సంస్థయొక్క ప్రధాన లక్ష్యంగా వుండింది. ధనిక మైనారిటీ అదృశ్యం కావడంతో దమనశీల సాయుధ రాజ్య శక్తి అవసరం కూడా అదృశ్య మౌతుంది. అదే సమయంలో మాకు యెల్లప్పుడూ వున్న మరొక భావం యిది: యీ గమ్యాన్నీ, భావి సామాజిక విప్లవంయొక్క యింతకంటె యెంతో ముఖ్యమైన యితర గమ్యాలనూ చేరుకునేటందుకు కార్మికవర్గం మొదట రాజ్యంయొక్క వ్యవస్థీకృత రాజకీయ శక్తిని వశపరచుకొని, యీ సాధనంతో పెట్టుబడిదారీ వర్గపు ప్రతిఘటనను నిర్మూలించి, సమాజాన్ని పునర్వ్యవస్థీకరించాలి. యిది 1847 నాటి 'కమ్యూనిస్టు ప్రణాళిక'లోనే, రెండవ ప్రకరణం అంతంలో, చెప్పబడింది.

# ఓ. ఫన్ బోనిగ్‌కు ఎంగెల్స్ రాసిన ఉత్తరం

(కొంత భాగం)

డోవర్ దగ్గర ఫోల్క్‌స్టన్
అగస్టు 21, 1890

...మీ ప్రశ్నలకు టూకీగా, దరహంమీద మాత్రమే సమాధానం యివ్వగలను. లేకపోతే మొదటి ప్రశ్నకు పెద్ద వ్యాసం రాయవలసివుంటుంది.

మొదటిది. నా అభిప్రాయంలో, "సోషలిస్టు సమాజం" అనబడేది మార్పు లేనిదేమీ కాదు. యితర సామాజిక వ్యవస్థ లన్నిటిలాగే దానిని నిత్య ప్రవాహ స్థితిలో, నిత్యం మారే స్థితిలో ఊహించుకోవాలి. ప్రస్తుత వ్యవస్థకూ దానికీ మధ్య గల కీలకమైన భేదం యేమిటంటే, సహజంగానే, ఉత్పత్తి సాధనాలన్నీ జాతియొక్క సమష్టి స్వామ్యం కింద వుండే ప్రాతిపదికమీద వ్యవస్థీకరించబడిన ఉత్పత్తి. యీ పునర్వ్యవస్థీకరణను రేపు ప్రారంభించడమూ, కానీ క్రమక్రమంగా నిర్వహించడమూ నాకు చాలా ఆచరణ యోగ్యంగా కనిపిస్తున్నది. మన కార్మికులు అందుకు సమర్థులని వాళ్ల అనేక ఉత్పాదక, వినియోగదారుల సహకార సంఘాలు రుజువుచేసినాయి. అవి, పోలీసులచేత ఉద్దేశపూర్వకంగా ధ్వంసంచేయబడనప్పుడల్లా, బూర్జువా స్టాక్ కంపెనీల లాగే బాగానూ, అంతకంటె నిజాయితీగానూ నిర్వహించబడుతున్నాయి. సోషలిస్టు వ్యతిరేక శాసనంమీద*

---

*సోషలిస్టు వ్యతిరేక అసాధారణ శాసనం జర్మనీలో బిస్మార్క్ ప్రభుత్వంచేత 1878లో ప్రవేశపెట్టబడింది. యీ శాసనం సోషల్ డెమోక్రటిక్ పార్టీనీ, అన్ని సామూహిక కార్మిక సంస్థలనూ, కార్మిక పత్రికావళినీ నిషేధించింది. జర్మన్ సోషల్ డెమోక్రట్ల ఉత్తమ ప్రతినిధులు, అగస్ట్ బేబెల్, విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్‌ల నాయకత్వం కింద, భారీ స్థాయి రహస్య కృషి ప్రారంభించినారు; కార్మికులలో పార్టీ పలుకుబడి తగ్గకపోవడమే కాక, గణనీయంగా పెరిగింది. 1890 రైహ్‌స్టాగ్ యెన్నికలలో సోషల్ డెమోక్రట్లకు 15 లక్షల వోట్లు వచ్చినాయి. అదే సంవత్సరం ప్రభుత్వం సోషలిస్టు వ్యతిరేక శాసనాన్ని రద్దుచేయక తప్పలేదు. — సం.

జరిపిన తమ విజయవంతమైన పోరాటంలో కార్మికులు ప్రదర్శించిన రాజకీయ పరిణతియొక్క ఉజ్వలమైన సాక్ష్యం తర్వాత జర్మనీలోని జనాల అజ్ఞానం గురించి మీరెలా మాట్లాడగలరో నాకు అర్థం కావడం లేదు. మన మేధావి నామకుల ఆశీర్వాదపూర్వక, మార్గభ్రంశపు ఉపన్యాసాలు యెంతో యెక్కువ అడ్డంకిగా నాకు అనిపిస్తుంది. మన కింకా సాంకేతికులూ, వ్యవసాయ శాస్త్రజ్ఞులూ, యింజనీర్లూ, రసాయనికులూ, వాస్తు శిల్పులూ, వగైరా కావలసిన మాట నిజమే; కానీ దుస్థితులలో కెల్ల దుస్థితి సంభవిస్తే, వాళ్లను పెట్టుబడిదార్లు కొన్నట్లే మనమూ యెప్పుడైనా కొనగలం; వాళ్లలోని ద్రోహులలో — ద్రోహులు తప్పక వుంటారు — కొంతమందిని కఠినంగా శిక్షిస్తే, మనతో న్యాయంగా వ్యవహరించడం తమకే సౌకర్యమని వాళ్లు తెలుసుకుంటారు. యీ నిపుణులు కాక — వీళ్లలో ఉపాధ్యాయులను కూడా నేను చేరుస్తున్నాను — యితర ''మేధావులు'' లేకుండా మనం బాగా నిర్వహించగలం. ఉదాహరణకు, పార్టీలోకి ప్రస్తుతం విద్యావంతులూ, విద్యార్థులూ ప్రవేశిస్తూ వుండడం హానికరం కావచ్చు, యీ పెద్దమనుషులను సరిగా అదుపులో పెట్టకపోతే.

ఎల్బ్ నదికి తూర్పునవున్న యుంకర్* యెస్టేట్లను తగిన సాంకేతిక మేనేజిమెంటు కింద ప్రస్తుత దినకూలీలకూ, యితర పరివారానికీ సులభంగా కౌలు కివ్వవచ్చు; వాళ్లు ఆ యెస్టేట్లను సంయుక్తంగా సాగుచేస్తారు. అల్లర్లు యేవైనా జరిగితే, ప్రస్తుత పాఠశాల శాసనాల నన్నిటినీ ఉల్లంఘించడంద్వారా ప్రజలను పశువులనుగా చేసిన యుంకర్లే బాధ్యు లౌతారు.

అన్నిటికంటె పెద్ద అడ్డంకి సన్నకారు రైతులూ, యెడతెగని విజ్ఞప్తులు చేసే అతితెలివి మేధావులూ; యీ మేధావులు తమకు యెంత తక్కువ అర్థమైతే అంత యెక్కువగా ప్రతిదీ తెలుసునని అనుకుంటారు.

జనాలలో మనకు తగినంతమంది అనుచరులు వుంటే, పెద్ద పరిశ్రమలనూ, భారీ స్థాయి యెస్టేట్ల వ్యవసాయాన్నీ వేగంగా సామాజికీకరించవచ్చు — రాజకీయ అధికారం మన వశంలో వున్న పక్షంలో. తక్కినవి త్వరలో వస్తాయి, కాస్త ముందో, వెనకో. భారీ స్థాయి ఉత్పత్తిలో అంతా మన యిష్ట ప్రకారమే వుంటుంది.

అందరికీ సమానంగా యింగిత జ్ఞానం లేదని మీరు అంటున్నారు. నిజమే — కానీ ప్రభువర్గంనుండి ఉద్భవించిన మేధావుల విషయంలోనూ, కార్మికులవద్ద తామింకా యెంత నేర్చుకోవలసి వున్నదీ అనుమానించని బూర్జువాల విషయంలోనూ యిది నిజం....

---

* యుంకర్ — పెద్ద భూస్వామి. — సం.

# వి. ఐ. లెనిన్

# మార్క్సిజంయొక్క మూడు మూలాలూ, మూడు భాగాలూ

నాగరిక ప్రపంచ మంతటా మార్క్సు బోధలు సమస్త బూర్జువా శాస్త్రవిజ్ఞానంయొక్క (అధికారిక శాస్త్రవిజ్ఞానందీ, ఉదారవాద శాస్త్రవిజ్ఞానందీ) బద్ధ శత్రుత్వాన్నీ, ద్వేషాన్నీ కలిగిస్తున్నాయి; యీ శాస్త్రవిజ్ఞానం మార్క్సిజంను ఒక విధమైన ''హానికరమైన మతం''గా పరిగణిస్తుంది. మరే వైఖరినీ మనం ఆశించలేము; యెందుకంటే, వర్గపోరాటంమీద ఆధారపడిన సమాజంలో ''నిష్పాక్షిక'' సామాజిక శాస్త్రం అనేది వుండజాలదు. యేదో ఒక రూపంలో, అధికారిక, ఉదారవాద శాస్త్రవిజ్ఞానం అంతా కూలి బానిసత్వాన్ని సమర్థిస్తుంది; కాగా మార్క్సిజం ఆ బానిసత్వంమీద సడలుబాటు లేని యుద్ధం ప్రకటించింది. కూలి బానిస సమాజంలో శాస్త్రవిజ్ఞానం నిష్పాక్షికంగా వుంటుందని ఆశించడం యెంత మతిహీనపు అమాయకత్వ మంటే, పెట్టుబడియొక్క లాభాలు తగ్గించడంద్వారా కార్మికుల వేతనాలు పెంచకూడదా అనే సమస్యమీద ఉత్పత్తిదార్లనుండి నిష్పాక్షికతను ఆశించినంత.

కానీ, అంతే కాదు. కరుడు గట్టిన, కొయ్యబారిన సిద్ధాంతం, ప్రపంచ నాగరికతాభివృద్ధియొక్క రాజమార్గానికి దూరంగా ఉద్భవించిన సిద్ధాంతం, అనే అర్థంలో ''ఒంటెత్తువాదాన్ని'' పోలినది మార్క్సిజంలో యేమీ లేదని తత్వశాస్త్ర చరిత్రా, సామాజిక శాస్త్ర చరిత్రా పరమ స్పష్టంగా నిరూపిస్తాయి. పైగా, మానవజాతిలోని అగ్రగామి మేధావులు యే ప్రశ్నలు యిప్పటికే వేసినారో ఆ ప్రశ్నలకు జవాబులు యివ్వడంలోనే సరిగ్గా మార్క్సు మహామేధ వుంది. ఆయన సిద్ధాంతం తత్వశాస్త్ర, అర్థశాస్త్ర, సోషలిజంల అత్యున్నత ప్రతినిధుల బోధల ప్రత్యక్ష, తక్షణ కొనసాగింపుగా ఉద్భవించింది.

మార్క్సిస్టు సిద్ధాంతం సర్వశక్తివంతమైనది; యెందుకంటే అది సత్యమైనది. అది సర్వగ్రాసి అయినది, సుసమన్వితమైనది; మూఢ విశ్వాసమూ, ప్రగతి వ్యతిరేకతా,

బూర్జువా పీడనకు సమర్థనా యే రూపంలో వున్నా వాటితో రాజీ లేని అఖండ ప్రపంచ దృక్పథాన్ని అది మనుషులకు యిస్తుంది. పందొమ్మిదవ శతాబ్దిలో మానవుడు సృష్టించినదానిలో అత్యుత్తమమైనదానికి — జర్మన్ తత్వశాస్త్రమూ, ఇంగ్లీషు అర్థశాస్త్రమూ, ఫ్రెంచి సోషలిజమూ ప్రాతినిధ్యం వహించినదానికి — అది న్యాయమైన వారసుడు.

మార్క్సిజంయొక్క యీ మూడు మూలాలనే, దాని భాగాలు కూడా అయిన వాటినే, నేను సంక్షేపంగా చిత్రించబోయేది.

I

మార్క్సిస్టు తత్వశాస్త్రం భౌతికవాదం. యూరప్‌యొక్క ఆధునిక చరిత్ర అంతటా, ముఖ్యంగా మధ్యయుగ చెత్తకూ, సంస్థలలోనూ, భావాలలోనూ బానిసత్వానికీ వ్యతిరేకంగా కృతనిశ్చయమైన పోరాటం జరిగిన ఫ్రాన్సులో పద్దెనిమిదవ శతాబ్ది అంతంలో, భౌతికవాదం ఒక్కటే స్థిరమైనదీ, ప్రకృతిశాస్త్ర బోధలకన్నిటికీ విధేయమైనదీ, మూఢవిశ్వాసాలకూ, పడికట్టు మాటలకూ, వగైరాలకు వ్యతిరేకమైనదీ అయిన తత్వశాస్త్రంగా రుజువైంది. అందువలన ప్రజాస్వామ్య శత్రువులు భౌతికవాదాన్ని ''పూర్వపక్షం'' చేయడానికీ, బలహీన పరచడానికీ, పరువుతీయడానికీ యెల్లప్పుడూ సకల ప్రయత్నాలూ చేసి, వివిధ తాత్విక భావవాద రూపాలను ప్రతిపాదించినారు; యిది సర్వదా యేదో ఒక రూపంలో మతాన్ని సమర్థించడమో, బలపరచడమో అవుతుంది.

మార్క్సు, ఎంగెల్సు అత్యంత కృతనిశ్చయమైన పద్ధతిలో తాత్విక భౌతికవాదాన్ని సమర్థించి, యీ ప్రాతిపదికనుండి వైదొలగిన ప్రతిదీ యెంత సంపూర్ణమైన తప్పు అయిందీ పదేపదే వివరించినారు. వాళ్ల అభిప్రాయాలు ఎంగెల్సు రచనలు 'లుడ్విగ్ ఫోయెర్‌బాఖ్'లోనూ, 'ఆంటీ-డ్యూరింగ్'లోనూ అత్యంత స్పష్టంగా, సంపూర్ణంగా వివరించబడినాయి; యీ రచనలు 'కమ్యూనిస్టు ప్రణాళిక'లాగ ప్రతి వర్గచైతన్యపూరిత కార్మికునికీ పాఠ్యగ్రంథాలు.

కానీ మార్క్సు పద్దెనిమిదవ శతాబ్దపు భౌతికవాదంవద్ద ఆగలేదు: ఆయన తత్వశాస్త్రాన్ని మరింత ఉన్నత స్థాయికి అభివృద్ధి చేసినాడు. ఆయన దానిని జర్మన్ సాంప్రదాయిక తత్వశాస్త్ర విజయాలతో, ముఖ్యంగా హెగెల్ * తాత్విక వ్యవస్థ విజయాలతో,

---

* హేగెల్, గియోర్గ్ విల్‌హెల్మ్ ఫ్రీడ్రిఖ్ (1770–1831) — జర్మన్ తత్వవేత్త, వస్తుగత భావవాది, పరస్పరవాదాన్ని — అభివృద్ధి సిద్ధాంతాన్ని — సమగ్రంగా, సర్వతోముఖంగా విపులీకరించినవాడు. — సం.

సంపన్నం చేసినాడు; హేగెల్ వ్యవస్థ మళ్లీ ఫోయెర్‌బాఖ్ * భౌతికవాదానికి దారితీసింది. ఆ విజయాలలో ప్రధానమైనది పరస్పరవాదం (dialectics), అనగా అత్యంత పరిపూర్ణ, గంభీర, సర్వగ్రాసి అభివృద్ధి సిద్ధాంతం, నిత్యం అభివృద్ధి అవుతున్న పదార్థంయొక్క ప్రతిబింబాన్ని మనకు అందించే మానవ జ్ఞానంయొక్క సాపేక్షతకు సంబంధించిన సిద్ధాంతం. ప్రకృతిశాస్త్రపు తాజా ఆవిష్కరణలు — రేడియం, ఎలెక్ట్రాన్లు, మూల కాల రూపాంతరీకరణ — మార్క్స్ పరస్పరాత్మక భౌతికవాదానికి గమనార్హమైన ధ్రువీకరణగా వున్నాయి — పాత, క్షీణమాన భావవాదానికి "కొత్త" తిరోగమనాలు చేసే బూర్జువా తత్వవేత్తలు తద్వ్యతిరేకమైన బోధలు చేస్తున్నప్పటికీ.

మార్క్స్ తాత్విక భౌతికవాదాన్ని సమగ్రంగా గంభీరపరిచి, అభివృద్ధి చేసి, మానవ సమాజ జ్ఞానాన్ని కూడా యిముడ్చుకునేటట్లు ప్రకృతి జ్ఞానాన్ని విస్తృతపరచినాడు. ఆయన చారిత్రక భౌతికవాదం శాస్త్రీయ ఆలోచనలో గొప్ప విజయం. చరిత్రను గురించీ, రాజకీయాలను గురించీ వున్న అభిప్రాయాలలో అంతకుముందు రాజ్యం చేసిన అల్లకల్లోలమూ, నియమ రాహిత్యమూ కన్నులకు కట్టినంత అఖండమూ, సుసమన్వితమూ అయిన శాస్త్రీయ సిద్ధాంతంచేత తొలగింపబడినాయి; ఉత్పాదక శక్తుల పెరుగుదల ఫలితంగా, ఒక సమాజ జీవిత వ్యవస్థనుండి అంతకంటె ఉన్నతమైన వ్యవస్థ యెలా అభివృద్ధి అయ్యేదీ — ఉదాహరణకు ఫ్యూడలిజంనుండి పెట్టుబడిదారీ వ్యవస్థ యెలా పెరిగేదీ — యీ సిద్ధాంతం చూపించింది.

మానవుని జ్ఞానం, అతనిమీద ఆధారపడకుండా వున్న ప్రకృతిని (అనగా అభివృద్ధి చెందే పదార్థాన్ని) యెలా ప్రతిబింబిస్తుందో, అలాగే మానవుని సామాజిక జ్ఞానం (అనగా అతని వివిధ అభిప్రాయాలూ, సిద్ధాంతాలూ — తాత్విక, మత, రాజకీయ, వగైరా) సమాజంయొక్క ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తుంది. రాజకీయ సంస్థలు ఆర్థిక పునాదిమీద వున్న ఉపరి నిర్మాణం. ఉదాహరణకు, ఆధునిక యూరపియన్ రాజ్యాల వివిధ రాజకీయ రూపాలు కార్మికవర్గంమీద బూర్జువావర్గపు పెత్తనాన్ని బలపరచడానికి ఉపయోగపడతాయని మనం చూస్తున్నాము.

మార్క్స్ తత్వశాస్త్రం మానవజాతికి, ముఖ్యంగా కార్మికవర్గానికి, శక్తివంతమైన జ్ఞాన సాధనాలు సమకూర్చిన పరిపూర్ణ తాత్విక భౌతికవాదం.

---

* ఫోయెర్‌బాఖ్, లుడ్విగ్ (1804–1872) — జర్మన్ తత్వవేత్త, భౌతికవాది, నాస్తికుడు, భౌతికవాద స్థావరాలనుండి హేగెల్ సిద్ధాంతాన్ని విమర్శించినాడు. — సం.

## II

ఆర్థిక వ్యవస్థను పునాదిగానూ, రాజకీయ వ్యవస్థను దానిమీద నిర్మింపబడిన ఉపరి నిర్మాణంగానూ గుర్తించి మార్క్స్ యీ ఆర్థిక వ్యవస్థను అధ్యయనం చేయడానికి అత్యున్నత శ్రద్ధ అర్పించినాడు. మార్క్స్ ప్రధాన రచన అయిన 'పెట్టుబడి' ఆధునిక, అనగా పెట్టుబడిదారీ, సమాజపు ఆర్థిక వ్యవస్థ అధ్యయనానికి అంకితమైంది.

మార్క్స్‌కు ముందు, సాంప్రదాయిక అర్థశాస్త్రం పెట్టుబడిదారీ దేశాలలో కెల్లా అభివృద్ధి చెందిన దేశమైన ఇంగ్లండులో వికసించింది. ఆడమ్ స్మిత్*, డేవిడ్ రికార్డో **, ఆర్థిక వ్యవస్థమీద తాము చేసిన పరిశోధనలద్వారా, విలువయొక్క శ్రమ సిద్ధాంతానికి పునాదులు వేసినారు. మార్క్స్ వాళ్ల కృషిని కొనసాగించినాడు. ఆయన ఆ సిద్ధాంతానికి రుజువును సమకూర్చి, దానిని సార్వత్రికంగా అభివృద్ధి చేసినాడు. ప్రతి సరుకుయొక్క విలువా దాని ఉత్పత్తికి ఖర్చుపెట్టబడిన, సాంఘికంగా అవసరమైన శ్రమ కాలపు పరిమాణంచేత నిర్ణయింపబడుతుందని ఆయన నిరూపించినాడు.

బూర్జువా ఆర్థికవేత్తలు వస్తువుల మధ్య సంబంధాన్ని (ఒక సరుకుకు మరొక సరుకు మారకం) చూసిన చోట మార్క్స్ మనుషుల మధ్య సంబంధాన్ని వెల్లడించినాడు. సరుకుల మారకం విడివిడి ఉత్పత్తిదార్ల మధ్య సంబంధాన్ని మార్కెట్‌ద్వారా వ్యక్తం చేస్తుంది. యీ సంబంధం అంతకంతకూ సన్నిహితవౌతూ, విడివిడి ఉత్పత్తిదార్ల ఆర్థిక జీవిత మంతటినీ విడదీయరాకుండా ఒక సమస్తంగా యేకంచేస్తున్నదని డబ్బు సంకేతిస్తుంది. పెట్టుబడి యీ సంబంధంయొక్క యితోధిక అభివృద్ధిని సంకేతిస్తుంది: మనిషి శ్రమశక్తి సరుకు అవుతుంది. కూలి కార్మికుడు తన శ్రమశక్తిని భూమీ, ఫాక్టరీలూ, శ్రమ పరికరాలూ గల యజమానికి అమ్ముతాడు. కార్మికుడు తననూ, తన కుటుంబాన్నీ భరించడానికి అయ్యే ఖర్చుకు (కూలికి) గాను దినంలో కొంత భాగాన్ని వినియోగిస్తాడు; దినంలో తక్కిన భాగాన్ని అతను ప్రతిఫలం లేకుండా పనిచేస్తాడు, పెట్టుబడిదారుని కొరకు అదనపు విలువను, లాభంయొక్క మూలాన్ని, పెట్టుబడిదారీ వర్గ సంపదయొక్క మూలాన్ని, సృష్టిస్తూ.

అదనపు విలువ సిద్ధాంతం మార్క్స్ ఆర్థిక సిద్ధాంతానికి పునాదిరాయి.

---

* స్మిత్, ఆడమ్ (1723–1790) – బ్రిటిష్ అర్థశాస్త్రజ్ఞుడు, సాంప్రదాయిక అర్థశాస్త్రానికి అందరికంటె గొప్ప ప్రతినిధి. – సం.

** రికార్డో, డేవిడ్ (1772–1823) – బ్రిటిష్ అర్థశాస్త్రజ్ఞుడు, స్మిత్‌యొక్క శ్రమ విలువ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసినవాడు. – సం.

కార్మికుని శ్రమచేత సృష్టింపబడిన పెట్టుబడి కార్మికుని నలిపివేస్తుంది, చిన్న యజమానులను నాశనం చేస్తుంది, నిరుద్యోగుల సమూహాన్ని సృష్టిస్తుంది. పరిశ్రమలలో భారీ స్థాయి ఉత్పత్తియొక్క విజయం స్పష్టంగా కనపడుతుంది; కానీ వ్యవసాయంలో కూడా యీ స్థితి గమనించవచ్చు. వ్యవసాయంలో యంత్రాల వాడకం పెరిగే కొద్దీ, రైతు ఆర్థిక వ్యవస్థ డబ్బు పెట్టుబడి బోనులో చిక్కుకొని, వెనుకబడిన సంవిధానపు భారంచేత క్షీణించి నాశనమయ్యే కొద్దీ, భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవసాయంయొక్క ఆధిక్యం యెక్కువౌతుంది. సన్నకారు ఉత్పత్తి క్షీణత వ్యవసాయంలో భిన్న రూపాలు ధరిస్తుంది, క్షీణత మాత్రం నిర్వివాదమైనది.

సన్నకారు ఉత్పత్తిని ధ్వంసం చేయడంద్వారా పెట్టుబడి శ్రమ ఉత్పాదకత పెరుగుదలకూ, పెట్టుబడిదార్ల సంఘాలకు గుత్త స్థావరం సృష్టికావడానికీ దారితీస్తుంది. ఉత్పత్తి అనేదే అంతకంతకూ సామాజికం అవుతుంది — లక్షల, దశలక్షల కార్మికులు క్రమబద్ధమైన ఆర్థిక వ్యవస్థలో ఒకటిగా అనుబంధింపబడతారు — కానీ యీ సమష్టి శ్రమయొక్క ఉత్పత్తిని కొద్దిమంది పెట్టుబడిదార్లు సొంతపరుచుకుంటారు. ఉత్పత్తిలో అరాజకత్వమూ, సంక్షోభాలూ, మార్కెట్ల కొరకు తీవ్రమైన వేటా, ప్రజానీకంలో అత్యధిక భాగంయొక్క జీవిత భద్రతా రాహిత్యమూ తీవ్రతర వౌతాయి.

పెట్టుబడిమీద కార్మికులు ఆధారపడడాన్ని పెంచడంద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ సమైక్య శ్రమయొక్క మహా శక్తిని సృష్టిస్తుంది.

మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిని పిండ రూపంలోని సరుకు ఆర్థిక వ్యవస్థనుండి, సరళమైన మారకంనుండి, దాని అత్యున్నత రూపాలదాకా, భారీ స్థాయి ఉత్పత్తిదాకా గమనించినాడు.

పాత, కొత్త, సకల పెట్టుబడిదారీ దేశాల అనుభవం యేటేటా యీ మార్క్సిస్టు సిద్ధాంత సత్యాన్ని అంతకంతకూ యెక్కువమంది కార్మికులకు ప్రదర్శిస్తున్నది.

పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచమంతటా జయించింది; కానీ యీ విజయం పెట్టుబడిమీద శ్రమయొక్క విజయానికి నాంది మాత్రమే.

## III

ఫ్యూడలిజం కూలదోయబడి, "స్వేచ్ఛా" పెట్టుబడిదారీ సమాజం ప్రపంచంలో అవతరించినప్పుడు, యీ స్వేచ్ఛకు అర్థం శ్రామిక ప్రజలమీద జరిగే పీడన, దోపిడీల కొత్త వ్యవస్థ అని వెంటనే వెల్లడైంది. యీ పీడనకు ప్రతిబింబంగా, నిరసనగా వివిధ సోషలిస్టు సిద్ధాంతాలు వెంటనే ఆవిర్భవించినాయి. కానీ, తొలి కాలపు సోషలిజం

ఊహాస్వర్గ సోషలిజంగా వుండింది. అది పెట్టుబడిదారీ సమాజాన్ని విమర్శించింది, అభిశంసించింది, శపించింది, దాని వినాశం గురించి కలలు గనింది, మేలైన వ్యవస్థను గురించి ఊహాస్వప్నాలు చూసింది, దోపిడీ అవినీతి అని ధనికులను ఒప్పించడానికి ప్రయత్నించింది.

కానీ ఊహాస్వర్గ సోషలిజం నిజమైన పరిష్కారాన్ని సూచించలేకపోయింది. అది పెట్టుబడిదారీ వ్యవస్థలో కూలి బానిసత్వంయొక్క నిజమైన స్వభావాన్ని వివరించలేకపోయింది, పెట్టుబడిదారీ అభివృద్ధి నియమాలను వెల్లడించలేకపోయింది, నూతన సమాజ సృష్టికర్త అయ్యే సామర్థ్యం యే సామాజిక శక్తికి వున్నదీ చూపించలేకపోయింది.

యీలోగా, యూరప్ అంతటా, ముఖ్యంగా ఫ్రాన్సులో, ఫ్యూడలిజంయొక్క, ఫ్యూడల్ దాస్యంయొక్క, పతనంవెంట జరిగిన కల్లోలిత విప్లవాలు అంతకంతకూ స్పష్టంగా వర్గాల పోరాటాన్ని సమస్త అభివృద్ధియొక్క ప్రాతిపదికగా, చోదక శక్తిగా వెల్లడించినాయి.

ఫ్యూడల్ వర్గంమీద రాజకీయ స్వేచ్ఛయొక్క యే ఒక్క విజయమూ భీషణ ప్రతిఘటన లేకుండా సాధింపబడలేదు. పెట్టుబడిదారీ సమాజంలోని వివిధ వర్గాల మధ్య చావు బ్రతుకుల పోరాటం లేకుండా యే ఒక్క పెట్టుబడిదారీ దేశమూ అంతో యింతో స్వేచ్ఛాయుతమైన, ప్రజాస్వామికమైన ప్రాతిపదికమీద అభివృద్ధి కాలేదు.

ప్రపంచ చరిత్ర నేర్పే గుణపాఠాన్ని దీనినుండి లాగి, ఆ గుణపాఠాన్ని మినహాయింపులు లేకుండా వర్తింపజేసిన మొదటివాడుగా వుండడంలో వుంది మార్క్స్ మహామేధ. ఆ గుణపాఠమే వర్గపోరాట సిద్ధాంతం.

రాజకీయాలలో మనుషులు యెల్లప్పుడూ వంచనకూ, ఆత్మవంచనకూ తెలివితక్కువగా గురి అయినారు; నైతిక, మత, రాజకీయ, సాంఘిక నుడికారాల, ప్రకటనల, వాగ్దానాల వెనుక యేదో ఒక వర్గంయొక్క ప్రయోజనాలను వెదకడం వాళ్ళు నేర్చుకున్న దాకా యెల్లప్పుడూ అలా గురి అవుతుంటారు. సంస్కరణల కొరకూ, మెరుగుదలల కొరకూ పోరాడేవాళ్ళు పాత వ్యవస్థ సంరక్షకులచేత యెల్లప్పుడూ మోసగింపబడతారు, ప్రతి పాత సంస్థా యెంత కిరాతకంగా, కుళ్ళిపోయినదిగా కనిపించినా, కొన్ని పాలకవర్గాల శక్తులచేత అది నడిపించబడుతూవుందని వాళ్ళు గుర్తించేదాకా. ఆ వర్గాల ప్రతిఘటనను బ్రద్దలుచేసే మార్గం ఒకటి మాత్రమే వుంది; అదేమిటంటే, పాతను వూడ్చి పారవేసి, కొత్తను సృష్టించే శక్తి కాగల — తమ సామాజిక స్థానం మూలంగా కాక తప్పని — బలాలను మన చుట్టూ వున్న సమాజంలోనే గుర్తించి, వాటిని ప్రబుద్ధంచేసి, పోరాటానికి సంఘటితం చేయడం.

యింతవరకు పీడిత వర్గాలన్నీ యే ఆత్మిక బానిసత్వంలో మగ్గినాయో దానినుండి కార్మికవర్గం బయటపడే మార్గాన్ని మార్క్స్ తాత్విక భౌతికవాదం మాత్రమే

చూపించింది. పెట్టుబడిదారీ సాధారణ వ్యవస్థలో కార్మికవర్గంయొక్క నిజమైన స్థానాన్ని మార్క్సు ఆర్థిక సిద్ధాంతం మాత్రమే వివరించింది.

స్వతంత్ర కార్మికవర్గ సంస్థలు ప్రపంచమంతటా, అమెరికానుండి జపాన్‌దాకా, స్వీడెన్‌నుండి దక్షిణాఫ్రికాదాకా, వృద్ధి అవుతున్నాయి. కార్మికవర్గం తన వర్గపోరాటం చేయడంద్వారా విద్యా విజ్ఞానాలు పొందుతున్నది; అది బూర్జువా సమాజపు దురభిప్రాయాలను తొలగించుకుంటున్నది; అది తన శ్రేణులను మరింత చిక్కగా సమీకరిస్తూ, తన విజయాల ఫలితాన్ని కొలవడం నేర్చుకుంటున్నది; అది తన బలాలను కాకలు దీరుస్తూ, దుర్నిరోధంగా పెరుగుతున్నది.

'ప్రాస్వెశ్చేనియె' నం. 3, మార్చి 1913
సంతకం: వి. ఐ.

# కార్ల్ మార్క్స్

(కొంత భాగం)

...పెట్టుబడిదారీ సమాజం సోషలిస్టు సమాజంగా రూపాంతరం చెందడంయొక్క అనివార్యతను మార్క్స్ పూర్తిగా, నిశ్శేషంగా సమకాలిక సమాజపు అభివృద్ధికి చెందిన ఆర్థిక నియమంనుండి లాగుతాడనేది తేటతెల్లం. శ్రమయొక్క సామాజికీకరణ — వేల రూపాలలో అంతకంతకూ వేగంగా పురోగమిస్తున్నట్టిదీ, మార్క్స్ మరణించి నప్పటినుండి గడచిన అర్ధ శతాబ్ది కాలంలో భారీ స్థాయి ఉత్పత్తియొక్క, పెట్టుబడిదారీ కార్టెల్లు, సిండికేట్లు, ట్రస్టులయొక్క పెరుగుదలలోనూ, ఫైనాన్స్ పెట్టుబడియొక్క ప్రమాణాలూ, శక్తీ బ్రహ్మాండంగా పెరగడంలోనూ కన్నులకు కట్టినట్లు వ్యక్తమైనట్టిదీ — సోషలిజంయొక్క అనివార్య ఆగమనానికి ప్రధాన పాదార్థిక పునాదిని సమకూరుస్తుంది. యీ రూపాంతరీకరణయొక్క బౌద్ధిక, నైతిక చోదక శక్తీ, భౌతిక నిర్వాహకుడూ కార్మికవర్గం, పెట్టుబడిదారీ వ్యవస్థచేతనే తర్ఫీదు పొందినట్టిది. బూర్జువావర్గంమీద కార్మికవర్గపు పోరాటం — సారంలో అంతకంతకూ సంపన్నమయ్యే వివిధ రూపాలలో వ్యక్తీకరణ పొందేటట్టిది — కార్మికవర్గం రాజకీయ అధికారం గెలుచుకోడానికి (''కార్మికవర్గ నియంతృత్వం'') జరిగే రాజకీయ పోరాటం అనివార్యంగా అవుతుంది. ఉత్పత్తి సామాజికీకరణ విధిగా ఉత్పత్తి సాధనాలు సమాజ ఆస్తి కావడానికీ, ''ఆస్తి హర్తల ఆస్తి హరణా''నికీ దారితీస్తుంది. శ్రమ ఉత్పాదకతలో ప్రచండమైన పెరుగుదలా, పని దినం తగ్గుదలా, సన్నకారు, ఆదిమ, అనైక్య ఉత్పత్తియొక్క అవశేషాల, శిథిలాల స్థానంలో మెరుగుపరచబడిన, సమష్టి శ్రమ రావడమూ — యివి యీ రూపాంతరీకరణయొక్క ప్రత్యక్ష పర్యవసానాలు. పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యవసాయానికీ, పరిశ్రమలకూ మధ్య గల సంబంధాలను శాశ్వతంగా తెంచుతుంది, కానీ అదే సమయంలో, తన అత్యున్నత అభివృద్ధిద్వారా అది వాటి సంబంధాలకు కొత్త అంశాలను తయారుచేస్తుంది — శాస్త్రవిజ్ఞానాన్ని చైతన్యవంతంగా ప్రయోగించడంమీదా,

సమష్టి శ్రమ సాంద్రీకరణమీదా, మానవ జనాభాను పునఃవంపకం చేయడంమీద (తద్వారా గ్రామీణ వెనుకబాటుతనాన్నీ, యేకాకితనాన్నీ, ఆటవికత్వాన్నీ, పెద్ద నగరాలలో విస్తారమైన జనాల అసహజ సాంద్రీకరణనూ అంతమొందించడంమీదా) ఆధారపడిన సంయోగాన్ని పరిశ్రమలకూ, వ్యవసాయానికీ మధ్య యేర్పరచడానికి కావలసిన కొత్త అంశాలను తయారుచేస్తుంది. యీనాటి పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అత్యున్నత రూపాలచేత కొత్తరూపపు కుటుంబమూ, స్త్రీల ప్రతిపత్తిలోనూ, పిల్లల పెంపకంలోనూ కొత్త పరిస్థితులూ తయారుచేయబడతాయి. స్త్రీల, పిల్లల శ్రమా, పెట్టుబడిదారీ వ్యవస్థ పితృస్వామిక కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడమూ అనివార్యంగా ఆధునిక సమాజంలో భయంకరమైన, వినాశనకరమైన, అసహ్యమైన రూపాలు ధరిస్తాయి. అయినప్పటికీ, "ఆధునిక పరిశ్రమలు గృహ రంగానికి వెలుపల, సామాజికంగా వ్యవస్థీకృతమైన ఉత్పత్తి ప్రక్రియలో, స్త్రీలకూ, యువజనులకూ, బాలబాలికలకూ ముఖ్యమైన పాత్ర యిస్తూవుండడంద్వారా కుటుంబంయొక్కా, స్త్రీ పురుష సంబంధాలయొక్కా మరింత ఉన్నత రూపానికి నూతన ఆర్థిక పునాదిని సృష్టిస్తాయి. కుటుంబంయొక్క ట్యుటానిక్ క్రైస్తవ రూపాన్ని పరమమైనదిగా, అంతిమమైనదిగా భావించడం, సహజంగానే, ప్రాచీన రోమన్ రూపానికి గానీ, ప్రాచీన గ్రీకు రూపానికి గానీ, తూర్పు దేశాల రూపానికి గానీ ఆ స్వభావం యివ్వడంలాగే అసంబద్ధం. అన్నట్లు, యీ రూపా లన్నిటినీ కలిపి చూస్తే, యివి చారిత్రక అభివృద్ధిలో ఒక వరుస క్రమం అవుతాయి. అంతే కాక, సామూహికంగా పనిచేసే బృందంలో ఉభయ లింగాలకూ, అన్ని వయసులకూ చెందిన వ్యక్తులు వుండడం అనేది, తగిన పరిస్థితులలో, అవశ్యంగా మానవీయమైన అభివృద్ధికి కారణవౌతుందనేది తేటతెల్లం — సద్యోజనితంగా అభివృద్ధి చెందిన, పాశవికమైన పెట్టుబడిదారీ రూపంలో, ఉత్పత్తి క్రమం శ్రామికుని కొరకు కాక శ్రామికుడు ఉత్పత్తి క్రమం కొరకు జీవించే పెట్టుబడిదారీ రూపంలో, ఆ విషయం నైతిక కాలుష్యానికీ, బానిసత్వానికీ మహమ్మారి లాంటి కారణంగా వున్నప్పటికీ" ('పెట్టుబడి,' సంపుటి 1, ప్రకరణం 13 చివర). "భావి విద్యా విధానంయొక్క బీజం — ఒక వయసుకు పైన వున్న ప్రతి శిశువు విషయంలోనూ, సామాజిక ఉత్పత్తియొక్క సామర్థ్యాన్ని పెంచే పద్ధతులలో ఒకటిగా మాత్రమే కాక, పూర్తిగా అభివృద్ధి చెందిన మానవులను తయారుచేసే యేకైక పద్ధతిగా, ఉత్పాదక శ్రమను బోధనతోనూ, వ్యాయామంతోనూ మేళవించే విద్యా విధానంయొక్క బీజం" ఫాక్టరీ వ్యవస్థలో వుంది (అదే చోట). మార్క్స్ సోషలిజం జాతి సమస్యలనూ, రాజ్య సమస్యలనూ ఒకే చారిత్రక స్థాయిలో వుంచుతుంది — గతాన్ని వివరించడం అనే అర్థంలో మాత్రమే కాక, భవిష్యత్తును సాహసంగా జోస్యం చెప్పడమూ, దానిని సాధించడానికి సాహసపూరితమైన ఆచరణాత్మక చర్యా అనే అర్థంలో

కూడా. జాతులు అనేవి సామాజిక అభివృద్ధియొక్క బూర్జువా యుగంలో అనివార్యమైన ఫలితం, అనివార్యమైన రూపం. కార్మికవర్గం "జాతి అంటే తానే అనే స్థితికి" రాకుండా, "జాతీయం"కాకుండా ("ఆ మాటకు బూర్జువాలు చెప్పే అర్థంలో కాక పోయినప్పటికీ"), బలపడగలిగేది కాదు, పరిణతం కాగలిగేది కాదు, రూపు దాల్చగలిగేది కాదు. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అభివృద్ధి అంతకంతకూ యెక్కువగా జాతీయ అడ్డంకులను కూలదోస్తుంది, జాతీయ యేకాంతాన్ని అంతమొందిస్తుంది, జాతీయ వైరుధ్యాల స్థానంలో వర్గ వైరుధ్యాలను వుంచుతుంది. కనుక, "కార్మికులకు దేశం అనేది లేదు" అనేదీ, కార్మికులు, కనీసం నాగరిక దేశాల కార్మికులు, "సమైక్యంగా కృషి చేయడం" "కార్మికవర్గ విమోచనకు గల ఒక ముఖ్య షరతు" అనేదీ ('కమ్యూనిస్టు ప్రణాళిక') అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల విషయంలో పరమ సత్యం. సమాజ అభివృద్ధిలోని ఒక నిర్ణీత దశలో, సమాజం రాజీపడజాలని వర్గాలుగా చీలినప్పుడు, సమాజానికి అతీతంగా వున్నట్లు కనపడుతూ, కొంతమేరకు సమాజానికి విడిగా వుండే ఒక "అధికారం" లేకుండా సమాజం మనలేనప్పుడు, వ్యవస్థీకృతమైన నిర్బంధం అయిన రాజ్యం అనివార్యంగా ఆవిర్భవించింది. వర్గ వైరుధ్యాలనుండి ఉద్భవిస్తూ, రాజ్యం "...అత్యంత శక్తివంతమైన, ఆర్థికంగా ప్రబలమైన వర్గంయొక్క రాజ్యంగా వుంటుంది. యీ వర్గం రాజ్యంద్వారా రాజకీయంగా ప్రబలమైన వర్గం కూడా అయి, తద్వారా పీడిత వర్గాన్ని అణచివుంచడానికీ, దోపిడీచేయడానికీ కొత్త సాధనాలు సంపాయించుకుంటుంది. ఆవిధంగా, ప్రాచీనకాలపు రాజ్యం అన్నిటినీ మించి బానిసలను అణచివుంచడానికి బానిస యజమానుల రాజ్యంగా వుండింది; అలాగే ఫ్యూడల్ రాజ్యం రైతు దాసులనూ, ఫ్యూడల్ బానిసలనూ అణచివుంచడానికి ప్రభువర్గపు అంగంగా వుండింది, ఆధునిక ప్రాతినిధ్యపు రాజ్యం కూలి కార్మికులను పెట్టుబడి దోపిడీ చేయడానికి పరికరం!" (ఎంగెల్స్, 'కుటుంబమూ, సొంత ఆస్తీ, రాజ్యమూ అనేవాటి పుట్టుక,' రచయిత తన అభిప్రాయాలనూ, మార్క్స్ అభిప్రాయాలనూ వెల్లడించే రచన). బూర్జువా రాజ్యపు అత్యంత స్వేచ్ఛాయుత, అత్యంత ప్రగతిశీల రూపమైన ప్రజాతంత్ర రిపబ్లిక్ కూడా యీ విషయాన్ని యే విధంగానూ తొలగించదు, కేవలం దాని రూపాన్ని మారుస్తుంది (ప్రభుత్వానికీ, స్టాక్ యెక్స్‌చేంజికీ మధ్యన వున్న లంకెలనూ, ఉద్యోగులయొక్క, పత్రికలయొక్క లంచగొండితనాన్నీ — ప్రత్యక్షమైనదాన్నీ, పరోక్షమైనదాన్నీ — వగైరాలను). వర్గాల రద్దుకు దారితీయడంద్వారా సోషలిజం తత్కారణంగా రాజ్యంయొక్క రద్దుకు కూడా దారితీస్తుంది. 'ఆంటీ డ్యూరింగ్'లో ఎంగెల్సు యిలా రాస్తాడు: "రాజ్యం మొత్తం సమాజంయొక్క ప్రతినిధిగా యే మొదటి చర్యద్వారా ముందుకు వస్తుందో అది — సమాజం తరపున ఉత్పత్తి సాధనాలను సొంతపరచుకోవడం — అదే రాజ్యంగా

దాని చివరి స్వతంత్ర చర్య కూడా. సామాజిక సంబంధాలలో, ఒక రంగం తర్వాత మరొక రంగంలో, రాజ్యం జోక్యం అనవసర మైపోయి, తరువాత తనంతకు తానే కృశించిపోతుంది. మనుషులమీద పాలన పోయి, దాని స్థానంలో వస్తువుల నియమనమూ, ఉత్పత్తి క్రమాలను నడిపించడమూ వస్తాయి. రాజ్యం 'రద్దుచేయబడదు.' అది కృశించిపోతుంది.'' ''స్వేచ్ఛా, సమానతలు గల ఉత్పత్తిదార్ల సంఘపు ప్రాతిపదికమీద ఉత్పత్తిని పునర్నిర్మించబోయే సమాజం మొత్తం రాజ్య యంత్రాన్ని అప్పుడది యెక్కడ వుండవలెనో అక్కడ వుంచుతుంది — పురావస్తువుల మ్యూజియంలో, రాట్నమూ, కంచు గొడ్డలీ వుండేచోట'' (ఎంగెల్స్, 'కుటుంబమూ, సొంత ఆస్తీ, రాజ్యమూ అనేవాటి పుట్టుక').

చివరి విషయం. ఆస్తి హర్తల ఆస్తి హరణం జరిగే దశలో కొనసాగేటట్టి సన్న కారు రైతాంగంపట్ల మార్క్స్ సోషలిజంయొక్క వైఖరిని గురించి మనం ఎంగెల్స్ చేసిన ఒక ప్రకటనను చూడాలి; అది మార్క్స్ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంది: ''...రాజ్యాధికారం మన వశంలో వున్నప్పుడు, పెద్ద భూస్వాముల విషయంలో చేయవలసి వున్నట్లు, సన్నకారు రైతులను బలవంతంగా (నష్ట పరిహారం యిచ్చి గానీ, యివ్వకుండా గానీ) నిరాస్తిపరులను చేయాలని మనం అనుకోను కూడా అనుకోం.... సన్నకారు రైతుకు సంబంధించి మన కర్తవ్యం యేమిటంటే, ప్రప్రథమంగా, అతని సొంత కృషీ, సొంత ఆస్తీ సహకార కృషిగా, సహకార ఆస్తిగా పరివర్తన చెందేటట్లు చేయడం — బలవంతంగా కాక, ఉదాహరణలద్వారానూ, యీ పనికి సామాజిక సహాయం యివ్వడం ద్వారానూ. తరువాత, సహజంగానే, సన్నకారు రైతుకు యీనాడు కూడా తేటతెల్లంగా వుండక తప్పని భావి సౌకర్యాలను అతనికి చూపించడానికి మనకు బోలెడు మార్గాలు వుంటాయి'' (ఎంగెల్స్, 'ఫ్రాన్సు, జర్మనీలలో రైతు సమస్య,' పుట 17, అలెక్సేయెవా చేత ప్రచురింపబడింది; రష్యన్ అనువాదంలో తప్పులున్నాయి. మూలం *Die Neue Zeit*).

1914 జూలై—నవంబర్‌లో రచింపబడింది

# స్వయంనిర్ణయంమీద జరిగిన చర్చ సారాంశం

(కొంత భాగం)

## 1. సోషలిజమూ, జాతుల స్వయంనిర్ణయమూ

సోషలిజంలో జాతుల స్వయంనిర్ణయాన్ని అమలుపరచడానికి నిరాకరించడం సోష లిజంకు ద్రోహ మౌతుందని మేము ఉద్ఘాటించినాము. దీనికి సమాధానంగా "స్వయంనిర్ణయ హక్కు సోషలిస్టు సమాజానికి వర్తించదు" అని మాతో అన్నారు. భేదం తీవ్రమైనది. యిది దేనినుండి ఉద్భవిస్తున్నది?

"సోషలిజం జాతీయ పీడనకు దారితీసే వర్గ ప్రయోజనాలను రద్దుచేస్తుంది గనుక, అది ప్రతి రకం జాతీయ పీడననూ రద్దుచేస్తుందని మనకు తెలుసు...." అనేది మా వ్యతిరేకుల వాదం. జాతీయ పీడన రద్దుకు వుండవలసిన ఆర్థిక పూర్వావసరాలు సుప్రసిద్ధమైనవి, నిర్వివాదమైనవి; అలాంటివాటిని గురించిన యీ వాదానికి ఒక జాతియొక్క రాజ్య సరిహద్దులలో మరొక జాతిని బలవంతంగా నిలుపుకోవడం అనే ఒక రాజకీయ పీడన రూపానికి సంబంధించిన చర్చతో యేమిటి సంబంధం? రాజకీయ సమస్యలను తప్పుకునే ప్రయత్నం తప్ప యిది మరేమీ కాదు. తదనంతర వాదాలు మా నిర్ణయం సరైనదని యింకా నమ్మకం కలిగిస్తాయి:

> "సోషలిస్టు సమాజంలో జాతి అనేది ఆర్థిక, రాజకీయ అంశంగా వుంటుందని నమ్మడానికి మా కే కారణమూ లేదు. ప్రాయశః అది సాంస్కృతిక, భాషాత్మక అంశంయొక్క స్వభావాన్ని మాత్రమే పొందు తుంది; యెందుకంటే, ఒక సోషలిస్టు సాంస్కృతిక మండలాన్ని భౌగోళి కంగా విభజించడం అనేది, అసలు అమలు జరగడమంటూ వుంటే, ఉత్పత్తి అవసరాలనుబట్టి మాత్రమే జరగగలదు; అంతే కాక, అలాంటి విభజన సమస్య సహజంగానే వ్యష్టి జాతులచేత ఒంటరిగానూ, ('స్వయం నిర్ణయ హక్కు' కోరేటట్లు) సంపూర్ణ సర్వసత్తాకత కలిగిన సందర్భంలోనూ నిర్ణయించబడదు, అందుకు సంబంధించిన పౌరు లందరిచేతా సంయు క్తంగా నిర్ణయించబడుతుంది...."

స్వయంనిర్ణయానికి బదులు సంయుక్త నిర్ణయాన్ని గురించిన యీ చివరి వాదం మన పోలిష్ కా(మేడ్లకు యెంతగా నచ్చిందంటే, వాళ్లు తమ సూ(తీకరణలలో దానిని మూడు సార్లు పునశ్చరణ చేస్తారు! కానీ, పునశ్చరణ పౌనఃపున్యం యీ అక్టో (బిస్టు,* (పగతి వ్యతిరేక వాదాన్ని సోషల్ డెమో(కటిక్ వాదంగా మార్చదు. సకల (పగతి వ్యతిరేకులూ, బూర్జువాలూ నిర్దిష్ట రాజ్యపు సరిహద్దుల లోపల బలవంతంగా నిలుపుకోబడిన జాతులకు తమ భవితవ్యాన్ని ఉమ్మడి పార్లమెంటులో "సంయుక్తంగా నిర్ణయించుకొనే" హక్కును యిస్తారు. రెండవ విల్‌హెల్మ్** కూడా బెల్జియన్లకు జర్మన్ సా(మాజ్యపు భవితవ్యాన్ని ఉమ్మడి జర్మన్ పార్లమెంటులో "సంయుక్తంగా నిర్ణయించుకొనే" హక్కును యిస్తాడు.

మన వ్యతిరేకులు సరిగ్గా అసలు సమస్యను తప్పుకోడానికి (పయత్నిస్తారు, చర్చకు వచ్చిన ఒకేఒక సమస్యను — వేరుపాటు హక్కును. యిది యింత విషాదకరం కాకపోతే, పరిహాసాస్పదంగా వుండేది!

పీడిత జాతుల విమోచన అంటే రాజకీయ రంగంలో రెండు రకాల రూపాంతరీ కరణ అని మొట్టమొదటి సూ(తం చెప్పింది: (1) జాతుల సంపూర్ణ సమానత్వం — దీనికి వివాదం లేదు, యిది రాజ్యం లోపల జరిగేదానికి మా(తమే వర్తిస్తుంది; (2) రాజకీయ వేరుపాటు హక్కు. యిది రాజ్య సరిహద్దులు గీయడానికి సంబంధించినది. దీనికి మా(తమే వివాదం వుంది. కానీ, మా (పత్యర్థులు మౌనంగా వుండేది సరిగ్గా దీన్ని గురించే. వాళ్లు రాజ్య సరిహద్దులను గురించి గానీ, చివరకు రాజ్యంగా రాజ్యం గురించి గానీ ఆలోచించ గోరరు. పెట్టుబడిదారీ వ్యవస్థ విజయవంతంగా వుంది, కనుక రాజకీయ సమస్యలు నిరర్థకం, అని వాదించిన 1894–1902 నాటి పాత "ఆర్థిక

---

* "అక్టో(బిస్టులు" ("అక్టోబర్ 17 సంఘం") – 1905 అక్టోబర్ 17 నాటి జారు (పణాళిక (పకటింపబడిన తర్వాత పారి(శామిక బూర్జువాలూ, బడా భూస్వాములూ స్థాపించిన విప్లవ(పతిఘాత పార్టీ. విప్లవానికి భయపడి, జారు "పౌర స్వేచ్ఛలూ," రాజ్యాంగమూ యిస్తానని (పజలకు వాగ్దానం చేసినాడు. అక్టో(బిస్టులు జారిస్టు (పభుత్వపు ఆంతరంగిక, వైదేశిక విధానానికి బేషరతు మద్దతు యిచ్చినారు. బడా పారి(శామికుడు గుచ్‌కోవ్, పెద్ద భూస్వామి అయిన రొద్జ్యాన్కొ ఆ పార్టీ నాయకులు. — సం.

** రెండవ విల్‌హెల్మ్ (1859–1941) – జర్మన్ చ(కవర్తి, (పష్యా రాజు (1888–1918). – సం.

వాదం''* లాగ యిదొక విధమైన ''సామ్రాజ్యవాద ఆర్థికవాదం.'' సామ్రాజ్యవాదం విజయవంతంగా వుంది, కనుక రాజకీయ సమస్యలు నిరర్థకం! యిలాంటి అరాజకీయ సిద్ధాంతం మార్క్సిజంకు వ్యతిరేకం.

తన 'గోతా కార్యక్రమ విమర్శ'లో మార్క్స్ యిలా రాసినాడు: ''పెట్టుబడిదారీ సమాజానికీ కమ్యూనిస్టు సమాజానికీ మధ్య ఒకటి మరొకటిగా విప్లవాత్మక రూపాంతరం చెందే దశ వుంది. దీనికి అనుగుణంగా ఒక రాజకీయ పరివర్తన దశ కూడా వుంది; యీ దశలో రాజ్యం కార్మికవర్గ విప్లవ నియంతృత్వం తప్ప మరొకటి కాజాలదు.''** యింత వరకు యీ సత్యం సోషలిస్టులకు నిర్వివాదంగా వుంది; విజయవంతమైన సోషలిజం పరిపూర్ణ కమ్యూనిజంగా అభివృద్ధి చెందేవరకు రాజ్యం వుంటుందనే విషయానికి గుర్తింపు దీనిలో వుంది. రాజ్యం కృశించిపోవడం గురించిన ఎంగెల్స్ సూక్తి ప్రసిద్ధమైనది. ప్రజాస్వామ్యం అనేది ఒక రాజ్య రూపం అనీ, రాజ్యం కృశించిపోయేటప్పుడు అది కూడా కృశించిపోతుందనీ, మొదటి సూత్రంలో మేము ఉద్దేశపూర్వకంగా నొక్కి చెప్పినాము. మా ప్రత్యర్థులు మార్క్సిజం స్థానంలో యేదో ఒక ''అరాజ్య'' దృక్పథాన్ని పెట్టిందాకా, వాళ్ల వాదాలన్నీ కలిసి ఒక పెద్ద పొరపాటు అవుతాయి.

రాజ్యం గురించి (అనగా, దాని సరిహద్దులను గీయడం గురించి) మాట్లాడడానికి బదులు వాళ్లు ''సోషలిస్టు సాంస్కృతిక మండలం'' గురించి మాట్లాడుతారు. అనగా, రాజ్య సమస్య లన్నిటినీ తుడిచివేసే అర్థంలో అనిర్దిష్టంగా వున్న నుడికారాన్ని వాళ్లు ఉద్దేశపూర్వకంగా యెన్నుకుంటారు! యీ విధంగా మనకు పరిహాసాస్పదమైన చర్విత చర్వణం లభిస్తుంది: రాజ్యం అనేది లేకపోతే, సహజంగానే, సరిహద్దుల వూసే వుండజాలదు. ఆ సందర్భంలో ప్రజాతంత్ర రాజకీయ కార్యక్రమం యావత్తూ అనవసరం. రాజ్యం ''కృశించిపోయి'' నప్పుడు రిపబ్లిక్ అనేది కూడా వుండదు.

---

* ''ఆర్థికవాదం'' – 19వ శతాబ్ది అంతంలోనూ, 20వ శతాబ్ది ప్రారంభంలోనూ రష్యన్ సోషల్ డెమోక్రసీలోని ఒక అవకాశవాద ధోరణి. ఉదారవాద బూర్జువావర్గ జారిజంతో రాజకీయ పోరాటం చేయడానికి ప్రధాన శక్తి అనీ, కార్మికులు ఆర్థిక పోరాటానికి – పని పరిస్థితుల మెరుగుదలా, వేతనాల పెరుగుదలా, మొదలైనవాటికి – పరిమితం కావాలనీ ''ఆర్థికవాదులు'' భావించినారు. ''ఆర్థికవాదులు'' పార్టీ నాయక పాత్రనూ, కార్మికవర్గ ఉద్యమంలో విప్లవ సిద్ధాంత ప్రాముఖ్యాన్నీ నిరాకరించి, ఆ ఉద్యమం కేవలం సద్యోజనితంగా అభివృద్ధి చెందాలని భావించినారు. 'ఏమి చేయాలి?' అనే తన పుస్తకంలో లెనిన్ ''ఆర్థికవాదాన్ని'' విస్తృతమైన విమర్శకు గురిచేసినాడు. –సం.

** చూ. పుట 39. – సం.

జర్మన్ జాతీయ దురహంకారవాది లెన్ష్, సూత్రం 5 (పాదపీఠిక)లో మేము ప్రస్తావించిన వ్యాసాలలో, 'పో, రైన్' అనే ఎంగెల్స్ వ్యాసంనుండి ఒక ఆసక్తికరమైన ఖండికను ఉల్లేఖించినాడు. జీవయోగ్యత లేని పలు చిన్న జాతులను కబళించిన చారిత్రక అభివృద్ధి గతిలో, ''జీవయోగ్యత గల గొప్ప యూరపియన్ జాతుల సరిహద్దులు'' ప్రజానీకపు ''భాష, సానుభూతుల'' చేత అంతకంతకూ యెక్కువగా నిర్ణయింపబడుతూ వుండినాయని ఎంగెల్స్ యీ వ్యాసంలో, యితర విషయాలతో పాటు, అంటాడు. ఎంగెల్స్ యీ సరిహద్దులను ''సహజ'' సరిహద్దు లంటాడు. యూరప్‌లోని ప్రగతిశీల పెట్టుబడిదారీ వ్యవస్థ కాలంలో, రమారమిగా 1848నుండి 1871దాకా, పరిస్థితి అలా వుండింది. యీనాడు, ప్రజాస్వామికంగా నిర్ణయింపబడిన యీ సరిహద్దులు ప్రగతి వ్యతిరేక, సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థచేత అంతకంతకూ తరచుగా బ్రద్దలు చేయబడుతున్నాయి. సామ్రాజ్యవాదం తన తదనంతరురాలైన సోషలిజంకు తక్కువ ప్రజాస్వామికమైన సరిహద్దుల వారసత్వాన్ని — యూరప్‌లోనూ, ప్రపంచంలో యితర ప్రాంతాలలోనూ పలు పర భూభాగ స్వాధీనాలను — యిచ్చిపోతుందనడానికి యెన్నైనా సూచన లున్నాయి. విజయవంతమైన సోషలిజం సర్వత్రా పూర్తి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తూ, అమలుపరుస్తూ, రాజ్య సరిహద్దులను ప్రజాస్వామికంగా గీయకుండా వుంటుందనీ, ప్రజానీకపు ''సానుభూతు''లను ఉపేక్షిస్తుందనీ అనుకోవాల్నా? యీ ప్రశ్నలు వేసుకుంటే చాలు — మన పోలిష్ సహచరులు మార్క్సిజంనుండి ''సామ్రాజ్యవాద ఆర్థికవాదం''వైపు దిగజారుతున్నారని స్పష్టమౌతుంది.

మార్క్సిజంకు వికృత రూపం యిచ్చిన పాత ''ఆర్థికవాదులు'' ''ఆర్థికమైనది మాత్రమే'' మార్క్సిస్టులకు ప్రాముఖ్యం గలదని కార్మికులకు చెప్పినారు. విజయవంతమైన సోషలిజంకు చెందిన ప్రజాతంత్ర రాజ్యం సరిహద్దులు లేకుండా (పదార్థం లేని ''యింద్రియానుభూతుల''లాగ) వుంటుందనో, లేక ఉత్పత్తి అవసరాలనుబట్టి ''మాత్రమే'' సరిహద్దులు గీయబడతాయనో కొత్త ''ఆర్థికవాదులు'' అనుకుంటున్నట్లు వుంది. వాస్తవంలో దాని సరిహద్దులు ప్రజాస్వామికంగా గీయబడతాయి, అనగా, ప్రజానీకపు యిచ్ఛకూ, ''సానుభూతులకూ'' అనుగుణంగా. పెట్టుబడిదారీ వ్యవస్థ యీ సానుభూతులను అణగదొక్కి, జాతుల రాజీకి మరిన్ని ఆటంకాలను చేరుస్తుంది. సోషలిజం వర్గ పీడన లేకుండా ఉత్పత్తిని వ్యవస్థీకరించడంద్వారా, రాజ్యంలోని సభ్యు లందరి సంక్షేమాన్ని కట్టుదిట్టం చేయడంద్వారా, ప్రజానీకపు ''సానుభూతులకు'' పూర్తిగా అవకాశం యిస్తుంది, తద్వారా జాతులు పరస్పరం దగ్గరకు రావడాన్నీ, లీనం కావడాన్నీ పెంపొందించి, యెంతగానో త్వరపరుస్తుంది.

బరువైన అస్తవ్యస్తపు ''ఆర్థికవాదం''నుండి పాఠకునికి విశ్రాంతి యివ్వడానికి, యీ వివాదానికి వెలుపల వున్న ఒక సోషలిస్టు రచయితయొక్క వాదాన్ని ఉల్లేఖించ నివ్వండి. ఆ రచయిత ఒట్టో బౌవర్, అతనికి కూడా తన సొంత ''అభిమాన విషయం'' వుంది — ''సాంస్కృతిక, జాతీయ స్వపరిపాలన''* అనేది; కానీ అతను అత్యంత ముఖ్యమైన పెక్కు సమస్యలమీద సరిగా వాదిస్తాడు. ఉదాహరణకు, తన 'జాతీయ సమస్యా, సోషల్ ప్రజాస్వామ్యమూ' అనే గ్రంథం పారగ్రాపు 29లో, సామ్రాజ్యవాద విధానాలకు ముసుగు వేయడానికి జాతీయ భావజాలాన్ని వాడుకోవడాన్ని అతను గుర్తించ డం ద్విగుణీకృతంగా సరైనది. 'సోషలిజమూ, జాతీయతా సూత్రమూ' అనే పారగ్రాపు 30లో అతను యిలా అంటాడు:

> ''సోషలిస్టు సమాజం యెప్పుడూ బల ప్రయోగంద్వారా మొత్తం జాతులను తనలో యిముడ్చుకోగలిగి వుండదు. జాతీయ సంస్కృతి యొక్క వరాల నన్నిటినీ అనుభవిస్తూ, శాసన నిర్మాణంలోనూ, ప్రభుత్వంలోనూ పూర్తిగా, క్రియాత్మకంగా పాల్గొంటూ, చివరి విషయంగా, ఆయుధాలు కలిగి వున్నట్టి ప్రజా సమూహాలను ఊహించుకోండి — అలాంటి జాతిని బలవంతంగా పరాయి సామాజిక వ్యవస్థయొక్క పాలనకు లోబరచడం సాధ్యమౌతుందా? ప్రభుత్వ అధికారం అనేది అంతా ఆయుధ బలంమీద ఆధారపడుతుంది. యీనాటి ప్రజా సైన్యం, మహా చతురమైన సంవిధానం మూలంగా, గతకాలపు కులీనుల సైన్యం లాగే,

---

* సాంస్కృతిక, జాతీయ స్వపరిపాలన — ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రట్లు ఒట్టో బౌవర్, కార్ల్ రెన్నెర్ 1890లలో జాతీయ సమస్యమీద ప్రతిపాదించిన అవకాశవాద కార్యక్రమం. దాని ముఖ్యమైన అంశం యేమిటంటే, ఒకే జాతికి చెందిన ప్రజలు, ఒక దేశంలో యే ప్రాంతంలో నివసిస్తున్నా సరే, స్వపరిపాలక జాతీయ సంఘంగా యేర్పడాలనీ, దాని యాజమాన్యంకిందికి పాఠశాలలనూ (భిన్న జాతుల పిల్లలకు వేరు వేరుగా వుండేవాటిని), యితర విద్యా సాంస్కృతిక సంస్థలనూ రాజ్యం అప్పగించాలనీ. యీ కార్యక్రమం అమలు జరిగితే, యిది ప్రతి జాతీయ బృందంలోని మత గురువులకు సంబంధించిన, ప్రగతి వ్యతిరేకమైన జాతీయవాద భావజాలాన్ని పటిష్ఠపరచి, కార్మికుల మధ్య జాతీయ విభేదాలను పెంచడంద్వారా కార్మికవర్గ వ్యవస్థీకరణను ఆటంకపరచేది. సాంస్కృతిక, జాతీయ స్వపరిపాలన వినాదాన్ని లెనిన్ పలు వ్యాసాలలో తీవ్ర విమర్శకు గురిచేసినాడు. — సం.

కిరాయి సైన్యం లాగే, యింకా ఒక నిర్దిష్టమైన వ్యక్తి చేతుల్లోనో, కుటుంబం చేతుల్లోనో, వర్గం చేతుల్లోనో పనిముట్టుగా వుంది. సోష లిస్టు సమాజపు ప్రజాతంత్ర సమిష్టి కుటుంబంయొక్క సైన్యం సాయుధ ప్రజలు తప్ప మరేమీ కాదు; యెందుకంటే, సామాజికీ కృతమైన యంత్రాలయాలలో నిర్బంధం లేకుండా పని చేస్తూ, రాజకీయ జీవితపు అన్ని రంగాలలోనూ పూర్తిగా పాల్గొనే మహా సంస్కార వంతులైన వ్యక్తులచేత ఆ సైన్యం యేర్పడుతుంది. అలాంటి పరిస్థితు లలో పరాయి పాలన అవకాశాలన్నీ అదృశ్య మౌతాయి.''

యిది నిజమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో జాతీయ పీడనను (దరహంమీద యే రాజకీయ పీడనైనా) రద్దుచేయడం అసాధ్యం. యెందుకంటే, దీనికి వర్గాల రద్దు, అనగా సోషలిజంను ప్రవేశపెట్టడం, అవసరం. కానీ, ఆర్థిక విషయాలమీద ఆధార పడినప్పటికీ, సోషలిజంను కేవలం ఆర్థిక విషయాలకు కుదించరాదు. జాతీయ పీడనను రద్దుచేయడానికి ఒక పునాది — సోషలిస్టు ఉత్పత్తి అనేది — అత్యవసరం. కానీ యీ పునాదివెంట ప్రజాస్వామికంగా వ్యవస్థీకృతమైన రాజ్యమూ, ప్రజాస్వామిక సైన్యమూ, మొదలైనవి వుండాలి. పెట్టుబడిదారీ వ్యవస్థను సోషలిజంగా రూపాంతరీకరించడంద్వారా కార్మికవర్గం జాతీయ పీడనను రద్దుచేసే అవకాశాన్ని సృష్టిస్తుంది. అవకాశం యెప్పుడు వాస్తవం అవుతుందంటే, ప్రజానీకపు ''సానుభూతుల'' ప్రకారం రాజ్య సరిహద్దులను గీయడంతో సహా, వేరుపాటుకు సంపూర్ణ హక్కుతో సహా, అన్ని రంగాలలోనూ సంపూర్ణ ప్రజాస్వామ్యం నెలకొల్పబడి నప్పుడు ''మాత్రమే'' — అప్పుడు ''మాత్రమే''! యిది, మళ్ళీ, అత్యంత స్వల్పమైన జాతీయ ఘర్షణను కూడా, అత్యంత స్వల్పమైన జాతీయ అపనమ్మకాన్ని కూడా ఆచరణలో తొలగించే పనిని అభివృద్ధి చేయడానికీ, జాతులు మరింత వేగంగా పరస్పరం దగ్గరికి వచ్చి, లీనం కావడానికీ (రాజ్యం కృశించిపోయి నప్పుడు పూర్తి అయ్యే చర్యకు) ప్రాతిపదికగా వుంటుంది. యిది మార్క్సిస్టు సిద్ధాంతం — యీ సిద్ధాంతంనుండే మన పోలిష్ సహచరులు పొరపాటున వైదొలగినారు.

1916 జూలైలో రచింపబడింది

# రాజ్యమూ, విప్లవమూ

(కొంత భాగం)

## ప్రకరణం V

## రాజ్యం కృశించిపోవడానికి ఆర్థిక ప్రాతిపదికలు

మార్క్స్ యీ ప్రశ్నను తన 'గోతా కార్యక్రమ విమర్శ' (బ్రాకెకు ఉత్తరం, మే 5, 1875 నాటిది, 1891 దాకా ప్రచురింపబడినట్టిది, అప్పుడు *Die Neue Zeit*! సంపుటి IX, 1లో అచ్చయినట్టిది, రష్యన్ భాషలో ప్రత్యేక కూర్పుగా వెలువడి నట్టిది)లో అత్యంత అమూలాగ్రంగా వివరిస్తాడు. యీ అసాధారణ రచనలోని వాదోప వాదాత్మక భాగం, లాసాలియనిజంమీద విమర్శను గలిగినట్టిది, యీ రచనలోని ధనాత్మక భాగాన్ని మరుగున పడవేసిందని చెప్పవచ్చు; దేనినంటే, కమ్యూనిజం అభివృద్ధికీ, రాజ్యం కృశించిపోవడానికీ గల సంబంధంమీద పరిశీలనను.

### 1. మార్క్స్ యీ సమస్యను రూపొందించిన విధం

బ్రాకెకు మే 5, 1875 నాటి మార్క్స్ ఉత్తరాన్నీ, మనం పైన పరీక్షించి నట్టి, ఎంగెల్స్ మార్చి 28, 1875 నాడు బేబెల్‌కు రాసిన ఉత్తరాన్నీ పైపైన పోల్చిచూస్తే, ఎంగెల్స్‌కంటె మార్క్స్ చాలా యెక్కువగా ''రాజ్యాన్ని వెనకేసుక వచ్చేవాడు'' అయినట్లూ, రాజ్య సమస్యమీద యిద్దరు రచయితల మధ్యా గల అభి ప్రాయ భేదం చాలా గణనీయమైనట్లూ కనిపించవచ్చు.

రాజ్యం గురించి వాగుడంతా పూర్తిగా కట్టిపెట్టాలనీ, ''రాజ్యం'' అనే మాటను కార్యక్రమంనుండి పూర్తిగా తొలగించి, దాని స్థానంలో ''సమష్టి సమాజం'' అనే మాటను పెట్టాలనీ ఎంగెల్స్ బేబెల్‌కు సూచించినాడు. కమ్యూన్ యిక యెంత మాత్రమూ సరైన అర్థంలో రాజ్యం కాదని కూడా ఎంగెల్స్ ప్రకటించినాడు. కానీ మార్క్స్ ''కమ్యూనిస్టు సమాజంలోని భావి రాజ్యవ్యవస్థ'' గురించి కూడా మాట్లాడినాడు;

అనగా, కమ్యూనిజంలో కూడా రాజ్యంయొక్క అవసరాన్ని ఆయన గుర్తించినట్లు కనిపిస్తుంది.

కానీ ఆ అభిప్రాయం పౌలికంగా తప్పు. మరింత లోతుగా పరిశీలిస్తే తెలుస్తుంది, రాజ్యంమీదా, అది కృశించిపోవడంమీదా మార్క్స్, ఎంగెల్స్‌ల అభిప్రాయాలు పూర్తిగా ఒకటేననీ, పైన ఉల్లేఖించిన మార్క్స్ మాట కృశించిపోయే క్రమంలో వున్న రాజ్యవ్యవస్థకు వర్తిస్తుందనీ.

స్పష్టంగా, భావికాలపు "కృశించిపోయే" సమయాన్ని నిర్దిష్టంగా చెప్పే సమస్యే వుండజాలదు — అది దీర్ఘ క్రమం అనేదీ తేటతెల్లం గనుక మరీనూ. మార్క్స్‌కూ, ఎంగెల్స్‌కూ మధ్య కనిపిస్తున్న భేదానికి కారణం యేమిటంటే, వాళ్లు భిన్న విషయాలను చర్చించడమూ, భిన్న లక్ష్యాలను అనుసరించడమూ. ఎంగెల్స్ రాజ్యం గురించి చలామణీలో వున్న దురభిప్రాయాల (యేమీ స్వల్పం కానట్టి ప్రమాణంలో లాసాల్‌కు కూడా వున్న వాటి) పచ్చి అసంబద్ధతను కన్నులకు కట్టినట్లు, విశితంగా, స్థూల రేఖల్లో బేబెల్‌కు చూపించడానికి పూనుకున్నాడు. యీ సమస్యను మార్క్స్ ప్రసంగవశాత్తు మాత్రమే స్పృశించినాడు, మరొక విషయంలో — కమ్యూనిస్టు సమాజపు అభివృద్ధిలో — నిమగ్నుడై వుండినందున.

మార్క్స్ సిద్ధాంత మంతా అభివృద్ధి సిద్ధాంతాన్ని — దాని అత్యంత సుస్థిర, సంపూర్ణ, సమాలోచిత, పిండిత రూపంలో — ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థకు అన్వయించడమే. సహజంగా, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క రాబోయే పతనానికీ, భావి కమ్యూనిజంయొక్క భావి అభివృద్ధికీ రెంటికీ యీ సిద్ధాంతాన్ని అన్వయించే సమస్య మార్క్స్‌కు యెదురైంది.

అలాంటప్పుడు, యే వాస్తవాల ఆధారంమీద భావి కమ్యూనిజంయొక్క భావి అభివృద్ధి సమస్యను పరిశీలించవచ్చు?

అది పెట్టుబడిదారీ వ్యవస్థనుండి ఉద్భవిస్తుంది, అది పెట్టుబడిదారీ వ్యవస్థనుండి చారిత్రకంగా అభివృద్ధి అవుతుంది, అది పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రసవించిన ఒక సామాజిక శక్తియొక్క ఆచరణ ఫలితం, అనే వాస్తవాల ఆధారంమీద. ఊహాస్వర్గాన్ని కల్పించడానికీ, అజ్ఞేయ విషయాన్ని గురించి నిరర్థకపు ఊహాపోహల్లో మునగడానికీ మార్క్స్ లేశమాత్రం కూడా ప్రయత్నించడు. కమ్యూనిజం సమస్యను మార్క్స్ యే విధంగా పరిశీలిస్తాడంటే, ఒక ప్రకృతిశాస్త్రజ్ఞుడు, ఉదాహరణకు, ఒక కొత్త రకం జీవి ఫలానా విధంగా పుట్టిందనీ, ఫలానా నిశ్చిత దిశలో మార్పు చెందుతున్నదనీ తెలుసుకొన్న తర్వాత, దాని అభివృద్ధి సమస్యను యెలా పరిశీలిస్తాడో అలాగే.

మొట్టమొదట, రాజ్యానికీ, సమాజానికీ గల సంబంధానికి చెందిన సమస్యలోకి

గోతా కార్యక్రమం తీసుకవచ్చిన గంద్రగోళాన్ని మార్క్స్ తోసివేస్తాడు. ఆయన యిలా రాస్తాడు:

> "...'యీనాటి సమాజం' పెట్టుబడిదారీ సమాజం, మధ్య యుగపు కల్తీ దాదాపు లేకుండా, ప్రతి దేశంయొక్క నిర్దిష్ట చారిత్రక అభివృద్ధిచేత కొద్దో గొప్పో మార్పుచెంది, కొద్దో గొప్పో అభివృద్ధి అయి, అన్ని నాగరిక దేశాలలోనూ వున్నట్టిది. మరోవైపున, 'యీనాటి రాజ్యం' అనేది దేశం సరిహద్దులను బట్టి మారుతుంది. అది స్విట్జర్లండులో వున్నట్లు ప్రష్యన్ జర్మన్ సామ్రాజ్యంలో లేదు, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వున్నట్లు ఇంగ్లండులో లేదు. కనుక 'యీనాటి రాజ్యం' అనేది కట్టుకథ.
>
> "అయినప్పటికీ, భిన్న నాగరిక దేశాలలోని భిన్న రాజ్యాలకు రూపంలో యెంత వైవిధ్యం వున్నా, అన్నిటికీ యీ సామాన్య గుణం వుంది: అవి ఆధునిక బూర్జువా సమాజంమీద ఆధారపడతాయి,
> ఒక సమాజం మరొకదానికంటె యెక్కువగానో, తక్కువగానో పెట్టుబడిదారీ పద్ధతిలో అభివృద్ధి అవుతుంది. కనుక, వాటికి కొన్ని ముఖ్యమైన సామాన్య లక్షణాలు కూడా వున్నాయి. యీ అర్థంలో, భావి రాజ్యంకంటె భిన్నమైనదిగా, 'యీనాటి రాజ్యం' గురించి మాట్లాడడానికి వీలుంది; భావి రాజ్యంలో దాని ప్రస్తుత మూలమైన బూర్జువా సమాజం కృశించి పోయివుంటుంది.
>
> "అప్పుడీ ప్రశ్న ఉత్పన్నమౌతుంది: కమ్యూనిస్టు సమాజంలో రాజ్య వ్యవస్థ యే మార్పుకు లోనౌతుంది? మరొకవిధంగా చెప్పాలంటే, యీనాటి రాజ్య క్రియలతో సామ్యం గల యే సామాజిక క్రియలు మిగిలివుంటాయి? యీ ప్రశ్నకు శాస్త్రీయంగా మాత్రమే జవాబు వుండగలదు; ప్రజలు అనే మాటను రాజ్యం అనే మాటతో వెయ్యి సార్లు కలిపినా, వెంద్రుకవాసి కూడా యీ సమస్య పరిష్కారం దగ్గరకు యెవరూ పోలేరు."

యీవిధంగా మార్క్స్ "ప్రజా రాజ్యం" గురించిన ప్రసంగ మంతటినీ అపహాస్యం చేసి, ప్రశ్నను రూపొందించి, హెచ్చరిక చేస్తున్నాడా అన్నట్లు చెప్పతాడు, దానికి శాస్త్రీయమైన జవాబు కోరేవాళ్లు స్థిరంగా నిర్ధరింపబడిన శాస్త్రీయ విషయాలను మాత్రమే ఉపయోగించాలని.

మొత్తం అభివృద్ధి సిద్ధాంతంచేత, మొత్తంగా శాస్త్రంచేత అత్యంత కచ్చితంగా నిర్ధరింపబడిన మొదటి విషయం — ఊహాస్వర్గవాదులచేత ఉపేక్షింపబడిందీ, సోషలిస్టు విప్లవానికి భయపడే యీనాటి అవకాశవాదులచేత ఉపేక్షింపబడుతున్నదీ — యేమిటంటే, చారిత్రకంగా, పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిజంకు పరివర్తన చెందే ప్రత్యేక దశ ఒకటి నిస్సందేహంగా వుండాలనేది.

## 2. పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిజంకు పరివర్తన

మార్క్స్ కొనసాగిస్తాడు:

> "...పెట్టుబడిదారీ సమాజానికీ కమ్యూనిస్టు సమాజానికీ మధ్య ఒకటి మరొకటిగా విప్లవాత్మక రూపాంతరం చెందే దశ వుంది. దీనికి అనుగుణంగా ఒక రాజకీయ పరివర్తన దశ కూడా వుంది; యీ దశలో రాజ్యం కార్మికవర్గ విప్లవ నియంతృత్వం తప్ప మరొకటి కాజాలదు...."

ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో కార్మికవర్గం నిర్వహించిన పాత్రయొక్క పరిశీలననూ, యీ సమాజ అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలనూ, కార్మికవర్గంయొక్కా, బూర్జువావర్గంయొక్కా రాజీపడజాలని విరుద్ధ ప్రయోజనాలనూ ఆధారం చేసుకొని మార్క్స్ యీ నిర్ధారణ చేసినాడు.

మునుపు సమస్య యీవిధంగా రూపొందించబడింది: తన విమోచనను సాధించ డానికి కార్మికవర్గం బూర్జువావర్గాన్ని కూలదోసి, రాజకీయ అధికారం గెలుచుకొని, తన విప్లవ నియంతృత్వం స్థాపించాలి.

యిప్పుడు సమస్య కాస్త భిన్నంగా రూపొందించబడింది: పెట్టుబడిదారీ సమా జంనుండి — కమ్యూనిజం వైపు అభివృద్ధి చెందుతున్నట్టిదానినుండి — కమ్యూనిస్టు సమాజానికి పరివర్తన "రాజకీయ పరివర్తన దశ" లేకుండా అసాధ్యం; యీ దశలో రాజ్యం కార్మికవర్గంయొక్క విప్లవకర నియంతృత్వం మాత్రమే కాగలదు.

అయితే, యీ నియంతృత్వానికి ప్రజాస్వామ్యంతో గల సంబంధం యేమిటి?

'కమ్యూనిస్టు ప్రణాళిక' యీ రెండు భావాలనూ కేవలం పక్కపక్కన పెడు తుందని చూసినాము: "కార్మికవర్గాన్ని పాలకవర్గ స్థానానికి యెత్తడం," "ప్రజా స్వామ్యాన్ని గెలుచుకోవడం." పైన చెప్పిన అంతటినీ ఆధారం చేసుకొని, పెట్టుబడిదారీ

వ్యవస్థనుండి కమ్యూనిజంకు జరిగే పరివర్తనలో ప్రజాస్వామ్యం యెలా మారేదీ మరింత కచ్చితంగా నిర్ణయించ వీలౌతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో, అది అత్యంత అనుకూల పరిస్థితులలో అభివృద్ధి చెందిన పక్షంలో, ప్రజాతంత్ర రిపబ్లిక్‌లో మనకు దాదాపు సంపూర్ణ ప్రజాస్వామ్యం కనిపిస్తుంది. కానీ యీ ప్రజాస్వామ్యం యెప్పుడూ పెట్టుబడిదారీ దోపిడీ పెట్టే సంకుచిత హద్దులచేత పరిమితపరచబడి, తత్పర్యవసానంగా వాస్తవంలో యెప్పుడూ మైనారిటీకి, ఆస్తిపర వర్గాలకు మాత్రమే, ధనికులకు మాత్రమే, ప్రజాస్వామ్యంగా నిలిచివుంటుంది. పెట్టుబడిదారీ సమాజంలో స్వేచ్ఛ యెప్పుడూ దాదాపు పురాతన గ్రీకు రిపబ్లిక్కులలో వుండినట్లు వుంటుంది: బానిస యజమానులకు స్వేచ్ఛ. పెట్టుబడిదారీ దోపిడీ పరిస్థితుల మూలంగా, ఆధునిక కూలి బానిసలు లేమితో, దారిద్ర్యంతో యెంతగా నలిగిపోతారంటే, "ప్రజాస్వామ్యపు గొడవ వాళ్లకు పట్టదు," "రాజకీయాల గొడవ వాళ్లకు పట్టదు." మామూలు, శాంతియుత కాలక్రమంలో ప్రజానీకంలో మెజారిటీ సాంఘిక, రాజకీయ జీవితంలో పాల్గొనకుండా వెలివేయబడతారు.

యీ మాటలోని సత్యాన్ని బహుశా జర్మనీ అన్నిటికంటె స్పష్టంగా ధ్రువపరుస్తుంది. యెందుకంటే, అక్కడ రాజ్యాంగవిహిత చట్టబద్ధత అసాధారణమైనంత దీర్ఘ కాలం – దాదాపు అర శతాబ్ది (1871–1914) – కొనసాగింది; యీ కాలంలో సోషల్ డెమోక్రట్లు "చట్టబద్ధతను వినియోగించుకోవడం" అనే కార్యాన్ని యితర దేశాలలోకంటె యెంతో యెక్కువ సాధించగలిగినారు, ప్రపంచంలో యెక్కడా లేనంత పెద్ద నిష్పత్తిలో కార్మికులను రాజకీయ పార్టీలో సంఘటితపరచినారు.

రాజకీయ చైతన్యం కలిగి, క్రియాశీలురైన కూలి బానిసల యీ అత్యంత పెద్ద నిష్పత్తి పెట్టుబడిదారీ సమాజంలో యింతవరకు నమోదైనది యెంత? సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని పది లక్షల సభ్యులు – నూటాయాభై లక్షల కూలి శ్రామికులలో! ట్రేడ్‌యూనియన్లలో సంఘటితమైన ముప్పై లక్షలమంది – నూటాయాభై లక్షల మందిలో!

తృణప్రాయమైన మైనారిటీకి ప్రజాస్వామ్యం, ధనికులకు ప్రజాస్వామ్యం – అదీ పెట్టుబడిదారీ సమాజపు ప్రజాస్వామ్యం. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యపు యంత్రాంగంలోకి మరింత లోతుగా చూస్తే, వోటింగు హక్కుకు సంబంధించిన "చిల్లర" – చిల్లర అనుకోబడే – వివరాల (నివాస సంబంధమైన యోగ్యతా, స్త్రీల మినహాయింపూ, వగైరాల)లోనూ, ప్రాతినిధ్యపు సంస్థల సంవిధానంలోనూ, సమావేశ హక్కుకు ఆచరణలో గల ఆటంకాలలోనూ (పబ్లిక్ భవనాలు "బిచ్చగాళ్ల"కు కాదు!), శుద్ధ పెట్టుబడిదారీ పద్ధతిలో దినపత్రికలు యేర్పడివుండడంలోనూ, వగైరా, వగైరాలలో ప్రజా

స్వామ్యానికి అన్నీ నిర్బంధాలే కనపడతాయి. పేదవాళ్లకు గల యీ నిర్బంధాలూ, మినహాయింపులూ, బహిష్కారాలూ, ఆటంకాలూ స్వల్పమైనవిగా కనిపిస్తాయి, ముఖ్యంగా, లేమి అంటే యేమిటో యెరక్కుండా, పీడిత వర్గాల సామూహిక జీవితంతో యెన్నడూ సన్నిహిత సంపర్కం లేనట్టివాళ్లకు (బూర్జువా పత్రికా రచయితలలోనూ, రాజకీయ వాదులలోనూ నూటికి తొంభై తొమ్మిదిమంది కాకపోయినా, నూటికి తొంభై మంది యీ రకానికి చెందుతారు); కానీ యీ నిర్బంధాలు అన్నీ కలిసి రాజకీయాలనుండీ, ప్రజాస్వామ్యంలో క్రియాశీల భాగస్వామ్యంనుండీ పేదవాళ్లను మినహాయించి, బయటికి తొక్కేస్తాయి.

మార్క్స్ కమ్యూన్ అనుభవాన్ని పరిశీలిస్తూ, పీడక వర్గపు యే నిర్దిష్ట ప్రతినిధులు తమకు పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించి, తమను అణచివేయవలసిందీ నిర్ణయించడానికి పీడితులు ప్రతి కొద్ది యేండ్లకూ ఒకసారి అనుమతింపబడతారు, అని అన్నప్పుడు, ఆయన పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యపు యీ సారాన్ని అద్భుతంగా గ్రహించినాడు!

కానీ, ఉదారవాద ప్రొఫెసర్లూ, పెటీబూర్జువా అవకాశవాదులూ మనల్ని నమ్మించజూసేటట్లు, యీ పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యంనుండి – అనివార్యంగా సంకుచితమై, దొంగచాటుగా పేదవాళ్లను పక్కకు నెట్టివేస్తూ, అందువలన ఆమూలాగ్రం కపటమూ, బూటకమూ అయినట్టిదానినుండి – "అంతకంతకూ యెక్కువ ప్రజాస్వామ్యం" వైపు సరళంగా, సూటిగా, సాఫీగా పురోభివృద్ధి జరగదు. పురోభివృద్ధి, అనగా, కమ్యూనిజం వైపు అభివృద్ధి, కార్మికవర్గ నియంతృత్వంద్వారా జరుగుతుంది, మరొకవిధంగా జరగజాలదు, యెందుకంటే, పెట్టుబడిదారీ దోపిడీదార్ల ప్రతిఘటన మరెవ్వరిచేతా, మరేవిధంగానూ బద్దలు కాజాలదు.

కార్మికవర్గ నియంతృత్వానికి, అనగా పీడకులను అణచేందుకు పీడితుల అగ్రగదళం పాలకవర్గంగా సంఘటితపడడానికి, ప్రజాస్వామ్య విస్తృతీకరణ మాత్రమే ఫలితంగా వుండజాలదు. మొట్టమొదటిసారి పేదవాళ్లకు ప్రజాస్వామ్యం అయినట్టి, ప్రజలకు ప్రజాస్వామ్యం అయినట్టి, డబ్బుసంచులకు ప్రజాస్వామ్యం కానట్టి, అపార ప్రజాస్వామ్య విస్తృతీకరణ తోపాటు కార్మికవర్గ నియంతృత్వం పీడకుల, దోపిడీదార్ల, పెట్టుబడిదార్ల స్వేచ్ఛమీద నిర్బంధాల పరంపర మోపుతుంది. మానవజాతిని కూలి బానిసత్వంనుండి విముక్తిచేయడానికి మనం వాళ్లను అణచివేయాలి, వాళ్ల ప్రతిఘటన బలప్రయోగంచేత నలిపివేయబడాలి; అణచివేత వుండేచోట, బలాత్కారం వుండేచోట స్వేచ్ఛా, ప్రజాస్వామ్యమూ వుండవనేది స్పష్టం.

ఎంగెల్స్ బేబెల్‌కు రాసిన ఉత్తరంలో యీ విషయాన్ని చాలా బాగా యిలా వ్యక్తం చేయడం పాఠకునికి జ్ఞాపక ముంటుంది: ''కార్మికవర్గానికి రాజ్యం అవసరమయ్యేది స్వేచ్ఛా ప్రయోజనాల కొరకు కాదు, తన శత్రువులను అణచివేయడానికి; స్వేచ్ఛను గురించి మాట్లాడడం సాధ్యమైన వెనువెంటనే రాజ్యం అనేది వుండడం ఆగిపోతుంది.''

ప్రజలలో అపారమైన మెజారిటీకి ప్రజాస్వామ్యమూ, ప్రజల దోపిడీదార్లనూ, పీడకులనూ బలాత్కారంగా అణచివేయడమూ, అనగా ప్రజాస్వామ్యంనుండి మిన హాయించడమూ — యిది పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిజంకు జరిగే పరివర్తన కాలంలో ప్రజాస్వామ్యం పొందే మార్పు.

కమ్యూనిస్టు సమాజంలో మాత్రమే, పెట్టుబడిదార్ల ప్రతిఘటన పూర్తిగా నలిపివేయబడినప్పుడు, పెట్టుబడిదార్లు అదృశ్యమైనప్పుడు, వర్గాలు లేనప్పుడు (అనగా, సామాజిక ఉత్పత్తి సాధనాలతో తమ సంబంధం విషయంలో సమాజంలోని సభ్యుల మధ్య భేదాలు లేనప్పుడు), అప్పుడు మాత్రమే ''రాజ్యం... వుండడం ఆగిపోతుంది,'' ''స్వేచ్ఛను గురించి మాట్లాడడం సాధ్యమౌతుంది.'' అప్పుడు మాత్రమే నిజంగా సంపూర్ణమైన ప్రజాస్వామ్యం సాధ్యమౌతుంది, సాధింపబడుతుంది, యెలాంటి మినహాయింపులూ లేనట్టి ప్రజాస్వామ్యం. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం కృశించిపోవడం ప్రారంభిస్తుంది; యెందుకంటే, ప్రజలు పెట్టుబడిదారీ బానిసత్వంనుండీ, పెట్టుబడిదారీ దోపిడీయొక్క వర్ణనాతీతమైన బీభత్సాలనుండీ, కిరాతకత్వంనుండీ, అసంబద్ధాలనుండీ, అపచారాలనుండీ విముక్తులై, శతాబ్దాలుగా తెలిసినట్టి, వేల యేండ్లుగా నీతిశతకాలలో పునశ్చరణ చేయబడినట్టి సామాజిక సంబంధాల ప్రాథమిక నియమాలను పాటించడానికి క్రమక్రమంగా అలవాటుపడతారు. వాళ్లు బలప్రయోగం లేకుండా, నిర్బంధం లేకుండా, ఒకరికి లొంగివుండడం లేకుండా, నిర్బంధంకొరకు రాజ్యం అనబడే ప్రత్యేక యంత్రాంగం లేకుండా వాటిని పాటించడానికి అలవాటుపడతారు.

''రాజ్యం కృశించిపోతుంది'' అనే నుడికారం చాలా బాగా యెన్నుకోబడింది; యెందుకంటే, అది ఆ ప్రక్రియయొక్క క్రమక్రమత్వాన్నీ, స్వయంజనితత్వాన్నీ, రెంటినీ సూచిస్తుంది. అలవాటు మాత్రమే అలాంటి ఫలితాన్ని కలిగించగలదు, నిస్సందేహంగా కలిగిస్తుంది; దోపిడీ లేనప్పుడు, ఆగ్రహాన్ని రేపేదీ, నిరసననూ, తిరుగుబాటునూ కలిగించేదీ, అణచివేతకు అవసరాన్ని సృష్టించేదీ యేదీ లేనప్పుడు, జనం యెంత నిరభ్యంతరంగా సామాజిక సంబంధాల అవశ్య నియమాలను పాటించడానికి అలవాటుపడేదీ మనం లక్షలసార్లు మనచుట్టూ చూసినాము.

యీవిధంగా పెట్టుబడిదారీ సమాజంలో కత్తిరించబడిన, దౌర్భాగ్యపు, బూటకపు ప్రజాస్వామ్యం వుంది, ధనికులకు, మైనారిటీకి, మాత్రమే ప్రజాస్వామ్యం వుంది. కార్మిక

వర్గ నియంతృత్వం, కమ్యూనిజంకు పరివర్తన చెందే దశ, మొదటిసారి ప్రజలకు, మెజారిటీకి, ప్రజాస్వామ్యాన్ని సృష్టిస్తుంది; దీనితో పాటు దోపిడీదార్లను, మైనారిటీని, అణచివేసే అవసర కార్యం చేస్తుంది. కమ్యూనిజం మాత్రమే నిజంగా పరిపూర్ణమైన ప్రజాస్వామ్యాన్ని యివ్వడానికి సమర్థమైనది; అది యెంత పరిపూర్ణంగా వుంటే అంత త్వరగా అనవసరమైపోయి, తనంతకు తానే కృశించిపోతుంది.

మరొక విధంగా చెప్పాలంటే, పెట్టుబడిదారీ వ్యవస్థలో సరైన అర్థంలో రాజ్యం అనేది వుంటుంది – ఒక వర్గాన్ని మరొక వర్గం, అంతే కాక మెజారిటీని మైనారిటీ అణచడానికి ప్రత్యేక యంత్రం. సహజంగా, దోపిడీ చేయబడే మెజారిటీని దోపిడీచేసే మైనారిటీ క్రమపద్ధతిగా అణచివేయడంలాంటి పని విజయవంతంగా జరగాలంటే, అణచివేతలో దానికి అత్యంత క్రౌర్యమూ, కిరాతకత్వమూ, రక్త సముద్రాలూ అవసర మౌతాయి; బానిసత్వంలో, ఫ్యూడల్ దాస్యంలో, కూలి శ్రమలో మానవజాతి వాస్తవంగా రక్త సముద్రాలలో నడుస్తున్నది.

అంతే కాక, పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిజంకు జరిగే పరివర్తన కాలంలో అణచివేత యింకా అవసర మౌతుంది, కానీ యిప్పుడది దోపిడీ చేయబడే మెజారిటీ దోపిడీచేసే మైనారిటీని అణచివేయడం. ఒక ప్రత్యేక సాధనావళి, అణచివేతకు ఒక ప్రత్యేక యంత్రం, "రాజ్యం," యింకా అవసర మౌతుంది, కానీ యిప్పుడది పరివర్తన చెందే రాజ్యం. కానీ అది సరైన అర్థంలో యిక యెంత మాత్రమూ రాజ్యం కాదు; యెందుకంటే, నిన్నటి కూలి బానిసల మెజారిటీ దోపిడీచేసే మైనారిటీని అణచివేయడం సాపేక్షంగా యెంత సులభమైన, సరళమైన, సహజమైన పని అంటే, బానిసల, లేదా ఫ్యూడల్ దాసుల, లేదా కూలి శ్రామికుల తిరుగుబాట్లను అణచడంకంటె అది యెంతో తక్కువ రక్తపాతం కలిగిస్తుంది, మానవజాతికి యెంతో తక్కువ కష్టనష్టాలు కలిగిస్తుంది. ప్రజానీకంలో యెంత అపారమైన మెజారిటీకి ప్రజాస్వామ్యాన్ని విస్తృతపరచడానికి అది అనుగుణంగా వుంటుందంటే, అణచివేతకు ప్రత్యేక యంత్రంయొక్క అవసరం అదృశ్యం కావడం ప్రారంభిస్తుంది. సహజంగా, యీ పని చేయడానికి మహా క్లిష్టమైన యంత్రం లేకుండా దోపిడీదార్లు ప్రజలను అణచివేయజాలరు, కానీ ప్రజలు దోపిడీదార్లను అతి సరళ "యంత్రం"తో కూడా అణచివేయగలరు, దాదాపు "యంత్రం" లేకుండానే, ప్రత్యేక సాధనావళి లేకుండానే సరళ సాయుధ ప్రజల సంస్థద్వారా (కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్ల లాంటిది అనవచ్చు, ముందుచూపు చూస్తూ).

చివరి విషయం, కమ్యూనిజం మాత్రమే రాజ్యాన్ని పరమ అనవసరం చేస్తుంది, యెందుకంటే అణచివేయబడవలసినవాడు యెవ్వడూ వుండడు – "యెవ్వడూ" అంటే ఒక వర్గం అనే అర్థంలో, ప్రజానీకంలో ఒక నిశ్చితమైన భాగంమీద క్రమపద్ధతి గల

పోరాటం అనే అర్థంలో. మనం ఊహాస్వర్గవాదులం కాదు; వ్యక్తులు అత్యాచారాలు చేసే అవకాశమూ, అలాంటివి తప్పనిసరిగా జరగడమూ మనం యెంత మాత్రమూ నిరాకరించము, అలాంటి అత్యాచారాలను అణచవలసిన అవసరాన్ని నిరాకరించము. కానీ, మొదటి విషయం, దీనికి ప్రత్యేకమైన యంత్రం, అణచివేతకు ప్రత్యేకమైన సాధనావళి, అవసరం లేదు; సాయుధ ప్రజలే యీ పని చేస్తారు — ఒక కొట్లాటను తుదముట్టించడానికి గానీ, ఒక స్త్రీమీద దౌర్జన్యం జరగకుండా అరికట్టడానికి గానీ, ఆధునిక సమాజంలో కూడా, నాగరిక జన సమూహం జోక్యం కలిగించుకునేటంత సరళంగా, నిస్సంకోచంగా. యిక రెండవది, సామాజిక సంబంధాల నియమాల ఉల్లంఘనగా వుండే అత్యాచారాల మౌలిక సామాజిక కారణం ప్రజల దోపిడీ, వాళ్ల లేమిడీ, దారిద్ర్యమూ అని మనకు తెలుసు. యీ ప్రధాన కారణం తొలగిపోవడంతో అత్యాచారాలు అనివార్యంగా ''కృశించిపోవడం'' ప్రారంభిస్తాయి. యెంత వేగంగా, యే క్రమంలో కృశించిపోతాయో మనకు తెలియదు, కానీ అవి కృశించి పోతాయని తప్పక తెలుసు. అవి కృశించిపోవడంతో రాజ్యం కూడా కృశించిపోతుంది.

యీ భవిష్యత్తు విషయంలో యిప్పుడు దేనిని నిర్వచించడం సాధ్యమో దానిని, అనగా కమ్యూనిస్టు సమాజపు నిమ్న, ఉన్నత దశల మధ్య గల భేదాన్ని, మార్క్స్ ఊహాస్వర్గాలు నిర్మించకుండా, మరింత సంపూర్ణంగా నిర్వచించినాడు.

## 3. కమ్యూనిస్టు సమాజపు మొదటి దశ

సోషలిజంలో కార్మికుడు ''తన శ్రమయొక్క పూర్తి ఉత్పాదితాన్ని,'' లేదా ''తగ్గించబడనిదాన్ని'' పొందుతాడు అన్న లాసాల్ భావాన్ని పూర్వపక్షం చేయడానికి మార్క్స్ 'గోతా కార్యక్రమ విమర్శ'లో వివరాలలోకి పోతాడు. సమాజంయొక్క మొత్తం సామాజిక శ్రమనుండి ఒక రిజర్వు నిధినీ, ఉత్పత్తి విస్తృతీకరణకు గాను నిధినీ, యంత్రాల ''అరుగుదల, తరుగుదలలను'' భర్తీచేయడానికి గాను నిధినీ, వగైరాలను తీసివేయాలని మార్క్స్ చూపిస్తాడు. తరువాత, వినియోగ వస్తువులనుండి పరిపాలనా నిర్వహణ ఖర్చులూ, పాఠశాలలూ, ఆస్పత్రులూ, వృద్ధుల వసతిగృహాలూ, వగైరాలకుగాను ఒక నిధిని తీసివేయాలి.

లాసాల్‌యొక్క అస్పష్ట, దుర్గ్రాహ్య, సాధారణ నుడికారం (''కార్మికునికి తన శ్రమయొక్క పూర్తి ఉత్పాదితం'') బదులు, కచ్చితంగా సోషలిస్టు సమాజం తన వ్యవహారాలను యెలా నిర్వహించవలసివుండేదీ మార్క్స్ స్వస్థచిత్తంతో అంచనావేస్తాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ లేని సమాజపు జీవిత పరిస్థితులను నిర్దిష్ట పరిశీలన చేస్తూ, మార్క్స్ యిలా అంటాడు:

"యిక్కడ (కార్మిక పార్టీ కార్యక్రమాన్ని పరిశీలించడంలో) మనం చూడవలసింది యేమిటంటే, తన సొంత పునాదులమీద అభివృద్ధిచెందిన కమ్యూనిస్టు సమాజాన్ని కాదు, తద్వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ సమాజంనుండి అప్పుడప్పుడే ఉద్భవిస్తున్న కమ్యూనిస్టు సమాజాన్ని; కనుక, ప్రతి విషయంలోనూ, ఆర్థికంగా, నైతికంగా, బౌద్ధికంగా, దేని గర్భంనుండి తాను వస్తుందో ఆ పాత సమాజపు ముద్రలను యింకా కలిగివున్నట్టిదాన్ని."

పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంనుండి అప్పుడప్పుడే బయటికి వచ్చినట్టి, ప్రతి విషయంలోనూ పాత సమాజపు ముద్రలను కలిగివున్నట్టి యీ కమ్యూనిస్టు సమాజాన్నే మార్క్సు కమ్యూనిస్టు సమాజపు "మొదటి," లేక నిమ్న దశ అని అనేది.

ఉత్పత్తి సాధనాలు యిక యెంత మాత్రమూ వ్యక్తుల సొంత ఆస్తి కాదు. ఉత్పత్తి సాధనాలు మొత్తం సమాజానికి చెందుతాయి. సమాజంలోని ప్రతి సభ్యుడూ సామాజికంగా అవసరమైన పనిలో కొంత భాగం నిర్వహించి, తాను కొంత పని చేసినట్లు సమాజంనుండి సర్టిఫికెట్ పొందుతాడు. యీ సర్టిఫికెట్‌తో అతను వినియోగ వస్తువుల పబ్లిక్ నిధినుండి తదనురూపమైన ప్రమాణంలో సరుకులు పొందుతాడు. కనుక, పబ్లిక్ నిధికి పోయే శ్రమ పరిమాణం తీసివేయబడిన తర్వాత, ప్రతి కార్మికుడూ సమాజానికి తాను యెంత యిచ్చినాడో అంత సమాజంనుండి పొందుతాడు.

దృశ్యమానంగా "సమానత్వం" రాజ్యం చేస్తున్నది.

కానీ, అలాంటి సమాజ వ్యవస్థను (మామూలుగా సోషలిజం అనబడేది, కానీ కమ్యూనిజంయొక్క మొదటి దశ అని మార్క్సు పేరుపెట్టింది) దృష్టిలో పెట్టుకొని, యిది "న్యాయమైన పంపకం" అనీ, యిది "సమాన శ్రమ ఉత్పాదితంమీద ప్రతివొక్కరికీ గల సమాన హక్కు" అనీ లాసాల్ అన్నప్పుడు, అతను పొరపాటు పడినాడు, ఆ పొరపాటును మార్క్సు బయటపెడతాడు.

మార్క్సు అంటాడు, "సమాన హక్కు" యిక్కడ నిశ్చయంగా వుంది; కానీ అది యింకా "బూర్జువా హక్కే," దీనిలో, ప్రతి హక్కులో లాగే, అసమానత్వం ఇమిడివుంది. సమాన హక్కు అంటే, వాస్తవంలో ఒకలాగ లేని, ఒకరికొకరు సమానులు కాని భిన్న వ్యక్తులకు సమాన కొలతను అన్వయింపజేయడం. అందుకనే "సమాన హక్కు" అనేది సమానతా భంగం, అన్యాయం. వాస్తవంలో, ప్రతివొకడూ మరొకడు చేసినంత సామాజిక శ్రమ చేసి, సామాజిక ఉత్పాదితంలో సమాన భాగం పొందుతాడు (పైన చెప్పిన తీసివేతల తర్వాత).

కానీ మనుషులు ఒకలాగ వుండరు; ఒకడు బలంగా వుంటాడు, ఒకడు బలహీనంగా వుంటాడు, ఒకనికి పెండ్లి అయివుంటుంది, ఒకనికి అయివుండదు; ఒకనికి యెక్కువమందీ, ఒకనికి తక్కువమందీ పిల్లలు వుంటారు; యిలాగే. దీనినుండి మార్క్స్ లాగే నిర్ధారణ యిది:

> "సమాన శ్రమ నిర్వహణతో, తత్ఫలితంగా సామాజిక వినిమయ వస్తువుల నిధిలో సమాన భాగంతో, వాస్తవంలో ఒకనికంటె ఒకడు యెక్కువ పొందుతాడు, ఒకనికంటె ఒకడు ధనవంతుడుగా వుంటాడు, వగైరా. యీ లోపాలన్నీ పరిహరించడానికి, హక్కు సమానంగా కాక, అసమానంగా వుండాలి."

కనుక, కమ్యూనిజంయొక్క మొదటి దశ న్యాయాన్నీ, సమానత్వాన్నీ యింకా సమకూర్చజాలదు: ఐశ్వర్యంలో విభేదాలు, అన్యాయమైన విభేదాలు కూడా, యింకా కొనసాగుతాయి, కానీ మనిషిమీద మనిషి దోపిడీ అసాధ్యమైపోయివుంటుంది, యెందుకంటే, ఉత్పత్తి సాధనాలను — ఫాక్టరీలూ, యంత్రాలూ, భూములూ, వగైరాలను — సంగ్రహించుకోవడమూ, వాటిని సొంత ఆస్తి చేసుకోవడమూ అసాధ్యంగా వుంటుంది. దరహం మీద "సమానత్వం" గురించీ, "న్యాయం" గురించీ లాసాల్ చెప్పే పెటీబూర్జువా, అస్పష్ట నుడికారాలను పటాపంచలు చేయడంలో, మార్క్స్ కమ్యూనిస్టు సమాజంయొక్క — మొదట వ్యక్తులు సంగ్రహించుకున్న ఉత్పత్తి సాధనాల "అన్యాయాన్ని" మాత్రమే రద్దుచేసేటట్లు నిర్బంధింపబడి, వినియోగ వస్తువులను "శ్రమను బట్టి" (అవసరాలను బట్టి కాక) పంపకం ఛేయడం అనే మరొక అన్యాయాన్ని వెంటనే తొలగించడానికి అశక్తమైన కమ్యూనిస్టు సమాజంయొక్క — అభివృద్ధి గతిని చూపిస్తాడు.

సోషలిస్టులు మనుషుల అసమానతను మరచిపోతారనీ, యీ అసమానతను తొలగించాలని "కలలుగంటారనీ" వెకిలి అర్థశాస్త్రజ్ఞులు, బూర్జువా ప్రొఫెసర్లతో సహా, "మన" తుగాన్‌తో సహా, నిరంతరం నిందిస్తారు. అలాంటి నింద, మనకు కనపడుతున్నట్లు, బూర్జువా సిద్ధాంతవేత్తల మితిలేని అజ్ఞానాన్ని మాత్రమే రుజువుచేస్తుంది.

మార్క్స్ మనుషులలోని అనివార్యమైన అసమానతను అత్యంత నిష్ఠగా లెక్కలోకి తీసుకోవడమే కాక, కేవలం ఉత్పత్తి సాధనాలు మొత్తం సమాజంయొక్క సమష్టి ఆస్తిగా మారడంతో (మామూలుగా "సోషలిజం" అనబడేదానితో) పంపకంలోని లోపాలూ, "బూర్జువా హక్కు"లోని అసమానత్వమూ తొలగిపోవనీ, "శ్రమను బట్టి" సరుకులు పంపకమైనంత కాలం యీ అసమానత్వం వుండడం కొనసాగుతుందనీ,

అనే విషయాన్ని కూడా ఆయన లెక్కలోకి తీసుకుంటాడు. కొనసాగిస్తూ, మార్క్స్ యిలా అంటాడు:

> "...కానీ, దీర్ఘ ప్రసవవేదన తరువాత పెట్టుబడిదారీ సమాజంనుండి అప్పుడే ఆవిర్భవించిన కమ్యూనిస్టు సమాజపు మొదటి దశలో యీ లోపాలు అనివార్యం. హక్కు అనేది సమాజంయొక్క ఆర్థిక నిర్మాణంకంటె, తద్వారా నిర్ణయింపబడిన దాని సాంస్కృతిక అభివృద్ధి కంటె ఉన్నతంగా యెన్నడూ వుండజాలదు."

కనుక, కమ్యూనిస్టు సమాజపు మొదటి దశలో (మామూలుగా సోషలిజం అనబడేదానిలో) "బూర్జువా హక్కు" సంపూర్ణంగా రద్దుచేయబడదు, పాక్షికంగా మాత్రమే, అంతవరకు సాధింపబడిన ఆర్థిక విప్లవానికి తగిన నిష్పత్తిలో మాత్రమే, అనగా ఉత్పత్తి సాధనాల విషయంలో మాత్రమే, రద్దుచేయబడుతుంది. "బూర్జువా హక్కు" ఉత్పత్తి సాధనాలను వ్యక్తుల సొంత ఆస్తిగా గుర్తిస్తుంది. సోషలిజం వాటిని సమష్టి ఆస్తిగా మారుస్తుంది. ఆ మేరకు—ఆ మేరకు మాత్రమే—"బూర్జువా హక్కు" అదృశ్యమౌతుంది.

కానీ, దాని యితర భాగానికి సంబంధించినంత వరకు అది కొనసాగుతుంది; సమాజ సభ్యుల మధ్య సరుకుల పంపకంలోనూ, శ్రమను కేటాయించడంలోనూ సర్దుబాటుకర్త (నిర్ణాయక అంశం) యోగ్యతలో అది కొనసాగుతుంది. "పనిచేయనివాడు తినకూడదు" అనే సోషలిస్టు సూత్రం అప్పటికే సాధింపబడింది; "సమానమైన శ్రమ పరిమాణానికి సమానమైన సరుకుల పరిమాణం" అనే మరొక సోషలిస్టు సూత్రం కూడా అప్పటికే సాధింపబడింది. కానీ యిది యింకా కమ్యూనిజం కాదు; అసమానమైన వ్యక్తులకు అసమానమైన (నిజంగా అసమానమైన) శ్రమ పరిమాణాలకు బదులుగా సమానమైన సరుకుల పరిమాణాలను యిచ్చే "బూర్జువా హక్కు"ను యిది యింకా రద్దుచేయదు.

మార్క్స్ అంటాడు, యిది ఒక "లోపం," కానీ కమ్యూనిజంయొక్క మొదటి దశలో యిది అనివార్యం; యెందుకంటే, మనం ఊహాస్వర్గవాదంలో నిమగ్నులం కాకుండా వుండాలంటే, పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి, జనం హక్కుకు యే ప్రమాణమూ లేకుండానే సమాజంకొరకు పనిచేయడం వెంటనే నేర్చుకుంటారని మనం అనుకోకూడదు. అంతే కాక, అలాంటి మార్పుకు కావలసిన ఆర్థిక పూర్వావసరాలు పెట్టుబడిదారీ వ్యవస్థ రద్దు అయిన వెనువెంటనే సృష్టి కావు.

యిప్పుడు "బూర్జువా హక్కు" తప్ప యితర ప్రమాణం యేదీ లేదు. కనుక, యీ మేరకు, రాజ్యానికి అవసరం యింకా నిలిచివుంటుంది: యీ రాజ్యం ఉత్పత్తి సాధనాల

సమష్టి స్వామ్యాన్ని రక్షిస్తూ, శ్రమలోనూ, సరుకుల పంపకంలోనూ సమానత్వాన్ని రక్షిస్తుంది.

యే పెట్టుబడిదార్లూ, యే వర్గాలూ యిక యెంత మాత్రమూ లేనంతమేరకు, తత్ఫలితంగా, అణచబడజాలిన వర్గం యేదీ లేనంతమేరకు, రాజ్యం కృశించిపోతుంది.

కానీ, రాజ్యం పూర్తిగా కృశించిపోలేదు; యెందుకంటే, వాస్తవమైన అసమానత్వాన్ని పవిత్రపరచే ''బూర్జువా హక్కు''ను రక్షించడం యింకా నిలిచివుంది. రాజ్యం సంపూర్ణంగా కృశించిపోవడానికి సంపూర్ణ కమ్యూనిజం అవసరం.

## 4. కమ్యూనిస్టు సమాజపు ఉన్నత దశ

మార్క్స్ యిలా కొనసాగిస్తాడు:

> ''...కమ్యూనిస్టు సమాజపు మరింత ఉన్నతమైన దశలో, శ్రమ విభజనకు మనిషి బానిసలాగ లోబడడమూ, దానితో పాటు మానసిక శ్రమకూ, శారీరిక శ్రమకూ మధ్య గల భేదమూ అదృశ్యమైన తర్వాత, శ్రమ అనేది జీవనోపాధి మాత్రమే కాక, జీవితపు ప్రాథమిక అవసరం అయిన తర్వాత, వ్యక్తి సర్వతోముఖ వికాసం జరిగి, ఉత్పాదక శక్తులు పెరిగి, సామాజిక ఐశ్వర్యపు జలలన్నీ సమృద్ధిగా ప్రవహిస్తున్న తర్వాత — అప్పుడు మాత్రమే బూర్జువా హక్కు అనే సంకుచిత దిఙ్మండలం సంపూర్ణంగా అధిగమింపబడి, సమాజం తన పతాకమీద యిలా రాసుకోగలదు: 'ప్రతివానినుండీ వాని సామర్థ్యాన్ని బట్టి, ప్రతివానికీ వాని అవసరాలను బట్టి!' ''

''రాజ్యమూ,'' ''స్వేచ్ఛా'' అనే మాటలను కలపడంలోని అసంబద్ధతను నిర్దాక్షిణ్యంగా అపహాస్యం చేస్తూ ఎంగెల్స్ చెప్పిన అభిప్రాయాలు యెంత సరైనవో యిప్పుడు మాత్రమే మనం పూర్తిగా గ్రహించగలం. రాజ్యం వున్నంత కాలం స్వేచ్ఛ లేదు. స్వేచ్ఛ వున్నప్పుడు రాజ్యం వుండదు.

రాజ్యం పూర్తిగా కృశించిపోవడానికి ఆర్థిక ఆధారం కమ్యూనిజం అభివృద్ధిలోని ఉన్నత దశ — యెంత ఉన్నతమైన దశ అంటే, ఆ దశలో మానసిక శ్రమకూ, శారీరిక శ్రమకూ మధ్య గల భేదం అంతర్ధానమౌతుంది, తత్పర్యవసానంగా, ఆధునిక సామాజిక అసమానతయొక్క ప్రధాన మూలాలలో ఒకటి అంతర్ధానమౌతుంది; అంతే కాదు, యీ

మూలం కేవలం ఉత్పత్తి సాధనాలను సామాజిక ఆస్తిగా మార్చడంతో, కేవలం పెట్టుబడిదార్ల ఆస్తి హరణంతో యేవిధంగానూ తొలగింపబడజాలనట్టిది.

యీ ఆస్తి హరణం ఉత్పాదక శక్తులు ప్రచండంగా అభివృద్ధి చెందడానికి వీలు కలిగిస్తుంది. యెంత నమ్మశక్యం కానంతగా పెట్టుబడిదారీ వ్యవస్థ యిప్పటికే యీ అభివృద్ధిని మందగింపజేస్తున్నదో చూసినప్పుడు, యిప్పటికే సాధింపబడిన సాంకేతిక స్థాయి ఆధారంతో యెంత పురోగతిని సాధించవచ్చునో గమనించినప్పుడు, పెట్టుబడిదార్ల ఆస్తి హరణం మానవ సమాజపు ఉత్పాదక శక్తుల అపార అభివృద్ధిని అనివార్యంగా కలిగిస్తుందని అత్యంత సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో చెప్పే హక్కు మనకు వుంది. కానీ, యీ అభివృద్ధి యెంత వేగంగా జరిగేదీ, శ్రమ విభజననుండి విడిపోయే సమయానికి, మానసిక శ్రమకూ, శారీరిక శ్రమకూ మధ్య గల భేదాన్ని రద్దుచేసే సమయానికి, శ్రమను ''జీవితపు ప్రాథమిక అవసరం''గా రూపుమార్చే సమయానికి, యిది యెంత త్వరగా చేరుకొనేదీ — మనకు తెలియదు, తెలియజాలదు.

అందుకనే, రాజ్యం అనివార్యంగా కృశించిపోవడం గురించి మాత్రమే మాట్లాడే హక్కు వుంది మనకు, యీ ప్రక్రియయొక్క సుదీర్ఘత్వాన్నీ, కమ్యూనిజంలోని ఉన్నత దశయొక్క అభివృద్ధి వేగంమీద యిది ఆధారపడడాన్నీ నొక్కిచెప్పతూ, కృశించిపోవడం యెంత కాలం తీసుకుంటుంది, యే నిర్దిష్ట రూపాలు ధరిస్తుంది, అనే ప్రశ్నలను వదలేస్తూ; యెందుకంటే, యీ ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి కావలసిన సమాచారం యేదీ లేదు.

రాజ్యం యెప్పుడు సంపూర్ణంగా కృశించిపోగలిగి వుంటుందంటే, సమాజం ''ప్రతివానినుండీ వాని సామర్థ్యాన్ని బట్టి, ప్రతివానికీ వాని అవసరాలను బట్టి'' అనే నియమాన్ని అవలంబించినప్పుడు, అనగా, తమ సామర్థ్యాన్ని బట్టి ఐచ్ఛికంగా పనిచేసేటంతగా మనుషులు సామాజిక సంబంధాల మౌలిక నియమాలను పాటించడానికి అలవాటుపడినప్పుడు, వాళ్ల శ్రమ అంత ఉత్పాదక మైనప్పుడు. ''బూర్జువా హక్కు అనే సంకుచిత దిఙ్మండలం'' — తాను మరొకనికంటె ఒక అరగంట సేపు యెక్కువ పనిచేసినానా అనీ, తనకు మరొకనికంటె తక్కువ జీతం వస్తున్నదా అనీ షైలాక్ లాగ హృదయ రహితంగా లెక్కలు కట్టేటట్లు* నిర్బంధించేది — యీ సంకుచిత దిఙ్మండలం అప్పుడు అధిగమింపబడుతుంది. అప్పుడు, సరుకులు పంపకం చేయడంలో, ప్రతివానికీ వచ్చే పరిమాణాన్ని

---

* షైలాక్ — 'వెనిస్ వర్తకుడు' అనే షేక్స్పియర్ నాటకంలో ఒక పాత్ర, క్రూరమైన వడ్డీ వ్యాపారి; సకాలంలో రుణం తీర్చని రుణస్తుడు, అంగీకరింపబడిన షరతుల ప్రకారం, ఒక పౌండు కండలు కోసి యివ్వాలని పట్టుబట్టినవాడు. — సం.

నియంత్రించే అవసరం వుండదు సమాజానికి; ప్రతివాడూ తన ''అవసరాలను బట్టి'' స్వేచ్ఛగా తీసుకుంటాడు.

అలాంటి సామాజిక వ్యవస్థ ''పచ్చి ఊహాస్వర్గం'' అని ఉద్ఘాటించడమూ, ఒక వ్యక్తి శ్రమమీద యే అజమాయిషీ లేకుండా కార్లూ, పియానోలూ, మొదలైనవి యెన్నైనా సమాజంనుండి పొందే హక్కును ప్రతివొకరికీ వాగ్దానం చేస్తున్నారని సోషలిస్టులను యీసడించడమూ బూర్జువా దృక్పథంనుండి సులభం. యీనాటికీ అత్యధిక బూర్జువా ''విద్వాంసులు'' యిలాంటి యీసడింపుకు పరిమితమౌతారు — తద్వారా తమ అజ్ఞానాన్నీ, పెట్టుబడిదారీ వ్యవస్థకు తమ స్వార్థపూరిత సమర్థననూ బయటపెట్టుకుంటూ.

అజ్ఞానం — యెందుకంటే, కమ్యూనిజం అభివృద్ధిలోని ఉన్నత దశ వచ్చేస్తుంది అని ''వాగ్దానం చేయా''లనే ఆలోచన యే సోషలిస్టు బుర్రలోకీ యెప్పుడూ రాలేదు; అది వస్తుందనే గొప్ప సోషలిస్టుల జోస్యం మాట యేమిటంటే, దానికి వుండవలసింది యీనాటి శ్రమ ఉత్పాదకత కాదు, పొమ్యలోవ్‌స్కీ కథలలో ''వట్టి తమాషా కోసం'' ప్రజా సంపదకు చెందిన సరుకులను పాడుచేస్తూ, అసాధ్యమైన కోరికలు కోరే విద్యార్థులలాంటి యీనాటి అల్పబుద్ధులు కాదు.

కమ్యూనిజంయొక్క ''ఉన్నత'' దశ వచ్చిందాకా, శ్రమ పరిమాణంమీదా, వినియోగపు పరిమాణంమీదా సమాజంచేతా, రాజ్యంచేతా అత్యంత కచ్చితమైన అజమాయిషీ వుండాలని సోషలిస్టులు డిమాండు చేస్తారు; కానీ యీ అజమాయిషీ పెట్టుబడిదార్ల ఆస్తి హరణంతో, పెట్టుబడిదార్లమీద కార్మికుల అజమాయిషీని నెలకొల్పడంతో ప్రారంభం కావాలి, బ్యూరాక్రట్ల రాజ్యంచేత కాక, సాయుధ కార్మికుల రాజ్యంచేత చలాయింపబడాలి.

పెట్టుబడిదారీ వ్యవస్థకు బూర్జువా సిద్ధాంతవేత్తల (వాళ్ల ఆశ్రితులైన త్సెరెతేలి, చెర్నోవ్* అండ్ కంపెనీలాంటివాళ్ల) స్వార్థపూరిత సమర్థన యెందులో వుందంటే, వాళ్లు యీనాటి రాజకీయాల ముఖ్యమైన, తీవ్రమైన సమస్యకు బదులు — పెట్టుబడిదార్ల ఆస్తి హరణం చేయడమూ, పౌరుల నందరినీ ఒకేఒక బ్రహ్మాండమైన ''సిండి

---

* త్సెరెతేలి, ఐ. జి. (1882–1959) — మెన్షివిక్ నాయకుడు, 1917లో బూర్జువా తాత్కాలిక ప్రభుత్వ విధానాన్ని బలపరచినాడు.

చెర్నోవ్, వి. యం. (1876–1952) — సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ నాయకుడు, 1917లో బూర్జువా తాత్కాలిక ప్రభుత్వ విధానాన్ని బలపరచినాడు. — సం.

కేటు''యొక్క, అనగా మొత్తం రాజ్యంయొక్క, కార్మికులుగానూ, యితర ఉద్యోగులు గానూ మార్చడమూ, యీ ''సిండికేటు'' పని నంతటినీ నిజంగా ప్రజాస్వామికమైన రాజ్యానికి, కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్ల రాజ్యానికి, పూర్తిగా లోబరచడమూ అనే సమస్యకు బదులు — దాని స్థానంలో సుదూర భవిష్యత్తును గురించిన వాదాలనూ, మాటలనూ తెచ్చిపెడతారు.

వాస్తవంలో, వ్యుత్పన్నుడైన ప్రొఫెసరూ, అతనివెంట అల్పబుద్ధులూ, వాళ్లవెంట త్సెరెతేలిలూ, చెర్నోవ్‌లూ బోల్షివిక్కుల అర్థం పర్థంలేని ఊహాస్వర్గాల గురించీ, ఉద్రేకపూరిత వాగ్దానాల గురించీ, సోషలిజం ''ప్రవేశపెట్టడం''యొక్క అసాధ్యతను గురించీ మాట్లాడినప్పుడు, వాళ్ల మనసులో వున్నది కమ్యూనిజంయొక్క ఉన్నత దశ, యెవరూ యెప్పుడూ వాగ్దానం చేయనట్టిది, ''ప్రవేశపెట్టా''లని ఆలోచన కూడా చేయనట్టిది, యెందుకంటే, దరహంమీద చెప్పాలంటే, అది ''ప్రవేశపెట్ట''బడ జాలనిది.

దీనితో మనం సోషలిజంకూ, కమ్యూనిజంకూ మధ్య గల శాస్త్రీయ విభేద సమస్య వద్దకు వస్తాం — ''సోషల్ డెమొక్రట్'' అనే పేరు సరైనది కాకపోవడం గురించిన పూర్వోక్తవాదంలో ఎంగెల్స్ ప్రస్తావించిన సమస్యవద్దకు. రాజకీయంగా, కమ్యూనిజంయొక్క మొదటి, లేక నిమ్న దశకూ, ఉన్నత దశకూ మధ్య గల విభేదం, కాలాంతరాన, బహుశా ప్రచండంగా వుంటుంది. కానీ, యిప్పుడు, పెట్టుబడిదారీ వ్యవస్థలో, యీ భేదాన్ని గుర్తించడం పరిహాసాస్పదం; యెక్కడైనా ఒకరు అరాజకవాదులు మాత్రమే దీనికి ప్రథమ ప్రాముఖ్యం యివ్వవచ్చు (క్రొపోత్కిన్‌లూ, గ్రావ్, కొర్నెలిస్సేన్ తదితర అరాజకవాద మొనగాళ్లా సోషల్ జాతీయ దురహంకారులుగా, లేదా, ఆత్మగౌరవాన్నీ, అంతరాత్మనూ నిలుపుకున్న గె అన్నట్లు, అరాజకవాద కందక సైనికులుగా, ''ప్లెహానోవ్'' లాగ మారిపోవడంనుండి యేమీ నేర్చుకోనివాళ్లు అరాజకవాదులలో యింకా యెవరైనా వుంటే).

కానీ సోషలిజంకూ, కమ్యూనిజంకూ మధ్య గల శాస్త్రీయ విభేదం స్పష్టంగా వుంది. మామూలుగా సోషలిజం అనబడేదానికి మార్క్స్ కమ్యూనిస్టు సమాజపు మొదటి దశ, లేక నిమ్న దశ, అని పేరుపెట్టినాడు. ఉత్పత్తి సాధనాలు సమష్టి ఆస్తి అయ్యే మేరకు, ''కమ్యూనిజం'' అనే మాట యిక్కడ కూడా వర్తిస్తుంది — యిది పూర్తి కమ్యూనిజం కాదు అనే విషయం మనం మరచిపోకుండా వుండే పక్షంలో. మార్క్స్ వివరణలలోని గొప్ప ప్రాముఖ్యం యేమిటంటే, ఆయన యిక్కడ కూడా భౌతికవాద పరస్పరవాదాన్ని, అభివృద్ధి సిద్ధాంతాన్ని, స్థిరంగా వర్తింపజేస్తూ, కమ్యూనిజంను పెట్టుబడిదారీ వ్యవస్థనుండి అభివృద్ధి అయ్యేదిగా పరిగణిస్తాడు. పండితతత్వ పూర్వ

కంగా సృష్టింపబడిన, "కల్పించబడిన'' నిర్వచనాలకూ, మాటల గురించిన నిష్ఫల వివాదాలకూ (సోషలిజం అంటే యేమిటి? కమ్యూనిజం అంటే యేమిటి?) బదులు, మార్క్స్ కమ్యూనిజంయొక్క ఆర్థిక పరిణతిలోని దశలు అనదగిన వాటి పరిశీలన యిస్తాడు.

కమ్యూనిజం, దాని మొదటి దశలో, అప్పటి కింకా ఆర్థికంగా పూర్తి పరిపక్వం గానూ, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క సంప్రదాయాలనుండి గానీ, అవశేషాలనుండి గానీ పూర్తి విముక్తంగానూ వుండజాలదు. కనుకనే కమ్యూనిజం తన మొదటి దశలో ''బూర్జువా హక్కు అనే సంకుచిత దిజ్మండ''లాన్ని నిలుపుకోవడం అనే ఆసక్తికరమైన విషయం. సహజంగానే, వినియోగ వస్తువుల పంపకం విషయంలో బూర్జువా హక్కు వుండడమంటే, అనివార్యంగా బూర్జువా రాజ్యం వుండడ మన్నమాట; యెందుకంటే, హక్కు ప్రమాణాలను పాటించేటట్లు నిర్బంధించ గల సాధనావళి లేకుండా హక్కు అనేది అర్థం లేనిది.

దీనినిబట్టి యేర్పడేది యేమిటంటే, కమ్యూనిజంలో కొంత కాలంపాటు బూర్జువా హక్కు మాత్రమే కాక, బూర్జువా రాజ్యం కూడా వుంటుంది, బూర్జువావర్గం లేకుండా!

యిది విషమాలంకారం లాగో, లేదా వట్టి పరస్పరవాదపు పొడుపుకథలాగో కనిపించవచ్చు; అసాధారణంగా గంభీరమైన దీని సారాన్ని అధ్యయనం చేయడానికి కించిత్తు ప్రయత్నం కూడా చేయనివాళ్లు మార్క్సిజంలో యిలాంటివి వున్నాయని తరుచు నిందిస్తారు.

వాస్తవంలో, ప్రకృతిలోనూ, సమాజంలోనూ పాతదాని అవశేషాలు కొత్తదానిలో యింకా బతికివుండడం మనకు నిత్య జీవితంలో అడుగడుగునా కనిపిస్తుంది. మరి, మార్క్స్ యిష్టారాజ్యంగా కమ్యూనిజంలోకి ''బూర్జువా'' హక్కును చొప్పించలేదు, పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంనుండి ఉద్భవిస్తున్న సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా అనివార్యమైన దానిని ఆయన తీసుకొన్నాడు.

తన విమోచనకు పెట్టుబడిదార్లతో చేసే పోరాటంలో కార్మికవర్గానికి ప్రజాస్వామ్యం అపారమైన ప్రాముఖ్యం కలది. కానీ, ప్రజాస్వామ్యం అధిగమించరాని హద్దు యేవిధంగానూ కాదు; అది ఫ్యూడలిజంనుండి పెట్టుబడిదారీ వ్యవస్థకూ, పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కమ్యూనిజంకూ పోయే దారిలోని ఒక దశ మాత్రమే.

ప్రజాస్వామ్యం అంటే సమానత్వం. సమానత్వం అంటే వర్గాల రద్దు అని దానికి సరైన వ్యాఖ్యానం యిస్తే, సమానత్వంకొరకు కార్మికవర్గం చేసే పోరాటంయొక్క, నినాదంగా సమానత్వంయొక్క మహత్తర ప్రాముఖ్యం స్పష్టమౌతుంది. కానీ ప్రజాస్వామ్యమంటే లాంఛనప్రాయమైన సమానత్వం మాత్రమే. ఉత్పత్తి సాధనాల యాజమా

న్యానికి సంబంధించి సమాజ సభ్యు లందరికీ సమానత్వం, అనగా శ్రమలో, వేతనాలలో సమానత్వం, సాధింపబడిన వెంటనే, మరింత ముందుకు, లాంఛనప్రాయమైన సమానత్వంనుండి యధార్థమైన సమానత్వానికి, "ప్రతివానినుండీ వాని సామర్థ్యాన్ని బట్టి, ప్రతివానికీ వాని అవసరాలను బట్టి" అనే నియమం అమలు జరిగే స్థితికి, పురోగమించే సమస్య మానవాళికి అనివార్యంగా యెదురౌతుంది. యే దశలద్వారా, యే ఆచరణాత్మక చర్యలద్వారా మానవాళి యీ అత్యున్నత లక్ష్యానికి పురోగమించేదీ మనకు తెలియదు, తెలియజాలదు. కానీ, సోషలిజమంటే నిర్జీవమైనదనీ, గడ్డకట్టినదనీ, శాశ్వతంగా నిర్ణయమైపోయినదనీ అనుకునే మామూలు బూర్జువా అవగాహన యెంత హద్దులేని అబద్ధమో గుర్తించడం ముఖ్యం. వాస్తవంలో, సాంఘిక జీవిత, వ్యక్తి జీవిత రంగాలన్నిటిలోనూ, మొదట మెజారిటీకీ, తరువాత మొత్తం ప్రజానీకానికీ వర్తించే సత్వరమైన, అసలైన, నిజంగా సామూహికమైన పురోగమనానికి సోషలిజం మాత్రమే ప్రారంభంగా వుంటుంది.

ప్రజాస్వామ్యం రాజ్యంయొక్క ఒక రూపం, దాని రకాలలో ఒకటి. తత్ఫలితంగా అది ప్రతి రాజ్యంలాగే, ఒక వైపున, వ్యక్తులమీద సంఘటితమైన, క్రమపద్ధతి గల బలప్రయోగానికి ప్రాతినిధ్యం వహిస్తుంది; కానీ, మరొకవైపున, అది పౌరుల సమానత్వాన్ని, రాజ్య నిర్మాణాన్ని నిర్ణయించడానికీ, రాజ్యాన్ని నిర్వహించడానికీ అందరికీ గల సమాన హక్కును, లాంఛనగతంగా గుర్తిస్తుంది. మళ్లీ, దీని ఫలితంగా, ప్రజాస్వామ్యంయొక్క ఒకానొక అభివృద్ధి దశలో అది పెట్టుబడిదారీ వ్యవస్థతో విప్లవ పోరాటం చేసే వర్గాన్ని, కార్మికవర్గాన్ని, మొదట ఐక్యపరచి, దానికి వీలు కలిగిస్తుంది బూర్జువా రాజ్య యంత్రాన్నీ, రిపబ్లికన్ బూర్జువా రాజ్య యంత్రాన్ని కూడా, స్థాయీ సైన్యాన్నీ, పోలీసులనూ, బ్యూరాక్రసీనీ నలిపి, నుసిచేసి, భూతలంమీదనుండి తుడిచిపారవేయడానికీ, వాటి స్థానంలో మరింత ప్రజాస్వామికమైన రాజ్య యంత్రాన్ని — అయినప్పటికీ రాజ్య యంత్రాన్నే, యావత్తు ప్రజానీకం పాల్గొనే మిలీషియాగా యేర్పడడానికి పూనుకునే సాయుధకార్మికుల రూపంలో వున్న రాజ్య యంత్రాన్ని — నెలకొల్పడానికీ.

యిక్కడ "పరిమాణం గుణంగా మారుతుంది:" ప్రజాస్వామ్యంయొక్క అలాంటి స్థాయిలో యిమిడివుంది బూర్జువా సమాజపు హద్దులను అధిగమించడమూ, దాని సోషలిస్టు పునర్నిర్మాణాన్ని ప్రారంభించడమూ. రాజ్య నిర్వహణలో నిజంగా అందరూ పాల్గొంటే పెట్టుబడిదారీ వ్యవస్థ తన పట్టును నిలుపుకోలేదు. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి రాజ్య నిర్వహణలో పాల్గొనడానికి నిజంగా "అందరికీ" వీలు కలిగించే పూర్వ పరిస్థితులను సృష్టిస్తుంది. యీ పూర్వ పరిస్థితులలో కొన్ని యివి: సార్వజనీన అక్షరాస్యత, పలు అత్యంత పురోగామి దేశాలలో యిప్పటికే సాధింపబడినట్టిది; తపాలా శాఖా, రైల్వేలూ, పెద్ద ఫాక్టరీలూ, భారీ వాణిజ్యమూ, బాంకింగూ, వగైరా,

నగైరాల (బహ్మాండమైన, సంక్లిష్టమైన, సామాజికీకృత సాధనావళిచేత లక్షోపలక్షల కార్మికులకు ''తర్ఫీదూ, క్రమశిక్షణా.''

యీ ఆర్థిక పూర్వ పరిస్థితులు వుంటే, పెట్టుబడిదార్లనూ, బ్యూరాక్రట్లనూ కూలదోసిన తర్వాత, వాళ్ల స్థానంలో, ఉత్పత్తిమీదా, పంపకంమీదా చేసే అజమాయిషీలోనూ, శ్రమ, ఆహార పదార్థాల లెక్కలు రాయడంలోనూ, సాయుధ కార్మికులను, మొత్తం సాయుధ ప్రజానీకాన్ని, పెట్టడానికి వెంటనే, తెల్లవారేలోపల, పూనుకోవడం యెంతైనా సాధ్యం. (అజమాయిషీ, లెక్కలు రాయడమూ అనే సమస్యా, యింజనీర్లూ, వ్యవసాయ శాస్త్రజ్ఞులూ, మొదలైన శాస్త్రీయంగా తర్ఫీదు పొందిన సిబ్బంది సమస్యా ఒకటే అనుకోకూడదు. యీ పెద్దమనుషులు యీనాడు పెట్టుబడిదార్ల అభీష్టాలకు విధేయంగా పనిచేస్తున్నారు, రేపు సాయుధ కార్మికుల అభీష్టాలకు విధేయంగా యింతకంటె బాగా కూడా పనిచేస్తారు.)

లెక్కలు రాయడం, అజమాయిషీ — అది కమ్యూనిస్టు సమాజపు మొదటి దశ ''సాఫీగా నడవడానికి,'' సక్రమంగా పనిచేయడానికి, ప్రధానంగా కావలసింది. సాయుధ కార్మికులతో యేర్పడిన రాజ్యానికి పౌరు లందరూ వేతనపు ఉద్యోగులుగా మారుతారు. పౌరు లందరూ యేకైక దేశవ్యాప్త రాజ్య ''సిండికేటు''కు ఉద్యోగులూ, శ్రామికులూ అవుతారు. కావలసిందల్లా యేమిటంటే, వాళ్ల సమానంగా పనిచేయడమూ, పనిలో తమ సక్రమమైన భాగం చేయడమూ, సమానమైన వేతనం పొందడమూ. దీనికి అవసరమైన లెక్కలు రాయడమూ, అజమాయిషీ అనేవి పెట్టుబడిదారీ వ్యవస్థచేత గరిష్ఠంగా సరళీకరింపబడి, తనిఖీ చేయడమూ, రికార్డు చేయడమూ, కూడిక, తీసివేత, హెచ్చింపు, భాగింపుల జ్ఞానమూ, తగిన రసీదులు యివ్వడమూ అనే — యే అక్షరాస్యుడైనా నిర్వహించగల — సరళ కార్యాలుగా కుదింపబడినాయి.*

జనంలో మెజారిటీ స్వతంత్రంగా, ప్రతిచోటా అలాంటి లెక్కలు రాయడమూ, (యిప్పుడు ఉద్యోగులుగా మారిన) పెట్టుబడిదార్లమీదా, తమ పెట్టుబడిదారీ అలవాట్లు నిలుపుకొనే మేధావి పెద్దమనుషులమీదా అలాంటి అజమాయిషీ నిర్వహించడమూ ప్రారంభించినప్పుడు, యీ అజమాయిషీ నిజంగా సార్వత్రికమూ, సాధారణమూ, ప్రజాగతమూ అవుతుంది; దీనినుండి తప్పించుకొని పోవడం జరగదు, ''తప్పించుకొని పోవడానికి మరొకచోటు వుండదు.''

---

* రాజ్యంయొక్క మరీ ముఖ్యమైన విధులు కార్మికులే స్వయంగా నిర్వహించే అలాంటి లెక్కలు రాయడానికీ, అజమాయిషీకీ కుదింపబడినప్పుడు, అది ''రాజకీయ రాజ్యం''గా వుండడం ఆగిపోతుంది, ''సామాజిక విధులు తమ రాజకీయ స్వభావం కోల్పోయి, కేవలం పరిపాలనా నిర్వహణ క్రియలు అవుతాయి.'' (చూ: ప్రకరణం IV, 2, అరాజకవాదులతో ఎంగెల్స్ వివాదం.)

సమాజమంతా శ్రమలోనూ, జీతంలోనూ సమానత్వం గల యేకైక ఆఫీసూ, యేకైక ఫాక్టరీ అవుతుంది.

పెట్టుబడిదార్లను ఓడించిన తర్వాత, దోపిడీదార్లను కూలదోసిన తర్వాత కార్మిక వర్గం మొత్తం సమాజానికి విస్తృతపరచే యీ "ఫాక్టరీ" క్రమశిక్షణ యెంత మాత్రమూ మన ఆశయం కాదు, మన అంతిమ గమ్యం కాదు. పెట్టుబడిదారీ దోపిడీలోని దారుణాలనుండీ, యేహ్యాలనుండీ సమాజాన్ని ఆద్యంతం ప్రక్షాళనం చేయడానికీ, యితోధిక పురోగతికీ యిది అవశ్యమైన మెట్టు మాత్రమే.

సమాజంలోని సభ్యు లందరూ, లేదా కనీసం అపారమైన మెజారిటీ, తామే రాజ్యాన్ని నిర్వహించడం నేర్చుకొని, యీ పనిని తమ చేతుల్లోకే తీసుకొని, తృణప్రాయమైన పెట్టుబడిదార్ల మైనారిటీమీదా, తమ పెట్టుబడిదారీ అలవాట్లను నిలుపుకోగోరే పెద్దమనుషులమీదా, పెట్టుబడిదారీ వ్యవస్థచేత ఆద్యంతం కలుషితమైన కార్మికులమీదా అజమాయిషీని యేర్పాటుచేసినప్పుడు — ఆ తరుణంనుండి యెలాంటి ప్రభుత్వమైనా వుండవలసిన అవసరం పూర్తిగా అదృశ్యం కావడం ప్రారంభమవౌతుంది. ప్రజాస్వామ్యం యెంత పరిపూర్ణంగా వుంటే, అంత దగ్గరగా వుంటుంది అది అనవసరమయ్యే తరుణం. సాయుధ కార్మికులతో యేర్పడిన "రాజ్యం," "సరైన అర్థంలో యిక యెంత మాత్రమూ రాజ్యం కానట్టిది," యెంత ప్రజాస్వామికంగా వుంటే, అంత వేగంగా రాజ్యంయొక్క ప్రతి రూపమూ కృశించిపోవడం ప్రారంభమవౌతుంది.

యెందుకంటే, అందరూ సామాజిక ఉత్పత్తిని నిర్వహించడం నేర్చుకొని, వాస్తవంగా స్వతంత్రంగా నిర్వహించినప్పుడు, స్వతంత్రంగా లెక్కలు రాసి, పరరక్తోపజీవులమీదా, ధనవంతుల పుత్రులమీదా, మోసగాళ్లమీదా, యితర "పెట్టుబడిదారీ సంప్రదాయాల పరిరక్షకుల"మీదా అజమాయిషీ చలాయించినప్పుడు, యీ ప్రజాగతమైన లెక్కలు రాయడంనుండీ, అజమాయిషీనుండీ తప్పించుకోవడం యెంత నమ్మరానంత కష్టమవౌతుందంటే, యెంత అరుదైన మినహాయింపు అవుతుందంటే, బహుశా యెంత సత్వర, తీవ్ర శిక్షకు గురి అవుతుందంటే (యెందుకంటే, సాయుధ కార్మికులు కార్యవాదులు, దుర్బల హృదయపు మేధావులు కాదు, యెవరూ తమను చులకన చేయడానికి అంగీకరించనివాళ్లు), సమష్టి సమాజపు సరళ, మౌలిక నియమాలను పాటించే అవసరం అతి త్వరగా అలవాటు అవుతుంది.

అప్పుడు, కమ్యూనిస్టు సమాజపు మొదటి దశనుండి దాని ఉన్నత దశకు పరివర్తన జరగడానికీ, దానితోపాటు రాజ్యం సంపూర్ణంగా కృశించిపోవడానికీ ద్వారం పూర్తిగా తెరచుకుంటుంది.

1917 ఆగస్టు — సెప్టంబరులో రచించబడింది

# రాజ్యం గురించి మార్క్సిజం

(కొంత భాగం)

ఆ విధంగా, కార్మికవర్గ నియంతృత్వం ఒక ''రాజకీయ పరివర్తన దశ;'' యీ దశకు చెందిన రాజ్యం రాజ్యంనుండి అరాజ్యానికి పరివర్తన కూడా అనేది స్పష్టం, అనగా ''సరైన అర్థంలో యిక యెంత మాత్రమూ రాజ్యం కానట్టిది.'' కనుక, యీ విషయంమీద మార్క్స్, ఎంగెల్స్‌లు యెంత మాత్రమూ ఒకరి నొకరు వ్యతిరేకించ లేదు.

యింకా మార్క్స్ ''కమ్యూనిస్టు సమాజపు భావి రాజ్యవ్యవస్థ'' గురించి మాట్లాడుతాడు!! కనుక, ''కమ్యూనిస్టు సమాజం''లో కూడా రాజ్యం వుంటుంది!! యిక్కడ వైరుధ్యం యేమీ లేదా?

లేదు:

| | |
|---|---|
| బూర్జువావర్గానికి రాజ్యం ఆవసరం | I ,— — పెట్టుబడిదారీ సమాజంలో సరైన అర్థంలో రాజ్య |
| కార్మికవర్గానికి రాజ్యం అవసరం | II — — పరివర్తన (కార్మికవర్గ నియంతృత్వం): పరివర్తన రకానికి చెందిన రాజ్యం (సరైన అర్థంలో రాజ్యం కాదు) |
| రాజ్యం అవసరం లేదు, అది కృశించిపోతుంది | III — — కమ్యూనిస్టు సమాజం: రాజ్యం కృశించిపోవడం. |

పూర్తి సమన్వయమూ, స్పష్టతా!!

లేకపోతే:

I — ధనికులకూ, కార్మికవర్గంలో ఒక పల్చని పొరకూ మాత్రమే ప్రజాస్వామ్యం. [బీదలు దాన్ని గురించి ఆలోచించే స్థితిలో వుండరు!]

I — ప్రజాస్వామ్యం అనేది అపవాదం మాత్రమే, యెప్పుడూ పరిపూర్ణంగా వుండదు....

II — బీదలకు, ప్రజానీకంలో $^{9}/_{10}$ వంతులకు, ప్రజాస్వామ్యం, ధనికుల ప్రతిఘటనకు బలవంతపు అణచివేత

II — ప్రజాస్వామ్యం దాదాపు పరిపూర్ణం, బూర్జువావర్గ ప్రతిఘటనయొక్క అణచివేతచేత మాత్రమే పరిమితమైనది

III — పరిపూర్ణ ప్రజాస్వామ్యం, యిది అలవాటు అవుతుంది, కనుక కృశించిపోతూ వుంటుంది, దీని స్థానంలో ''ప్రతివాని నుండీ వాని సామర్థ్యాన్నిబట్టి, ప్రతివానికీ వాని అవసరాలను బట్టి'' అనే సూత్రం వస్తూ వుంటుంది.

III — నిజంగా పరిపూర్ణమైన ప్రజాస్వామ్యం, అలవాటు అవుతూ, కనుక కృశించిపోతూ వుంటుంది.... పరిపూర్ణ ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్య రాహిత్యానికి సమానం. యిది విషమాలంకారం కాదు, సత్యం!

లెనిన్ ప్రకీర్ణకం, సంపుటి XIV
1930 లో మొదటిసారి ప్రచురింపబడింది

# పోటీని యేర్పరచడం యెలా?

పోటీనీ, సొంత ప్రయత్నాన్నీ, పెట్టుబడిదారులయొక్క, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సమస్త యితర సద్గుణాలనూ, వరాలనూ పొగడుతూ బూర్జువా రచయితలు రీములకొద్దీ కాగితాలు ఖర్చు చేసినారు, చేస్తున్నారు. సోషలిస్టులు యీ సద్గుణాల ప్రాముఖ్యాన్ని అర్థంచేసుకోడానికి నిరాకరిస్తున్నారనీ, ''మానవ స్వభావాన్ని'' నిర్లక్ష్యం చేస్తున్నారనీ వాళ్లను నిందించినారు. కానీ, వాస్తవంలో, యే సరుకుల ఉత్పత్తిలో పోటీ అనేది ప్రయత్నాన్నీ, చురుకుదనాన్నీ, సాహసపు చొరవనూ గణనీయమైన విస్తృతిలో అభివృద్ధి చేయగలదో ఆ చిన్న, స్వతంత్ర సరుకుల ఉత్పత్తిని పెట్టుబడిదారీ వ్యవస్థ యేనాడో తొలగించి, దాని స్థానంలో భారీ, అతి భారీ ఉత్పత్తినీ, జాయింటు స్టాక్ కంపెనీలనూ, సిండికేట్లనూ, యితర గుత్త సంస్థలనూ పెట్టింది. అలాంటి పెట్టుబడిదారీ వ్యవస్థలో పోటీ అంటే ప్రజా బాహుళ్యంయొక్క, దాని అపారమైన మెజారిటీయొక్క, ప్రతి వందమంది శ్రామికులలోనూ తొంబై తొమ్మిదిమందియొక్క, ప్రయత్నాన్నీ, చురుకుదనాన్నీ, సాహసపు చొరవనూ నమ్మశక్యంకానంత పాశవికంగా అణచివేయడం; పోటీని తొలగించి, దాని స్థానంలో ఆర్థిక వంచనా, బంధుప్రీతీ, సామాజిక విచ్చెనలోని పైమెట్లలో దాస్యభావమూ వచ్చినాయని కూడా దాని అర్థం.

తద్వ్యతిరేకంగా, సోషలిజం పోటీని అంతమొందించడానికి బదులు, దానిని నిజంగా విస్తృతమైన, నిజంగా సామూహికమైన ప్రమాణంలో వినియోగించుకోడానికి — వేల, లక్షల సంఖ్యలో పెట్టుబడిదారీ వ్యవస్థచేత నలిపివేయబడి, అణచివేయబడి, గొంతు నులిమివేయబడిన ప్రజలలో అంత సమృద్ధిగా వున్న తమ శక్తులనూ, తమ సామర్థ్యాలనూ, తమ ప్రజ్ఞలనూ ప్రదర్శించగల శ్రమ రంగంలోకి మెజారిటీ శ్రామిక ప్రజలను నిజంగా ఆకర్షించడానికి — మొట్టమొదటి సారి అవకాశాన్ని సృష్టిస్తుంది.

యిప్పుడు సోషలిస్టు ప్రభుత్వం అధికారంలో వుంది గనుక, పోటీని యేర్పాటు చేయడం మన కర్తవ్యం.

బూర్జువాల వంది మాగధులు సోషలిజంను యేకరూపపు, నిత్యకృత్యపు, రోకటి పాటలాంటి, నిస్సారపు బారకాసుల వ్యవస్థగా వర్ణించినారు. డబ్బుసంచుల గులాములూ, దోపిడీదార్ల యెంగిలి మెతుకులు తినేవాళ్లూ అయిన బూర్జువా మేధావులు పెట్టు బడిదారీ వ్యవస్థలో కఠిన శిక్షకూ, కష్టమైన, రోకటి పాటలాంటి శ్రమకూ, కటిక దారిద్ర్యానికీ, అర్ధ పస్తులకూ గురైన ప్రజలను "జడిపించడానికి" సోషలిజంను ఒక భూతంగా వాడుకున్నారు. యీ కఠిన శిక్షనుండి ప్రజల విముక్తికి మొదటి చర్య యేమిటంటే, భూ యెస్టేట్లను స్వాధీనం చేసుకోవడమూ, కార్మికుల అజమాయిషీ ప్రవేశపెట్టడమూ, బాంకులను జాతీయం చేయడమూ. తరువాతి చర్యలు యేమిటంటే, ఫాక్టరీ, మిల్లుల జాతీయకరణా, వినియోగదారుల సంఘాలుగానూ, అదే సమయంలో ఉత్పాదితాలు అమ్మే సంఘాలుగానూ వుండేవాటిలో యావత్తు ప్రజానీకాన్నీ నిర్బంధంగా చేర్చడమూ, ధాన్యమూ, తదితర అవసర వస్తువుల వ్యాపారంమీద ప్రభుత్వ గుత్తాధిపత్యమూ.

ప్రయత్నాన్నీ, పోటీనీ, సాహసపు చొరవనూ నిజంగా సామూహిక స్థాయిలో ప్రదర్శించడానికి యిప్పుడు మాత్రమే అవకాశం సృష్టింపబడింది. పెట్టుబడిదారుడు వెళ్ల గొట్టబడిన, లేదా నిజమైన కార్మికుల అజమాయిషీచేత పరిమితపరచబడిన ప్రతి ఫాక్టరీ, భూస్వామ్య దోపిడీదారుడు తరిమివేయబడి, అతని భూమి స్వాధీనం చేసుకో బడిన ప్రతి గ్రామమూ యిప్పుడు మాత్రమే శ్రామికుడు తన ప్రజ్ఞలను చూపించి, వంగిన నడుమును కాస్త యెత్తి, నిటారుగా విలబడి, తానొక మనిషినని అనుకోగల రంగమైంది. శతాబ్దాల తరబడి పరులకొరకు పనిచేసిన తర్వాత, దోపిడీదారునికొరకు నిర్బంధ శ్రమ చేసిన తర్వాత, మొదటిసారి తనకొరకు తాను పనిచేసుకోవడమూ, పైగా తన పనిలో ఆధునిక సాంకేతిక శాస్త్రంయొక్క, సంస్కృతియొక్క విజయాల నన్నిటినీ వినియోగించుకోవడమూ సాధ్యమైంది.

సహజంగానే, మానవ చరిత్రలో నిర్బంధ శ్రమనుండి తనకొరకు తాను పని చేసుకోడానికి జరిగిన యీ అత్యంత మహత్తరమైన మార్పు రాపిడీ, కష్టాలూ, ఘర్షణలూ, వేర్లు పాతుకున్న పరాన్నభుక్కులమీదా, వాళ్ల ఆశ్రితులమీదా హింసా లేకుండా జరగదు. యీ విషయంలో యే కార్మికునికీ భ్రమలు లేవు. కటిక దారిద్ర్యం చేతా, అనేక దీర్ఘ సంవత్సరాలు దోపిడీదార్లకు చేసిన బానిస శ్రమచేతా, వాళ్ల అసంఖ్యాక అవమానాలచేతా, హింసా చర్యలచేతా కరుడుగట్టిన కార్మికులూ, బీద రైతులూ యీ దోపిడీదార్ల ప్రతిఘటనను బ్రద్దలు చేయడానికి కొంత కాలం పట్టుతుందని

గుర్తిస్తారు. మేధావులైన పెద్దమనుషులకూ, 'నోవయ జీజ్న్' * గ్రూపుకూ, యితర సజ్జుకూ గల మమతా పూర్వక భ్రమలు కార్మికులకూ, రైతులకూ బొత్తిగా లేవు; వాళ్లు పెట్టుబడిదార్లను ఖండిస్తూ గొంతు రాచేటట్లు "కేకలు వేసి," వాళ్లమీదికి "చేతులు యెత్తి," చర్యలు చేయవలసి వచ్చినప్పుడు, బెదరింపులు ఆచరణలో పెట్టవలసి వచ్చినప్పుడు, పెట్టుబడిదారులను తొలగించే పని ఆచరణలో నిర్వహించవలసి వచ్చినప్పుడు, కన్నీళ్లు కారుస్తూ, కొరడా దెబ్బలు తిన్న కుక్కపిల్లలలాగ ప్రవర్తించినారు.

నిర్బంధ శ్రమనుండి తనకొరకు తాను పనిచేసుకోడానికి, బ్రహ్మాండమైన, జాతీయ (కొంతవరకు అంతర్జాతీయ, ప్రపంచ) ప్రమాణంలో క్రమపద్ధతిలో యేర్పాటు చేసిన శ్రమకు, జరిగే మహత్తరమైన మార్పుకు — దోపిడీదార్ల ప్రతిఘటనను అణచడానికి అవసరమైన "మిలిటరీ" చర్యలకుతోడు — కార్మికవర్గమూ, బీద రైతులూ చేసే ప్రచండమైన వ్యవస్థీకరణాత్మక కృషి అవసరం. వ్యవస్థీకరణాత్మక కర్తవ్యం నిన్నటి బానిస యజమానులనూ (పెట్టుబడిదార్లను), వాళ్ల గులాములైన బూర్జువా మేధావుల మందలనూ మిలిటరీ పద్ధతులద్వారా నిర్దాక్షిణ్యంగా అణచివేసే కర్తవ్యంతో పెనవేసుకొని ఒకటిగా కలిసిపోతుంది. నిన్నటి బానిస యజమానులూ, వాళ్ల మేధావి గులాములూ యిలా అంటారు, అనుకుంటారు: "మేము యెల్లప్పుడూ అర్గనైజర్లముగానూ, అధికారులముగానూ వుండినాము. మేము యెల్లప్పుడూ ఆజ్ఞాపించినాము, ఆ పని కొనసాగించ దలచుకున్నాము. 'సామాన్య ప్రజలు,' కార్మికులూ, కర్షకులూ, చెప్పినట్లు వినడానికి మేము నిరాకరిస్తాము. వాళ్లకు మేము లోబడము. డబ్బు సంచుల అధిక సౌకర్యాలనూ, ప్రజలమీద పెట్టుబడియొక్క పరిపాలననూ రక్షించడానికి మేము జ్ఞానాన్ని ఆయుధంగా మారుస్తాము."

యిది బూర్జువాలూ, బూర్జువా మేధావులూ అనేదీ, అనుకునేదీ, చేసేదీ. స్వలాభం దృష్ట్యా వాళ్ల ప్రవర్తన అర్థమౌతుంది. ఫ్యూడల్ భూస్వాముల వంది మాగధులూ, మతగురువులూ, రచయితలూ, గోగొల్** చిత్రించిన రీతిలోని బ్యురాక్రట్లూ, బెలీన్స్కీ***ని

---

* 'నోవయ జీజ్న్' ('నూతన జీవితం') — మెన్షివిక్ "అంతర్జాతీయవాదుల," అర్ధ మెన్షివిక్ మేధావుల పత్రిక. ఏప్రెల్ 1917 నుండి జూలై 1918 దాకా పెత్రోగ్రాడ్‌నుండి వెలువడింది. సోవియట్ ప్రభుత్వంపట్ల 'నోవయ జీజ్న్' శత్రు వైఖరి ప్రకటించింది. — సం.

** గోగొల్, యన్. వి. (1809–1852) — సుప్రసిద్ధ రష్యన్ రచయిత. — సం.

*** బెలీన్స్కీ, వి. జి. (1811–1848) — ప్రఖ్యాత రష్యన్ విప్లవాత్మక ప్రజాస్వామ్యవాది, పత్రికా వ్యాసకర్త, రష్యాలోని ఫ్యూడల్ దాస్యాన్ని తీవ్రంగా ఖండించినాడు. — సం.

ద్వేషించిన ''మేధావులూ'' — వీళ్లకు కూడా ఫ్యూడల్ దాస్యాన్ని పోగొట్టుకోవడం ''కష్టం''గా వుండింది. కానీ దోపిడీదార్లయొక్కా, వాళ్ల ''మేధావి'' పరిచారకులయొక్కా లక్ష్యం నిరర్థకమైనది. కార్మికులూ, కర్షకులూ వాళ్ల ప్రతిఘటనను బద్దలు చేయడం ప్రారంభిస్తున్నారు — దురదృష్టవశాత్తు, యింకా తగినంత దృఢంగా, దీక్షగా, నిర్దాక్షిణ్యంగా కాదు — తప్పక బద్దలు చేస్తారు.

''వాళ్లు'' అనుకుంటారు, శ్రామిక ప్రజలమీద సోషలిస్టు విప్లవం మోపిన మహత్తరమైన, ప్రపంచ చరిత్రాత్మక అర్థంలో నిజంగా వీరోచితమైన వ్యవస్థీకరణాత్మక కర్తవ్యాలను ''సామాన్య ప్రజలు,'' ''సామాన్య'' కార్మికులూ, బీద రైతులూ, నిర్వహించజాలరని. పెట్టుబడిదార్లకూ, పెట్టుబడిదారీ రాజ్యానికీ సేవచేయడానికి అలవాటుపడిన మేధావులు తమ్ము తాము ఓదార్చుకోడానికి యిలా అంటారు: ''మేము లేకుంటే మీకు జరగదు.'' కానీ వాళ్ల దురహంకారపు ఊహ నిజం కాబోదు. విద్యావంతులు యిప్పటికే ప్రజల పక్షాన, శ్రామిక ప్రజల పక్షాన ప్రత్యక్షమౌతూ, పెట్టుబడి సేవకుల ప్రతిఘటనను బద్దలు చేయడానికి తోడ్పడుతున్నారు. రైతులలోనూ, కార్మికవర్గంలోనూ యెంతోమంది ప్రజ్ఞావంతులైన ఆర్గనైజర్లు వున్నారు; వాళ్లు తమను తాము గుర్తించడమూ, మేలుకోవడమూ, మహత్తరమైన, ప్రాణప్రదమైన, సృజనాత్మక కృషివైపు చేతులు చాచడమూ, సోషలిస్టు సమాజాన్ని నిర్మించే కర్తవ్యానికి తమ సొంత శక్తులతో పూనుకోవడమూ యిప్పుడిప్పుడే ప్రారంభమౌతున్నది.

యీనాటి అత్యంత ముఖ్యమైన కర్తవ్యం కాకపోయినా ఒక ముఖ్యమైన కర్తవ్యం యేమిటంటే, కార్మికులయొక్కా మొత్తంమీద శ్రామిక, పీడిత ప్రజలందరియొక్కా యీ స్వతంత్ర చొరవను అభివృద్ధి చేయడం, సృజనాత్మక వ్యవస్థీకరణాత్మక కృషిలో వీలైనంత విస్తృతంగా అభివృద్ధిచేయడం. యేమైనప్పటికీ, ''పై వర్గాలు'' మాత్రమే, ధనికులూ, ధనికుల పాఠశాలలో చదువుకున్నవాళ్లూ మాత్రమే రాజ్యాన్ని పరిపాలించడానికీ, సోషలిస్టు సమాజంయొక్క నిర్మాణపు అభివృద్ధికి దర్శకత్వం వహించడానికీ సమర్థులనే పాత, అసంబద్ధపు, కిరాతకమైన, యేహ్యమైన, అసహ్యమైన దురభిప్రాయాన్ని బద్దలుచేయాలి.

యీ దురభిప్రాయాన్ని కుళ్లిపోయిన నిత్యకృత్యమూ, గడ్డకట్టిన అభిప్రాయాలూ, బానిస అలవాట్లూ, అంతకంటె యెక్కువగా, దోపిడీచేస్తూ పరిపాలించడమూ, పరిపాలిస్తూ దోపిడీచేయడమూ యెవరికి ప్రయోజనకరమో ఆ పెట్టుబడిదార్ల నీచపు స్వార్థమూ పోషించినాయి. తమకు జ్ఞానశక్తి అవసరమనే విషయాన్ని కార్మికులు ఒక క్షణంసేపు కూడా విస్మరించరు. జ్ఞానంకొరకు కార్మికులు, ముఖ్యంగా యిప్పుడు, చేస్తున్న కృషిద్వారా తెలుస్తుంది, దీనిని గురించిన పొరపాటు అభిప్రాయాలు కార్మికవర్గంలో

లేవనీ, వుండజాలవనీ. కానీ, చదవనూ రాయనూ వచ్చి, మనుషులను అంచనావేయ గలిగి, ఆచరణాత్మక అనుభవం గల ప్రతి సాధారణ కార్మికుడూ, కర్షకుడూ వ్యవస్థీకరణాత్మక కృషి చేయగలడు. యెవరిని గురించి బూర్జువా మేధావులు అంత దురహంకారంతో, అంత యేవగింపుతో మాట్లాడుతారో ఆ "సామాన్య ప్రజల"లో అలాంటి స్త్రీ పురుషులు కొల్లలుగా వున్నారు. కార్మికవర్గంలోనూ, రైతులలోనూ వున్న యిలాంటి ప్రజ్ఞ సంపన్నమైన, యింకా వినియోగింపబడని నిధిగా వుంది.

కార్మికులూ, కర్షకులూ యింకా "పిరికిగా" వున్నారు; వాళ్లే యిప్పుడు పాలక వర్గమనే భావానికి వాళ్లు యింకా అలవాటుపడలేదు; వాళ్లు యింకా తగినంత కృత నిశ్చయులుగా లేరు. లేమిచేతా, ఆకలిచేతా తమ జీవితమంతా కర్ర పెత్తనంకింద పని చేసేటట్లు నిర్బంధింపబడిన కోటానుకోట్ల ప్రజలలో యీ గుణాలను విప్లవం ఒక్క దెబ్బతో యెక్కించజాలకపోయింది. కానీ 1917 అక్టోబర్ విప్లవం బలీయమైనది, జీవించగలది, అజేయమైనది; యెందుకంటే అది యీ గుణాలను మేల్కొల్పుతుంది, పాత ప్రతిబంధకాలను బద్దలు చేస్తుంది, అరిగిపోయిన శృంఖలాలను తొలగిస్తుంది, నూతన జీవిత స్వతంత్ర సృష్టి అనే మార్గంమీదికి శ్రామిక ప్రజలను నడిపిస్తుంది.

లెక్కలు రాయడమూ, అజమాయిషీ – యిది ప్రతి కార్మిక, సైనిక, కర్షక ప్రతినిధుల సోవియట్‌కూ, ప్రతి వినియోగదార్ల సంఘానికీ, ప్రతి సరఫరాల సంఘానికీ, లేక కమిటీకీ, ప్రతి ఫాక్టరీ కమిటీకీ, లేక సాధారణ కార్మికుల అజమాయిషీ సంస్థకూ ప్రధాన ఆర్థిక కర్తవ్యం.

శ్రమ భారాన్ని తగ్గించడమూ, బూర్జువావర్గంనుండి కనీసం కాస్త ముక్కను పొందడమూ యేకైక లక్ష్యంగా గల బానిసయొక్క దృక్పథంనుండి శ్రమ పరిమాణాన్నీ, ఉత్పత్తి సాధనాలనూ చూసే పాత అలవాటుకు వ్యతిరేకంగా మనం పోరాటం చేయాలి. పురోగామి, వర్గచైతన్యపూరిత కార్మికులు యిప్పటికే యీ పోరాటం ప్రారంభించినారు; వాళ్లు యుద్ధ కాలంలో మరీ పెద్ద సంఖ్యలో ఫాక్టరీ ప్రపంచంలో మూగి, యిప్పుడు ప్రజల ఫాక్టరీని, ప్రజల వశంలోకి వచ్చిన ఫాక్టరీని, పాత పద్ధతిలో, "వీలైనంత పెద్ద రొట్టె ముక్క సంగ్రహించుకొని, దారి పట్టడం" అనే యేకైక లక్ష్యంతో చూడగోరే కొత్త వాళ్లకు కృతనిశ్చయంతో కూడిన ప్రతిఘటన యిస్తున్నారు. వర్గచైతన్యమూ, నిజాయితీ గలిగి, ఆలోచించగల సకల రైతులూ, శ్రామిక ప్రజలూ యీ పోరాటంలో పురోగామి కార్మికుల పక్కన నిలబడతారు.

లెక్కలు రాయడమూ, అజమాయిషీ – యిది అత్యున్నత రాజ్యాధికారంగా వ్యవహరించే, లేక యీ అధికారంయొక్క ఆదేశాల మేరకు, ఆజ్ఞ మేరకు, వ్యవహరించే

సైనిక, కార్మిక, కర్షక ప్రతినిధుల సోవియట్లచేత నిర్వహించబడినట్లైతే — విస్తృతమైన, సాధారణమైన, సార్వత్రికమైన లెక్కలు రాయడమూ, అజమాయిషీ, చేసిన శ్రమయొక్క మొత్తానికీ, ఉత్పాదితాల పంపకానికీ లెక్కలు రాయడమూ, అజమాయిషీ — యిది, కార్మికవర్గపు రాజకీయాధికారం నెలకొల్పబడి, స్థిరపరచబడిన తర్వాత, సోషలిస్టు పరిణామంయొక్క సారం.

సోషలిజంకు జరిగే పరివర్తనకు అత్యవసరమైన లెక్కలు రాయడమూ, అజమాయిషీ ప్రజలచేత మాత్రమే చేయబడగలవు. లెక్కలు రాయడంలోనూ, ధనికులనూ, దొంగవెధవలనూ, సోమరిపోతులనూ, రౌడీలనూ అజమాయిషీ చేయడంలోనూ కార్మిక, కర్షక బాహుళ్యంయొక్క ఐచ్ఛిక, అంతరాత్మపూర్వక సహకారం మాత్రమే, విప్లవోత్సాహంతో కూడిన సహకారం మాత్రమే, జయించగలదు యీ పాపిష్ఠి పెట్టుబడిదారీ సమాజపు అవశేషాలను, యీ మానవ సమాజపు మడ్డిని, పూర్తిగా కృశించి నిరసచ్చు పడిపోయిన యీ అంగాలను, యీ అంటురోగాన్ని, యీ ప్లేగును, పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు సంక్రమించిన యీ పుండును.

కార్మిక, కర్షకులారా, శ్రామిక, పీడిత జనులారా! భూమీ, బాంకులూ, ఫాక్టరీలూ యిప్పుడు యావత్తు ప్రజల ఆస్తి అయినాయి! సరుకుల ఉత్పత్తికీ, పంపకానికీ లెక్కలు రాయడమూ, వాటిని అజమాయిషీ చేయడమూ అనే పనికి మీరే పూనుకోవాలి — యిది, యిది మాత్రమే, సోషలిజం విజయానికి దారి, దాని విజయానికి ఒకేఒక హామీ, సమస్త దోపిడీమీదా, సమస్త దారిద్ర్యంమీదా, లేమిమీదా విజయానికి హామీ! యెందుకంటే, ప్రతివొక్కరి అవసరాలూ తీర్చడానికి తగిన ధాన్యమూ, యినుమూ, కొయ్యా, వున్నీ, దూదీ, ఫ్లాక్సూ రష్యాలో వున్నాయి, కానీ శ్రమా, దాని ఉత్పాదితాలూ సక్రమంగా పంపకం చేయబడితేనే యీ పంపకంమీద యావత్తు ప్రజల వ్యవహారసరళి, ఆచరణగత అజమాయిషీ నెలకొల్పబడితేనే, ప్రజల శత్రువులను — ధనికులనూ, వాళ్ల పరివారాన్నీ, దొంగవెధవలనూ, సోమరిపోతులనూ, రౌడీలనూ — రాజకీయాలలో మాత్రమే కాదు, రోజువారీ ఆర్థిక జీవితంలో కూడా వుండేవాళ్లను మనం ఓడించగలిగితేనే.

యీ ప్రజల శత్రువులపట్ల, సోషలిజంకు శత్రువులైనవాళ్లపట్ల, శ్రామిక ప్రజల శత్రువులపట్ల కనికరం వద్దు. ధనికులమీదా, వాళ్ల పరివారమైన బూర్జువా మేధావులమీదా మరణందాకా యుద్ధం; దొంగవెధవలమీదా, సోమరిపోతులమీదా, రౌడీలమీదా యుద్ధం! వాళ్లందరూ ఒకే జాతి — పెట్టుబడిదారీ వ్యవస్థ సంతానం, అగ్రవర్ణపు బూర్జువా సమాజానికి పుట్టినవాళ్లు; కొద్దిమంది మనుషులు ప్రజలను దోచుకొని, అవమానపరిచిన సమాజం; పేదరికమూ, లేమిడీ వేనవేలమందిని రౌడీ జీవితంలోకీ, నైతిక

పతనంలోకీ, వంచనలోకీ తోసి, వాళ్ళ మానవత్వపు చాయలనన్నిటినీ కోల్పోయేటట్లు చేసిన సమాజం; మోసంద్వారానైనా సరే దోపిడీనుండి తప్పించుకోవాలనే, దానినుండి జారిపించుకోవాలనే కోరికను, ఒక క్షణం సేపైనా అసహ్యమైన శ్రమనుండి తప్పించుకోవాలనే కోరికను, పస్తు వుండకుండా వుండడానికి, తానూ, తన ఆత్మీయులూ అనుభవించే ఆకలి మంటలను చల్లార్చడానికి యే మార్గంచేతనైనా సరే, యేమైనా సరే, ఒక రొట్టెముక్కయినా సంపాయించుకోవాలనే కోరికను, శ్రామికునిలో అనివార్యంగా కలిగించిన సమాజం.

ధనికులూ, దొంగవెధవలూ ఒకే నాణ్యంయొక్క రెండు పార్శ్వాలు; వాళ్ళు పెట్టుబడిదారీ వ్యవస్థ పోషించిన పరాన్నభుక్కులలో రెండు ప్రధాన రకాలు; వాళ్ళ సోషలిజంకు ప్రధాన శత్రువులు. వాళ్లను యావత్తు ప్రజల ప్రత్యేక తనిఖీకింద వుంచాలి; సోషలిస్టు సమాజపు చట్టాలనూ, నిబంధనలనూ ఈషణ్మాత్రమైనా ఉల్లంఘిస్తే వాళ్లను నిర్దాక్షిణ్యంగా శిక్షించాలి. యీ విషయంలో బలహీనతా, తటపటాయింపూ, మమతాపూర్వక వైఖరీ యేమాత్రం ప్రదర్శించినా అది సోషలిజం పట్ల అపారమైన నేర మౌతుంది.

యీ పరాన్నభుక్కులను సోషలిస్టు సమాజానికి హానికరం కాకుండా చేయడానికి మనం సమస్త ప్రజలూ, కోటానుకోట్ల కార్మికులూ, కర్షకులూ, ఐచ్ఛికంగా, చురుకుగా, విప్లవోత్సాహంతో పాల్గొంటూ చేసిన పనియొక్క మొత్తానికీ, ఉత్పత్తి, పంపకాలకూ లెక్కలు రాయడమూ, అజమాయిషీ యేర్పాటుచేయాలి. యీ లెక్కలు రాయడాన్నీ, అజమాయిషీనీ — చిత్తశుద్ధిగల, తెలివిగల, సమర్థుడైన ప్రతి కార్మికునికీ, కర్షకునికీ పూర్తిగా చేతనైనదాన్ని — యేర్పాటు చేయడానికి మనం వాళ్ల ప్రజ్ఞను, వాళ్ల మధ్యలో వున్న ప్రజ్ఞను, రేపాలి; నిర్మాణపు విజయాల రంగంలో పోటీని మనం వాళ్లలో రేపాలి, జాతీయ ప్రమాణంలో యేర్పాటు చేయాలి; విద్యావంతుని అవసరమైన సలహాకూ, ''విద్యావంతుల''లో అంత మామూలుగా వుండే క్రమరాహిత్యంమీద ''సాధారణ'' కార్మిక, కర్షకుల అవసరమైన అజమాయిషీకీ మధ్య భేదాన్ని కార్మికులూ, కర్షకులూ స్పష్టంగా చూసేటట్లు చేయాలి.

యీ క్రమరాహిత్యం, యీ అజాగ్రత్త, చిందరవందర, నరాల తొందర, ఆచరణకు బదులు చర్చలు చేసే ధోరణి, పనికి బదులు మాట్లాడే ధోరణి, విశ్వంలో వున్న ప్రతిదానికీ పూనుకొని, దేనినీ ముగించకుండా వుండే ధోరణి ''విద్యావంతుల'' గుణాలు; యిది వాళ్ళ సహజంగా చెడ్డవాళ్ళు అయినందువల్ల కాదు, వాళ్ల దుర్బుద్ధివల్ల కానేకాదు; యిది వాళ్ల జీవితపు అలవాట్లవల్ల, వాళ్ల పని పరిస్థితులవల్ల, అలసటవల్ల, శరీర శ్రమనుండి బౌద్ధిక శ్రమ విపరీతంగా వేరుపడడంవల్ల, వగైరా, వగైరా.

మనమధ్య వున్న మేధావుల యీ శోచనీయమైన — కానీ ప్రస్తుతం అనివార్యమైన — గుణాలవల్లా, మేధావుల వ్యవస్థీకరణాత్మక కృషిమీద కార్మికుల తనిఖీ తగినంత లేకపోవడం వల్లా కలిగే పొరపాట్లూ, లోపాలూ, తప్పులూ మన విప్లవంలోని వాటిలో యేమీ అముఖ్యం కాని స్థానం ఆక్రమించివున్నాయి.

కార్మికులూ, కర్షకులూ యింకా "పిరికిగా" వున్నారు; వాళ్లు యీ పిరికితనాన్ని వదలించుకోవాలి, తప్పక వదలించుకుంటారు. విద్యావంతుల, మేధావుల, నిపుణుల సలహాలనూ, సూచనలనూ మనం విసర్జించలేము. తెలివిపరుడైన ప్రతి కార్మికునికీ, కర్షకునికీ యిది బాగా తెలుసు; కార్మికులూ, కర్షకులూ శ్రద్ధా, సౌభ్రాతృ గౌరవమూ చూపడం లేదని మనమధ్య వున్న మేధావులు ఫిర్యాదు చేయలేరు. కానీ సలహాలూ, సూచనలూ వేరు, ఆచరణలో లెక్కలు రాయడాన్నీ, అజమాయిషీని వ్యవస్థీకరించడం వేరు. చాలా తరుచుగా మేధావులు ప్రశస్తమైన సలహాలూ, సూచనలూ యిస్తారు; కానీ వీటిని అమలుపరచడంలో, మాటలను చేతలలోకి అనువదించడంమీద ఆచరణగతమైన అజమాయిషీ చేయడంలో హాస్యాస్పదంగా, అసంబద్ధంగా, సిగ్గుచేటుగా అననుకూలురుగా, అసమర్థులుగా వుంటారు.

సరిగ్గా యీ విషయంలోనే, "ప్రజల"నుండీ, ఫాక్టరీ కార్మికులనుండీ, శ్రామిక రైతులనుండీ వచ్చే ఆచరణగత ఆర్గనైజర్ల సహాయాన్నీ, నాయక పాత్రనూ విసర్జించడం కేవలం అసాధ్యం. "కుండలు చేసేది దేవతలు కాదు" — యిది కార్మికులూ, కర్షకులూ తమ మనస్సుల్లోకి బాగా యెక్కించుకోవలసిన సత్యం. యిప్పుడున్నదంతా ఆచరణాత్మకమైన పని అనీ, సిద్ధాంతం ఆచరణలోకి మార్చబడుతూ, ఆచరణచేత జీవవంతం చేయబడుతూ, ఆచరణచేత సరిదిద్దబడుతూ, ఆచరణచేత పరీక్షించబడుతూ వుండే చారిత్రక తరుణం వచ్చిందనీ వాళ్లు గ్రహించాలి. "డజను కార్యక్రమాలకంటె నిజమైన ఉద్యమంయొక్క ప్రతి అడుగూ యెక్కువ ముఖ్యం," అన్న మార్క్స్ మాటలు ప్రత్యేకించి నిజమైనప్పుడు — ధనవంతులనూ, దొంగవెధవలనూ నిజంగా ఆచరణలో అరికట్టడంలో, పరిమిత పరచడంలో, పూర్తిగా రిజిస్టరు చేయడంలో, వాళ్లను అదుపులో వుంచడంలో ప్రతి అడుగూ సోషలిజం గురించి డజను ప్రశస్తమైన వాదాలకంటె విలువైనది. యెందుకంటే, "మిత్రమా, సిద్ధాంతం బూడిద రంగుది, కానీ నిత్యమైన జీవిత వృక్షం పచ్చనిది."*

కార్మికులనుండీ, కర్షకులనుండీ వచ్చిన ఆచరణాత్మక ఆర్గనైజర్లమధ్య పోటీ యేర్పాటు చేయాలి. ఒకేవిధమైన రూపాలను నెలకొల్పడానికీ, పైనుండి ఏకరూపతను విధించడానికీ

---

*గ్యోతే రచించిన 'ఫౌస్ట్'నుండి మెఫిస్టొఫెలెస్ మాటల ఉల్లేఖన. — సం.

చేసే ప్రతి ప్రయత్నంతోనూ, మేధావులు చేయడానికి అంత అభిముఖంగా వున్నదానితో, యుద్ధంచేయాలి. పైనుండి విధించే ఒకే విధమైన రూపాలకూ, ఏకరూపతకూ ప్రజా తంత్ర, సోషలిస్టు కేంద్రాధికారంతో యేమీ సామ్యం లేదు. ముఖ్య విషయాలలోని, మౌలిక విషయాలలోని, సారంలోని, యేకత్వం వివరాలలోని, ప్రత్యేక స్థానిక లక్షణాలలోని, దృక్పథంయొక్క పద్ధతులలోని, పరాన్నభుక్కులను (ధనవంతులనూ, దొంగవెధవలనూ, క్రమరహితులూ, గావు కేకలు వేసేవాళ్లూ అయిన మేధావులనూ, వగైరా, వగైరాలను) నిర్మూలించడమూ, ప్రమాద రహితులను చేయడమూలో గల మార్గాలలోని, వైవిధ్యం చేత భంగం చేయబడదు సరికదా నిస్సందేహం చేయబడుతుంది.

కిందనుండి చొరవా, స్వాతంత్ర్యమూ, ఆచరణ స్వేచ్ఛా, చురుకుదనమూ అనే వాటిని ఒకేవిధమైన రూపాలు విధించని ఐచ్ఛిక కేంద్రాధికారంతో మేళవించడం యెలా అనేదానికి పారిస్ కమ్యూన్* గొప్ప ఉదాహరణ. మన సోవియట్లు** అదే మార్గం అను సరిస్తున్నాయి. కానీ అవి యింకా "పిరికిగా" వున్నాయి; అవి యింకా పనిలో పూర్తిగా మునగలేదు, సోషలిస్టు పద్ధతులను నిర్మించే తమ నూతన, మహత్తర, సృజనాత్మక కర్తవ్యానికి యింకా అలవాటుపడలేదు. సోవియట్లు మరింత ధైర్యంగా పనిచేయడానికి పూనుకొని, మరింత చొరవ ప్రదర్శించాలి. శ్రమకూ, ఉత్పాదితాల పంపకానికీ లెక్కలు రాయడాన్నీ, వాటి అజమాయిషీనీ యేర్పాటుచేసే ఆచరణాత్మక ఆర్గనైజర్లుగా "కమ్యూన్లు" అన్నీ — ఫాక్టరీలూ, గ్రామాలూ, వినియోగదారుల సంఘాలూ, సరఫ రాల కమిటీలూ — ఒకదానితో ఒకటి పోటీ పడాలి. యీ లెక్కలు రాయడంయొక్క,

---

*పారిస్ కమ్యూన్ — ప్రపంచ చరిత్రలో మొదటి కార్మికవర్గ నియంతృత్వం. యిది 1871 మార్చి 18 నుండి మే 28 వరకు ఉంది. యిది రాజ్యంనుండి చర్చినీ, చర్చినుండి విద్యాసంస్థలనూ విడదీసింది; సైన్యాన్ని రద్దుచేసి, సమస్త ప్రజ లనూ సాయుధులను చేసింది; జడ్జీలనూ, ఆఫీసు ఉద్యోగులనూ యెన్నుకునే పద్ధతి ప్రవేశపెట్టింది; కార్మికులకన్న ఉద్యోగులకు యెక్కువ జీతం వుండదని చట్టం చేసింది; కార్మికుల, పట్టణ బీదల పరిస్థితిని మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంది, వగైరా. 1871 మే 21న త్యేర్ ప్రభుత్వపు విప్లవ ప్రతీఘాత సైన్యాలు పారిస్‌కు వచ్చి, కార్మికులమీద కసాయి హత్యాకాండ జరిపినాయి. దాదాపు 30 వేలమందిని కాల్చి వేసినారు, 50 వేలమందిని అరెస్టు చేసినారు, అనేకమందికి కఠినమైన జైలు శిక్షలు విధించినారు. — సం.

**అక్టోబర్ సోషలిస్టు విప్లవం తర్వాత రాజ్యాధికార అంగాలైన కార్మిక, సైనిక, కర్షక ప్రతినిధుల సోవియట్లకు ప్రస్తావన. — సం.

ఆజమాయిషీయొక్క కార్యక్రమం సరళమైనది, స్పష్టమైనది, అందరికీ అర్థమయ్యేది — ప్రతివొకనికీ బ్రెడ్డు వుండడం; ప్రతివొకనికీ దిట్టమైన బూట్లూ, మంచి దుస్తులూ వుండడం; ప్రతివొకనికీ వెచ్చని నివాసగృహం వుండడం; ప్రతివొకడూ అంతరాత్మ సాక్షిగా పనిచేయడం; ఒక్క దొంగవెధవను కూడా (పని దొంగలతో సహా) స్వేచ్ఛగా వుండనివ్వకుండా జైలులో పెట్టడం, లేదా అత్యంత కఠినమైన నిర్బంధ శ్రమ చేయించడం; సోషలిజంయొక్క చట్టాలనూ, నిబంధనలనూ ఉల్లంఘించే ఒక్క ధనవంతుని కూడా దొంగవెధవ గతిని తప్పించుకోకుండా చేయడం (న్యాయంగా దొంగవెధవకు ధనవంతుని గతే వుండాలి). ''పనిచేయనివాడు తినకూడదు'' — యిది సోషలిజంయొక్క ఆచరణాత్మక సూత్రం, యిది వ్యవహారాలు ఆచరణాత్మకంగా యేర్పాటు చేయవలసిన పద్ధతి. యివి మన ''కమ్యూనిస్టు,'' మన కార్మిక, కర్షక ఆర్గనైజర్లూ గర్వించవలసిన ఆచరణాత్మక విజయాలు. యిది మేధావులలోని ఆర్గనైజర్లకు ప్రత్యేకంగా వర్తిస్తుంది (ప్రత్యేకంగా, యెందుకంటే, వాళ్లకు తమ సాధారణ సూచనల గురించీ, తీర్మానాల గురించీ గర్వించే అలవాటు అతిగా, మరీ అతిగా వుంది).

లెక్కలు రాయడానికీ, ధనికులనూ, దొంగవెధవలనూ, సోమరిపోతులనూ అదుపులో పెట్టుకోడానికీ వేలాది ఆచరణీయమైన సాధనాలనూ, పద్ధతులనూ కమ్యూన్లు, పట్టణాలలోనూ, గ్రామాలలోనూ వున్న చిన్న సంస్థలు, తామే రూపకల్పన చేసి, ఆచరణలో పరీక్షకు పెట్టాలి. యిక్కడ వైవిధ్యం ఫలదాయకతకు హామీ — రష్యా దేశాన్ని సకల క్రిములనుండీ, పురుగుల లాంటి దొంగవెధవలనుండీ, నల్లులలాంటి ధనికులనుండీ, వగైరా, వగైరాలనుండీ శుద్ధిచేయడం అనే ఏకైక సమష్టి లక్ష్యాన్ని సాధించడంలో విజయానికి హామీ. ఒకచోట ఒక పదిమంది ధనికులు, ఒక డజనుమంది దొంగవెధవలు, ఒక అరడజనుమంది పనికి పాలుమాలేవాళ్లు (రౌడీలలాగా, పెట్రోగ్రాడ్‌లో, ముఖ్యంగా పార్టీ ముద్రణాలయాల్లో, చాలామంది కంపోజిటర్లలాగా పనికి పాలుమాలేవాళ్లు) జైలుకు పంపబడతారు. మరొకచోట వాళ్లు పాయిఖానాలు వూడ్చే పనికి నియమింపబడతారు. యింకొకచోట వాళ్ల శిక్షాకాలం పూర్తి అయిన తర్వాత వాళ్లకు ''పనికిరాని వ్యక్తి సర్టిఫికెట్టు''లు యివ్వబడతాయి — వాళ్లు మారిందాకా, హానికరమైన వ్యక్తులుగా వాళ్లమీద ప్రతివొకరూ ఒక కన్ను వుంచేటట్లు. వేరొకచోట పదిమంది సోమరిపోతులలో ఒకడు అక్కడికక్కడే కాల్చివేయబడతాడు. యింకొక చోట కొన్ని పద్ధతులను కలిపి ఉపయోగించవచ్చు; ఉదాహరణకు, తప్పులు దిద్దుకోగల ధనికులనూ, బూర్జువా మేధావులనూ, దొంగవెధవలనూ, రౌడీలనూ ప్రొబేషన్ మీద విడుదల చేయడంద్వారా వాళ్లు మారడానికి అవకాశం యివ్వబడుతుంది. వైవిధ్యం యెక్కువ వుండే కొద్దీ, మన సాధారణ అనుభవం మేలుగా, మరింత సంపన్నంగా వుంటుంది, సోషలిజం విజయం

మరింత నిశ్చయంగా, మరింత వేగంగా వుంటుంది, అత్యుత్తమ పోరాట పద్ధతులనూ, సాధనాలనూ రూపకల్పన చేయడానికి ఆచరణకు — ఆచరణ మాత్రమే వాటిని రూపకల్పన చేయగలదు గనుక మరింత సులభవౌతుంది.

యే కమ్యూన్‌లో, ఒక నగరంలోని యే పేటలో, యే ఫాక్టరీలో, యే గ్రామంలో వస్తులుండే వాళ్ళు యెవ్వరూ, నిరుద్యోగులు యెవ్వరూ, సోమరి ధనికులు యెవ్వరూ, యేహ్యమైన బూర్జువావర్గపు గులాములై మేధావులమని చెప్పుకునే విధ్వంసనకారులు యెవ్వరూ లేరు? శ్రమ ఉత్పాదకతను పెంచడానికీ, బీదలకు మంచి, కొత్త యిండ్లు కట్టడానికీ, బీదలను ధనికుల యిండ్లలో వుంచడానికీ, ప్రతి బీద కుటుంబంలోని ప్రతి పసిబిడ్డకూ ఒక పాలసీసా క్రమంగా యివ్వడానికీ యెక్కడ అన్ని చోట్లకంటె యెక్కువ కృషి జరిగింది? కమ్యూన్లకూ, గ్రామ సమాజాలకూ, ఉత్పత్తిదార్ల వినియోగదార్ల సంఘాలకూ, కార్మిక, సైనిక, కర్షక ప్రతినిధుల సోవియట్లకూ మధ్య పోటీ అభివృద్ధి కావలసింది యీ అంశాలమీద. యిది ప్రజ్ఞగల ఆర్గనైజర్లు ఆచరణలో ముందుకు రావలసిన పని; అలాంటివాళ్లను ప్రభుత్వపరిపాలన పనికి ప్రమోట్‌చెయ్యాలి. ప్రజలలో ప్రజ్ఞ చాలా వుంది. కేవలం అది అణచివేయబడింది. బయటపడడానికి దానికి అవకాశం యివ్వాలి. అది, అది మాత్రమే, ప్రజల అండదండలతో, రష్యాను రక్షించగలదు, సోషలిజంను రక్షించగలదు.

1917 డిసెంబర్ 24–27న రచింపబడింది

# ఆర్థిక కౌన్సిళ్ల మొదటి అఖిల రష్యా మహాసభలో ఉపన్యాసం

## మే 26, 1918

కామ్రేడ్స్, మొదట, ప్రజా కమిసార్ల కౌన్సిల్ తరఫున ఆర్థిక కౌన్సిళ్ల మహాసభకు అభివాదాలు తెలుపనివ్వండి. (హ ర్ష ధ్వా నా లు.)

కామ్రేడ్స్, అత్యున్నత ఆర్థిక కౌన్సిల్‌కు యిప్పుడొక కష్టమైన, కానీ అత్యంత ప్రతిఫలదాయకమైన కర్తవ్యం వుంది. అత్యంత నిస్సందేహంగా, అక్టోబర్ విప్లవంయొక్క విజయాలు ముందుకు పోయేకొద్దీ, అది ప్రారంభించిన ఉత్పతనం మరింత గంభీరమయ్యేకొద్దీ, సోషలిస్టు విప్లవ లాభాలు మరింత స్థిరంగా నెలకొల్పబడి, సోషలిస్టు వ్యవస్థ మరింత స్థిరంగా దృఢపడేకొద్దీ, ఆర్థిక కౌన్సిళ్లయొక్క, రాజ్య సంస్థలలోకెల్ల యేవి మాత్రమే స్థిరంగా వుంటాయో వాటియొక్క పాత్ర మరింత గొప్పదీ, ఉన్నతమూ అవుతుంది. సోషలిస్టు వ్యవస్థ ప్రతిష్ఠాపనకు మనం మరింత దగ్గరగా వచ్చేకొద్దీ, వాటి స్థానం యింకా యెక్కువగా స్థిరమవుతుంది, కేవల పరిపాలన యంత్రాంగానికి, కేవలం పరిపాలనలో మాత్రమే నిమగ్నమైన యంత్రాంగానికి, మరింత తక్కువ అవసరం వుంటుంది. దోపిడీదార్ల ప్రతిఘటన అంతిమంగా బద్దలు చేయబడిన తర్వాత, శ్రామిక ప్రజలు సోషలిస్టు ఉత్పత్తిని యేర్పరచడం నేర్చుకున్న తర్వాత, సరైన, కచ్చితమైన, సంకుచితమైన అర్థంలో యీ పరిపాలన యంత్రాంగం, యీ పాత రాజ్య యంత్రాంగం, నశించి తీరుతుంది; కాగా అత్యున్నత ఆర్థిక కౌన్సిల్‌లాంటి యంత్రాంగం సంఘటిత సమాజపు ప్రధాన కార్యకలాపాల సన్నిటినీ నిర్వహిస్తూ, పెరిగి, అభివృద్ధి అయి, బలీయం కాక తప్పదు.

కామ్రేడ్స్, అందుకనే, నేను అత్యున్నత ఆర్థిక కౌన్సిల్‌యొక్క, వేటి కార్యకలాపాలతో అది సన్నిహితమైన, విడదీయరాని సంబంధాలు కలిగివుందో ఆ స్థానిక కౌన్సిళ్లయొక్క అనుభవాన్ని చూసినప్పుడు, నాకు అనిపిస్తుంది, యింకా ముగింపబడనిదీ, అసంపూర్ణ

మైనదీ, వ్యవస్థీకరింపబడనిదీ యెంతో వున్నప్పటికీ, నిరాశాపూరిత నిర్ణయాలు చేయడానికి మనకు యేమాత్రమూ ఆధారాలు లేవు. యెందుకంటే, అత్యున్నత ఆర్థిక కౌన్సిల్ తనకు తాను పెట్టుకుంటున్న కర్తవ్యం, ప్రాంతీయ, స్థానిక కౌన్సిళ్లు అన్నీ తమకు తాము పెట్టుకున్న కర్తవ్యం, యెంత అపారంగా, యెంత సర్వగ్రాసిగా వుందంటే, మన కందరికీ కనిపించేదానిలో భయం కలిగించేది అణుమాత్రం కూడా లేదు. చాలా తరుచుగా — సహజంగానే, మన దృక్పథంనుండి బహుశా అమిత తరుచుగా — ''మూడుసార్లు కొలిచి, ఒకసారి కత్తరించు,'' అనే సామెతను వర్తింపజేయడం లేదు. దురదృష్టవశాత్తు, సోషలిస్టు పద్ధతులలో ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి సంబంధించిన విషయాలు ఆ సామెతలో వ్యక్తం చేయబడినంత సరళంగా లేవు.

అధికారమంతా — యీసారి రాజకీయ అధికారం మాత్రమే కాదు, ప్రధానంగా రాజకీయ అధికారం కూడా కాదు, ఆర్థిక అధికారం, అనగా రోజువారీ మానవ జీవితపు అత్యంత లోతైన పునాదులకు సంబంధించిన అధికారం — ఒక కొత్త వర్గానికి, అంతే కాదు, మానవ చరిత్రలో మొట్టమొదటి సారి ప్రజానీకంలో అపారమైన మెజారిటీకి, శ్రామిక, పీడిత ప్రజా బాహుళ్యానికి, నాయకుడైన వర్గానికి, బదిలీ అయినప్పుడు, మన కర్తవ్యాలు మరింత జటిలమౌతాయి. మనలను యెదుర్కొంటున్న నిర్మాణపు కర్తవ్యాల అత్యున్నత ప్రాముఖ్యం దృష్ట్యా, అత్యంత కష్టం దృష్ట్యా, పూర్తి కొత్త పద్ధతులలో కోటానుకోట్ల ప్రజల జీవితపు అత్యంత లోతైన పునాదులను మనం నిర్మించవలసి వచ్చినప్పుడు, '''మూడుసార్లు కొలిచి, ఒకసారి కత్తరించు,'' అన్న సామెతలో వున్నంత సరళంగా విషయాలను యేర్పాటు చేయడం అసాధ్యం, అని చెప్పనక్కర లేదు. నిజంగా మనం ఒక దాన్ని లెక్కలేనన్నిసార్లు కొలిచి, తరువాత కత్తరించి, అంతిమంగా కొలవబడి, సరిచేయబడినదాన్ని అతికించే స్థితిలో లేము. మనం ముందుకు నడుస్తూ మన ఆర్థిక భవనాన్ని నిర్మించాలి, వివిధ సంస్థలను పరీక్షించి చూసుకుంటూ, వాటి పనిని గమనిస్తూ, శ్రామిక ప్రజల సామూహిక సమష్టి అనుభవంచేతా, అన్నిటి కంటె యెక్కువగా వాటి పనియొక్క ఫలితాలచేతా వాటిని పరీక్షిస్తూ. యిది మనం ముందుకు నడుస్తూ చేయాలి, అంతేకాక, పెట్టుబడిదారీ దోపిడీయొక్క చివరి పుచ్చిన పండ్లను పెరికివేయగల కాలాన్ని మనం సమీపించేకొద్దీ యెవరి దురావేశం పెరుగుతుందో ఆ పెట్టుబడిదార్ల తెంపరి, దురావేశపు ప్రతిఘటన సన్నివేశంలో యిది మనం చేయాలి. స్వల్ప కాలంలో జాతీయ ఆర్థిక వ్యవస్థయొక్క వివిధ శాఖలలోని పరిపాలనకు చెందిన రకాలనూ, నిబంధనలనూ, సంస్థలనూ మనం కొన్ని సార్లు మార్చవలసి వస్తే కూడా, యీ పరిస్థితులలో నిరాశకు యే మాత్రమూ ఆధారాలు లేవనేది సులభంగా గ్రహించ వచ్చు: కానీ, హృదయాలకు బాధ కలిగిన బూర్జువాలూ, దోపిడీదార్లూ ద్వేషపూరితమైన

ఆగ్రహం వెలిగక్కడానికి యిది గణనీయమైన ఆధారాలు యిస్తుంది. నిజమే, యీ పనిలో మరీ సన్నిహితంగా, మరీ ప్రత్యక్షంగా పాల్గొనేవాళ్లకు, ఉదాహరణకు ప్రధాన జల మండలికి, పరిపాలనకు సంబంధించిన నియమాలనూ, నిబంధనలనూ, చట్టాలనూ మూడుసార్లు మార్చడం యెల్లప్పుడూ హాయిగా వుండదు; యిలాంటి పనినుండి లభించే హాయి యెక్కువగా వుండజాలదు. కానీ, అత్యంత తరుచుగా ఉత్తరువులను మార్చే ప్రత్యక్ష కష్టంనుండి మనం దూరంగా నిలిచి, రష్యన్ కార్మికవర్గం యింకా అరకొరగా వున్న తన సొంత శక్తుల సహాయంతో నిర్వహించవలసి వున్న అపారమైన ప్రపంచ చరిత్రాత్మక కర్తవ్యాన్ని కాస్త లోతుగా పరిశీలిస్తే, మనకు వెంటనే అర్థమౌతుంది, యింకా చాలా యెక్కువ మార్పులూ, యింకా యెక్కువగా వివిధ పరిపాలనా వ్యవస్థలనూ, క్రమశిక్షణ రూపాలనూ ఆచరణలో పరీక్షించుకోవడమూ కూడా అనివార్యమనీ, యింత బ్రహ్మాండమైన కర్తవ్యంలో, ముందుగా నిర్ణయింపబడిన యేదో ఒక సూచన ప్రకారం ఒక్క దెబ్బతో నూతన సమాజ నిర్మాణ రూపాలను మనం వెంటనే స్థిరపరచి, రూపకల్పన చేయగలమని మనం యెన్నడూ చెప్పుకోలేమనీ, భవిష్యత్తులో గల అవకాశాల గురించి యెప్పుడైనా రాసినా యే తెలివి గల సోషలిస్టూ అలా యెన్నడూ అనుకోను కూడా లేదనీ.

మనకు తెలిసిందంతా యేమిటంటే, పెట్టుబడిదారీ సమాజంమీద అత్యుత్తమ పండితులు, దాని అభివృద్ధిని భవిష్యద్దర్శనం చేసిన అత్యున్నత మేధావులు, మనకు కచ్చితంగా సూచించిందంతా యేమిటంటే, రూపాంతరీకరణం చారిత్రకంగా అనివార్యమనీ, ఒకానొక ప్రధాన మార్గంగుండా పురోగమించాలనీ, ఉత్పత్తి సాధనాల సొంత యాజమాన్యం చరిత్రచేత అభిశప్తమైందనీ, అది బ్రద్దలౌతుందనీ, దోపిడీదార్లు అనివార్యంగా నిరాస్తిపరులుగా చేయబడతారనీ. యిది శాస్త్రీయ కచ్చితత్వంతో ప్రతిష్ఠింపబడింది. మనం సోషలిజం జండా పట్టుకున్నప్పుడు, మనం సోషలిస్టులముగా ప్రకటించుకున్నప్పుడు, మనం సోషలిస్టు పార్టీలు స్థాపించినప్పుడు, సమాజ పునర్నిర్మాణం చేసినప్పుడు, యిది మనకు తెలుసు. సోషలిస్టు పునర్నిర్మాణం సాగించడానికి మనం అధికారం స్వాధీనం చేసుకున్నప్పుడు యిది మనకు తెలుసు; కానీ రూపాంతరీకరణ యే రూపాలలో జరిగేదీ, నిర్దిష్ట పునర్నిర్మాణం యే వేగంతో అభివృద్ధి అయ్యేదీ మనకు తెలియ జాలదు. సమష్టి అనుభవం, కోట్లమంది అనుభవం మాత్రమే యీ విషయంలో మనకు నిర్ణయాత్మకమైన మార్గదర్శకత్వం యివ్వగలదు; యెందుకంటే, సరిగ్గా, ఫ్యూడల్ సమాజంలోనూ, పెట్టుబడిదారీ సమాజంలోనూ యింతవరకు చరిత్రను నిర్మించిన ఆ పైవర్గాలకు చెందిన లక్షలమంది అనుభవం మన కర్తవ్యానికి, సోషలిజంను నిర్మించే

కర్తవ్యానికి, చాలదు గనుకనే. మనం యీ మార్గంలో పురోగమించ జాలం, యెందుకంటే, సరిగ్గా, మనం సమష్టి అనుభవంమీద, లక్షోపలక్షల శ్రామిక ప్రజల అనుభవంమీద, ఆధారపడతాము గనుకనే.

కనుక, మనకు తెలుసు, సోవియట్ల ప్రధాన, మౌలిక కర్తవ్యమైన వ్యవస్థీకరణ మూలంగా, అనివార్యంగా అపారమైన ప్రయోగాలూ, బృహత్ చర్యలూ, అపారమైన మార్పులూ, అపారమైన కష్టాలూ, ముఖ్యంగా ప్రతి వ్యక్తినీ అతవి ఉచిత స్థానంలో సరిగా పెట్టడం యెలా అనే విషయంలో, అవసర మౌతాయి; యెందుకంటే, మనకు దీని అనుభవంలేదు. యిక్కడ ప్రతి చర్యనీ మనమే రూపకల్పన చేసుకోవాలి. యీ మార్గంలో మనం చేసే తప్పులు యెంత గురుతరమైనవైతే అంతగా ట్రేడ్‌యూనియన్ సభ్యత్వంలో జరిగే ప్రతి పెరుగుదలతోనూ, యింతవరకు సంప్ర దాయం ప్రకారమూ, అలవాటు ప్రకారమూ జీవించిన శ్రామిక ప్రజల, పీడితుల, శిబి రంనుండి సోవియట్ సంస్థల నిర్మాతల శిబిరంలోకి వచ్చే ప్రతి అదనపు వెయ్యిమంది తోనూ, ప్రతి అదనపు లక్షమందితోనూ, తగినవాళ్ళుగా, సక్రమమైన పద్ధతులలో పనిని యేర్పాటుచేసేవాళ్ళుగానూ వుండక తప్పనివాళ్ల సంఖ్య పెరుగుతున్నదనే నిశ్చితత్వం పెరుగుతుంది.

ఆర్థిక కౌన్సిల్ — అత్యున్నత ఆర్థిక కౌన్సిల్ — మరీ తరుచుగా యెదుర్కొనే ఒక ప్రధాన కర్తవ్యాన్ని, బూర్జువా నిపుణులను ఉపయోగించుకునే కర్తవ్యాన్ని, తీసు కోండి. మన కందరికీ తెలుసు, కనీసం శాస్త్రవిజ్ఞానం, సోషలిజంల ఆధారంమీద ఆలో చించేవాళ్లకు తెలుసు, అంతర్జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థ శ్రమయొక్క భౌతిక, సాంకేతిక పూర్వావసరాలను, అపారమైన ప్రమాణంలో అభివృద్ధి చేయబడి, శాస్త్ర విజ్ఞానంమీద ఆధారపడి, తత్కారణంగా, శాస్త్రీయంగా విద్య పొందిన అపారమైన నిపు ణుల శిక్షణమీద ఆధారపడినవాటిని, అభివృద్ధి చేసినప్పుడు మాత్రమే, అభివృద్ధి చేసిన మేరకు మాత్రమే, యీ కర్తవ్యం నెరవేర్చబడగలదని. యీ అభివృద్ధి లేకుండా సోషలి జం అసాధ్యమని మనకు తెలుసు. గత అర్ధ శతాబ్దిలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభి వృద్ధిని గమనించి మళ్లీ మళ్లీ సోషలిజం అనివార్యమనే నిర్ణయానికి వచ్చిన సోషలిస్టుల రచనలు మనం మళ్లీ చదివితే, సోషలిజం మాత్రమే శాస్త్రవిజ్ఞానాన్ని బూర్జువా సంకెళ్లనుండీ, పెట్టుబడికింద బానిసత్వంనుండీ, గలీజు పెట్టుబడిదారీ దురాశా ప్రయోజనాలకింద దాస్యంనుండీ విముక్తి చేస్తుందని వాళ్లందరూ ఒకరు కూడా మినహాయింపు లేకుండా గుర్తుచేసినారని మనకు తెలుస్తుంది. శాస్త్రీయ పద్ధతులలో సామాజిక ఉత్పత్తి, పంపకాలు విశాలంగా విస్తరించడానికీ, సాధ్యమైనంత మేరకు శ్రామిక ప్రజల జీవితాలలోని కష్టాలు తగ్గించి, వాళ్ల సంక్షేమాన్ని పెంచే లక్ష్యానికి

అవి వాస్తవంలో లోబడడానికీ సోషలిజం మాత్రమే వీలు కలిగిస్తుంది. సోషలిజం మాత్రమే దీన్ని సాధించగలదు. అది దీనిని సాధించితీరాలని మనకు తెలుసు. యీ సత్యాన్ని గ్రహించడంలో వుంది మార్క్సిజంయొక్క యావత్తు సంక్లిష్టతా, యావత్తు బలమూ.

దీనికి వ్యతిరేకమైన శక్తులమీద ఆధారపడుతూ మనం దీనిని సాధించాలి; యెందు కంటే, పెట్టుబడి పెద్దదయ్యేకొద్దీ, బూర్జువావర్గం కార్మికులను యెక్కువగా అణచివేస్తుంది. అధికారం యిప్పుడు కార్మికుల, బీదరైతుల చేతుల్లో వుంది గనుక, ప్రజల అండతో ప్రభుత్వం కర్తవ్యాలు పెట్టుకుంటున్నది గనుక, యీ సోషలిస్టు మార్పులను మనం బూర్జువా సమాజంలో తర్ఫీదు పొంది, యే యితర పరిస్థితులనూ యెరగని, యే యితర సమాజ వ్యవస్థనూ ఊహించజాలని బూర్జువా నిపుణుల సహాయంతో సాధించవలసి వుంది. కనుక, యీ నిపుణులు పరమ నిజాయితీగా, పనిపట్ల పరమ భక్తిగా వున్న సందర్భాలలో కూడా, వేల బూర్జువా దురభిప్రాయా లతో వాళ్లు నిండివుంటారు, మరణిస్తూ, నశిస్తూ, అందువలన భీకరమైన ప్రతి ఘటన చేస్తూ వుండే బూర్జువా సమాజంతో తమకే కనపడని వేల సంబంధాలు వాళ్లు కలిగివుంటారు.

ప్రయత్నంలోనూ, విజయంలోనూ వుండే యీ కష్టాలను మనం మనకు కనపడకుండా మూసిపెట్టలేము. కార్మికవర్గం అధికారం స్వాధీనం చేసుకున్నప్పుడు, పెట్టుబడిదారీ వ్యవస్థ కూడబెట్టిన మహా సంపన్నమైన, చారిత్రకంగా అనివార్యమైన, మనకు అవసరమైన సంస్కృతీ, విజ్ఞాన, సంవిధానాల నిధియొక్క వెరసి మొత్తాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క పరికరంగా వుండే స్థితినుండి సోషలిజంయొక్క పరికరంగా వుండే స్థితికి మార్చే కర్తవ్యం పెట్టుకున్నప్పుడు, దానికి యెదురయ్యే యీ నిర్దిష్ట, ఆచరణగత కష్టాన్ని సూచించిన ఒక్క సోషలిస్టుయొక్క రచన గానీ, భావి సోషలిస్టు సమాజంమీద ఒక్క ప్రముఖ సోషలిస్టుయొక్క అభిప్రాయం గానీ నాకు గుర్తురావడం లేదు. సాధారణ సూత్రంలో, అభౌతిక తర్కంలో యిది చేయడం సులభం, కానీ వెంటనే చావకుండా, చావు సమీపించేకొద్దీ అంతకంతకూ భీక రంగా ప్రతిఘటన చేసే పెట్టుబడిదారీ వ్యవస్థతో చేసే పోరాటంలో యీ కర్తవ్యానికి ప్రచండమైన కృషి అవసర మౌతుంది. యీ రంగంలో ప్రయోగాలు జరుగుతా యంటే, పాక్షిక పొరపాట్లను మనం పదేపదే సరిదిద్దుకుంటా మంటే, యిది అనివార్యం; యెందుకంటే, జాతీయ ఆర్థిక వ్యవస్థలోని యే రంగంలోనైనా, నిపుణులను పెట్టుబడిదారీ వ్యవస్థ సేవకులుగా వుండే స్థితినుండి, శ్రామిక ప్రజల సేవకులుగా, వాళ్ల సలహాదారులుగా, వుండే స్థితికి మనం వెంటనే మార్చలేము. యిది మనం

వెంటనే చేయలేకపోతే, అది కించిత్తు నిరాశా దృక్పథాన్ని కూడా కలిగించకూడదు; యెందుకంటే, మనం పెట్టుకున్న కర్తవ్యం ప్రపంచ చారిత్రక కష్టమూ, ప్రాముఖ్యమూ గలది. ఒకే ఒక దేశంలో, అది రష్యాకంటె చాలా తక్కువ వెనుకబడి వుండినా కూడా, నాలుగేండ్ల అపూర్వ, బాధాకర, తీవ్ర, వినాశనకర యుద్ధం తర్వాత వున్న పరిస్థితుల కంటె మేలైన పరిస్థితులలో మనం జీవిస్తూ వుండినా కూడా, మనం సోషలిస్టు విప్లవాన్ని కేవలం మన సొంత ప్రయత్నాలద్వారా, పూర్తిగా నిర్వహించ జాలమనే విషయాన్ని మనం విస్మరించం. యిప్పుడు రష్యాలో జరుగుతున్న సోషలిస్టు విప్లవంనుండి ముఖం పక్కకు తిప్పుకొని, స్పష్టంగా కనపడే బలాల అసమత్వాన్ని చూపించేవాడు యెలాంటి వాడంటే, తన ముక్కును దాటి ముందుకు చూడలేనట్టి, బలాల అసమత్వం గల కొన్ని సందర్భాలు లేకుండా యేమాత్రమైనా ప్రాముఖ్యం గల ఒక్క చారిత్రక మార్పు కూడా జరగదనే విషయాన్ని విస్మరించేటట్టి యథాస్థితివాదపు బధిరాంధక శవము లాంటివాడు. విప్లవం పెరిగేకొద్దీ, పోరాటపు ప్రక్రియలో బలాలు పెరుగుతాయి. ఒక దేశం గంభీరమైన మార్పుల మార్గం చేపట్టినప్పుడు, ఆ దేశమూ, ఆ దేశంలో విజయం సాధించిన కార్మికవర్గమూ గతంలో అభౌతికంగా, సిద్ధాంతరీత్యా లేవనెత్తబడిన కర్తవ్యాలకు ఆచరణాత్మక పద్ధతిలో పూనుకోవడం వాటికి ప్రతిష్ఠాదాయకం. యీ అనుభవం యెన్నటికీ విస్మృతం కాదు. యిప్పుడు ట్రేడ్‌యూనియన్లలోనూ, స్థానిక సంస్థలలోనూ యేకమైన కార్మికులు మొత్తం ఉత్పత్తిని జాతీయ ప్రమాణంలో యేర్పాటుచేసే ఆచరణాత్మక పనిలో గడిస్తున్న అనుభవం, రష్యన్ విప్లవమూ, అంతర్జాతీయ సోషలిస్టు విప్లవమూ యెంత కష్టభూయిష్ఠమైన హెచ్చుతగ్గులగుండా గడిచినా, నష్టం కాజాలదు. అది సోషలిజంయొక్క లాభంగా చరిత్ర కెక్కింది; దానిమీద భావి ప్రపంచ విప్లవం తన సోషలిస్టు భవనాన్ని నిర్మిస్తుంది.

అత్యున్నత ఆర్థిక కౌన్సిల్ ఆచరణాత్మక పరిష్కారం కనుక్కోవలసిన మరొక సమస్యను, బహుశా అత్యంత కష్టమైన సమస్యను, ప్రస్తావించనియ్యండి. యిది పని క్రమశిక్షణ సమస్య. కచ్చితంగా చెప్పాలంటే, యీ సమస్యను ప్రస్తావించడంలో ఒక విషయాన్ని మనం సంతృప్తితో ఒప్పుకొని, నొక్కిచెప్పాలి: సరిగ్గా ట్రేడ్‌యూనియన్లే, వాటి అత్యంత పెద్ద సంస్థలే, అనగా మెటల్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ, అఖిల రష్యా ట్రేడ్‌యూనియన్ కౌన్సిలూ, మిలియన్ల కార్మికులను సమైక్యం చేసే అత్యున్నత ట్రేడ్‌యూనియన్ సంస్థలూ, యివే యీ సమస్యను పరిష్కరించడానికి మొదట స్వతంత్రంగా పూనుకొన్నవి; యీ సమస్య ప్రపంచ చరిత్రాత్మక ప్రాముఖ్యం గలది. దీనిని అర్థంచేసుకోడానికి మనం యీ పాక్షిక, స్వల్ప వైఫల్యాలనుండి, విడివిడిగా

చూస్తే అధిగమించరానట్టివిగా కనపడే నమ్మశక్యం కాని కష్టాలనుండి దూరంగా నిల బడాలి. మనం మరింత యెత్తున నిలబడి, సాంఘిక ఆర్థిక వ్యవస్థల చారిత్రక మార్పును పరిశీలించాలి. మనం పూనుకున్న కర్తవ్యంయొక్క అపారత్వాన్ని గ్రహించడానికి యీ కోణంనుండి మాత్రమే వీలౌతుంది. యింతకుముందు, ఫ్యూడల్ రష్యాలో 1861 వరకు,* తమ సొంత వ్యవహారంగా పరిగణించిన భూస్వాములచేత పరిష్కరింపబడిన కర్తవ్యానికి యిప్పుడు సమాజపు అత్యంత పురోగామి ప్రతినిధులు, శ్రామిక, పీడిత ప్రజలు, తమ సొంత చొరవతో పూనుకుంటున్నారనే విషయంయొక్క అపారమైన ప్రాముఖ్యాన్ని గ్రహించడానికి అప్పుడు మాత్రమే వీలౌతుంది. రాజ్య యేకీకరణనూ, క్రమశిక్షణనూ సాధించడం ఆ కాలంలో భూస్వాముల వ్యవహారం.

ఫ్యూడల్ భూస్వాములు యీ క్రమశిక్షణను యెలా సృష్టించిందీ మనకు తెలుసు. అది మెజారిటీ ప్రజలకు పీడన, అవమానం, నమ్మశక్యం కాని హింసలతో కూడిన కఠినశిక్ష. ఫ్యూడల్ దాస్యంనుండి బూర్జువా వ్యవస్థకు పరివర్తన జ్ఞాపకం చేసుకోండి. మీరు చూసినదాన్నిబట్టి — మీలో అధిక భాగం దానిని చూసివుండజాలక పోయినప్పటికీ — వెనుకటి తరంవాళ్లనుండి మీరు విన్నదాన్నిబట్టి, మీకు తెలుసు, 1861 తర్వాత కొత్త బూర్జువా ఆర్థిక వ్యవస్థకు పరివర్తన, పాత ఫ్యూడల్ కర్రపెత్తనపు క్రమశిక్షణనుండి, మతిహీన, దురహంకార, పాశవిక అవమానపు, వ్యక్తిగత దౌర్జన్యపు క్రమశిక్షణనుండి, బూర్జువా క్రమశిక్షణకు, పస్తుల క్రమశిక్షణకు, వాస్తవంలో పెట్టుబడిదారీ బానిసత్వపు క్రమశిక్షణ అయినట్టి నిర్నిబంధ కూలిపని అనబడేదానికి, పరివర్తన చారిత్రకంగా యెంత సులభంగా కనిపించిందీ. దీనికి కారణం యేమిటంటే, మానవజాతి ఒక దోపిడీదారునినుండి మరొకనికి మారినారు; ప్రజల శ్రమను కొల్లగొట్టి, దోపిడీ చేసే ఒక మైనారిటీ పోయి దాని స్థానంలో మరొక మైనారిటీ, వాళ్లు కూడా ప్రజల శ్రమను కొల్లగొట్టి, దోపిడీచేసేవాళ్లు అయినట్టి మైనారిటీ, వచ్చింది; భూస్వాములు పోయి వారి స్థానంలో పెట్టుబడిదార్లు వచ్చినారు; శ్రమజీవులైన దోపిడీచేయబడే వర్గాలు అణచివేయబడుతూనే వుండినారు. ఒక దోపిడీదారుని క్రమశిక్షణనుండి మరొక దోపిడీదారుని క్రమశిక్షణకు జరిగిన యీ మార్పుకు కూడా దశాబ్దాల కృషి కాకపోయినా, సంవత్సరాల కృషి పట్టింది; అది దశాబ్దాలు కాకపోయినా, సంవత్సరాల పరివర్తన దశగా విస్తరించింది. యీ దశలో పాత ఫ్యూడల్ భూస్వాములు ప్రతిదీ ధ్వంసమై పోతున్నదనీ, ఫ్యూడల్ దాస్యం లేకుండా దేశాన్ని నిర్వహించడం అసాధ్యమనీ పరమ మనస్ఫూర్తిగా

*రష్యాలో ఫ్యూడల్ దాస్యం 1861 ఫిబ్రవరి 19న రద్దుచేయబడింది. — సం.

నమ్మినారు; కాగా కొత్త పెట్టుబడిదారీ యజమాని అడుగడుగునా ఆచరణగత కష్టాలు యెదుర్కొని, తన వ్యాపారాన్ని పనికిమాలిన పనిగా యెంచి, విరమించుకున్నాడు. యీ పరివర్తనలోని కష్టానికి భౌతిక సాక్ష్యం, ఒక మంచి రుజువు, యేమిటంటే, అత్యుత్త మమైన యంత్రాలు ఉపయోగించుకోడానికి ఆ కాలంలో రష్యా విదేశాలనుండి యంత్రాలను దిగుమతి చేసుకొంది, కానీ యీ యంత్రాలను నడిపించేవాళ్లు యెవ్వరూ లేకపోయినారు, మేనేజర్లు యెవ్వరూ లేరు. రష్యా అంతటా ప్రశస్తమైన యంత్రాలు ఉపయోగించ కుండా పడివుండడం కనిపించింది; పాత, ఫ్యూడల్ క్రమశిక్షణనుండి కొత్త, బూర్జువా, పెట్టుబడిదారీ క్రమశిక్షణకు పరివర్తన యింత కష్టంగా వుండింది.

కామ్రేడ్స్, కనుక, మీరు యీ విషయాన్ని యీ కోణంనుండి చూస్తే, ఆ మనుషులచేతా, ఆ వర్గాలచేతా, ఆ బూర్జువావర్గంచేతా, వాళ్ల ఆశ్రితులచేతా మోసపోరు; వాళ్ల యేకైక కర్తవ్యం భయవిహ్వలతను విత్తడం, నిరాశను విత్తడం, మొత్తం మన పనిని గురించి సంపూర్ణ నిరాశను విత్తడం, దానిని నిరుపయోగమైనదిగా కనిపించే టట్లు చేయడం; వాళ్ళ క్రమశిక్షణా రాహిత్యానికీ, లంచగొండితనానికీ సంబంధించిన ప్రతి వొక్క సందర్భాన్నీ చూపించి, తత్కారణంగా విప్లవాన్ని పనికిమాలిన పనిగా యెంచి విసర్జిస్తారు, ప్రజలు ఒక కొత్త క్రమశిక్షణను సృష్టించేటప్పుడు, క్రమ శిక్షణా రాహిత్యం లేకుండా, లంచగొండితనం లేకుండా, బాధాకరమైన ప్రయోగాత్మక చర్యలు లేకుండా ప్రపంచంలో, చరిత్రలో, యెప్పుడైనా నిజంగా గొప్పదైన ఒక్కగా నొక్క విప్లవమైనా వుండినట్లు. చరిత్రలో ఒక కొత్త క్రమశిక్షణను, శ్రామిక క్రమ శిక్షణను, సౌభ్రాతృ సంబంధాల క్రమశిక్షణను, సోవియట్ క్రమశిక్షణను, లక్షోపలక్షల శ్రామిక, పీడిత ప్రజలు వాస్తవంలో సృష్టిస్తున్న యీ ప్రాథమిక దశ అందుకో బడడం యిది మొదటిసారి అనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. యీ రంగంలో సత్వర విజయాలు కలుగుతాయని మనం అనం, మనం ఆశించం. యీ కర్తవ్యానికి ఒక మొత్తం చారిత్రక యుగం పట్టుతుందని మనకు తెలుసు. యీ చారిత్రక యుగాన్ని మనం ప్రారంభించినాము; యీ యుగంలో మనం యింకా బూర్జువాగా వున్న దేశంలో పెట్టుబడిదారీ సమాజపు క్రమశిక్షణను బద్దలు చేస్తున్నాము, రాజకీయ చైతన్యం గల కార్మికులందరూ, మినహాయింపు లేకుండా శ్రామిక రైతులందరూ యీ విధ్వంసానికి తోడ్పడుతున్నందుకు మనం గర్విస్తున్నాము; యీ యుగంలో, శ్రామిక ప్రజల దోపిడీ మీదా, బానిసత్వంమీదా ఆధారపడిన యీ క్రమశిక్షణను నూతన సమైక్య శ్రామిక క్రమశిక్షణగా, మొత్తం రష్యాయొక్క, కోట్ల, దశకోట్ల జనాభా గల దేశంయొక్క సమైక్య, సంఘటిత కార్మికుల, శ్రామిక రైతుల క్రమశిక్షణగా తాము — పైనుండి వచ్చే ఆదేశాల ప్రకారం కాక, తమ సొంత సజీవ అనుభవంయొక్క ఆదేశాల

ప్రకారం — మార్చాలని ప్రజలు ఇచ్ఛికంగా, సొంత చొరవతో తెలుసుకుంటున్నారు. యిది అపారమైన కష్టంతో కూడిన కర్తవ్యం, కానీ లాభదాయకమైనది; యెందుకంటే, దీనిని మనం ఆచరణలో పరిష్కరించినప్పుడే, మనం పాతిపెడుతున్న పెట్టుబడిదారీ సమాజపు శవపేటికకు చివరి చీల దిగగొట్టినవాళ్ల మౌతాము. (హర్షధ్వానాలు.)

# మహా ప్రారంభం

(పశ్చాద్భాగంలోని కార్మికుల వీరత్వం. "కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కుల" సందర్భంలో)

(కొన్ని భాగాలు)

నేను ఒకటికంటె యెక్కువసార్లు — యితర సందర్భాలతో పాటు, మార్చి 12న పెట్రోగ్రాడ్ సోవియట్ సమావేశంలో నేను యిచ్చిన ఉపన్యాసంలోనూ — గుర్తు చేసినట్లు, కార్మికవర్గ నియంతృత్వం అంటే దోపిడీదార్లమీద బలప్రయోగం మాత్రమే కాదు, ప్రధానంగా బలప్రయోగం కూడా కాదు. యీ విప్లవ బలప్రయోగపు ఆర్థిక పునాదీ, దీని ప్రయోజకత్వానికీ, విజయానికీ హామీ యేమిటంటే, కార్మికవర్గం పెట్టుబడిదారీ వ్యవస్థకంటె ఉన్నతమైన శ్రమయొక్క సామాజిక వ్యవస్థీకరణకు ప్రాతినిధ్యం వహించడమూ, ఆ వ్యవస్థీకరణను సృష్టించడమూ. యిదే ముఖ్యమైనది, యిదే బలంయొక్క మూలమూ, కమ్యూనిజంయొక్క అంతిమ విజయం అనివార్యం కావడానికి హామీ.

సామాజిక శ్రమయొక్క ఫ్యూడల్ వ్యవస్థీకరణ బడిత క్రమశిక్షణమీద ఆధారపడి వుండింది, కొద్దిమంది భూస్వాములచేత దోచుకోబడి, హింసింపబడిన శ్రామిక ప్రజలు పూర్తిగా అజ్ఞానులుగానూ, నేల రాయబడినవాళ్లుగానూ వుండినారు. సామాజిక శ్రమయొక్క పెట్టుబడిదారీ వ్యవస్థీకరణ ఆకలి క్రమశిక్షణమీద ఆధారపడి వుండింది; బూర్జువా సంస్కృతీ, బూర్జువా ప్రజాస్వామ్యమూ యెంత పురోగమించినప్పటికీ, అత్యంత పురోగామి, నాగరిక, ప్రజాతంత్ర రిపబ్లిక్కుల్లో శ్రామిక ప్రజల అపార జనబాహుళ్యం కొద్దిమంది పెట్టుబడిదార్లచేత దోచుకోబడి, హింసింపబడే కూలి బానిసల, లేదా దమిత రైతుల నేల రాయబడిన జనబాహుళ్యంగా వుంది. సామాజిక శ్రమయొక్క కమ్యూనిస్టు వ్యవస్థీకరణ, సోషలిజం దేనివైపు మొదటి అడుగో అది, భూస్వాములయొక్కా, పెట్టుబడిదార్లయొక్కా పెత్తనాన్ని తోసివేసిన శ్రామిక ప్రజలదే అయిన స్వేచ్ఛాయుత, చైతన్యపూరిత క్రమశిక్షణమీద ఆధారపడుతుంది, కాలం గడచేకొద్దీ అంతకంతకూ యెక్కువగా ఆధారపడుతుంది.

యీ కొత్త క్రమశిక్షణ ఆకాశంనుండి వూడిపడదు, భక్తిపూరిత కాంక్షలనుండి ఉద్భవించదు; యిది భారీ పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క భౌతిక పరిస్థితులనుండి, వాటినుండి మాత్రమే, ఉద్భవిస్తుంది. అవి లేకుండా యిది అసంభవం. యీ భౌతిక పరిస్థితులు వుండే స్థానం, లేదా పాత్ర భారీ పెట్టుబడిదారీ వ్యవస్థచేత సృష్టింపబడి, వ్యవస్థీకరింపబడి, సమైక్యం చేయబడి, తర్ఫీదు చేయబడి, విద్యావంతం చేయబడి, కాకలు తీర్చబడిన ఒక నిర్దిష్టమైన చారిత్రక వర్గం. యీ వర్గం కార్మికవర్గం.

''కార్మికవర్గ నియంతృత్వం'' అనే లాటిన్ భాషలోని శాస్త్రీయ, చారిత్రక-తాత్త్విక పదాన్ని సరళమైన భాషలోకి అనువదిస్తే, దాని అర్థం సరిగ్గా యిది:

పెట్టుబడి పెత్తనాన్ని తోసివేయడానికి జరిగే పోరాటంలోనూ, దాన్ని నిర్వహించడంలోనూ, విజయాన్ని నిలుపుకోడానికీ, దృఢపరచుకోడానికీ చేసే పోరాటంలోనూ, కొత్త, సోషలిస్టు సామాజిక వ్యవస్థను సృష్టించడంలోనూ, వర్గాల సంపూర్ణ రద్దు కొరకు చేసే యావత్తు పోరాటంలోనూ దోపిడీ చేయబడే మొత్తం శ్రామిక ప్రజా బాహుళ్యానికి ఒక నిర్దిష్ట వర్గం మాత్రమే నాయకత్వం వహించగలదు — యేదంటే, పట్టణ కార్మికులూ, దరహంమీద ఫాక్టరీ, పారిశ్రామిక కార్మికులూ. (యిక్కడ ఒక మాట చెప్పనివ్వండి; సోషలిజంకూ, కమ్యూనిజంకూ మధ్య గల ఒకేఒక శాస్త్రీయ భేదం యేమిటంటే, మొదటి మాటకు అర్థం పెట్టుబడిదారీ వ్యవస్థనుండి ఉద్భవించే నూతన సమాజపు మొదటి దశ, రెండవ మాటకు అర్థం తరువాతి, మరింత ఉన్నతమైన దశ.)

''బెర్న్'' పెకిలి ఇంటర్నేషనల్* చేసే పొరపాటు యేమిటంటే, దాని నాయకులు వర్గపోరాటాన్నీ, కార్మికవర్గపు నాయక పాత్రనూ మాటలలో మాత్రమే ఒప్పుకుంటారు, కానీ దాని తార్కిక నిర్ధారణదాకా తుదముట్ట ఆలోచించడానికి భయపడతారు. ప్రత్యేకంగా యేది బూర్జువాలను భయకంపితులను చేస్తుందో, యేది బూర్జువాలకు అనంగీకార యోగ్యమో, ఆ నిర్ధారణకు వాళ్ళు భయపడతారు. కార్మికవర్గ నియంతృత్వం వర్గపోరాట కాలం <u>కూడా</u> అనీ, వర్గాలు రద్దుచేయబడకుండా వున్నంత కాలం యీ

---

*''బెర్న్'' పెకిలి ఇంటర్నేషనల్ — 1914లో మొదటి ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు అంతరించి, మళ్లీ 1919 ఫిబ్రవరిలో సోషల్ జాతీయ దురహంకార పార్టీలూ, సెంట్రిస్టు పార్టీలూ బెర్న్‌లో జరిపిన కాన్ఫరెన్సులో పునరుద్ధరించబడిన రెండవ ఇంటర్నేషనల్. — సం.

పోరాటం అనివార్యమనీ, యీ పోరాటం రూపం మారుతూ, పెట్టుబడి కూలదోయ బడిన తర్వాత వెంటనే వచ్చే కాలంలో మరీ భీషణంగా, మరీ విలక్షణంగా వుంటుందనీ ఒప్పుకోడానికి వాళ్లు భయపడతారు. రాజకీయ అధికారం పట్టుకున్న తర్వాత కార్మిక వర్గం వర్గపోరాటం ఆపదు, వర్గాలు రద్దయిందాకా కొనసాగిస్తుంది — సహజంగా, భిన్న పరిస్థితులలో, భిన్న రూపంలో, భిన్న సాధనాలతో.

''వర్గాల రద్దు'' అంటే యేమిటి అర్థం? సోషలిస్టులమని చెప్పుకునేవాళ్లందరూ దీనిని సోషలిజంయొక్క అంతిమ గమ్యంగా గుర్తిస్తారు, కానీ దాని ప్రాముఖ్యం గురించి అందరూ ఆలోచించరు. వర్గాలు అంటే, చారిత్రకంగా నిర్ణీతమైన సామాజిక ఉత్పత్తి వ్యవస్థలో తాము ఆక్రమించే స్థానంలోనూ, ఉత్పత్తి సాధనాలతో తమకు గల సంబంధం (అత్యధిక సందర్భాలలో చట్టంచేత నిర్ణయించబడి, రూపొందించబడిన సంబంధం) లోనూ, శ్రమయొక్క సామాజిక వ్యవస్థీకరణలోని తమ పాత్రలోనూ, తత్పర్యవసానంగా, సామాజిక ఐశ్వర్యంలో తాము ఖర్చుపెట్టే భాగంయొక్క పరిమాణాలలోనూ, ఆ భాగాన్ని సంపాయించే పద్ధతిలోనూ పరస్పరం భిన్నమైన విశాల ప్రజా బృందాలు. వర్గాలు అంటే, నిర్ణీత సామాజిక ఆర్థిక వ్యవస్థలో తాము ఆక్రమించే భిన్న స్థానాల మూలంగా, ఒకదాని శ్రమను మరొకటి సొంతపరచుకోగల ప్రజా బృందాలు.

స్పష్టంగా, వర్గాలను పూర్తిగా రద్దుచేయడానికి దోపిడీదార్లను —భూస్వాములనూ, పెట్టుబడిదార్లనూ — కూలదోయడం చాలదు, వాళ్ల ఆస్తి హక్కులను రద్దుచేయడం చాలదు; ఉత్పత్తి సాధనాల సొంత స్వామ్యాన్ని అంతటినీ రద్దుచేయడం కూడా అవసరం, పట్టణానికీ, గ్రామీణ ప్రాంతానికీ మధ్య భేదాన్నీ, శరీర శ్రమ చేసేవాళ్లకూ, మానసిక శ్రమ చేసేవాళ్లకూ మధ్య భేదాన్నీ రద్దుచేయడం అవసరం. దీనికి చాలా దీర్ఘ కాలం పట్టుతుంది. దీనిని సాధించడానికి ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో అపారమైన ముందడుగు వేయాలి. సన్నకారు ఉత్పత్తియొక్క అనేక అవశేషాల ప్రతిఘటనను (తరుచుగా నిష్క్రియాత్మకమైనదాన్ని, అందువలన మరీ మొండిదీ, అధిగమించడానికి మరీ కష్టమైనదీ అయినదాన్ని) అధిగమించడం అవసరం; యీ అవశేషాలతో లంకింపబడిన అపారమైన అలవాటు బలాన్నీ, యథాస్థితితత్వాన్నీ అధిగమించడం అవసరం.

''శ్రామిక ప్రజ'' లందరూ యీ పని చేయడానికి సమానంగా సమర్థులని అను కోవడం వట్టి మాట, లేదా కృతయుగంనాటి, మార్క్సుపూర్వ సోషలిస్టుయొక్క భ్రమ. యెందుకంటే, యీ సామర్థ్యం దానిపాటికదే రాదు, చారిత్రకంగా పెరుగు తుంది, భారీ పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క భౌతిక పరిస్థితులనుండి మాత్రమే పెరుగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు పోయే బాటయొక్క

ప్రారంభంలో యీ సామర్థ్యం కార్మికవర్గానికి మాత్రమే వుంటుంది. తనను యెదుర్కొనే బ్రహ్మాండమైన కర్తవ్యాన్ని నిర్వహించే సామర్థ్యం దానికి యెందుకు వుందంటే, మొదటిది, అది నాగరిక సమాజంలో అత్యంత బలమైన, అత్యంత పురోగామి అయిన వర్గం గనుకా; రెండవది, అత్యంత అభివృద్ధి అయిన దేశాలలో అది ప్రజానీకంలో మెజారిటీగా వుంది గనుకా; మూడవది, రష్యా లాంటి వెనుకబడిన పెట్టుబడిదారీ దేశాలలో ప్రజానీకంలో మెజారిటీ అర్ధ కార్మికులు గనుకా, అనగా, యేడాదిలో కొంత భాగం క్రమం తప్పకుండా కార్మికవర్గ పద్ధతిలో జీవిస్తూ, క్రమం తప్పకుండా తమ జీవనోపాధిలో కొంత భాగాన్ని పెట్టుబడిదారీ సంస్థలలో కూలి కార్మికులుగా సంపాయిస్తారు గనుకా.

పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు జరిగే పరివర్తనలో యిమిడివున్న సమస్యలను స్వేచ్ఛా, సమానత్వమూ, దర్ధహంమీద ప్రజాస్వామ్యమూ, శ్రమ ప్రజాస్వామ్య సమానత్వమూ, వగైరాల గురించిన సాధారణ సంభాషణ ప్రాతిపదికమీద (కౌట్స్కీ,* మార్తొవ్‌ల లాగా, బెర్న్ వెకిలి ఇంటర్నేషనల్‌కు చెందిన యితర వీరుల లాగా) పరిష్కరించడానికి ప్రయత్నించేవాళ్లు తద్వారా తమ పెటీబూర్జువా, అల్ప బుద్ధి స్వభావాన్ని మాత్రమే వెల్లడిచేస్తారు, సైద్ధాంతికంగా బానిస బుద్ధితో బూర్జువా వర్గపు అడుగు జాడలను అనుసరిస్తారు. యీ సమస్యకు సరైన పరిష్కారం యెక్కడ లభించగలదంటే, రాజకీయ అధికారం జయించుకున్న నిర్దిష్ట వర్గం అయిన కార్మిక వర్గానికీ, కార్మికవర్గేతరమూ, అర్ధ కార్మికవర్గీయమూ అయిన మొత్తం శ్రామిక ప్రజా బాహుళ్యానికీ మధ్య గల నిర్దిష్ట సంబంధాలను — ఊహాలోక సామరస్యపు ''ఆదర్శ'' పరిస్థితులలో కాక, అనేక, భిన్న రూపాలు ధరించే బూర్జువావర్గపు ఆదుర్దాతో కూడిన ప్రతిఘటన గల వాస్తవ పరిస్థితులలో రూపుదాల్చే సంబంధాలను — నిర్దిష్టంగా అధ్యయనం చేయడంలో మాత్రమే లభించగలదు.

యే పెట్టుబడిదారీ దేశంలో నైనా, రష్యాతో సహా, వున్న ప్రజానీకంలోని — అంతకంటె యెక్కువగా శ్రామిక ప్రజానీకంలోని — అపారమైన మెజారిటీ స్వయంగానూ, తమ ఆత్మీయులద్వారానూ పెట్టుబడి పీడననూ, అది సాగించే కొల్లనూ, రకరకాల క్రౌర్యాన్నీ వేలసార్లు అనుభవించినారు. సామ్రాజ్యవాద యుద్ధం, అనగా, యావత్ప్రపంచాన్నీ కొల్లగొట్టడానికి సర్వాధిపత్యం బ్రిటిష్ పెట్టుబడికి వుండాల్నా, జర్మన్ పెట్టు

* కౌట్స్కీ, కార్ల్ (1854–1938) — జర్మన్ సోషల్ డెమోక్రసీకీ, రెండవ ఇంటర్నేషనల్‌కూ ఒక నాయకుడు, సిద్ధాంతకారుడు. సెంట్రిజం సిద్ధాంతకారుడు, మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పటినుండి మార్క్సిజంకు ద్రోహి. — సం.

బడికి వుండాల్నా అనేది నిర్ణయించడానికి కోటిమంది వధ, యీ బాధలను తీవ్రతరం చేసింది, పెంచింది, ప్రగాఢం చేసింది, వీటి అర్థాన్ని ప్రజలు గుర్తించేటట్లు చేసింది. కనుకనే ప్రజానీకంలోని అపారమైన మెజారిటీ, ముఖ్యంగా శ్రామిక ప్రజలు, కార్మికవర్గానికి అనివార్యంగా సానుభూతి చూపడం; యెందుకంటే, అది వీరోచిత ధైర్యంతోనూ, విప్లవ నిర్దాక్షిణ్యంతోనూ పెట్టుబడి పెత్తనాన్ని తోసివేస్తున్నది, దోపిడీదార్లను కూలదోస్తున్నది, వాళ్ల ప్రతిఘటనను అణచివేస్తున్నది, దోపిడీదార్లకు తావు లేని నూతన సమాజపు సృష్టికి బాట వేయడానికి తన రక్తం ధారవోస్తున్నది గనుక.

కార్మికవర్గేతర, అర్ధ కార్మికవర్గీయ శ్రామిక ప్రజా బాహుళ్యానికి గల పెటీ బూర్జువా ఊగిసలాటా, బూర్జువా ''సువ్యవస్థ''లోకి, బూర్జువావర్గ ''రక్షణ''లోకి తిరిగి పోవాలనే ధోరణీ గొప్పగా, అనివార్యంగా వున్నప్పటికీ, వాళ్లు కార్మికవర్గంయొక్క — దోపిడీదార్లను కూలదోస్తూ, వాళ్ల ప్రతిఘటనను అణచివేస్తూ వుండడమే కాక, ఒక నూతన, ఉన్నత సామాజిక సంబంధాన్ని, ఒక సామాజిక క్రమశిక్షణను, తమ సొంత ఐక్యతయొక్కా, తమ సొంత, అధిక వర్గచైతన్యపూరిత, ధీర, దృఢ, విప్లవాత్మక, సుస్థిర అగ్రగదళంయొక్కా అధికారాన్ని తప్ప యే పెత్తనాన్నీ, యే అధికారాన్నీ యెరగని వర్గచైతన్యపూరిత, సమైక్య శ్రామిక ప్రజల క్రమశిక్షణను, నిర్మిస్తున్న కార్మికవర్గంయొక్క — నైతిక, రాజకీయ అధికారాన్ని గుర్తించకుండా వుండ లేరు.

విజయం సాధించడానికీ, సోషలిజంను నిర్మించి, దృఢపరచడానికీ, కార్మికవర్గం ద్విముఖ, లేదా ద్వంద్వ కర్తవ్యం నిర్వర్తించాలి. మొదటిది, అది పెట్టుబడిమీద చేసే విప్లవాత్మక పోరాటంలో తన మహోన్నత వీరత్వంద్వారా దోపిడీ చేయబడే శ్రామిక ప్రజా బాహుళ్య మంతటినీ ఆకర్షించాలి, వాళ్లను ఆకర్షించి, వ్యవస్థీకరించి, బూర్జువా వర్గాన్ని కూలదోయడానికీ, బూర్జువావర్గ ప్రతిఘటనను పూర్తిగా అణచి వేయడానికీ చేసే పోరాటంలో వాళ్లను నడిపించాలి. రెండవది, అది కొత్త ఆర్థిక అభివృద్ధి బాటమీదికి, ఒక కొత్త సామాజిక సంబంధాన్ని, ఒక కొత్త శ్రమ క్రమ శిక్షణను, సరికొత్త శాస్త్ర విజ్ఞానాన్నీ, పెట్టుబడిదారీ సాంకేతిక విజ్ఞానాన్నీ, భారీ సోషలిస్టు పరిశ్రమలను సృష్టించే వర్గచైతన్యపూరిత కార్మికుల సామూహిక సంస్థలతో సమ్మేళనం చేసే కొత్త శ్రమ వ్యవస్థీకరణను, సృష్టించడం వైపు దోపిడీ చేయబడే శ్రామిక ప్రజా బాహుళ్య మంతటినీ, పెటీబూర్జువా అంశాలనూ కూడా నడిపించాలి.

రెండవ కర్తవ్యం మొదటిదానికంటె కష్టమైనది; యెందుకంటే, వీరావేశపు

ఒంటరి చర్యలచేత దానిని నిర్వర్తించడం సాధ్యం కాదు; దానికి సాదా, రోజువారీ పనిలో అత్యంత దీర్ఘమైన, పట్టు విడువని, కష్టమైన సామూహిక వీరత్వం అవసరం. కానీ మొదటిదానికంటె యీ కర్తవ్యం ముఖ్యమైనది, యెందుకంటే, కొత్త, ఉన్నత సామాజిక ఉత్పత్తి విధానం మాత్రమే, పెట్టుబడిదారీ, పెటీబూర్జువా ఉత్పత్తి స్థానంలో భారీ సోషలిస్టు ఉత్పత్తిని పెట్టడం మాత్రమే, బూర్జువావర్గంమీద విజయాలకు కావలసిన బలానికి ప్రగాఢమైన మూలంగా, యీ విజయాల సుస్థిరత్వానికీ, శాశ్వతత్వానికీ యేకైక హామీగా వుండగలదు.

...అంతిమ పరిశీలనలో నూతన సమాజ వ్యవస్థకు అత్యంత ముఖ్యమైనది, ప్రధానమైనది శ్రమ ఉత్పాదకత. ఫ్యూడల్ దాస్యంలో కనీవిని యెరగని శ్రమ ఉత్పాదకతను పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించింది. సోషలిజం అంతకంటె చాలా ఉన్నతమైన కొత్త శ్రమ ఉత్పాదకతను సృష్టించి, పెట్టుబడిదారీ వ్యవస్థను చిత్తుగా ఓడించగలదు, ఓడిస్తుంది. యిది చాలా కష్టమైన విషయం, చాలా కాలం తీసుకోక తప్పదు, కానీ యిది ప్రారంభించబడింది; అదీ ముఖ్యమైనది. పస్తులున్న మాస్కోలో, 1919 వేసవిలో, పస్తులున్న కార్మికులు, బాధాకరమైన నాలుగేండ్ల సామ్రాజ్యవాద యుద్ధాన్నీ, అంతకంటె బాధాకరమైన ఒకటిన్నర యేండ్ల అంతర్యుద్ధాన్నీ అనుభవించినవాళ్లు, యీ గొప్ప పనిని ప్రారంభించగలిగినారంటే, తరువాత, మనం అంతర్యుద్ధంలో గెలిచి, శాంతిని గెలుచుకున్నప్పుడు పరిస్థితులు యెలా అభివృద్ధి అవుతాయి?

కమ్యూనిజం అనేది పురోగామి సంవిధానాలను వినియోగించే ఐచ్ఛిక, వర్గచైతన్యపూరిత, సమైక్య కార్మికుల శ్రమయొక్క ఉన్నత ఉత్పాదకత – పెట్టుబడిదారీ వ్యవస్థలో వున్నదానితో పోలిస్తే. కమ్యూనిజంయొక్క వాస్తవ ప్రారంభంగా కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు అసాధారణమైన విలువ గలవి; యిది చాలా అరుదైన విషయం; యెందుకంటే, (మన పార్టీ కార్యక్రమం సరిగా చెప్పినట్లు) ''పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి కమ్యూనిజంకు జరిగే పరివర్తనలో మొదటి అడుగులు మాత్రమే వేయబడుతున్న'' దశలో మనం వున్నాం.

మామూలు కార్మికులు శ్రమ ఉత్పాదకతను పెంచడానికి కష్టమైన శ్రమకు భయపడని ఉత్సాహపూరిత ఆసక్తి ప్రదర్శించినప్పుడు, కార్మికులకు స్వయంగా గానీ, వాళ్ల ''దగ్గరి'' బంధువులకు గానీ చేరేది కాక, వాళ్ల ''దూరపు'' బంధువులకు, అనగా మొత్తం సమాజానికి, మొదట ఒక సోషలిస్టు రాజ్యంలోనూ, తరువాత సోవియట్ రిపబ్లిక్కుల యూనియన్‌లోనూ సమైక్యమైన కోట్ల, దశకోట్ల ప్రజలకు, చేరే ప్రతి

పూడ్ * ధాన్యాన్నీ, బొగ్గునూ, యినుమునూ, తదితర ఉత్పాదితాలనూ సేకరించడానికి ఆసక్తి ప్రదర్శించినప్పుడు కమ్యూనిజం ప్రారంభమౌతున్నది.

'పెట్టుబడి'లో కార్ల్ మార్క్స్ స్వేచ్ఛ, మానవ హక్కుల పటాటోప, గంభీరా డంబర బూర్జువా ప్రజాతంత్ర మహా పత్రాన్ని అపహాస్యం చేస్తాడు, దరహంమీద స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాత్రాల గురించిన వాగాడంబరాన్ని, పెటీబూర్జువాలకూ, సకల దేశాల అల్పబుద్ధులకూ, యేహ్యమైన బెర్న్ ఇంటర్నేషనల్‌కు చెందిన ప్రస్తుత యేహ్యమైన వీరులతో సహా, కనులకు మిరుమిట్లు గొల్పేదాన్ని, అపహాస్యం చేస్తాడు. యీ పటాటోప హక్కుల ప్రకటనలను మార్క్స్ కార్మికవర్గం యీ సమస్యను రూపొందించే సాదా, మిత, ఆచరణాత్మక, సరళ పద్ధతితో పోలుస్తాడు — తక్కువ పని దినాన్ని శాసనం చేయడం అలాంటి పద్ధతికి విలక్షణమైన ఉదాహరణ. కార్మికవర్గ విప్లవ సారం వెల్లడయ్యే కొద్దీ మార్క్స్ మాటలోని ఔచిత్యమూ, గాంభీర్యమూ మనకు స్పష్టమూ, తేటతెల్లమూ అవుతాయి. నిజమైన కమ్యూనిజంయొక్క "సూత్రాలు" కౌట్స్కీయొక్కా, మెన్షివిక్కులయొక్కా, ** సోషలిస్టు రివల్యూషనరీలయొక్కా, *** వాళ్ల

---

* పూడ్ = 16 కిలోగ్రాములు. — సం.

** మెన్షివిక్కులు — రష్యన్ సోషల్ డెమోక్రసీలో ఒక అవకాశవాద ధోరణి, అంత ర్జాతీయ అవకాశవాదంలో ఒక ధోరణి. ఆర్.యస్.డి.యల్.పి. రెండవ మహాసభ (1903)లో లెనిన్ 'ఇస్క్రా'కు వ్యతిరేకులైనవాళ్లు యీ ధోరణికి రూపమిచ్చినారు. ఆ మహాసభలో లెనినిస్టులకు మెజారిటీ వోట్లు వచ్చి, బోల్షివిక్కు లనబడినారు; మైనారిటీలో వుండిన అవకాశవాదులకు మెన్షివిక్కులనే పేరు వచ్చింది. (రష్యన్ భాషలో "బోల్షిన్‌స్త్వో" అంటే మెజారిటీ, "మెన్షిన్‌స్త్వో" అంటే మైనారిటీ.)

1917లో మెన్షివిక్కులు బూర్జువా తాత్కాలిక ప్రభుత్వంలో సభ్యులుగా వుండి, అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవం తర్వాత, యితర విప్లవ ప్రతీఘాత పార్టీలతో కలిసి, సోవియట్ అధికారంతో పోరాటం చేసినారు. — సం.

*** సోషలిస్టు రివల్యూషనరీలు (యస్.ఆర్.లు) — 1901 అంతంలోనూ, 1902 ప్రారంభంలోనూ వివిధ నరోద్నిక్ బృందాలు లీనమైన ఫలితంగా రష్యాలో యేర్పడిన పెటీబూర్జువా పార్టీ. ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం తర్వాత సోషలిస్టు రివల్యూషనరీలు, మెన్షివిక్కుల లాగే, బూర్జువా తాత్కాలిక ప్రభుత్వంలో సభ్యులుగా వుండి, దాని సామ్రాజ్యవాద విధానాన్ని బలపరచినారు. రష్యాలో సోషలిస్టు విప్లవం జయించిన తర్వాత సోషలిస్టు రివల్యూషనరీలు సోవియట్ ప్రజలమీద ప్రతీఘాత విప్లవం చేసిన సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. — సం.

ప్రియతమ బెర్న్ ''సోదరుల''యొక్క పటాటోప, జటిల, గంభీర నుడికారాలతో యెక్కడ విభేదిస్తాయంటే, అవి ప్రతిదాన్నీ శ్రమ పరిస్థితులకు కుదిస్తాయి. ''శ్రమ ప్రజా స్వామ్యం'' గురించీ, ''స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాత్రం'' గురించీ, ''ప్రజలచేత ప్రభుత్వం'' గురించీ, యింకా అలాంటివాటి న్నిటినీ గురించీ తక్కువ వాగుడు; యీనాటి వర్గచైతన్యపూరిత కార్మికులూ, కర్షకులూ బూర్జువా మేధావియొక్క యీ పటాటోపపు నుడికారాల పస తెలుసుకొని, ఆ జిత్తును సులభంగా గుర్తుపట్టుతారు — యెంత సులభంగా అంటే, మామూలు లోకజ్ఞానమూ, లోకానుభవమూ గల వ్యక్తి ''గొప్పోడు, కనపళ్లా'' అనదగినవాని ''నిగనిగలాడే'' లక్షణాలూ, నిష్కళంకమైన వాలకమూ చూసి, ''బహుశా, బద్మాష్''! అని వెంటనే పొరపాటు లేకుండా అంచనా వేసినంత సులభంగా.

తక్కువ పటాటోపపు నుడికారాలూ, యెక్కువ సాదా, రోజువారీ పనీ, ప్రతి పూడు ధాన్యంపట్లా, బొగ్గుపట్లా శ్రద్ధా! ఆకలిగొన్న కార్మికులకూ, చింపిరి పాతల, వుత్త కాళ్ల రైతులకూ అవసరమైన యీ ధాన్యాన్నీ, బొగ్గునూ కీచులాట బేరంద్వారా కాక, పెట్టుబడిదారీ పద్ధతిలో కాక, మాస్కో కజాన్ రైల్వేలోని అనిపుణ శ్రామికులూ, రైల్వే కార్మికులూ లాంటి సాదా శ్రమజీవుల చైతన్యపూరిత, ఐచ్ఛిక, అపరిమిత వీరోచిత శ్రమద్వారా సమకూర్చడానికి మరింత శ్రద్ధ.

విప్లవ సమస్యలపట్ల బూర్జువా మేధావి వాగాడంబరపు వైఖరియొక్క చాయలు అడుగడుగునా, ప్రతిచోటా, మన సభ్యులలో కూడా వున్నాయని ఒప్పకోక తప్పదు. ఉదాహరణకు మన పత్రికావళి కుళ్లిన బూర్జువా ప్రజాతంత్ర గతంయొక్క యీ కుళ్లిన అవశేషాలతో పోరాడడానికి యేమీ చేయడం లేదు; నిజమైన కమ్యూనిజంయొక్క సరళమైన, మితమైన, సాదా అయిన, కానీ జీవయోగ్యమైన మొక్కలను సాకడానికి అది యేమీ చేయడం లేదు.

స్త్రీల పరిస్థితి తీసుకుందాం. యీ రంగంలో, ప్రపంచంలో, ఒక్క ప్రజాతంత్ర పార్టీ కూడా, అత్యంత పురోగామి బూర్జువా రిపబ్లిక్‌లో కూడా, మనం అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి సంవత్సరంలో చేసినదానిలో శతాంశం కూడా దశాబ్దాలలో చేయలేదు. స్త్రీలను అసమాన స్థితిలో వుంచడం, విడాకులను పరిమితపరచడం, దానిచుట్టూ అసహ్యమైన తతంగాలు పెట్టడం, వివాహం కాకుండా పుట్టిన పిల్లలకు గుర్తింపు నిరాకరించడం, వాళ్ల తండ్రుల కొరకు అన్వేషణను బలవంతంగా రుద్దడం, వగైరాలు చేసే యేహ్యమైన చట్టాలను, వేటి అనేక అవశేషాలు బూర్జువావర్గానికీ, పెట్టుబడిదారీ వ్యవస్థకూ సిగ్గుచేటుగా సకల నాగరిక దేశాలలోనూ కనపడతాయో ఆ చట్టాలను, మనం నిజంగా కూల్చి నేలమట్టం చేసినాం. యీ రంగంలో మనం చేసినదానికి వెయ్యి

సార్లు గర్వించే హక్కు వుంది. కానీ పాత, బూర్జువా చట్టాల, సంస్థల పనికిమాలిన చెత్తను తొలగించి, యెంత సమగ్రంగా మనం నేలను శుభ్రంచేస్తే అంత స్పష్టమౌతుంది, నేలమీద నిర్మించడానికి మనం నేలను శుభ్రం మాత్రమే చేసినామనీ, యింకా నిర్మించడం లేదనీ.

స్త్రీ విమోచనకు యెన్ని చట్టాలు చేసినప్పటికీ ఆమె యింటి బానిసగా వుంటూనే వుంది; యెందుకంటే, చిల్లర యింటిపని ఆమెను నలిపేస్తుంది, గొంతు నొక్కుతుంది, నిరర్థకురాలిని చేస్తుంది, హీన పరుస్తుంది, ఆమెను వంటయింటికీ, పురిటి గదికీ బంధిస్తుంది, ఆమె తన శ్రమను ఆటవికంగా అనుత్పాదకమూ, చిల్లరదీ, రొష్టు పెట్టేదీ, నిరర్థకురాలిని చేసేదీ, మనిషిని నలిపేసేదీ అయిన గొడ్డుచాకిరీమీద దుర్వ్యయం చేస్తుంది. యీ చిల్లరయింటిపనిమీద (రాజ్యాధికారం వహించే కార్మిక వర్గం నాయకత్వాన) సర్వ శక్తితో పోరాటం ప్రారంభమైనప్పుడు, ప్రారంభమైన చోట మాత్రమే, లేదా ఆ యింటిపని భారీ సోషలిస్టు ఆర్థిక వ్యవస్థగా పూర్తిగా రూపాంతరం చెందడం ప్రారంభమైనప్పుడు మాత్రమే, నిజమైన స్త్రీ విమోచన, నిజమైన కమ్యూనిజం, ప్రారంభమౌతుంది.

సిద్ధాంతగతంగా ప్రతి కమ్యూనిస్టూ నిర్వివాదమని యెంచే యీ సమస్యకు మనం ఆచరణలో తగినంత శ్రద్ధ అర్పిస్తున్నామా? నిజంగా, లేదు. యీ రంగంలో యిప్పటికే వుంటున్న కమ్యూనిజం మొక్కలపట్ల మనం సరైన జాగ్రత్త వహిస్తున్నామా? మళ్లీ, లేదు అనేదే జవాబు. భోజనశాలలూ, శిశు సంస్థలూ, బాలోద్యానాలూ — యివి యీ మొక్కలకు ఉదాహరణలు, యివి పటాటోపాలూ, ఆడంబరాలూ, సాంగ్యాలూ యేమీ లేని సరళ, దైనందిన సాధనాలు, నిజంగా స్త్రీలను విమోచన చేయగలవి, సామాజిక ఉత్పత్తిలోనూ, పౌర జీవితంలోనూ ,స్త్రీల పాత్ర విషయంలో పురుషులతో వాళ్లకు గల అసమానత్వాన్ని నిజంగా తగ్గించగలవీ, రద్దుచేయగలవీ. యీ సాధనాలు కొత్తవి కాదు, యివి (సోషలిజంయొక్క భౌతిక పూర్వావసరా లన్నిటిలాగే) భారీ పెట్టుబడిదారీ వ్యవస్థ చేత సృష్టింపబడినాయి. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో అవి, మొదటిది, అరుదుగానూ, రెండవది — మరీ ముఖ్యమైనది — సట్టావ్యాపారమూ, లాభార్జనా, మోసమూ, దగాల అత్యంత హీన లక్షణాలు గల లాభార్జన సంస్థలుగా గానీ, ఉత్తమ కార్మికులు సముచితంగా ద్వేషించి, యేవగించుకొన్న "బూర్జువా దయాధర్మాల దొమ్మరి ఆటలు"గా గానీ నిలిచివుండినాయి.

యీ సంస్థల సంఖ్య మన దేశంలో అపారంగా పెరిగిందనడంలోనూ, వీటి స్వభావం మారడం ప్రారంభమౌతున్న దనడంలోనూ సందేహం లేదు. శ్రామిక, కర్షక స్త్రీలలో మనం గుర్తిస్తున్నంతకంటె యెంతో యెక్కువ వ్యవస్థీకరణ ప్రజ్ఞ వుందనీ, ప్రణాళి

కలూ, వ్యవస్థలూ, వగైరాల గురించి ఆ పుష్కలమైన మాటలూ, గడబిడా, కీచులా టలూ, వాగుడూ — మన పెద్ద బుర్రల "మేధావుల"కూ, అర్ధ పక్వ "కమ్యూనిస్టుల"కూ "సోకి" నట్టివి — లేకుండా, బహుళ సంఖ్యాక కార్మికులయొక్కా, అంతకంటె బహుళ సంఖ్యాకమైన వినియోగదారులయొక్కా సహకారంతో ఆచరణాత్మక పనిని వ్యవస్థీకరించ గలవాళ్లు మనకు తెలిసినంతకంటె యెక్కువమంది వున్నారనీ అనడంలో సందేహం లేదు. కానీ కొత్తదానియొక్క యీ మొక్కలను మనం సాకవలసినట్లుగా సాకడం లేదు.

బూర్జువాలను చూడండి. తమకు కావలసింది యెలా అడ్వర్టైజు చేసుకోవల సిందీ వాళ్లకు యెంత బాగా తెలుసు! పెట్టుబడిదార్లు "ఆదర్శ" సంస్థలుగా పరిగ ణించేవాటిని వాళ్ల వార్తాపత్రికలు మిలియన్ల ప్రతులలో యెలా కీర్తిగానం చేసేదీ, "ఆదర్శ" బూర్జువా సంస్థలు యెలా జాతీయ గర్వకారణంగా చేయబడేదీ చూడండి! ఉత్తమ భోజనశాలలను గానీ, శిశు సంస్థలను గానీ, దినదినం పట్టుబట్టి చెప్పడంద్వారా, వాటిలో కొన్నిటిని ఆ జాతిలో ఆదర్శ సంస్థలుగా మార్చడానికి గాను, వర్ణించే శ్రమ మన పత్రికావళి తీసుకోవడం లేదు, లేదా యెప్పుడో గాని తీసుకోవడం లేదు. మన పత్రి కావళి వాటికి తగినంత పబ్లిసిటీ యివ్వడం లేదు, ఆదర్శప్రాయమైన కమ్యూనిస్టు కృషితో, మొత్తం సమాజానికి, శ్రామిక ప్రజలందరికీ, విస్తరింపజేస్తే సాధింపబడగల మానవ శ్రమ కర్తనాన్నీ, వినియోగదారులకు సౌకర్యాలనూ, సరుకుల పొదుపునూ, యింటి బానిసత్వంనుండి స్త్రీల విమోచననూ, ఆరోగ్యకర పరిస్థితులలో మెరుగుదలనూ వివరంగా వర్ణించడం లేదు.

ఆదర్శప్రాయమైన ఉత్పత్తీ, ఆదర్శప్రాయమైన కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులూ, ప్రతి పూడ్ ధాన్యాన్నీ వసూలు చేయడంలోనూ, పంపకం చేయడంలోనూ ఆదర్శ ప్రాయమైన జాగ్రత్తా, చిత్తశుద్ధీ, ఆదర్శప్రాయమైన భోజనశాలలూ, ఫలానా భవనంలోని ఫలానా కార్మికుల యింటిలో ఆదర్శప్రాయమైన శుభ్రతా, యివన్నీ మన పత్రికావళి నుండీ, కార్మికుల, కర్షకుల ప్రతి సంస్థనుండీ యిప్పుడు పొందుతున్నంత పదంతలు శ్రద్ధా, జాగ్రతా పొందాలి. యివన్నీ కమ్యూనిజం మొక్కలు, వీటిని సాకడం మన సమష్టి, ప్రాథమిక విధి. మన ఆహార, ఉత్పత్తి పరిస్థితి కష్టంగా వున్నా, బోల్షివిక్ పరిపాలన జరిగిన ఒకటిన్నర సంవత్సర కాలంలో సర్వత్రా నిస్సందేహమైన పురోగతి వుంది: ధాన్యం సేకరణ 3 కోట్ల పూడ్ల (1917 ఆగస్టు 1నుండి 1918 ఆగస్టు 1వరకు) నుండి 10 కోట్ల పూడ్ల (1918 ఆగస్టు 1నుండి 1919 మే 1వరకు)కు పెరిగింది; కూరగాయల వ్యవసాయం విస్తరించింది, విత్తనం వేయని భూమి తగ్గింది, అపారమైన యింధనం కష్టాలు వున్నప్పటికీ రైల్వే రవాణా మెరుగు కావడం

ప్రారంభించింది, వగైరా. యీ పూర్వరంగంలో, కార్మికవర్గ రాజ్యాధికారపు అండదండలతో, కమ్యూనిజం మొక్కలు వాడిపోవు; అవి పరిపూర్ణ కమ్యూనిజంగా పెరిగి, వికసిస్తాయి.

1919 జూలైలో పుస్తక రూపంలో ప్రచురింపబడింది

# కార్మికవర్గ నియంతృత్వ యుగంలో ఆర్థిక విధానమూ, రాజకీయాలూ

(కొంత భాగం)

సోషలిజం అంటే వర్గాల రద్దు.

వర్గాలను రద్దుచేయడానికి, మొట్టమొదటిది, భూస్వాములనూ, పెట్టుబడిదార్లనూ కూలదోయడం అవసరం. మన కర్తవ్యంలోని యీ భాగం సాధింపబడింది, కానీ యిది ఒక భాగం మాత్రమే, పైగా, అన్నిటికంటె కష్టమైన భాగం కాదు. వర్గాలను రద్దుచేయడానికి, రెండవది, ఫాక్టరీ కార్మికునికీ రైతుకూ మధ్య భేదాన్ని రద్దుచేయడం, వాళ్లు అందరూ పనిచేసేవాళ్లు అయ్యేటట్లు చేయడం, అవసరం. యిది ఒక్క దెబ్బతో చేయలేము. యీ కర్తవ్యం పోలికే లేనంతగా యెక్కువ కష్టమైనది, విధిగా దీర్ఘంగా వుంటుంది. ఒక వర్గాన్ని కూలదోయడంద్వారా పరిష్కారం కాగల సమస్య కాదు యిది. మొత్తం సామాజిక ఆర్థిక వ్యవస్థయొక్క సంస్థాగత పునర్నిర్మాణంద్వారా మాత్రమే, వ్యక్తిగత, అనైక్య చిన్న స్థాయి సరుకుల ఉత్పత్తినుండి భారీ సామాజిక ఉత్పత్తికి జరిగే పరివర్తనద్వారా మాత్రమే పరిష్కారం కాగలదు. యీ పరివర్తన విధిగా అత్యంత దీర్ఘంగా వుండక తప్పదు. తొందరపాటుతోనూ, అజాగ్రత్తగానూ చేసే పరిపాలనాత్మక, శాసనాత్మక చర్యలద్వారా యిది ఆలస్యమూ, జటిలమూ మాత్రమే కావచ్చు. రైతు తన మొత్తం వ్యవసాయ సంవిధానంలో అపారమైన మెరుగుదలను సాధించగలిగేటట్లూ, దాన్ని సమూలంగా సంస్కరించగలిగేటట్లూ అతనికి సహాయం యివ్వడంద్వారా మాత్రమే దీని వేగం వృద్ధికాగలదు.

మన సమస్యలో రెండవదీ, అత్యంత కష్టమైనదీ అయిన భాగాన్ని పరిష్కరించడానికి, కార్మికవర్గం, బూర్జువావర్గాన్ని ఓడించిన తర్వాత, రైతులపట్ల తన విధానాన్ని యీ కింది మౌలిక మార్గాలగుండా స్థిరంగా నడిపించాలి. కార్మికవర్గం శ్రామిక రైతును ఆస్తిపరుడైన రైతునుండీ, రైతు కార్మికుని రైతు వర్తకునినుండీ, శ్రమించే రైతును లాభపరుడైన రైతునుండీ వేరుగా చూడాలి.

యీా వేరుగా చూడడంలో వుంది సోషలిజంయొక్క మొత్తం సారం.

మరి, మాటలలో సోషలిస్టులై, చేతలలో పెటీబూర్జువా ప్రజాతంత్రవాదులైన సోషలిస్టులు (మార్తొవ్‌లూ, చెర్నోవ్‌లూ, కౌట్స్కీలూ, మొదలైనవాళ్ళు) సోషలిజం యొక్క యీ సారాన్ని గ్రహించకపోవడంలో ఆశ్చర్యం లేదు.

ఈ విధంగా వేరుగా చూడడం అత్యంత కష్టమైనది; యెందుకంటే, వాస్తవ జీవితంలో "రైతు"యొక్క లక్షణాలన్నీ, అవి యెంత భిన్నమైనవైనా, యెంత పరస్పర వ్యతిరేక మైనవైనా, ఒకే ముద్దగా సమ్మిళితమై వుంటాయి. అయినప్పటికీ వేరుగా చూడడం సాధ్యం; అది సాధ్యం మాత్రమే కాదు, రైతు వ్యవసాయ పరిస్థితులనుండీ, రైతు జీవిత పరిస్థితులనుండీ అనివార్యంగా ఉద్భవిస్తుంది. శ్రామిక రైతు యుగాల తరబడి భూస్వాములచేతా, పెట్టుబడిదార్లచేతా, వర్తకులచేతా, అధిక లాభపరులచేతా, వాళ్ల రాజ్యంచేతా, అత్యంత ప్రజాతంత్ర బూర్జువా రిపబ్లిక్కులతో సహా, పీడింప బడినాడు. యుగాల పొడవునా శ్రామిక రైతు యీ పీడకులనూ, దోపిడీదార్లనూ ద్వేషించడానికీ, అసహ్యించుకోడానికీ తనకు తాను శిక్షణ యిచ్చుకున్నాడు. జీవిత పరిస్థితులనుండి ఉద్భవించిన యీ శిక్షణ నిర్బంధిస్తుంది రైతును – పెట్టుబడిదారునికి వ్యతిరేకంగా, అధిక లాభపరునికీ, వర్తకునికీ వ్యతిరేకంగా కార్మికునితో పొత్తును అన్వేషించడానికి. కానీ అదే సమయంలో, ఆర్థిక పరిస్థితులు, సరుకు ఉత్పత్తి నియమాలు, అనివార్యంగా రైతును (సర్వత్రా కాదు గానీ, విస్తారమైన అధిక సంఖ్యాక సందర్భాలలో) వర్తకునిగానూ, అధిక లాభపరునిగానూ మారుస్తాయి.

పైన ఉటంకించిన గణాంక లెక్కలు శ్రామిక రైతుకూ లాభపర రైతుకూ మధ్య కొట్టవచ్చినట్లు కనపడే భేదాన్ని వెల్లడిస్తాయి. 1918–1919లో నగరాలలోని క్షుత్పీడిత కార్మికులకు నియమిత ప్రభుత్వ ధరలకు 4 కోట్ల పూడ్ల ధాన్యం యిచ్చిన రైతు – యీ ధాన్యాన్ని ప్రభుత్వ సంస్థలకు, వాటిలో యెన్ని లోటుల్లు, కార్మిక ప్రభుత్వంచేత పూర్తిగా గుర్తింపబడిన లోటుల్లు, కానీ సోషలిజంకు పరివర్తన చెందే కాలం యొక్క మొదటి దశలో అనివార్యమైనవి, వున్నప్పటికీ, యిచ్చిన రైతు – ఆ రైతు శ్రామిక రైతు, సోషలిస్టు కార్మికునికి సరిసమానుడైన కామ్రేడ్, అతని అత్యంత విశ్వసనీయుడైన పొత్తుదారుడు, పెట్టుబడి శృంఖలాలమీద చేసే పోరాటంలో అతని రక్త సోదరుడు. కానీ, నగర కార్మికుని అవసరాన్నీ, ఆకలినీ ఆసరాగా తీసుకొని, ప్రభుత్వాన్ని మోసంచేస్తూ, ప్రతిచోటా మోసమూ, దొంగతనమూ, వంచనా వృద్ధిచేస్తూ, సృష్టిస్తూ, ప్రభుత్వ ధరకంటె పది రెట్లు యెక్కువ ధరకు 4 కోట్ల పూడ్ల ధాన్యం రహస్యంగా అమ్మిన రైతు – ఆ రైతు అధిక లాభపరుడు, పెట్టుబడిదారుని పొత్తుదారుడు, కార్మికునికి వర్గ శత్రువు, దోపిడీదారుడు. యెవడైతే మొత్తం ప్రభు

త్వానికి చెందిన భూమినుండి, యేదో ఒక విధంగా రైతు శ్రమే కాక కార్మికుడూ మొదలైనవాళ్ల శ్రమ రూపుదాల్చిన పనిముట్ల సహాయంతో మామూలు చేయబడిన అదనపు ధాన్యం కలిగివుంటాడో, యెవడైతే అదనపు ధాన్యం కలిగి, ఆ ధాన్యంద్వారా అధిక లాభార్జన చేస్తాడో, వాడు క్షుత్పీడిత కార్మికుని దోపిడీచేసేవాడు.

మీరు స్వేచ్ఛనూ, సమానత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ ఉల్లంఘించేవాళ్లు అని వాళ్లు అన్ని దిక్కులనుండీ మనమీద కేకలువేస్తున్నారు. మన రాజ్యాంగంలో కార్మికునికీ రైతుకూ గల అసమానత్వాన్నీ, రాజ్యాంగసభను రద్దుచేయడాన్నీ, అదనపు ధాన్యాన్ని బలవంతంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్నీ చూపించి వాళ్లు యిలా కేకలువేస్తున్నారు. మనం యిలా సమాధానం చెప్తాం — వాస్తవమైన అసమానత్వాన్నీ, శతాబ్దాల తరబడి శ్రామిక రైతు అనుభవించిన వాస్తవమైన స్వేచ్ఛా రాహిత్యాన్నీ తొలగించడానికి యింత చేసిన రాజ్యం ప్రపంచంలో యెప్పుడూ లేదు. కానీ మేము లాభపర రైతు సమానత్వాన్ని యెప్పుడూ గుర్తించము — దోపిడీదారునికీ దోపిడీచేయబడేవానికీ మధ్య, కడుపు నిండినవానికీ ఆకలిగొన్నవానికీ మధ్య "సమానత్వా"న్ని, మొదటివాడు రెండవవాణ్ని దోచుకోడానికి "స్వేచ్ఛ"నూ యెలా గుర్తించమో అలాగే. మరి, యీ భేదాన్ని గుర్తించడానికి నిరాకరించే విద్యావంతులను మేము వైట్‌గార్డులలాగే చూస్తాము — వాళ్లు ప్రజాతంత్రవాదులమనీ, సోషలిస్టులమనీ, అంతర్జాతీయవాదులమనీ, కౌట్స్కీలమనీ, చెర్నోవ్‌లమనీ, మార్తొవ్‌లమనీ పేర్లు పెట్టుకున్నప్పటికీ.

'పెత్రోగ్రాడ్‌స్కయ ప్రావ్ద' నం. 255,
1919 నవంబర్ 7

# ఆర్.సి.పి.(బి.) మాస్కో నగర కాన్ఫరెన్సుకు "సుబ్బోత్నిక్కుల" మీద యిచ్చిన నివేదిక డిసెంబర్ 20, 1919

(కొంత భాగం)

కమ్యూనిజం యే విధంగా సోషలిజంకంటె భిన్నమైనదని మనల్ని మనం ప్రశ్నించు కుంటే, మనం యిలా చెప్పవలసి వుంటుంది: సోషలిజం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి నేరుగా పుట్టి పెరిగే సమాజం; అది నూతన సమాజపు మొదటి రూపం. కమ్యూనిజం అనేది సమాజంయొక్క మరింత ఉన్నతమైన రూపం; అది సోషలిజం స్థిరంగా నెలకొల్పబడినప్పుడు మాత్రమే అభివృద్ధి కాగలదు. సోషలిజంలో పెట్టుబడి దారులు లేకుండా పనీ, సంఘటితమైన అగ్రగదళంచేత, శ్రామిక ప్రజల పురోగామి విభాగంచేత, కచ్చితమైన లెక్కాచారమూ, అజమాయిషీ, తనిఖీ గల సామాజికీకృత శ్రమా యిమిడివున్నాయి. శ్రమయొక్క పరిమాణమూ, దాని ప్రతిఫలమూ నిర్ణయింప బడాలి. వాటిని నిర్ణయించడం యెందుకు అవసరమంటే, శ్రమను ముక్కలు చేయడమూ, సామాజిక ఆర్థిక వ్యవస్థలో విశ్వాస రాహిత్యమూ లాంటి అవశేషాలనూ, అలవాట్లనూ, రైతు దేశా లన్నిటిలోనూ ప్రాబల్యం వహించే చిన్న ఆస్తిపరుని పాత అలవాట్లనూ పెట్టుబడిదారీ వ్యవస్థ వదలిపోయింది గనుక. యిదంతా నిజమైన కమ్యూనిస్టు సమా జానికి వ్యతిరేకం. యే వ్యవస్థలో మనుషులు నిర్బంధపరచే ప్రత్యేక యంత్రం లేకుండా తమ సామాజిక విధులను నిర్వహించడం అలవాటు చేసుకుంటారో, సమాజ శ్రేయస్సు కొరకు వేతనం లేకుండా పనిచేయడం సాధారణ విషయమైనప్పుడు, ఆ వ్యవస్థను మనం కమ్యూనిజం అనే పేరుతో పిలుస్తాం. పెట్టుబడిదారీ వ్యవస్థమీద సంపూర్ణ విజయం అనేదానివైపు తొలి అడుగులు వేస్తున్నవాళ్లకు "కమ్యూనిజం" అనే భావం మరీ అతి దూరంలో వుండడం సమంజసమే. పార్టీ పేరును మార్చడం యెంత సరైన దైనప్ప టికీ, ఆ మార్పు మనకు తెచ్చిన లాభం యెంత గొప్ప దైనప్పటికీ, మన ఉద్యమం సాధించిన విజయాలూ, అది అభివృద్ధి అయిన ప్రమాణమూ యెంత గొప్ప వైనప్పటికీ — కమ్యూ

నిస్టు పార్టీలు ప్రపంచ మంతటా వున్నాయి, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ స్థాపించి యింకా యేడాది కాకపోయినా, కార్మికోద్యమం దృష్ట్యా అది పాత, మరణోన్ముఖమైన రెండవ ఇంటర్నేషనల్‌కంటె పోలికే లేనంతగా బలంగా వుంది — "కమ్యూనిస్టు పార్టీ" అనే పేరుకు కమ్యూనిజం వెంటనే ప్రవేశపెట్టబడుతున్నదనే అర్థం వున్నట్లు వ్యాఖ్యానిస్తే, అది వట్టి బడాయి తప్ప మరేమీ కాదు గనుక, గొప్ప వికృతీకరణ అవుతుంది, కార్య రూపంలో హాని చేస్తుంది.

అందుకనే "కమ్యూనిస్టు" అనే పదాన్ని మహా జాగ్రత్తగా వాడాలి, అందుకనే మన జీవితంలోకి యిప్పుడిప్పుడే ప్రవేశించడం ప్రారంభించిన కమ్యూనిస్టు "సుబ్బోత్నిక్కు"లు మరీ విలువైనవి, యెందుకంటే, యీ మహా అల్పమైన ఘటనలో మాత్రమే కమ్యూనిస్టు అనేది అవతరించడం ప్రారంభించింది. భూస్వాముల, పెట్టుబడిదార్ల ఆస్తి హరణం మనకు సోషలిజంయొక్క అత్యంత ఆదిమ రూపాలను మాత్రమే యేర్పరచడానికి వీలు కలిగించింది; దానిలో యింకా కమ్యూనిస్టు అనేదేమీ లేదు. మన ప్రస్తుత ఆర్థిక వ్యవస్థను చూస్తే, దానిలో సోషలిజం బీజాలు యింకా చాలా బలహీనంగా వున్నాయనీ, పాత ఆర్థిక రూపాలు ప్రచండంగా ప్రాబల్యం వహిస్తున్నాయనీ మనకు కనపడుతుంది; చిన్న ఆస్తిపరవర్గంయొక్క ప్రాబల్యంలో గానీ, హద్దు లేని విచ్చలవిడి లాభార్జనలో గానీ యివి వ్యక్తమౌతున్నాయి. మనం భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవస్థను బద్దలు చేసినామనీ, కానీ దాని స్థానంలో అత్యంత హీనమైన లాభార్జన, వడ్డీ వ్యాపారపు పెట్టుబడిదారీ వ్యవస్థ, నిక్కబొడుచుకొని వస్తున్నదనీ మన ప్రతిపక్షులైన పెటీబూర్జువా ప్రజాతంత్రవాదులూ, మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ మనమీద చేసే ఆక్షేపణలలో ఉద్ఘాటిస్తే, మనం వాళ్లతో యిలా చెప్తాము — మనం భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవస్థనుండి నేరుగా కమ్యూనిజంకు పోగలమని వాళ్లు ఊహిస్తే, వాళ్లు విప్లవకారులు కాదనీ, సంస్కరణవాదులూ, ఊహాస్వర్గవాదులూ అనీ.

భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతిచోటా తీవ్రంగా బలహీనపడింది, సోషలిజంవైపు యే చర్యలూ తీసుకోబడని దేశాలలో కూడా. యీ దృష్టితో చూస్తే, మన వ్యతిరేకులు మనమీద చేసే విమర్శలలో గానీ, ఆక్షేపణలలో గానీ యేవీ గురుతరమైనవి కావు. తేటతెల్లంగా, భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవస్థ నలిపివేయబడిన తర్వాత, కొత్త, సన్నకారు, లాభార్జనపర పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క ప్రారంభాలు అవతరించ సాగినాయి. ప్రతి రకం చిల్లర సట్టా వ్యాపారాన్నీ లంకించుకొనే భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అవశేషాలతో — దానిని ప్రతిఘటించడం కష్టమైన చోట, అది అత్యంత అధ్వాన్నమైన, అవ్యవస్థీకృతమైన వర్తక రూపం ధరించే చోట — జరిగే ఆటవిక పోరాటంగుండా మనం గడుస్తున్నాం.

యుద్ధ పరిస్థితులలో పోరాటం మరింత భీషణమై అత్యంత పాశవికమైన లాభార్జన రూపాలకు దారితీసింది, ప్రత్యేకంగా పెట్టుబడిదారీ వ్యవస్థ మరింత భారీ స్థాయిలో వ్యవస్థీకృతమైన చోట్ల; విప్లవాత్మక పరివర్తనకు మరే యితర రూపమైనా వుంటుందనుకోవడం తప్పు అవుతుంది. మన ప్రస్తుత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి పరిస్థితి వున్నది యిలా. సోవియట్ రష్యాయొక్క ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ యేమిటని మనల్ని మనం ప్రశ్నించుకుంటే, మనం యిలా చెప్పవలసి వుంటుంది — భారీ స్థాయి పరిశ్రమలలో సోషలిజంయొక్క పునాదులు వేయడమూ, పెట్టుబడిదారులు కోటానుకోట్ల భిన్న మార్గాలలో మొండిగా ప్రతిఘటిస్తూ వుండగా పాత పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడమూ ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ అని. యుద్ధంనుండి మనంత అధ్వాన్నంగా బయటపడిన పశ్చిమ యూరప్ దేశాలు — ఉదాహరణకు ఆస్ట్రియా — మనకంటె భిన్నంగా వుండేది యెందులో నంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ విచ్ఛిత్తీ, సట్టా వ్యాపారమూ అక్కడ మన దేశంలోకంటె తీవ్రంగా వుండడంలోనూ, పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రతిఘటించడానికి అక్కడ సోషలిస్టు వ్యవస్థీకరణ బీజాలు లేకపోవడంలోనూ మాత్రమే. అయినా, మన ఆర్థిక వ్యవస్థలో కమ్యూనిస్టు అనేదేదీ యింకా లేదు. ''సుబ్బోత్నిక్కు''లు (అనగా, యే అధికార సంస్థ గానీ, ప్రభుత్వం గానీ నిర్ణయించిన కోటా లేకుండా, వేతనం లేని శ్రమ) అవతరించి నప్పుడు, ''కమ్యూనిస్టు'' అనేది ప్రారంభమవౌతుంది. సమాజ శ్రేయస్సు కొరకు విస్తారమైన ప్రమాణంలో వ్యక్తులు చేసే శ్రమచేత యేర్పడుతాయి అవి. గ్రామాలలో యెల్లప్పుడూ ఆనవాయితీగా వుండిన పద్ధతిలో పొరుగువానికి సాయం చేయడం కాదు యిది; మొత్తంగా దేశంయొక్క అవసరాలను తీర్చడానికి చేసే పని యిది; యిది విస్తారమైన ప్రమాణంలో వ్యవస్థీకరింపబడేది, వేతనం లేనిది. కనుక, ''కమ్యూనిస్టు'' అనే పదం పార్టీ పేరుకు మాత్రమే కాక, మన వాస్తవ స్థితిలోని యే ఆర్థిక విషయాలకు ప్రత్యక్షంగా కమ్యూనిస్టు స్వభావం వుందో వాటికి కూడా వర్తింపజేయడం మరింత సరిగా వుంటుంది. రష్యాలో వున్న వ్యవస్థలో కమ్యూనిస్టు అనేదేదైనా వుందంటే, అది ''సుబ్బోత్నిక్కు''లు మాత్రమే; తక్కిన ప్రతిదీ సోషలిజంను దృఢపరచడానికి పెట్టుబడిదారీ వ్యవస్థతో చేసే పోరాటం తప్ప మరేమీ కాదు; దీనినుండి, సోషలిజంయొక్క సంపూర్ణ విజయం తర్వాత, యెలాంటి కమ్యూనిజం పుట్టి పెరగాలంటే, పుస్తకం సాయంతో కాక సజీవ వాస్తవంలో మనం ''సుబ్బోత్నిక్కు''లలో చూసే కమ్యూనిజం.

# పాత సామాజిక వ్యవస్థ విధ్వంసంనుండి కొత్త సామాజిక వ్యవస్థ సృష్టివరకు

మన వార్తాపత్రిక కమ్యూనిస్టు శ్రమ అనే సమస్యకు అర్పించబడింది.

సోషలిజం నిర్మాణంలో యిది అత్యున్నత సమస్య. మొట్టమొదట మనం మనకే ఒక విషయం స్పష్టం చేసుకోవాలి; యేమిటంటే, కార్మికవర్గం రాజకీయ అధికారం గెలుచుకున్న తర్వాత మాత్రమే, భూస్వాములూ, పెట్టుబడిదారులూ నిరాస్తిపరులు చేయబడిన తర్వాత మాత్రమే, కార్మికవర్గం రాజకీయ అధికారం పట్టుకొని, తెంపరి ప్రతిఘటనా, వ్యవస్థీకృతమైన విప్లవ ప్రతీఘాత తిరుగుబాట్లూ, అంతర్యుద్ధమూ చేసే దోపిడీదార్లమీద నిర్ణయాత్మక విజయాలు సాధించిన తర్వాత మాత్రమే యీ సమస్య ఆచరణాత్మక పద్ధతిలో యెత్తబడ గలదు.

1918 తొలి భాగంలో ఆ సమయం వచ్చినట్లు కనిపించింది – రష్యామీద జర్మన్ సామ్రాజ్యవాదపు ఫిబ్రవరి (1918) సైనిక దాడి తర్వాత ఆ సమయం నిజంగా వచ్చింది కూడా. కానీ, అప్పుడు ఆ దశ యెంత స్వల్ప కాలికంగా వుండిందంటే, విప్లవ ప్రతీఘాత తిరుగుబాట్లయొక్కా, దండయాత్రలయొక్కా మరింత శక్తివంత మైన కొత్త వెల్లువ యెంత వేగంగా మనమీదికి వచ్చిందంటే, శాంతియుత అభివృద్ధి సమస్యలకు శ్రద్ధగా, పట్టు విడువకుండా అర్పితం కావడానికే సోవియట్ ప్రభుత్వా నికి అవకాశం లేకపోయింది.

యిప్పుడు మనం రెండేండ్ల కనివిని యెరగని, నమ్మశక్యంకాని కష్టాలగుండా, రెండేండ్ల కరువు, లేమిడి, దుస్థితులగుండా గడిచినాం; వీటివెంట అంతర్జాతీయ ప్రగతివ్యతిరేకతకు చెందిన మూకలమీద యెర్రసైన్యంయొక్క కనివిని యెరగని విజయాలు కూడా వుండినాయి.

మనకు మరింత స్థిరమైన, చిరస్థాయి అయిన శాంతి లభిస్తుందని (మనమీద యుద్ధం చేయడానికి పోలండును ఫ్రెంచి పెట్టుబడిదార్లు వుసికొల్పకపోతే) ఆశించ డానికి యీనాడు గురుతరమైన ఆధారా లున్నాయి.

యీ రెండేండ్ల కాలంలో మనం సోషలిజం ప్రాతిపదికమీద వ్యవస్థీకరణ చేయడంలో కొంత అనుభవం గడించినాం. అందువల్లనే మనం సూటిగా కమ్యూనిస్టు శ్రమ సమస్య వద్దకు పోగలం, పోవాలి; లేదా, మరింత సరిగా చెప్పాలంటే, కమ్యూనిస్టు కాదు, సోషలిస్టు శ్రమ సమస్య వద్దకు. యెందుకంటే, మనం వ్యవహరించేది పెట్టుబడిదారీ వ్యవస్థనుండి పుట్టి పెరిగే నూతన సామాజిక వ్యవస్థయొక్క ఉన్నత అభివృద్ధి దశతో కాదు, నిమ్న, ప్రాథమిక దశతో.

మరింత సంకుచితమైన, మరింత కచ్చితమైన అర్థంలో కమ్యూనిస్టు శ్రమ అంటే, సమాజ శ్రేయస్సు కొరకు ఉచితంగా చేసే శ్రమ; ఒక నిశ్చితమైన విధిగా చేసే శ్రమ కాదు, కొన్ని సరుకులు పొందే హక్కు సంపాయించేటందుకు చేసే శ్రమ కాదు, ముందుగా నెలకొల్పబడి, చట్టరీత్యా నిర్ణయింపబడిన కోటాల ప్రకారం చేసే శ్రమ కాదు, మరి ఐచ్ఛిక శ్రమ, కోటాలతో నిమిత్తం లేనిది; అది ప్రతిఫలం వస్తుందను కోకుండా, ప్రతిఫలం అనే షరతు లేకుండా చేసే శ్రమ, సమష్టి శ్రేయస్సు కొరకు పనిచేయడం అలవాటు అయింది గనుక, సమష్టి శ్రేయస్సు కొరకు పనిచేసే అవసరంయొక్క చైతన్యపూరితమైన గుర్తింపు (అలవాటు అయినట్టిది) వుంది గనుక చేసే శ్రమ — ఆరోగ్యవంతమైన జీవికి అవసరంగా చేసే శ్రమ.

విశాలమైన, నిజంగా సామూహికమైన ప్రమాణంలో యీ రూపపు శ్రమను ప్రయోగించడానికి మనం, అనగా మన సమాజం, మన సామాజిక వ్యవస్థ, యింకా చాలా దూరంలో వున్నామని ప్రతివొకరికీ స్పష్టంగా వుండాలి.

యీ సమస్య యెత్తబడిందన్న విషయమే, అంతే కాక మొత్తం పురోగామి కార్మిక వర్గంచేతా (కమ్యూనిస్టు పార్టీచేతా, ట్రేడ్‌యూనియన్లచేతా), ప్రభుత్వ అధికార సంస్థలచేతా యెత్తబడిందన్న విషయమే యీ దిశలో ఒక అడుగు వేయడం.

పెద్ద పనులు సాధించడానికి చిన్న పనులతో ప్రారంభించాలి.

మరొకవైపున, ''పెద్ద పనుల'' తర్వాత, పెట్టుబడిదారీ స్వామ్యాన్ని కూలదోసి, కార్మికవర్గాన్ని అధికారంలో పెట్టిన విప్లవం తర్వాత, నూతన ప్రాతిపదికమీద ఆర్థిక జీవితపు వ్యవస్థీకరణ చిన్న పనులనుండి మాత్రమే ప్రారంభం కాగలదు.

''సుబ్బోత్నిక్కు''లు, శ్రమ సైన్యాలు, విధాయక శ్రమ — యివి వివిధ రూపాలలో సోషలిస్టు, కమ్యూనిస్టు శ్రమయొక్క ఆచరణగత వాస్తవీకరణ.

యీ ఆచరణగత వాస్తవీకరణలో యింకా పలు లోపాలు వున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థను వెనుకేసుకవచ్చేవాళ్లను పక్కన పెట్టితే, ఆలోచించడం బొత్తిగా చేతకాని వాళ్లు మాత్రమే వాటిని చూసి విరసనభావంతో నవ్వగలరు (లేదా కోపంతో ధుమ ధుమలాడగలరు).

అలాంటి కొత్త, కష్టమైన, గొప్ప పనిలో లోపాలూ, పొరపాట్లూ, తప్పులూ అనివార్యం. సోషలిజంను నిర్మించడంలోని కష్టాలకు భయపడేవాళ్లు, వాటికి జడుసుకొనేవాళ్లు, నిస్పృహకు గానీ, పిరికితనపు నివ్వెరపాటుకు గానీ లోబడేవాళ్లు, సోషలిస్టులు కారు.

కొత్త శ్రమ క్రమశిక్షణనూ, మనుషుల మధ్య కొత్త రూపాల సామాజిక సంబంధాలనూ, మనుషులను శ్రమలోకి ఆకర్షించే కొత్త రూపాలనూ, పద్ధతులనూ సృష్టించడానికి యేండ్లు పట్టుతుంది, దశాబ్దాలు పట్టుతుంది.

అది అత్యంత సంతృప్తిదాయకమైన, ఉదాత్తమైన పని.

బూర్జువావర్గాన్ని కూలదోసి, దాని ప్రతిఘటనను అణచివేయడంద్వారా మనం యీ పని యే భూమికమీద సాధ్యమైందో ఆ భూమికను గెలుచుకోగలగడం మన అదృష్టం.

మరి మన సర్వ శక్తితోనూ యీ పనికి పూనుకుంటాము. పట్టు విడువకపోవడమూ, దీక్షా, యిష్టమూ, కృతనిశ్చయమూ, వందసార్లు పరీక్షించి చూసుకోడానికీ, వందసార్లు సరిదిద్దుకోడానికీ, యేమైనప్పటికీ లక్ష్యాన్ని సాధించడానికీ సామర్థ్యమూ — యివి కార్మికవర్గం అక్టోబర్ విప్లవానికి ముందు పది, పదైదు, యిరవై యేండ్ల కాలంలో అలవరచుకొన్న గుణాలు, యీ విప్లవం తర్వాత గడచిన రెండేండ్లలో అలవరచుకొన్న గుణాలు, — కనివిని యెరగని లేమిడితో, ఆకలి బాధతో, ఆర్థిక వినాశనంతో, దారిద్ర్యంతో నిండిన రెండేండ్లలో. కార్మికవర్గంయొక్క యీ గుణాలు కార్మికవర్గం జయిస్తుందనడానికి హామీ.

ఏప్రెల్ 8, 1920

'కమ్యూనిస్తిచెస్కి సుబ్బోత్నిక్,' ఏప్రెల్ 11, 1920

# మాస్కో-కజాన్ రైల్వేమీది మొదటి "సుబ్బోత్నిక్కు" నుండి అఖిల రష్యా మే డే "సుబ్బోత్నిక్కు" దాకా

పై శీర్షికలో సూచింపబడిన దూరం ఒకేఒక సంవత్సరంలో గడవబడింది. యిది అపారమైన దూరం. మన సుబ్బోత్నిక్కులన్నీ యింకా బలహీనంగా వున్నప్పటికీ, ప్రతి సుబ్బోత్నిక్కూ యేర్పాటులోనూ, వ్యవస్థీకరణలోనూ, క్రమశిక్షణలోనూ బోలెడు లోపాలను వెల్లడించినప్పటికీ, ప్రధాన విషయం జరిగింది. బ్రహ్మాండమైన, బరువైనదానిని కదిలించినాము; విషయంయొక్క అసలు సారం అది.

యిప్పటికి జరిగిన స్వల్పం గురించీ, యింకా చేయవలసివున్న అనంతమైన పనిని గురించీ మనల్ని మనం మోసగించుకోవడం లేదు. కానీ, శ్రామిక ప్రజల ద్వేషపూరిత మద్దతుదారులు మాత్రమే మే ఒకటవ తేదీ సుబ్బోత్నిక్కును తృణీకరించగలరు; పెట్టుబడిదార్లకు తిరుగు లేకుండా అమ్ముడువోయిన యేహ్యమైనవాళ్ళు మాత్రమే మే ఒకటి నాటి మహా పర్వదినాన్ని కమ్యూనిస్టు శ్రమను ప్రవేశపెట్టే సామూహిక స్థాయి కృషికి వినియోగించుకోవడాన్ని ఖండించగలరు.

జారులనూ, భూస్వాములనూ, పెట్టుబడిదారులనూ కూలదోసినప్పటినుండి సోషలిజంను వాస్తవంగా నిర్మించడం కొరకూ, కొత్త సామాజిక లంకెల అభివృద్ధి కొరకూ, సమష్టి పనిలోని కొత్త క్రమశిక్షణయొక్క అభివృద్ధి కొరకూ, ప్రపంచ చరిత్రాత్మక ప్రాముఖ్యం గల నూతన జాతీయ (తదనంతరం అంతర్జాతీయ) ఆర్థిక వ్యవస్థయొక్క అభివృద్ధి కొరకూ నేలను శుభ్రంచేసే పని జరగడం యిది మొట్టమొదటి సారి. ప్రజల అలవాట్లనే — ఉత్పత్తి సాధనాలమీద గల సొంత స్వామ్యంచేతా, సన్నకారు వ్యష్టి ఆర్థిక వ్యవస్థ వలన, తమ మధ్య గల "స్వేచ్ఛాయుత" మారకం పరిస్థితులలోని సొంత యజమానుల ఆర్థిక వ్యవస్థ వలన, అనివార్యంగా ఉత్పన్నమయ్యే, నిత్యం పునరుత్పన్నమయ్యే కీచులాటలతో, అపనమ్మకంతో, అనైక్యతతో, పరస్పర కుట్రలతో నిండిన యావత్తు వాతావరణంచేతా రాబోయే చాలా కాలందాకా కలుషితమై, నీచపరచబడిన అలవాట్లనే —

రూపాంతరీకరించే వ్యవహారం యిది. వందల యేండ్లుగా వర్తక, మారక స్వేచ్ఛ అనేది కోట్లమందికి ఆర్థిక విజ్ఞతయొక్క వేద సారంగా వుండింది, వందల కోట్లమందిలో మహా లోతుగా వేర్లు పాతుకున్న అలవాటుగా వుండింది. యీ స్వేచ్ఛ పచ్చి బూటకం, పెట్టుబడిదారీ వంచనకూ, బలాత్కారానికీ, దోపిడీకీ ముసుగుగా ఉపకరించేది — బూర్జువా వర్గం ఉద్ఘోషించి, అమలుపరచే "పని చేసే స్వేచ్ఛ" (వాస్తవంలో పస్తులుండే స్వేచ్ఛ), మొదలైన యితర "స్వేచ్ఛల" లాగే.

ఆస్తిపరుడు ఆస్తిపరుడుగా వుండే యీ "స్వేచ్ఛ"తో, శ్రమను దోపిడీ చేయడానికి పెట్టుబడికి గల యీ "స్వేచ్ఛ"తో మొత్తంమీద మనం తిరుగు లేకుండా తెంచుకున్నాం, యీ పనిని పూర్తిచేస్తాం. దీని అవశేషాలతో మనం నిర్దాక్షిణ్యంగా, మన సర్వ శక్తితోనూ పోరాడుతున్నాం.

పాత సామాజిక లంకెలూ, పాత ఆర్థిక సంబంధాలూ, శ్రమయొక్క (పెట్టుబడికి లోబడిన శ్రమయొక్క) పాత "స్వేచ్ఛా," పాత చట్టాలూ, పాత అలవాట్లూ నశించాలి!

నూతన సమాజాన్ని నిర్మిద్దాం!

జారిజంతోనూ, బూర్జువావర్గంతోనూ, సర్వశక్తిపర సామ్రాజ్యవాద ప్రపంచ రాజ్యాలతోనూ చేసిన మహా విప్లవ యుద్ధ కాలంలోని పరాజయాలకు మనం భయపడలేదు.

మహా కష్టమైన కర్తవ్యపు ప్రారంభంలో అనివార్యమైనట్టి బ్రహ్మాండమైన కష్టాలకూ, తప్పులకూ మనం భయపడం. శ్రమ అలవాట్లూ, ఆచారాలూ అన్నీ రూపాంతరం చెందడానికి దశాబ్దాలు అవసరం. సకల త్యాగాలూ చేస్తామనీ, యీ అత్యంత శ్రమ భరితమైన పోరాటంలో — అలవాటు శక్తితో చేసే పోరాటంలో — నిలదట్టుకొని గెలుస్తామనీ, యేండ్ల తరబడి, దశాబ్దాల తరబడి శ్రమ అనకుండా కృషిచేస్తామనీ మనం ఒకరికొకరం గంభీరంగా, స్థిరంగా వాగ్దానం చేస్తున్నాం. "యెవనిపాటికి వాడే, చేతకానివాడు యేటిపాలే" అనే పాపిష్ఠి నీతి సూత్రాన్నీ, పనిని కేవలం విధిగా చూసి, నిర్దిష్టమైన రేట్ల ప్రకారం డబ్బు చెల్లించే పనిని మాత్రమే న్యాయబద్ధమైనదిగా భావించే అలవాటునూ తుదముట్టించడానికి మనం కృషిచేస్తాం. "ప్రతివొకని కోసం అందరూ, అందరి కోసం ప్రతివొకడూ" అనే నియమాన్నీ, "ప్రతివానినుండీ వాని సామర్థ్యాన్నిబట్టి, ప్రతి వానికీ వాని అవసరాలనుబట్టి" అనే నియమాన్నీ మనుషుల మనస్సులలోకి యెక్కించడానికీ, అలవాటుగా మార్చడానికీ, జనాల రోజువారీ జీవితంలోకి తేవడానికీ మనం కృషి చేస్తాం; కమ్యూనిస్టు క్రమశిక్షణనూ, కమ్యూనిస్టు శ్రమనూ క్రమక్రమంగా, కానీ స్థిరంగా ప్రవేశపెట్టడానికి మనం కృషిచేస్తాం.

మన మొక బ్రహ్మాండమైన పర్వతాన్ని కదిలించినాం, యధాస్థితివాదానికీ, అజ్ఞానానికీ, ''వ్యాపార స్వేచ్ఛ,'' ప్రతి యితర సరుకులాగే మానవ శ్రమను ''స్వేచ్ఛగా'' కొనడమూ, అమ్మడమూ అనే అలవాట్లకు మొండిగా అంటిపెట్టుకోవడానికీ చెందిన బ్రహ్మాండమైన రాసిని కదిలించినాం. మహా లోతుగా వేర్లు పాతుకున్న దురభిప్రాయాలనూ, మహా దృఢంగా, యుగయుగాలుగా రక్తంలో జీర్ణమైన అలవాట్లనూ బలహీన పరచడమూ, ధ్వంసం చేయడమూ మనం ప్రారంభించినాం. ఒకేఒక సంవత్సరంలో మన సుబ్బోత్నిక్కులు అపారమైన ముందంజ వేసినాయి. అవి యింకా అమేయమైనంత దుర్బలంగా వున్నాయి, కానీ అది మనల్ని భయపెట్టదు. ''అమేయంగా దుర్బలమైన'' మన సోవియట్ రాజ్యం మన కండ్ల యెదుటనే, మన సొంత ప్రయత్నాల ఫలితంగా బలం పుంజుకోవడమూ, మహా బలీయమైన ప్రపంచ శక్తి కావడమూ మనం చూసినాం. సుబ్బోత్నిక్కులను ఆచరిస్తూ, అభివృద్ధిచేస్తూ, వ్యాప్తిచేస్తూ, మెరుగుపరుస్తూ, అలవాటుగా మారుస్తూ మనం యేండ్ల తరబడి, దశాబ్దాల తరబడి పనిచేస్తాం. కమ్యూనిస్టు శ్రమయొక్క విజయాన్ని మనం సాధిస్తాం!

'పెర్వొమైస్కీ సుబ్బోత్నిక్' మే 2, 1920

# సహకారంమీద

## I

మన దేశంలోని సహకారోద్యమంపట్ల తగినంత శ్రద్ధ వహించడం లేదని నాకు అనిపిస్తుంది. యిప్పుడు, అక్టోబర్ విప్లవ కాలంనుండి, నూతన ఆర్థిక విధానంతో* సంబంధం లేకుండా (అంతే కాదు, యీ సందర్భంలో, నూతన ఆర్థిక విధానం మూలంగా అని చెప్పాలి) మన సహకారోద్యమం గొప్ప ప్రాముఖ్యం గలది అయింది, అన్న విషయం అందరికీ అర్థం కావడం లేదు. పాత సహకారోద్యమకారుల కలలలో ఊహాకల్పన దండిగా వుంది. తరచుగా వాళ్ల ఊహాకల్పన హాస్యాస్పదంగా వుంది. మరి, వాళ్లెందుకు ఊహాకల్పన శీలంగా వున్నారు? యెందుకంటే, దోపిడీదార్ల పరిపాలనను కూలదోయడానికి జరిగే

---

*నూతన ఆర్థిక విధానం – సోవియట్ ప్రజలు ప్రతీఘాత విప్లవాన్నీ, సాయుధ జోక్యాన్నీ ఓడించిన తర్వాత, 1921లో రష్యాలో ప్రవేశపెట్టబడిన ఆర్థిక విధానం. అంతర్యుద్ధ కాలంలో (1918–1921) అనుసరింపబడిన యుద్ధ కమ్యూనిజం విధానంలో రైతులు అదనపు వ్యవసాయ సరుకుల నన్నిటినీ ప్రభుత్వానికి యివ్వవలసి వుండింది (అదనపు ధాన్య సేకరణ పద్ధతి). దానికి భిన్నంగా నూతన ఆర్థిక విధానం వస్తు రూపపు పన్నును ప్రవేశపెట్టింది; అది చెల్లించిన తర్వాత రైతులు తమ సరుకును మార్కెట్‌లో అమ్ముకోవచ్చు. కొంత కాలం పాటు పరిమిత ప్రమాణంలో పెట్టుబడిదారీ అంశాల ఉనికిని అనుమతించిన నూతన ఆర్థిక విధానపు లక్ష్యం ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయడమూ, వ్యవసాయాన్ని మెరుగుపరచడమూ, దేశ పారిశ్రామికీకరణకు అవసరమైన నిధులను సృష్టించడమూ. – సం.

కార్మికవర్గ రాజకీయ పోరాటంయొక్క మౌలిక, ప్రప్రాథమిక ప్రాముఖ్యాన్ని జనం గ్రహించలేదు గనుక. మనం దోపిడీదార్ల పాలనను కూలదోసినాము; పాత కాలపు సహకారోద్యమకారుల కలలలో ఊహాకల్పనాత్మకంగా, రొమాంటిక్‌గా కూడా, సాదాగా కూడా వుండిన చాలా విషయాలు యిప్పుడు నగ్న సత్యం ఔతున్నాయి.

నిజంగా, రాజకీయాధికారం కార్మికవర్గం చేతుల్లో వుంది గనుక, యీ రాజకీయాధికారం ఉత్పత్తి సాధనాలన్నిటిమీదా యజమాని గనుక, నిజంగా మనకు మిగిలిన ఏకైక కర్తవ్యం ప్రజానీకాన్ని సహకార సంఘాలలో వ్యవస్థీకరించడం. వర్గపోరాటమూ, రాజకీయాధికారం కొరకు పోరాటమూ, వగైరా చేయడం అవసరమని, సరిగా, నమ్మకం గలవాళ్లచేత న్యాయంగా, గతంలో, అపహాస్యంతోనూ, నీచభావంతోనూ, ఏహ్యాభావంతోనూ చూడబడిన సోషలిజం, ప్రజానీకంలో అత్యధిక భాగం సహకార సంఘాలలో వ్యవస్థీకరింపబడినప్పుడు, దానంతకదే తన లక్ష్యాన్ని సాధిస్తుంది. కానీ, రష్యా ప్రజానీకాన్ని యిప్పుడు సహకార సంఘాలలో వ్యవస్థీకరించడం యెంత అపారమైన, యెంత అనంతమైన ప్రాముఖ్యం గలది అయిందీ కామ్రేడ్లు అందరూ గుర్తించడం లేదు. నూతన ఆర్థిక విధానాన్ని అవలంబించడంద్వారా మనం రైతుకు, వర్తకుడుగా, ఒక రాయితీ యిచ్చినాము, వ్యక్తిగత వ్యాపార సూత్రానికి ఒక రాయితీ యిచ్చినాము. సరిగ్గా యీ కారణంవల్లనే (కొంతమంది అనుకునేదానికి భిన్నంగా), సహకారోద్యమానికి అంత అపారమైన ప్రాముఖ్యం వుంది. నూతన ఆర్థిక విధానంలో మనకు వాస్తవంలో అవసరమైనదల్లా యేమిటంటే, రష్యా ప్రజానీకాన్ని తగినంత విస్తృత ప్రమాణంలో సహకార సంఘాలలో వ్యవస్థీకరించడం; యెందుకంటే, వ్యక్తిగత, వ్యక్తిగత వర్తక, ప్రయోజనాన్నీ, ఆ ప్రయోజనంమీద ప్రభుత్వ తనిఖీనీ, అజమాయిషీనీ యే మేరకు కలపాల్నో ఆ మేరను, సమష్టి ప్రయోజనాలకు ఆ వ్యక్తిగత ప్రయోజనాన్ని యే మేరకు లోబరచాల్నో ఆ మేరను, గతంలో చాలామంది సోషలిస్టులకు యిబ్బంది కలిగించినట్టి దాన్ని, యిప్పుడు మనం తెలుసుకున్నాము. నిజంగా, భారీ ఉత్పత్తి సాధనా లన్నిటిమీదా రాజ్యంయొక్క అధికారమూ, కార్మికవర్గం చేతుల్లో రాజకీయ అధికారమూ, అనేక మిలియన్ల చిన్న, అతి చిన్న రైతులతో యీ కార్మికవర్గంయొక్క పొత్తూ, రైతాంగంమీద కార్మికవర్గంయొక్క నాయకత్వం నమ్మకంగా వుండడమూ, వగైరా — యివి కాదా అవసరమైన వన్నీ, పరిపూర్ణ సోషలిస్టు సమాజాన్ని సహకార సంఘాలనుండి, సహకార సంఘాలనుండి మాత్రమే, నిర్మించడానికి? — యే సహకార సంఘాలనైతే గతంలో మనం వంచన అని అపహాస్యం చేసినామో, వేటినైతే యిప్పుడు, నూతన ఆర్థిక విధానంలో, ఒక దృక్పథంనుండి అలాగే అపహాస్యం చేయడానికి మనకు హక్కు వుందో,

ఆ సహకార సంఘాలనుండి సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి అవసరమైన వన్నీ? పరిపూర్ణ సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి అవసర మైనవన్నీ యివి కాదా? యిప్ప డింకా యిది సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం కాదు, కానీ దానికి అవసర మైనవన్నీ, చాలినవన్నీ యివే.

సరిగ్గా యీ పరిస్థితినే మన ఆచరణాత్మక కార్యకర్తలు తక్కువ అంచనా వేస్తున్నారు. వాళ్లు మన సహకార సంఘాలను హీనంగా చూస్తారు. మొదటిది సూత్ర దృష్ట్యానూ (ఉత్పత్తి సాధనాలమీద స్వామ్యం రాజ్యానికి వుంది), రెండవది, అత్యంత సరళమైన, సులభమైన, రైతుకు అంగీకృతమైన పద్ధతులలో కొత్త వ్యవస్థకు పరివ ర్తన జరగడం దృష్ట్యానూ వాటి అసాధారణమైన ప్రాముఖ్యాన్ని వాళ్లు అర్థం చేసుకోరు.

కానీ, మళ్లీ, యిది మౌలిక ప్రాముఖ్యం గలది. రకరకాల కార్మిక సంఘాలద్వారా సోషలిజం నిర్మించడానికి ఊహాకల్పనాత్మకమైన పథకాలు తయారుచేయడం వేరు, ప్రతి చిన్న రైతూ అందులో పాల్గొనడానికి వీలుగా సోషలిజంను ఆచరణలో నిర్మిం చడం నేర్చుకోవడం పూర్తిగా వేరు. అది యిప్పుడు మనం చేరిన దశ. ఆ దశకు చేరి, మనం దానిని అతి తక్కువగా వినియోగించుకుంటున్నా మనడంలో సందేహం యేమీ లేదు.

నూతన ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టడంలో మనం చాలా దూరం పోయినాము, కానీ స్వేచ్ఛా పరిశ్రమల, స్వేచ్ఛా వ్యాపార సూత్రానికి మనం అతిగా ప్రాముఖ్యం యిచ్చి నందువల్ల కాదు. మనం చాలా దూరం పోయింది యెందుకంటే, సహకార సంఘాలు మనకు కనుమరుగైనాయి గనుక, యిప్పుడు మనం సహకార సంఘాలను తక్కువ అంచనా వేస్తున్నాము గనుక, పై రెండు దృక్పథాలనుండి సహకార సంఘాలకు గల విస్తారమైన ప్రాముఖ్యాన్ని మరిచిపోవడం మనం యిప్పటికే ప్రారంభిస్తున్నాము గనుక.

యీ "సహకార" సూత్రం ప్రాతిపదికమీద వెంటనే ఆచరణ రీత్యా యేమి చెయ్య గలం, యేమి చెయ్యాలి, అనేది యిప్పుడు పాఠకునితో చర్చించదలచుకున్నాను. యీ సహకార సూత్రాన్ని, దాని సోషలిస్టు అర్థం అందరికీ స్పష్టమయ్యేటట్లు, అభివృద్ధి చేయడానికి మనం యే విధంగా వెంటనే ప్రారంభించగలం, ప్రారంభించాలి?

సహకారాన్ని రాజకీయంగా యెలా యేర్పాటుచేయాలంటే, అది కొన్ని సౌకర్యాలను సాధారణంగానూ, యెల్లప్పుడూనూ అనుభవించేటట్లు మాత్రమే కాదు, యీ సౌక ర్యాలు కేవలం భౌతికమైనవిగా వుండేటట్లు (అనుకూలమైన బాంకి రేటు, వగైరా) యేర్పాటుచేయాలి. ప్రైవేటు వ్యాపార సంస్థలకు, భారీ పరిశ్రమలకు కూడా, మనం యిచ్చే రుణాలకంటె, కొద్దిగానైనా సరే, యెక్కువగా వుండే ప్రభుత్వ రుణాలు సహకార సంఘాలకు యివ్వాలి, వగైరా.

ప్రతి సామాజిక వ్యవస్థా, దాని కొక నిర్ణీత వర్గంయొక్క ఆర్థిక అండ వున్నప్పుడు మాత్రమే, ఉద్భవిస్తుంది. ''స్వేచ్ఛాయుత'' పెట్టుబడిదారీ వ్యవస్థ జననానికి యెన్ని వందల మిలియన్ల రూబుళ్లు ఖర్చు అయిందీ చెప్ప నవసరం లేదు. మామూలు సహాయంకంటె యెక్కువ యిప్పుడు మనం యివ్వవలసిన సామాజిక వ్యవస్థ సహకార వ్యవస్థ, అని మనం ప్రస్తుతం గుర్తించాలి; ఆ సహాయం మనం వాస్తవంగా యివ్వాలి. కానీ, సహాయం అనే పదానికి గల నిజమైన అర్థంలో దానికి సహాయం యివ్వాలి; అనగా యెలాంటి సహకార వ్యాపారానికైనా సరే సహాయం అని దాన్ని వ్యాఖ్యానిస్తే చాలదు. సహాయమంటే నిజంగా విస్తారమైన ప్రజా సముదాయాలు నిజంగా పాల్గొనే సహకార వ్యాపారానికి సహాయమని మనం అర్థంచేసుకోవాలి. సహకార వ్యాపారంలో పాల్గొనే రైతులకు బోనస్ యివ్వడం నిశ్చయంగా సరైన సహాయ రూపమే; కానీ కీలకమైన విషయం యేమిటంటే, యీ పాల్గొనడంయొక్క స్వభావాన్ని తేల్చుకోవడం, దానివెనక వున్న జాగృతిని తేల్చుకోవడం, దాని గుణాన్ని తేల్చుకోవడం. కచ్చితంగా చెప్పాలంటే, ఒక సహకారోద్యమకారుడు ఒక గ్రామానికి వెళ్లి ఒక సహకార అంగడి ప్రారంభిస్తే, ప్రజలు అందులో యేమాత్రమూ పాల్గొనరు; కానీ, తమ సొంత ప్రయోజనాలచేత నడిపించబడి ప్రజలు అందులో పాల్గొనడానికి తొందరగా ప్రయత్నిస్తారు.

యీ సమస్యకు మరొక పార్శ్వం వుంది. ''నాగరిక'' (ప్రాథమికంగా, అక్షరాస్య) యూరపియన్ల దృక్పథంనుండి, సహకార చర్యల్లో జడాత్మకంగా కాక, క్రియాత్మకంగా పాల్గొనడానికి కచ్చితంగా ప్రతిఒక్కరినీ ప్రేరేపించడానికి మనం చేయడాని కేమీ మిగల్లేదు. కచ్చితంగా చెప్పాలంటే, మనకు చేయడానికి మిగిలిందల్లా ఒకటి ''మాత్రమే;'' యేమిటంటే, సహకార సంఘాల పనిలో ప్రతిఒకరూ పాల్గొంటే కలిగే సౌకర్యాలన్నిటినీ అర్థంచేసుకునేటట్లుగా, ఆ పాల్గొనడాన్ని యేర్పాటుచేసేటట్లుగా మన ప్రజలను ''నాగరికులను'' చేయడం. ''అంతే.'' సోషలిజంను పురోగమింపజేయడానికి అవసరమైన యితర సాధనా లేమీ యిప్పుడు లేవు. కానీ, యీ ''అంతే''ను సాధించడానికి అసలైన విప్లవమే వుండాలి — యావత్ప్రజలూ ఒక సాంస్కృతిక అభివృద్ధి దశగుండా గడవాలి. కనుక మన నియమం యిలా వుండాలి: సాధ్యమైనంత తక్కువ తత్వబోధలూ, సాధ్యమైనంత తక్కువ గారడీలూ. యీ విషయంలో నూతన ఆర్థిక విధానం ఒక పురోగమనం; యెందుకంటే, అది అత్యంత సాధారణమైన రైతు స్థాయికి అనుగుణంగా మార్చగలిగినట్టిది, అది అతనినుండి అంతకంటె యెక్కువేమీ డిమాండు చేయదు. కానీ యావత్ప్రజానీకాన్నీ నూతన ఆర్థిక విధానంద్వారా సహకార సంఘాల పనిలోకి తీసుకరావడానికి ఒక చారిత్రక యుగం మొత్తం పట్టుతుంది. మహా అయితే, దీనిని

మనం ఒకటి రెండు దశాబ్దాలలో సాధించగలం. అయినప్పటికీ యిది స్పష్టంగా ఒక భిన్నమైన చారిత్రక యుగం. యీ చారిత్రక యుగం లేకుండా, సార్వత్రిక అక్షరాస్యత లేకుండా, ఉచితమైన ఒక సామర్థ్య స్థాయి లేకుండా, ప్రజానీకానికి పుస్తకాలు చదివే అలవాటు పొందడానికి తగినంత శిక్షణ యివ్వకుండా, దీనికి అవసరమైన భౌతిక ప్రాతి పదిక లేకుండా, హీనమైన మాసూళ్లూ, కరువులూ, మొదలైనవాటినుండి రక్షణ పొందడానికి తగిన సమృద్ధి లేకుండా — యివి లేకుండా మనం మన లక్ష్యాన్ని సాధించము. యిప్పుడు చేయవలసిందేమిటంటే, విస్తారమైన విప్లవోత్సాహాన్నీ, మనం ప్రదర్శించిన, తగినంతగా ప్రదర్శించిన, సంపూర్ణ విజయం కూడా పొందిన విప్లవోత్సాహాన్నీ — దీనిని (నాకు యిలా చెప్పాలని దాదాపు కోరికగా వున్నది) ప్రయోజనకరమైన, సమర్థమైన వర్తకుడుగా వుండే సామర్థ్యంతో, మంచి సహకారోద్యమకారుడు కావడానికి పూర్తిగా చాలినట్టిదానితో, కలపడం. వర్తకుడుగా వుండే సామర్థ్యం అంటే నా అర్థం సంస్కారవంతుడైన వర్తకుడుగా వుండే సామర్థ్యం. తాము వర్తకం చేస్తున్నాము గనుక మంచి వర్తకుల మనుకునే ఆ రష్యన్లు, లేదా సాదా రైతుల బుర్రలలోకి యిది బాగా యెక్కాగాక. అదీ యిదీ యెంత మాత్రమూ ఒకటి కాదు. అతను వర్తకం చేస్తాడు, కానీ సంస్కారవంతుడైన వర్తకుడుగా వుండడంతో దానికేమీ సంబంధం లేదు. అతను యిప్పుడు ఆసియా పద్ధతిలో వర్తకం చేస్తున్నాడు, కానీ వర్తకుడు కావడానికి యూరపియన్ పద్ధతిలో వర్తకం చేయాలి. ఆ విషయంలో అతను మొత్తం ఒక చారిత్రక యుగం వెనక వున్నాడు.

ముగింపు మాట: సహకార సంఘాలకు కొన్ని ఆర్థిక, ఫైనాన్షల్, బాంకింగ్ సౌకర్యాలు యివ్వాలి — ప్రజానీకాన్ని యే నూతన సూత్రంమీద వ్యవస్థీకరించాల్నో ఆ నూతన సూత్రాన్ని మన సోషలిస్టు రాజ్యం పెంపొందించవలసిన పద్ధతి యిది. కానీ కర్తవ్యం యొక్క సాధారణ బాహ్యరేఖ మాత్రమే యిది; యిది ఆచరణలో వున్న కర్తవ్యంయొక్క మొత్తం వస్తువును నిర్వచించదు, సవివరంగా చిత్రించదు. అనగా, సహకార సంఘాలలో చేరినందుకు యే రూపంలో బోనస్ యివ్వవలసిందీ (దాన్ని యే షరతులమీద యివ్వవలసిందీ), యే బోనస్ రూపంతో మనం సహకార సంఘాలకు చాలినంతగా సహాయం చేయవలసిందీ, నాగరిక సహకార సంఘ సభ్యులను ఉత్పన్నంచేసే బోనస్ రూపాన్నీ మనం తెలుసుకోవాలి. మరి, ఉత్పత్తి సాధనాలమీద సామాజిక స్వామ్యం వుండగా, బూర్జువావర్గంమీద కార్మికవర్గంయొక్క వర్గ విజయం వుండగా, నాగరిక సహకార సంఘ సభ్యుల వ్యవస్థ అంటే సోషలిస్టు వ్యవస్థ.

జనవరి 4, 1923

## II

నూతన ఆర్థిక విధానాన్ని గురించి నేను రాసినప్పుడల్లా, 1918లో నేను ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థమీద రాసిన వ్యాసాన్ని ఉటంకించినాను.* ఒకటికంటె యెక్కువ సార్లే యిది కొంతమంది యువ కామ్రేడ్ల మనసులలో సందేహాలు రేపింది. కానీ వాళ్ల సందేహాలు ప్రధానంగా అభౌతిక రాజకీయ విషయాలకు సంబంధించినవి.

ఉత్పత్తి సాధనాలు కార్మికవర్గ స్వామ్యంకింద, రాజకీయాధికారం గల కార్మిక వర్గ స్వామ్యంకింద వున్న వ్యవస్థకు ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థ అనే పేరు వర్తించ జాలదని వాళ్లకు అనిపించింది. కానీ, వాళ్లు ఒకటి గమనించలేదు; నేను "ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థ" అనే పదాన్ని ఉపయోగించింది, మొదటిది, మన ప్రస్తుత స్థితిని వామపక్ష కమ్యూనిస్టు** లనబడేవాళ్లతో జరిగిన నా వివాదంలో నేను అవలంబించిన స్థావరంతో చారిత్రకంగా లంకె వేయడానికి; అంతే కాక, ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థ మనకు వున్న ఆర్థిక వ్యవస్థకంటె ఉన్నతంగా వుంటుందని అప్పుడు నేను వాదించి నాను. సాధారణ ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థకూ, నూతన ఆర్థిక విధానాన్ని పాఠకు నికి పరిచయం చేయడంలో నేను ప్రస్తావించిన అసాధారణమైన, చాలా అసాధారణం కూడా అయిన, ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థకూ మధ్యగల అనుస్యూతిని చూపించడం అప్పుడు నాకు ముఖ్యంగా వుండింది. రెండవది, ఆచరణాత్మక ప్రయోజనం నాకు యెల్ల ప్పుడూ ముఖ్యంగా వుండింది. మరి, మన నూతన ఆర్థిక విధానంయొక్క ఆచరణాత్మక ప్రయోజనం కన్సెషన్లు*** యివ్వడం. మన దేశంలో వున్న పరిస్థితులలో, కన్సెషన్లు

---

* వి. ఐ. లెనిన్ 'యేరిన రచనలు' మూడవ భాగం, పుటలు 108–137 చూడండి. — సం.

** "వామపక్ష" కమ్యూనిస్టులు – 1918లో జర్మనీతో బ్రెస్ట్ సంధినీ, దేశం లోపల పార్టీయొక్క ఆర్థిక విధానాన్నీ వ్యతిరేకించిన రష్యన్ కమ్యూనిస్టుల బృందం. వీళ్ల స్థావరానికి విశాలమైన పార్టీ సభ్యులలో అండదండలు లభించలేదు. 1918 అంతంలో యీ బృందం అంతరించింది. — సం.

*** కన్సెషన్లు — పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజానికి పరివర్తన జరిగే దశలో త్వరత్వరగా ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయడానికీ, సరుకుల ఉత్పత్తి పెంపొందించేం దుకూ సోవియట్ ప్రభుత్వం గనులను ఉపయోగించడానికీ, కొన్ని నిర్మాణ పనులను చేయడానికీ విదేశ పెట్టుబడిదారులతో ఒప్పందాలను చేసుకొన్నది. సోవియట్ యూనియన్ లోని ఆర్థిక వ్యవస్థలో కన్సెషన్లు ముఖ్యమైన పాత్ర వహించలేదు. — సం.

నిస్సందేహంగా పరిశుద్ధ ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థ రూపంగా వుంటాయి. ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థను గురించి నేను వాదించింది అలా.

కానీ, యీ విషయానికి మరొక పార్శ్వం వుంది. దానికి ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థ, లేదా కనీసం ఆ వ్యవస్థతో పోలిక, మనకు అవసరం కావచ్చు. అది సహకార సంఘాల సమస్య.

పెట్టుబడిదారీ రాజ్యంలో సహకార సంఘాలు నిస్సందేహంగా సమష్టి పెట్టుబడిదారీ సంస్థలు. మరొకటి కూడా నిస్సందేహమైనది; యేమిటంటే, మన ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో, ప్రైవేటు పెట్టుబడిదారీ వ్యాపార సంస్థలను మినహాయింపులు లేని సోషలిస్టు తరహాకు చెందిన వ్యాపార సంస్థలతో (ఉత్పత్తి సాధనాలూ, వ్యాపార సంస్థలు యే భూమిమీద వున్నాయో ఆ భూమీ, మొత్తం వ్యాపార సంస్థలూ రాజ్యానికి చెందినవి) కలిపినప్పుడు — కానీ ఆ కలపడం జాతీయం చేయబడిన భూమిమీద తప్ప మరే విధంగానూ కాదు, కార్మికవర్గ రాజ్యపు అజమాయిషీకింద తప్ప మరే విధంగానూ కాదు — మూడవ తరహా వ్యాపార సంస్థలు అయిన సహకార సంఘాల గురించి, సూత్రరీత్యా యితరవాటికంటె భిన్నమైనవిగా గతంలో పరిగణింపబడనివాటిని గురించి, ప్రశ్న ఉత్పన్నమౌతుంది. ప్రైవేటు పెట్టుబడిదారీ వ్యవస్థలో, సమష్టి వ్యాపార సంస్థలు ప్రైవేటు వ్యాపార సంస్థలకంటె భిన్నమైనవి అయినట్లు, సహకార సంస్థలు పెట్టుబడిదారీ సంస్థలకంటె భిన్నమైనవి. ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థలో, సహకార వ్యాపార సంస్థలు ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యాపార సంస్థలకంటె యెలా భిన్నమైనవంటే, మొదటిది, అవి ప్రైవేటు వ్యాపార సంస్థలు గనుక, రెండవది, అవి సమష్టి వ్యాపార సంస్థలు గనుక. మన ప్రస్తుత వ్యవస్థలో, సహకార వ్యాపార సంస్థలు సమష్టి వ్యాపార సంస్థలు గనుక, అవి ప్రైవేటు పెట్టుబడిదారీ సంస్థలకంటె భిన్నమైనవి; కానీ, అవి యే భూమిమీద వున్నాయో ఆ భూమీ, ఉత్పత్తి సాధనాలూ రాజ్యానికి, అనగా కార్మికవర్గానికి, చెందితే, అవి సోషలిస్టు వ్యాపార సంస్థలకంటె భిన్నమైనవి కావు.

సహకార సంఘాలను చర్చించేటప్పుడు యీ విషయాన్ని తగినంతగా పరిగణించడం లేదు. మన రాజకీయ వ్యవస్థయొక్క ప్రత్యేక లక్షణాల మూలంగా మన సహకార సంఘాలు పూర్తిగా అసాధారణమైన ప్రాముఖ్యం పొందుతున్నాయనే విషయం మరిచిపోయినారు. కన్సెషన్లను పక్కన పెట్టితే — అన్నట్లు అవి యే గణనీయమైన ప్రమాణంలోనూ అభివృద్ధి కాలేదు — సహకారోద్యమం మన పరిస్థితులలో దాదాపు యెల్లప్పుడూ సోషలిజంకు పూర్తిగా సమానం.

నా అర్థం వివరిస్తాను. రాబర్ట్ ఓవెన్ * ఆదిగా గల పాత సహకారోద్యమకారుల పథకాలు యెందుకు ఊహా కల్పనాత్మకమైనవి? యెందుకంటే, వర్గపోరాటమూ, కార్మిక వర్గం రాజకీయాధికారం పట్టుకోవడమూ, దోపిడీచేసే వర్గంయొక్క పరిపాలనను కూలదోయడమూ లాంటి మౌలిక సమస్యలను లెక్కలోకి తీసుకోకుండా, శాంతియుతంగా సమకాలిక సమాజాన్ని సోషలిస్టు సమాజంగా మార్చాలని వాళ్లు కలలుగన్నారు. అందు కనే యీ ''సహకార'' సోషలిజంను పూర్తిగా ఊహా కల్పనాత్మకమైనదని అనుకోవ డంలో మనం ఒప్పు; కేవలం ప్రజానీకాన్ని సహకార సంఘాలలో వ్యవస్థీకరించడంద్వారా వర్గ శత్రువులను వర్గ సహకారులుగానూ, వర్గ సమరాన్ని వర్గ శాంతి (సివిల్ శాంతి అనబడేది) గానూ మార్చాలని కలలుగనడాన్ని రొమాంటిక్ అనీ, సాదా అని కూడానూ అను కోవడంలో మనం ఒప్పు.

యీనాటి మౌలిక కర్తవ్యంయొక్క దృక్పథంనుండి మనం నిస్సందేహంగా ఒప్పు; యెందుకంటే, రాజ్యంలో రాజకీయాధికారం కొరకు వర్గపోరాటం లేకుండా సోషలిజం స్థాపించబడజాలదు.

కానీ యిప్పుడు రాజకీయాధికారం కార్మికవర్గం చేతుల్లో వుంది గనుక, దోపిడీదార్ల రాజకీయాధికారం కూలదోయబడింది గనుక, ఉత్పత్తి సాధనాలన్నీ (కార్మిక రాజ్యం కొన్ని షరతులమీద, కొంత కాలానికి, కన్సెషన్ల రూపంలో ఐచ్ఛికంగా దోపిడీదార్లకు వదలివేసేవి తప్ప) కార్మికవర్గానికి చెంది వున్నాయి గనుక, పరిస్థితులు యెలా మారిందీ చూడండి.

మనకు కేవలం సహకారోద్యమం పెరుగుదలే (పైన చెప్పిన ''చిన్న'' మినహా యింపుతో) సోషలిజం పెరుగుదలతో సమానమని చెప్పే హక్కు యిప్పుడు మనకు వుంది. కానీ, అదే సమయంలో, సోషలిజం గురించి మన మొత్తం దృక్పథంలో మౌలిక మైన మార్పు యిది: గతంలో మనం రాజకీయ పోరాటమూ, విప్లవమూ, అధికారం గెలుచుకోవడమూ, వగైరాలకు ప్రాముఖ్యం యిచ్చినాము. యిప్పుడు శాంతియుత, వ్యవస్థీకరణాత్మక, ''సాంస్కృతిక'' పనికి ప్రాముఖ్యం మారుతున్నది. సాంస్కృతిక పనికి ప్రాముఖ్యం మారుతున్నదని ఒప్పుకోడానికి సిద్ధంగా ఉన్నాను, మన అంతర్జా తీయ సంబంధాలు యిలా లేకపోతే, ప్రపంచ స్థాయిలో మన స్థానం కొరకు మనం పోరాటం చేయవలసి వుండకపోతే. కానీ, అది వదిలేసి, ఆంతరంగిక ఆర్థిక సంబంధాలకు మనం పరిమితమైతే, మన పనిలో ప్రాముఖ్యం నిశ్చయంగా సంస్కృతికి మారుతున్నది.

రెండు ప్రధాన కర్తవ్యాలు మనకు యెదురౌతున్నాయి; అవి రెండూ కలిసి యీ

---

* ఓవెన్, రాబర్ట్ (1771–1858) – బ్రిటిష్ ఊహాస్వర్గ సోషలిస్టు. – సం.

యుగం. మన మొదటి కర్తవ్యం రాజ్య యంత్రాంగాన్ని పునర్నిర్మాణం చేయడం. అది బొత్తిగా పనికిరానిది; గత యుగంనుండి దాన్ని మొత్తంగా తీసుకున్నాము. గత అయిదు సంవత్సరాల పోరాట కాలంలో మనం దాన్ని తీవ్రంగా పునర్నిర్మాణం చేయలేదు, చేయలేకపోయినాము. మన రెండవ కర్తవ్యం రైతులలో సాంస్కృతిక సంబంధమైన పని. రైతులలో యీ సాంస్కృతిక కార్యంయొక్క ఆర్థిక లక్ష్యం రైతులను సహకార సంఘాలలో వ్యవస్థీకరించడం. యావత్తు రైతాంగమూ సహకార సంఘాలలో సంస్థాబద్ధమైవుంటే, యీపాటికి మనం రెండు అడుగులూ సోషలిస్టు నేలమీద మోపి నిలబడివుండేవాళ్లం. కానీ యావత్తు రైతాంగాన్నీ సహకార సంఘాలలో వ్యవస్థీకరించాలంటే, ముందుగా రైతులలో (సరిగ్గా అత్యధిక సంఖ్యాకులుగా వున్న రైతులలో) ఒక సంస్కృతీ స్థాయి వుండాలి. కానీ, నిజానికి, సాంస్కృతిక విప్లవం లేకుండా అది సాధ్యం కాదు.

తగినంత సంస్కృతీ సంపన్నం కాని దేశంలో సోషలిజంను నాటడానికి మనం పూనుకోవడం తొందరపాటు అని మన వ్యతిరేకులు పదేపదే మనకు చెప్పినారు. కానీ, సిద్ధాంతం (రకరకాల ఛాందస పండితుల సిద్ధాంతం) నియమించిన దిశనుండి కాక, ఆవలి దిశనుండి మనం ప్రారంభించినందువలన వాళ్లు తప్పుదారి పట్టినారు. యెందుకంటే, మన దేశంలో రాజకీయ సాంఘిక విప్లవం సాంస్కృతిక విప్లవంకంటె ముందు వచ్చింది — యే సాంస్కృతిక విప్లవం యిప్పుడు మనల్ని యెదుర్కొంటున్నదో సరిగ్గా ఆ సాంస్కృతిక విప్లవంకంటె ముందు.

మన దేశాన్ని పూర్తిగా సోషలిస్టు దేశంగా చేయడానికి యిప్పుడు యీ సాంస్కృతిక విప్లవం చాలు; కానీ అది అపారమైన కష్టాలను యెదుటబెడుతున్నది, కేవలం సాంస్కృతిక స్వభావం గలవాటినీ (మనం నిరక్షరులం గనుక), భౌతిక స్వభావం గలవాటినీ (యెందుకంటే, సంస్కృతీ సంపన్నం కావడానికి మనం కొంత భౌతిక ఉత్పత్తి సాధనాల అభివృద్ధిని సాధించాలి, ఒక భౌతిక ప్రాతిపదికను కలిగి వుండాలి).

జనవరి 6, 1923

'ప్రావ్దా' సం. 115, 116
1923 మే 26, 27

# తక్కువే మేలు, కానీ మేలుగా వుండాలి

మన రాజ్యయంత్రాంగాన్ని మెరుగుపరిచే విషయంలో, నా అభిప్రాయంలో, 'కార్మిక కర్షక తనిఖీ' పరిమాణం కొరకు కష్టపడడం గానీ, తొందరపడడం గానీ చేయకూడదు. యింతవరకు మనం మన రాజ్యయంత్రాంగపు సమర్థతకు యెంత తక్కువ ఆలోచనా, శ్రద్ధా అర్పించినామంటే, యిప్పుడు దాని సమగ్ర నిర్మాణాన్ని సాధించడానికి మనం ప్రత్యేక జాగ్రత్త వహించి, నిజంగా కాలానికి వెనుకబడని, అనగా ఉత్తమ పశ్చిమ యూరపియన్ ప్రమాణాలకు తక్కువ కాని, కార్యకర్తల సిబ్బందిని 'కార్మిక కర్షక తనిఖీ'లో సాంద్రీకరిస్తే అది పరమ న్యాయంగా వుంటుంది. సోషలిస్టు రిపబ్లిక్కుకు, సహజంగానే, యీ షరతు మరీ మితమైనది. కానీ, మన అయిదేండ్ల అనుభవం మన తలకాయలనిండా అపనమ్మకాన్నీ, సందేహాన్నీ కూరింది. ''కార్మికవర్గ'' సంస్కృతిని గురించి మరీ దీర్ఘంగా, మరీ తేలికగా మాట్లాడేవాళ్లపట్ల అలాంటి భావాలు కలిగినాయి. ప్రారంభంలో మనం నిజమైన బూర్జువా సంస్కృతితో తృప్తిచెందవచ్చు; ప్రారంభంలో, మొరటు బూర్జువా పూర్వపు రకాల సంస్కృతిని, అనగా బ్యూరాక్రటిక్ సంస్కృతీ, ఫ్యూడల్ దాస్య సంస్కృతీ, వగైరాలను, తొలగించుకోవడంతో తృప్తి చెందవచ్చు. సాంస్కృతిక విషయాలలో తొందరా, మూకుమ్మడి చర్యలూ అత్యంత హానికరం. మన యువ రచయితలూ, కమ్యూనిస్టులూ చాలామంది యీ విషయాన్ని బాగా తమ బుర్రల్లోకి యెక్కించుకోవాలి.

కనుక, మన రాజ్యయంత్రాంగం విషయంలో, మరింత నెమ్మదిగా ముందుకు పోవడం మేలని మన గత అనుభవంద్వారా యిప్పుడు మనం నిర్ధారణ లాగాలి.

మన రాజ్యయంత్రాంగం దౌర్భాగ్యంగా వుందనక పోయినా, యెంత శోచనీయంగా వుందంటే, దాని లోపాలతో యెలా పోరాడవలసిందీ మొదట మనం అతి జాగ్రత్తగా

ఆలోచించాలి — యే గతం కూలదోయబడినప్పటికీ యింకా ఓడింపబడలేదో, యే గతం సుదూర భూతకాలంలోకి నిర్గమించిన సంస్కృతి స్థాయికి యింకా చేరలేదో, ఆ గతంలో యీ లోపాలు వేర్లు పాతుకొనివున్నాయనే విషయం మనసులో పెట్టుకొని. సంస్కృతిని గురించి ఉద్దేశపూర్వకంగా మాట్లాడుతున్నాను. యెందుకంటే, యీ విషయాలలో, మన సంస్కృతిలోనూ, మన నిత్య జీవితంలోనూ, మన అలవాట్లలోనూ విడదీయరాని భాగమైనదానిని మాత్రమే సాధింపబడినదిగా మనం పరిగణించగలం. మన సామాజిక వ్యవస్థలోని మంచి సక్రమంగా అధ్యయనం చేయబడలేదు, అర్థంచేసుకోబడలేదు, జీర్ణంచేసుకోబడలేదు, అని మనం అనవచ్చు; అది తొందరపాటుగా గ్రహించబడింది, అది సరిచూడబడలేదు, పరీక్షించి చూడబడలేదు, అనుభవంచేత ధ్రువపరచబడలేదు, స్థిరమైనదిగా చేయబడలేదు, వగైరా. నిజమే, విప్లవ కాలంలో, కేవలం అయిదేండ్లలో మనం జారిజంనుండి సోవియట్ వ్యవస్థకు మారగలిగినంత మహావేగంతో అభివృద్ధి జరిగిన దశలో, అది మరొకవిధంగా వుండజాలదు.

దీన్ని గురించి మనం యేదో ఒకటి చేయవలసిన సమయం వచ్చింది. మితిమీరిన వేగం గల పురోగమనమూ, డంబమూ, వగైరాలపట్ల మనం ఆరోగ్యకరమైన అపనమ్మకం చూపించాలి. ప్రతి గంటా మనం యే ముందడుగులు ప్రకటిస్తున్నామో, ప్రతి నిముషమూ మనం యే ముందడుగులు వేస్తున్నామో, ప్రతి క్షణమూ మనం యే ముందడుగులు నిరర్థకమైనవనీ, పైపైవి అనీ, అపార్థం చేసుకోబడినవనీ రుజువు చేస్తున్నామో ఆ ముందడుగులను పరీక్షించి చూసుకోవడం గురించి మనం ఆలోచించాలి. యిక్కడ అత్యంత హానికరమైనది తొందర. యిక్కడ అత్యంత హానికరమైనది మనకు కనీసం కొంతైనా తెలుసుననే ఊహమీద, లేదా నిజంగా నూతనమైన రాజ్యయంత్రాంగాన్ని, సోషలిస్టు, సోవియట్, వగైరా అని అనడానికి నిజంగా యోగ్యమైనదానిని, నిర్మించడానికి అవసరమైన అంశాలు గణనీయమైన సంఖ్యలో మనకు వున్నాయనే ఊహమీద ఆధారపడడం.

అలాంటి యంత్రాంగం, దాని అంశాలు కూడా మనకు అపహాస్యకరమైనంత తక్కువగా వున్నాయి. దానిని నిర్మించడానికి కాలాన్ని వినియోగించడంలో మనం లోభపడకూడదనీ, దానికి చాలా చాలా యేండ్లు పట్టుతుందనీ మనం జ్ఞాపకం పెట్టుకోవాలి.

యీ యంత్రాంగాన్ని నిర్మించడానికి మనకు యే అంశాలు వున్నాయి? రెండే. మొదటిది, సోషలిజం కొరకు జరిగే పోరాటంలో లీనమైన కార్మికులు. యీ అంశాలు తగినంత విద్యావంతులు కాదు. వాళ్లు మనకోసం మేలైన యంత్రాంగాన్ని నిర్మించగోరుతారు, కానీ నిర్మించడం వాళ్లకు తెలియదు. వాళ్లు నిర్మించలేరు. దీనికి అవస

రమైన సంస్కృతిని వాళ్లు అభివృద్ధి చేసుకోలేదు, మరి దీనికి కావలసింది సంస్కృతి. వేగంతో, దాడితో, చొరవతో, ఉత్సాహంతో, లేక సాధారణంగా యే ఉత్తమ మానవ గుణంతోనైనా పనులు చేయడంద్వారా యీ విషయంలో యేమీ సాధింపబడదు. రెండవది, మనకు జ్ఞానమూ, విద్యా, శిక్షణా గల అంశాలు వున్నాయి, కానీ యితర అన్ని దేశాలతోనూ పోలిస్తే అవి అపహాస్యకరమైనంత అరకొరగా వున్నాయి.

మన జ్ఞానలోపాన్ని ఉత్సాహమూ, తొందరా, వగైరాలతో పూరించడానికి (లేదా, పూరించగలమని ఊహించడానికి) మనం మరీ అభిముఖంగా వున్నామనే విషయాన్ని యిక్కడ మనం మరిచిపోకూడదు.

మన రాజ్యయంత్రాంగాన్ని పునర్నవం చేయడానికి మనం యెంత కష్టమైనప్పటికీ నేర్చుకోవాలి, ముమ్మాటికీ నేర్చుకోవాలి, ఆ తరువాత ఆ జ్ఞానం శుష్క పాండిత్యం కాకుండానూ, ఫాషనబుల్ పడికట్టు మాట కాకుండానూ (అతి తరుచుగా మనకు యిలా అవుతుందని మోమోటం లేకుండా మనం ఒప్పుకోవాలి), మన జీవితంలో నిజంగా ఒక భాగం అయ్యేటట్లూ, మన నిత్య జీవితంలో వాస్తవంగా, పూర్తిగా ఒక భాగం అయ్యేటట్లూ చూసుకోవాలి. టూకీగా చెప్పాలంటే, బూర్జువా పశ్చిమ యూరప్ చేసే డిమాండ్లు మనం చేయకూడదు, సోషలిస్టు దేశంగా అభివృద్ధి కావడానికి పూనుకున్న దేశానికి ఉచితమూ, యోగ్యమూ అయిన డిమాండ్లు మనం చేయాలి.

పైదానినుండి లాగవలసిన నిర్ధారణలు యివి: 'కార్మిక కర్షక తనిఖీ'ని మనం నిజంగా ఆదర్శప్రాయమైన సంస్థగా, మన రాజ్యయంత్రాంగాన్ని మెరుగుపరిచే సాధనంగా చేయాలి.

మనం కోరే ఉన్నత స్థాయిని అది అందుకోడానికి వీలుగా మనం యీకింది నియమాన్ని పాటించాలి: ''మూడు సార్లు కొలిచి ఒక సారి కత్తిరించు.''

దీనికిగాను మన సామాజిక వ్యవస్థలోని అత్యుత్తమమైనదాన్ని మనం వినియోగించుకోవాలి; కొత్త ప్రజా కమిస్సారియట్‌ను నిర్మించడానికి దానిని అత్యంత ముందు జాగ్రత్తతో, ఆలోచనతో, జ్ఞానంతో వినియోగించుకోవాలి.

దీనికిగాను మన సామాజిక వ్యవస్థలో మనకు గల అత్యుత్తమ అంశాలు — ఉదాహరణకు, మొదటిది, పురోగామి కార్మికులూ, రెండవది, మాటను చేతగా తీసుకోరనీ, తమ అంతరాత్మకు వ్యతిరేకమైన మాట ఒకటి కూడా మాట్లాడరనీ మనం యెవరిని గురించి హామీ యివ్వగలమో ఆ నిజంగా విజ్ఞాన ప్రబుద్ధులైన అంశాలూ — యే కష్టాన్నైనా ఒప్పుకోడానికి జంకకూడదు, తాము సాధించాలని నిష్ఠగా పెట్టుకొన్న లక్ష్యాన్ని సాధించడానికి యే పోరాటానికైనా జంకకూడదు.

మన రాజ్యయంత్రాంగాన్ని మెరుగుపరచడానికి అయిదేండ్లుగా మనం హడావుడి చేస్తున్నాము; కానీ అది వట్టి హడావుడిగా వుంది, యీ అయిదేండ్లలో నిరుపయోగంగా, నిరర్థకంగా కూడా, హానికరంగా కూడా వుంది. యీ హడావుడి మనం యేదో చేస్తున్నామనే అభిప్రాయాన్ని కలిగించింది, కానీ క్రియలో మన సంస్థలకూ, మన బుర్రలకూ గుదిబండగా వుండింది.

పరిస్థితులను మార్చవలసిన సమయం వచ్చింది.

మనం యీ నియమాన్ని పాటించాలి: తక్కువే మేలు, కానీ మేలుగా వుండాలి. మనం యీ నియమాన్ని పాటించాలి: రెండేండ్లలో, మూడేండ్లలో నయినా, మంచి కార్యకర్తలను సంపాయించడం మేలు, యెవరినీ సంపాయించే ఆశ లేకుండా తొందర పాటుతో పనిచేయడంకంటె.

యీ నియమానికి అంటిపెట్టుకోవడమూ, మన పరిస్థితులలో దీనిని వర్తింపజేయడమూ కష్టంగా వుంటుందని నాకు తెలుసు. దీనికి వ్యతిరేకమైన నియమం వేయి సందులగుండా చొచ్చుకొని వస్తుందని నాకు తెలుసు. బ్రహ్మాండమైన ప్రతిఘటన చేయవలసి వుంటుందనీ, అతిమానుషమైన పట్టుదల అవసరమనీ, కనీసం మొదటి కొద్ది సంవత్సరాలు యీ రంగంలో పని అమానుషమైనంత కష్టంగా వుంటుందనీ నాకు తెలుసు. అయినప్పటికీ, అలాంటి కృషిద్వారా మాత్రమే మనం మన లక్ష్యాన్ని సాధించగలమనీ, మన లక్ష్యాన్ని సాధించడంద్వారా మాత్రమే సోవియట్, సోషలిస్టు, వగైరా, వగైరా పేరుకు నిజంగా యోగ్యమైన రిపబ్లిక్కును మనం సృష్టిస్తామనీ నాకు దృఢ విశ్వాసం కలిగింది.

నా మొదటి వ్యాసంలో ఉదాహరణ రూపంలో నేను ఉటంకించిన అంకెలు * మరీ స్వల్పంగా వున్నాయని చాలామంది పాఠకులు బహుశా అనుకొని వుంటారు. అవి మరీ స్వల్పంగా వున్నాయని రుజువుచేయడానికి చాలా లెక్కాచారాలు చేయవచ్చునని నాకు విశ్వాసం వుంది. కానీ మనం అలాంటివీ, యితరవీ అయిన లెక్కాచారా లన్నిటికంటె ఒక విషయాన్ని మిన్నగా పెట్టాలి: నిజంగా ఆదర్శప్రాయమైన నాణ్యతను పొందాలనే మన కోరికను.

మన రాజ్యయంత్రాంగాన్ని మెరుగుపరచడానికి మనం మనస్ఫూర్తిగా కృషిచేయవలసిన సమయం చివరకు వచ్చిందని నేను అనుకుంటాను; యీ విషయంలో తొందర

---

* 'కార్మిక కర్షక తనిఖీని మనం యెలా పునర్నిర్మించవలసింది' అనే వ్యాసానికి ప్రస్తావన (వి. ఐ. లెనిన్ 'పార్టీ కేడర్ల శిక్షణ' సంపుటి, ''ప్రగతి'' ప్రచురణాలయం, మాస్కో). — సం.

పాటుకంటె హానికరమైనది యేదీ వుండజాలదు. అందుకనే, అంకెలను ఉబికించడా నికి వ్యతిరేకంగా గట్టి హెచ్చరిక చేయాలని వుంది నాకు. నా అభిప్రాయంలో, దీనికి విరుద్ధంగా, యీ విషయంలో అంకెలను మరీ మితంగా యివ్వాలి. ప్రస్తుతం 'కార్మిక కర్షక తనిఖీ'యొక్క ప్రజా కమిస్సారియట్‌కు కించిత్తు అర్హత కూడా లేదని మనం నిర్మొగమాటంగా చెప్పదాం. మన 'కార్మిక కర్షక తనిఖీ'కంటె అధ్వాన్నంగా యే యితర సంస్థలూ నిర్మింపబడలేదనీ, ప్రస్తుత పరిస్థితులలో యీ ప్రజా కమిస్సారియట్ నుండి యేమీ ఆశించలేమనీ అందరికీ తెలుసు. యీ విషయాన్ని మనం స్థిరంగా మనసులో పెట్టుకోవాలి — ప్రథమంగా, ఆదర్శప్రాయమైన సంస్థగా వుండేదీ, ద్వితీయంగా, ప్రతివొక్కరి నిరవధిక విశ్వాసాన్ని చూరగొనేదీ, తృతీయంగా, అంత ఉన్నత స్థాయిలో వుంచబడిన కేంద్ర కంట్రోల్ కమిషన్‌లాంటి సంస్థయొక్క పనిని మనం నిజంగా సమర్థించినామని అన్ని రకాల మనుషులకూ రుజువుచేసేదీ అయిన సంస్థను కొద్ది సంవత్సరాలలోపల సృష్టించాలని మనం నిజంగా కోరితే. నా అభిప్రాయంలో, ఆఫీసు సిబ్బందుల పరిమాణాల గురించిన సాధారణ అంకెల నన్నిటినీ మనం తక్షణం, తిరుగులేకుండా నిరాకరించాలి. ప్రత్యేక జాగ్రత్తతో, అత్యంత కచ్చితమైన పరీక్షల ఆధారంమీద మాత్రమే మనం 'కార్మిక కర్షక తనిఖీ'కి ఉద్యోగులను యెన్నుకోవాలి. నిజంగా, యెలా బడితే అలా పని సాగిస్తూ, కించిత్తు విశ్వాసం కూడా చూరగొనకుండా, తన మాటకు దాదాపు యేమీ విలువ లేకుండా వుండే ప్రజా కమిస్సారియట్‌ను నెల కొల్పడంవల్ల ప్రయోజన మేమిటి? యిప్పుడు మన మనసులో వున్న పునర్నిర్మాణపు పనిని ప్రారంభించడంలో మన ప్రధాన లక్ష్యం దీని నంతటినీ పరిహరించడమని అనుకుంటాను.

కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యులుగా మనం కూర్చుకునే కార్మికులు అనింద్యులైన కమ్యూనిస్టులుగా వుండాలి. వాళ్లకు తమ పని పద్ధతులనూ, లక్ష్యాలనూ నేర్పించడానికి యింకా చాలా కృషి చేయవలసి వుందనుకుంటాను. అంతేగాక, యీ పనిలో తోడ్పడడానికి నిశ్చితమైన సంఖ్యలో కార్యదర్శులు వుండాలి: ఆ పదవులకు నియమించే ముందు వాళ్లను త్రిముఖ పరీక్షకు గురిచేయాలి. చివరి విషయం, అసాధారణ సందర్భాలలో 'కార్మిక కర్షక తనిఖీ' ఉద్యోగులుగా మనం నేరుగా అంగీకరించేవాళ్లు యీకింది అవసరాలకు అనుగుణంగా వుండాలి:

మొదటిది, వాళ్లు కొంతమంది కమ్యూనిస్టులచేత సిఫారస్ చేయబడాలి;

రెండవది, మన రాజ్యయంత్రాంగం గురించిన జ్ఞానంలో పరీక్ష నెగ్గాలి;

మూడవది, మన రాజ్యయంత్రాంగ సిద్ధాంతపు మౌలిక సూత్రాలలోనూ, నిర్వ

హణ, ఆఫీసు రోజువారీ పనీ, వగైరాల మౌలిక సూత్రాలలోనూ వాళ్ళు పరీక్ష నెగ్గాలి;

నాల్గవది, వాళ్ళు కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యులతోనూ, తమ సొంత కార్య దర్శివర్గ సభ్యులతోనూ యెంత గాఢ సుసమన్వయంతో పనిచేయాలంటే, మొత్తం యంత్రాంగపు పనికి మనం హామీ యిచ్చేటంతగా.

యీ అవసరాలు అసాధారణమైనంత కఠినంగా వున్నాయని నాకు తెలుసు; 'కార్మిక కర్షక తనిఖీ'లోని ''ఆచరణవాద'' కార్మికులలో మెజారిటీ యీ అవసరాలు అనాచరణీయమని అంటారని, లేదా వాటిని అవహేళన చేస్తారని నాకు చాలా భయంగా వుంది. కానీ, 'కార్మిక కర్షక తనిఖీ'యొక్క ప్రస్తుత అధిపతులలో యెవరినైనా, లేక ఆ సంస్థతో సంబంధం గల యెవరినైనా నేను అడుగుతాను, 'కార్మిక కర్షక తనిఖీ' లాంటి ప్రజా కమిస్సారియట్‌వల్ల ప్రయోజనాన్ని చిత్తశుద్ధితో నాకు చెప్పగలరా అని. తమ యుక్తాయుక్త జ్ఞానాన్ని తిరిగి పొందడానికి వాళ్లకు యీ ప్రశ్న తోడ్పడుతుందని అనుకుంటాను. 'కార్మిక కర్షక తనిఖీ' అనే యీ నిరాశామయ వ్యవహారానికి మనం చేసిన అనేక పునర్నిర్మాణాలకు మరొకటి కలపడం నిష్ప్రయోజనం అవుతుంది, లేదా నిజంగా ఆదర్శప్రాయమైనదాన్ని, తన పేరువలనా, పదవివలనా కాక, తన యోగ్యతలవలన అందరి గౌరవాన్నీ చూరగొనేదాన్ని, కష్టమైన, అసాధారణమైన, నిదానపు పద్ధతుల ద్వారా, యీ పద్ధతులను పదేపదే పరీక్షించడంద్వారా సృష్టించడానికి నిజంగా పూనుకోవాలి.

మనం ఓర్పు వహించకపోతే, మనం యీ కర్తవ్యానికి కొన్ని సంవత్సరాలు వినియోగించకపోతే, దీనిని మనం అసలు తగలక పోవడం మేలు.

మనం యెంతో తొందరపాటుతో నిర్మించిన శ్రమ పరిశోధనకు చెందిన ఉన్నత సంస్థలూ, వగైరాలను, నా అభిప్రాయంలో, కనీస సంఖ్యలో యేరుకొని, అవి సక్రమంగా నిర్మించబడినాయా లేదా అని చూసి, అవి పనిచేయడం కొనసాగించనివ్వాలి — కానీ ఆధునిక శాస్త్రపు ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగానూ, దాని ప్రయోజనాల నన్నిటినీ మనకు యిచ్చేటట్లుగానూ. మనం ఆ పని చేస్తే, తన కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించగలదీ, మన రాజ్యయంత్రాంగాన్ని మెరుగుపరచడానికి క్రమపద్ధతిగా, స్థిరంగా పనిచేయగలదీ అయిన సంస్థ, కార్మికవర్గంయొక్క, రష్యన్ కమ్యూనిస్టు పార్టీయొక్క, మన రిపబ్లిక్ ప్రజానీక మంతటియొక్క విశ్వాసంచేత బలపరచబడిన సంస్థ, మనకు కొద్ది యేండ్లలో వుంటుందని ఆశించడం ఊహాస్వర్గం కాదు.

దీనికి సన్నాహక చర్యలు వెంటనే ప్రారంభించవచ్చు. 'కార్మిక కర్షక తనిఖీ'యొక్క ప్రజా కమిస్సారియట్ ప్రస్తుత పునర్నిర్మాణ పథకాన్ని అంగీకరిస్తే, అది వెంటనే

సన్నాహక చర్యలు తీసుకొని, కర్తవ్యం పూర్తి అయిందాకా క్రమపద్ధతిగా పనిచేయవచ్చు, తొందరపాటు లేకుండా, యిప్పటికే చేసినదానిని మార్చడానికి వెనుకాడకుండా.

అర్ధ పరిష్కారం యేదైనా యీ విషయంలో అత్యంత హానికరంగా వుంటుంది. 'కార్మిక కర్షక తనిఖీ' సిబ్బంది పరిమాణానికి యే యితర పరిగణనమీదనైనా ఆధార పడిన చర్య, వాస్తవంలో, పాత బ్యూరాక్రటిక్ పరిగణనలమీదా, పాత దురభిప్రాయాల మీదా, యిప్పటికే అభిశంసింపబడినదీ, సార్వత్రికంగా అపహసింపబడినదీ, వగైరా అయినదానిమీదా ఆధారపడుతుంది.

విషయంయొక్క సారాంశం యిది:

రాజ్య నిర్మాణం గురించి మనం నిజంగా కొంత నేర్చుకున్నామనైనా యిప్పుడు రుజువుచేయాలి (అయిదేండ్లలో మనం యేదో కొంత నేర్చుకొనివుండాలి), లేదా మనం దానికి తగినంత పరిణతి చెందలేదనైనా రుజువుచేయాలి. రెండవది నిజమైతే, ఆ కర్తవ్యానికి మనం పూనుకోకపోవడం మేలు.

లభ్యమైన మానవ సంపదతో కనీసం ఒక ప్రజా కమిస్సారియట్‌నైనా క్రమ పద్ధతిగా పునర్నిర్మించగలగడానికి చాలినంత మనం నేర్చుకున్నామని అనుకోవడం అవి నమ్రత కాదని అనుకుంటాను. నిజం, యీ ఒక్క ప్రజా కమిస్సారియట్ మొత్తం మన రాజ్యయంత్రాంగానికి నమూనాగా వుండవలసి వుంటుంది.

సాధారణంగా శ్రమ నిర్మాణంమీదా, ప్రత్యేకంగా నిర్వహణమీదా రెండు గానీ, యెక్కువ గానీ టెక్స్టు బుక్కుల రచనలో మనం వెంటనే ఒక పోటీని ప్రకటించాలి. యెర్మాన్స్కీచేత యిప్పటికే ప్రచురింపబడిన పుస్తకాన్ని మనం ఆధారంగా తీసుకో వచ్చు — అతను స్పష్టంగా మెన్షివిజంపట్ల సానుభూతి కలిగివున్నాడనీ, సోవియట్ వ్యవస్థకు టెక్స్టు బుక్కులు రచించడానికి తగడనీ చెప్పవలసి వున్నప్పటికీ. కేర్జెన్‌త్సెవ్‌యొక్క యిటీవలి పుస్తకాన్ని కూడా మనం ఆధారంగా తీసుకోవచ్చు; లభ్యమయ్యే యితర పాక్షిక టెక్స్టు బుక్కులలో కూడా కొన్ని ఉపయోగకరంగా వుండవచ్చు.

సాహిత్యాన్ని ప్రోగుచేయడానికీ, యీ సమస్యను అధ్యయనం చేయడానికీ మనం విద్యాయోగ్యతలూ, చిత్తశుద్ధీ గల కొంతమందిని జర్మనీకి గానీ, బ్రిటన్‌కు గానీ పంపాలి. నేను బ్రిటన్ అంటున్నది, అమెరికాకు గానీ, కెనడాకు గానీ మనుషులను పంపడానికి సాధ్యం కాని పక్షంలో.

'కార్మిక కర్షక తనిఖీ'లో ఉద్యోగులుగా చేరేవాళ్లకు పరీక్షలు పెట్టడానికి ప్రాథ మిక కార్యక్రమం తయారు చేయడానికి మనం ఒక కమిషన్‌ను నియమించాలి; కేంద్ర కంట్రోల్ కమిషన్ అభ్యర్థులకు కూడా అలాగే.

యీ చర్యలూ, యిలాంటివీ, సహజంగానే, 'కార్మిక కర్షక తనిఖీ'యొక్క ప్రజా కమిస్సార్‌కు గానీ, కాలేజియంకు గానీ, కేంద్ర కంట్రోల్ కమిషన్ అధ్యక్షవర్గానికి గానీ యేమీ కష్టాలు కలిగించవు.

అదే సమయంలో, కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యత్వానికి అభ్యర్థులను యెన్ను కోడానికి ఒక సన్నాహక కమిషన్‌ను నియమించాలి. అన్ని ప్రభుత్వ శాఖలలోనూ అను భవం గల కార్మికులనుండీ అలాగే సోవియట్ ఉన్నత పాఠశాలల విద్యార్థులనుండీ యీ సభ్యత్వానికి అవసరమైనంతకంటె యెక్కువమందిని యిప్పుడు మనం కనుక్కోగల మని నేను ఆశిస్తున్నాను. పై రెండు వర్గాలలో యే వర్గాన్నైనా ముందుగానే మినహాయిం చడం ఉచితంగా వుండదు. బహుశా యీ సంస్థలో మిశ్రమ అంగనిర్మాణానికి మొగ్గు యివ్వవలసి వుంటుంది; అందులో అనేక లక్షణాలూ, పోలికలేని యోగ్యతలూ కలిసివుం డాలి. పర్యవసానంగా, అభ్యర్థుల పట్టీ తయారుచేయడానికి బోలెడు పని చేయవలసి వుంటుంది. ఉదాహరణకు, కొత్త ప్రజా కమిస్సారియట్ సిబ్బందిలో ఒకే రకం మను షులు — ప్రభుత్వోద్యోగులు మాత్రమే అనుకుందాం — వుండడం గానీ, ప్రచారక రకా నికి చెందినవాళ్లను, లేదా పదిమందిలో కలవడం, యీ రంగంలో ప్రభుత్వోద్యోగులకు పూర్తిగా అనవాయితీ కాని బృందాలలోకి చొచ్చుకపోయే సామర్థ్యం, వగైరా ప్రధాన గుణంగా గలవాళ్లను అందులోనుండి మినహాయించడం గానీ అన్నిటికంటె తక్కువ అభిలషణీయంగా వుంటుంది.

* * *

నా పథకాన్ని అకడెమిక్ సంస్థల పథకంతో పోలిస్తే, నా భావాన్ని అత్యుత్తమంగా వ్యక్తంచేయగల ననుకుంటాను. కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు, తమ అధ్యక్షవర్గం యొక్క మార్గదర్శకత్వం కింద, పొలిట్ బ్యూరో కాగితాలనూ, పత్రాలనూ అన్నిటినీ క్రమపద్ధతిగా పరీక్షించాలి. అంతేగాక, వాళ్లు అతి చిన్న, అముఖ్య ఆఫీసులు మొదలుకొని అత్యంత పెద్ద ప్రభుత్వ సంస్థలదాకా వున్న మన సంస్థల రోజువారీ పనిని పరిశీలన చేయడంలోని వివిధ పనులమధ్య తమ కాలాన్ని సరిగా విభజించుకోవాలి. చివరి విషయం, వాళ్ల కర్తవ్యాలలో సిద్ధాంత అధ్యయనమూ — అనగా, తాము అంకితం కాదలచుకొన్న పనియొక్క యేర్పాటుకు సంబంధించిన సిద్ధాంతపు అధ్యయనమూ — పాత కామ్రేడ్ల యొక్క, లేదా శ్రమ నిర్మాణపు ఉన్నత విద్యా సంస్థల అధ్యాపకులయొక్క మార్గదర్శ కత్వంకింద ఆచరణాత్మక పనీ యిమిడివుండాలి.

కానీ, యిలాంటి అకడెమిక్ పనికి వాళ్లు పరిమితం కాగలరని నేను అనుకోవడం లేదు. దీనికి తోడు, దొంగ వెధవలను అని అనను గానీ, అలాంటివాళ్లను పట్టుకోడానికీ,

వాళ్ల చర్యలూ, ధోరణీ, వగైరాలను పరీక్షించడానికి ప్రత్యేకమైన పన్నాగాలు పన్నడానికీ తర్ఫీదు అని దేనిని పిలవడానికి నేను వెనుకాడనో ఆ పనికి వాళ్ళు తయారుకావలసి వుంటుంది.

పశ్చిమ యూరపియన్ ప్రభుత్వ సంస్థలలో యిలాంటి ప్రతిపాదనలు చేస్తే, అవి తీవ్రమైన నిరసనా, నైతిక ఆగ్రహమూ, వగైరాలను కలిగిస్తాయి; కానీ అలాంటివి చేతనయ్యేటంత బ్యూరాక్రటిక్‌గా మనం తయారుకాలేదని నమ్ముతున్నాను. యెవరినైనా పట్టుకోవడం అనే భావానికి మనలో యెవరైనా నిర్ఘాంతపడేటంతగా నూతన ఆర్థిక విధానం యింకా గౌరవాన్ని పొందలేదు. మన సోవియట్ రిపబ్లిక్ యెంత యిటీవలి నిర్మాణమంటే, చుట్టూ యింకా పాత పనికిరాని సామాను గుట్టలు యెంతవి వున్నాయంటే, పన్నాగాలద్వారానూ, ఒకోసారి సుదూరపు మూలాలకో, చుట్టుదారిలోనో ప్రయోగింపబడే దర్యాప్తులద్వారానూ మనం వాటిలోకి దూరవలసి వుంటుందనే భావానికి నిర్ఘాంతపడాలని యెవరికీ తోచదు. దీనికి నిర్ఘాంతపడాలని యెవరికైనా తోస్తే కూడా, అలాంటివాడు నవ్వులపా లౌతాడని నిశ్చయంగా చెప్పవచ్చు.

ఫ్రెంచివాళ్లు pruderie అనేదాన్ని, అనగా అపహాస్యకరమైన పెద్దమనిషి భంగిమను, లేదా అపహాస్యకరమైన ఆడంబరాన్ని, మనల్ని పూర్తిగా సోవియట్ బ్యూరాక్రసీ కిందికీ, పార్టీ బ్యూరాక్రసీ కిందికీ లాక్కుపోయేదాన్ని, మన కొత్త 'కార్మిక కర్షక తనిఖీ' విసర్జిస్తుందని ఆశిద్దాం. సోవియట్ సంస్థలలోనే కాక మన పార్టీ సంస్థలలో కూడా బ్యూరాక్రట్లు వున్నారని చెప్పాలి.

ఉన్నత శ్రమ నిర్మాణపు విద్యా సంస్థల్లోనూ, వగైరాలలో మనం అధ్యయనం చేయాలనీ, కష్టపడి అధ్యయనం చేయాలనీ నేను పైన అన్నప్పుడు, పాఠశాల పద్ధతిలో ''అధ్యయనం చేయాలని'' నేను అనుకోనేలేదు, పాఠశాల పద్ధతిలో మాత్రమే చేసే అధ్యయనానికి నేను పరిమితం కాలేదు కూడా. ''అధ్యయనం''లో యేవైనా అర్ధహాస్యకరమైన జిత్తులూ, కుయుక్తితో కూడిన పన్నాగాలూ, టక్కరితనమూ, లేదా అలాంటిదీ కలిసివుంటాయని గ్రహించడానికి యీ సందర్భంలో నేను నిరాకరిస్తానని నిజమైన విప్లవకారు డొక్కడు కూడా అనుమానించడని నేను ఆశిస్తున్నాను. నిబ్బరపు, నిష్ఠాపూర్వక పశ్చిమ యూరప్ రాజ్యాలలో అలాంటి భావం మనుషులను నిర్ఘాంతపరుస్తుందనీ, మర్యాదస్తుడైన ప్రభుత్వోద్యోగి యెవ్వడూ దీనిని మనసులోకి కూడా రానివ్వడనీ నాకు తెలుసు. అయినప్పటికీ, మన మింకా అంత బ్యూరాక్రటిక్‌గా తయారు కాలేదనీ, మనమధ్య దీనిమీద చర్చ వినోదాన్నితప్ప, అంతకు మించినదానిని కలిగించదనీ ఆశిస్తున్నాను.

నిజంగా, ఉపయోగంతో ఆహ్లాదాన్ని యెందుకు కలపకూడదు? యేదైనా అప

హాస్యకరమైనదానిని, హానికరమైనదానివి, అర్ధ అపహాస్యకరమైనదానిని, అర్ధ హానికర మైనదానిని, వగైరాను గుట్టుకడగడానికి యేదైనా హాస్యకరమైన, లేదా అర్ధ హాస్య కరమైన జిత్తుకు మనం యెందుకు దిగకూడదు?

మన 'కార్మిక కర్షక తనిఖీ' యీ భావాలను పరిశీలించడానికి పూనుకుంటే, అది యెంతో లాభపడుతుందనీ, మన కేంద్ర కంట్రోల్ కమిషనూ, 'కార్మిక కర్షక తనిఖీ'లోని దాని సహోద్యోగులూ తమ అత్యంత ఉజ్వల విజయాలలో కొన్నిటిని సాధించిన సందర్భాల పట్టే మన భావి 'కార్మిక కర్షక తనిఖీ'యొక్క, కేంద్ర కంట్రోల్ కమి షన్‌యొక్క సభ్యులు పెద్ద మనిషి తరహాలో వున్న నిబ్బరమైన టెక్స్టు బుక్కులలో ప్రస్తావించరాని సందర్భాలలో సాధించే అనేక విజయాలచేత సంపన్నం చేయబడుతుందనీ నాకు అనిపిస్తుంది.

* * *

ఒక పార్టీ సంస్థ ఒక సోవియట్ సంస్థతో యెలా సమ్మేళనం చేయబడగలదు? యీ సూచనలో యేదో అనుచితమైనది లేదా?

యీ ప్రశ్నలు నేను నా తరఫున అడగడం లేదు; మన పార్టీ సంస్థలలోనూ, అలాగే సోవియట్ సంస్థలలోనూ బ్యూరాక్రట్లు వున్నారని నేను అన్నప్పుడు పైన నేను యెవరిని ఉద్దేశించినానో వాళ్ల తరఫున అడుగుతున్నాను.

కానీ, నిజంగా, మన పనికి ప్రయోజనకరంగా వుంటే, ఆ రెంటినీ మనం యెం దుకు సమ్మేళనం చేయకూడదు? మొట్టమొదటనే అలాంటి సమ్మేళనం జరిగిన విదేశ వ్యవహారాల ప్రజా కమిస్సారియట్ విషయంలో అది చాలా ఉపయోగకరంగా వుండడం మన కందరికీ కనపడడం లేదా? విదేశాల ''యెత్తు''లకు ప్రతిగా, వాళ్ల కుయుక్తిని (అంతకంటె తక్కువ మర్యాదకరమైన పదం మనం ఉపయోగించరాదని అనుకుంటే) ముందుగానే అరికట్టడానికి, మనం చేయవలసిన ''యెత్తు''లకు సంబంధించిన అనేక ముఖ్య, అముఖ్య సమస్యలను పొలిట్ బ్యూరో పార్టీ దృక్కోణంనుండి చర్చించదా? ఒక సోవియట్ సంస్థను ఒక పార్టీ సంస్థతో చేసిన యీ పట్టువిడుపులు గల సమ్మేళనం మన రాజకీయాలలో గొప్ప బలం యివ్వడం లేదా? యేది తన ఉపయోగకరత్వాన్ని రుజువుచేసుకున్నదో, యేది మన విదేశ రాజకీయాలలో నిశ్చయంగా అవలంబించబడి, యీ రంగంలో యిక యెంతమాత్రమూ సందేహం కలిగించనంతగా ఆనవాయితీ అయిందో, అది మొత్తం మన రాజ్యయంత్రాంగానికి కనీసం అంతే ఉచితంగా వుంటుందని అనుకుంటాను. (యింకా యెక్కువ ఉచితంగా వుంటుందని, వాస్తవంలో, నేను అను

కుంటాను.) 'కార్మిక కర్షక తనిఖీ' కర్తవ్యాలు మొత్తం మన రాజ్యయంత్రాంగానికి వర్తిస్తాయి; దాని కార్యకలాపాల ప్రభావానికి మినహాయింపు లేకుండా ప్రతి రాజ్య సంస్థ గురికావాలి: స్థానిక, కేంద్ర, వాణిజ్య, కేవల పరిపాలనాత్మక, విద్యావిషయిక, చారిత్రక పత్ర, నాటకశాల, వగైరా — ఒక్క మాటలో చెప్పాలంటే, మినహాయింపు లేకుండా అన్ని సంస్థలూ.

కనుక, దేని కార్యకలాపాలకు అంత విస్తృత పరిధి వుందో, అంతేగాక రూపాల విషయంలో దేనికి అంత అసాధారణమైన పట్టువిడుపులు అవసరమో, అది ఒక పార్టీ కంట్రోల్ సంస్థను ఒక సోవియట్ కంట్రోల్ సంస్థతో కలిపే యీ విశిష్టమైన సమ్మేళనాన్ని అవలంబించడానికి యెందుకు అనుమతించకూడదు?

దీనికి అడ్డంకులేవీ నాకు కనపడడం లేదు. అంతేగాక, అలాంటి సమ్మేళనం ఒక్కటే మన పనిలో విజయానికి హామీ అనుకుంటాను. యీ విషయంలో కలిగే సందేహాలన్నీ మన ప్రభుత్వ ఆఫీసులలో అన్నిటికంటె యెక్కువగా బూజుపట్టిన మూలల్లో ఉత్పన్నమౌతున్నాయనీ, అపహాస్యానికి తప్ప మరిదేనికీ అవి తగవనీ నా భావన.

* * *

మరొక సందేహం: విద్యా కార్యకలాపాలను ఆధికారిక కార్యకలాపాలతో కలపడం ఉపయోగకరమా? అది ఉపయోగకరం మాత్రమే కాదు, అవసరం కూడా ననుకుంటాను. మొత్తంమీద, పశ్చిమ యూరపియన్ రాజ్య రూపంపట్ల మనకు విప్లవకర వైఖరి వున్నప్పటికీ, వాటి అత్యంత హానికరమైన, అపహాస్యకరమైన దురభిప్రాయాలలో కొన్నిటిని మన రక్తంలోకి యెక్కనిచ్చినాము; వాటిని కొంతవరకు మన ప్రియమైన బ్యూరాక్రట్లు, యీ దురభిప్రాయాలద్వారా పదేపదే లాభపడగలమని అంచనా వేసుకున్న బ్యూరాక్రట్లు, ఉద్దేశపూర్వకంగా మనలోకి యెక్కించినారు. యీ దురభిప్రాయాలద్వారా వాళ్లు లాభపడినారు కూడా; యెంత విస్తారంగా లాభపడినారంటే, మనలో గుడ్డివాళ్లు మాత్రమే దానిని చూడలేరు.

సాంఘిక, ఆర్థిక, రాజకీయ సంబంధాల రంగాలన్నిటిలోనూ మనం ''మహామహా'' విప్లవకారులం. కానీ అగ్రతాంబూలం విషయంలోనూ, ఆఫీసు నిర్వహణకు సంబంధించిన రూపాలనూ, తతంగాలనూ పాటించే విషయంలోనూ మన ''విప్లవకరత్వం'' తరుచు బూజుపట్టిన రోజువారీ క్రమచర్యకు లోబడుతుంది. సాంఘిక జీవితంలో గొప్ప ముందడుగూ, అత్యంత స్వల్పమైన మార్పులు ప్రతిపాదించబడినప్పుడల్లా అచ్చెరువు కలి

గించేటంత పిరికితనమూ కలిసివుండే ఆసక్తికరమైన ఘటనను ఒకటికంటె యెక్కువ సార్లు మనం గమనించినాము.

యిది సహజమే; యెందుకంటే, అత్యంత ధైర్యపూరితమైన ముందడుగులు వేయబడింది చాలా కాలంగా సిద్ధాంత రంగంలో — యేది ప్రధానంగా, సిద్ధాంతగతంగా, కేవలం సిద్ధాంతగతంగా కూడా, పెంపొందింపబడిందో ఆ రంగంలో. రష్యన్ వ్యక్తి, పనికి దూరంగా వున్నప్పుడు, నిరాశాకరమైన బ్యురాక్రటిక్ వాస్తవాలను మరిచిపోడానికి అసాధారణ సాహసపూరిత సిద్ధాంత నిర్మాణాలలో ఊరట పొందేవాడు; అందువల్లనే మన దేశంలో యీ అసాధారణ సిద్ధాంత సాహసపూరిత నిర్మాణాలు అసాధారణమైనంత వంకరగా వుండినాయి. సాధారణ నిర్మాణాలలో సిద్ధాంత సాహసమూ, రోజువారీ ఆఫీసు పనిలో అతిస్వల్ప సంస్కరణల విషయంలో అచ్చెరువు కలిగించేటంత పిరికితనమూ కలిసివుండినాయి. యే దేశంలోనూ సాటిలేని సాహసంతో ఒక గొప్ప సార్వత్రిక భూ విప్లవం రూపొందించబడింది; అదే సమయంలో, రోజువారీ ఆఫీసు పనిలో పదవ రకం సంస్కరణ రూపొందించవలసి వచ్చినప్పుడు ఊహాశక్తి విఫలమైంది. సాధారణ సమస్యలకు వర్తింపజేసినప్పుడు అంత ''ఉజ్వలమైన'' ఫలితాలు యిచ్చిన సాధారణ సూత్రాలను యీ సంస్కరణకు వర్తింపజేయడానికి ఊహాశక్తి, లేదా ఓర్పు లేకపోయింది.

అందువల్లనే, మన ప్రస్తుత జీవితంలో గుండెలు దీసిన సాహసమూ, స్వల్ప మార్పుల విషయంలో కూడా ఆలోచనా రంగంలో పిరికితనమూ ఆశ్చర్యం కలిగించేటంతగా ఒకదానితో ఒకటి కలిసివున్నాయి.

నిజంగా గొప్ప విప్లవాలన్నిటిలోనూ యిది జరిగిందనుకుంటాను; యెందుకంటే, ఒకవైపున పాతదానికీ, పాతదాని అభివృద్ధిని లక్షించేదానికీ, మరొకవైపున పాతదానిలోని అల్పాతి అల్ప అణువును కూడా కలిగివుండనంత కొత్తదిగా వుండవలసిన కొత్తదాని కోసం చేసే మహా అభౌతికమైన ప్రయత్నానికీ మధ్య వుండే వైరుధ్యాలనుండి నిజంగా గొప్పవైన విప్లవాలన్నీ పెరుగుతాయి.

యిక, విప్లవం యెంత తీవ్రంగా వుంటే, అంత దీర్ఘ కాలం వుంటాయి యీ వైరుధ్యాలలో అనేకం.

* * *

మన ప్రస్తుత జీవితపు సాధారణ లక్షణం యిది: మనం పెట్టుబడిదారీ పరిశ్రమలను ధ్వంసంచేసి, మధ్యయుగ సంస్థలనూ, భూస్వాముల యాజమాన్యాన్నీ నేలమట్టం చేయడానికి మన శక్తికొద్దీ కృషిచేసి, తద్వారా సన్నకారు, అతి సన్నకారు రైతాంగాన్ని సృష్టించినాము; యీ రైతాంగం కార్మికవర్గ నాయకత్వాన్ని అనుసరిస్తున్నది, యెందు

కంటే దాని విప్లవ కృషి ఫలితాలలో దీనికి నమ్మక మున్నది. కానీ, యెక్కువ అభివృద్ధి అయిన దేశాలలో సోషలిస్టు విప్లవం జయించిందాకా కేవలం యీ విశ్వాసం సహాయంతో నిలబడడం సులభం కాదు; యెందుకంటే, ఆర్థిక అవశ్యకత, ముఖ్యంగా నూతన ఆర్థిక విధానంలో, సన్నకారు, అతి సన్నకారు రైతుల శ్రమయొక్క ఉత్పాదకతను అత్యంత హీన స్థాయిలో నిలిపివుంచుతుంది. అంతేగాక, అంతర్జాతీయ సన్నివేశం కూడా రష్యాను వెనక్కి తోసి, మొత్తంమీద ప్రజల శ్రమ ఉత్పాదకతను యుద్ధపూర్వంకంటె గణనీయంగా తక్కువ స్థాయికి తగ్గించింది. పశ్చిమ యూరపియన్ పెట్టుబడిదారీ దేశాలు, కొంత ఉద్దేశపూర్వకంగానూ, కొంత తమకే తెలియకుండానూ, మనల్ని వెనక్కి తోయడానికీ, దేశంలో సాధ్యమైనంత వినాశనాన్ని వ్యాపింపజేయడానికి రష్యాలోని అంతర్యుద్ధ అంశాలను వినియోగించుకోడానికీ చేయవలసిందంతా చేసినాయి. సామ్రాజ్యవాద యుద్ధంనుండి బయటపడే యీ మార్గానికే అనేక సౌకర్యాలు వుండినట్టు కనిపించింది. వాళ్ళ కొంతమేరకు యీ విధంగా తర్కించినారు: ''రష్యాలోని సోషలిస్టు వ్యవస్థను మనం కూలదోయలేకపోతే, యేమైనప్పటికీ సోషలిజంవైపు దాని పురోగతిని అడ్డగిస్తాము.'' మరి, వాళ్ల దృక్పథంనుండి వాళ్ళు మరేవిధంగానూ తర్కించజాలరు. చివరకు వాళ్ల సమస్యలు అర్ధపరిష్కృతమైనాయి. విప్లవం సృష్టించిన నూతన వ్యవస్థను వాళ్ల కూలదోయలేకపోయినారు; కానీ వాళ్ళ యే ముందడుగు సోషలిస్టుల జోస్యాలను రుజువుచేసి వుండేదో, యే ముందడుగు సోషలిస్టులు అపారమైన వేగంతో ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయడానికీ, యేవి మొత్తంగా కలిపితే సోషలిజంను ఉత్పత్తిచేసివుండేవో ఆ గుప్తశక్తుల నన్నిటినీ అభివృద్ధి చేయడానికీ వీలు కలిగించివుండేదో ఆ ముందడుగు వెంటనే వేయకుండా ఆ నూతన వ్యవస్థను అడ్డగించినారు. ఆ గుప్తశక్తులు అభివృద్ధి అయివుంటే, సోషలిస్టులు అందరికీ రుజువు చేసివుండేవాళ్ళు, బ్రహ్మాండమైన శక్తులను సోషలిజం తనలోనే కలిగివుందనీ, అసాధారణంగా ఉజ్వలమైన భవితవ్యం గల నూతన అభివృద్ధి దశలో మానవజాతి యిప్పుడు ప్రవేశించిందనీ.

యిప్పుడు యేర్పడిన అంతర్జాతీయ సంబంధాల వ్యవస్థ యెలాంటిదంటే, ఒక యూరపియన్ రాజ్యమైన జర్మనీని విజేతరాజ్యాలు బానిసను చేసిన వ్యవస్థ యిది. అంతేకాక, అనేక రాజ్యాలు — పశ్చిమ దేశాల్లో అత్యంత పురాతనమైనవి — తమ విజయాన్ని వినియోగించుకొని తమ పీడిత వర్గాలకు అనేక చిల్లర సౌకర్యాలు కలిగించగల స్థితిలో వున్నాయి; ఆ సౌకర్యాలు చిల్లరవే అయినప్పటికీ, ఆ దేశాల్లో విప్లవోద్యమాన్ని మందగింపజేస్తాయి; ''సామాజిక శాంతి'' యేర్పడిందన్న భ్రమను కొంత కలిగిస్తాయి.

అదే సమయంలో, సరిగ్గా గత సామ్రాజ్యవాద యుద్ధ ఫలితంగా, అనేక ప్రాచ్య దేశాలు — భారతదేశం, చైనా, వగైరాలు — తమ పాత గాడినుండి పూర్తిగా బయటికి నెట్టబడినాయి. వాటి అభివృద్ధి నిశ్చయంగా సాధారణ యూరపియన్ పెట్టుబడిదారీ పద్ధతులకు మారింది, సాధారణ యూరపియన్ అంతర్గత అస్తిమితం వాటికి అంటుకుంటున్నది. యావత్ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క సంక్షోభానికి విధిగా దారితీసే అభివృద్ధి ప్రక్రియలోకి అవి లాగబడినాయని యిప్పుడు సర్వ ప్రపంచానికీ స్పష్టమైంది.

కనుక, యిప్పుడు మనకొక ప్రశ్న యెదురైంది: పశ్చిమ యూరపియన్ పెట్టుబడిదారీ దేశాలు సోషలిజంవైపు తమ అభివృద్ధిని పూర్తిచేస్తూ వుండగా, మనం మన చిన్న రైతుల, అతి చిన్న రైతుల ఉత్పత్తిలో, అందులోనూ మన ప్రస్తుత సర్వనాశన స్థితిలో, నిలబడగలమా? కానీ ఆ దేశాలు మనం ముందు అనుకున్నట్లు తమ అభివృద్ధిని పూర్తిచేయడం లేదు. క్రమంగా సోషలిజం "పక్వం కావడం" ద్వారా అవి తమ అభివృద్ధిని పూర్తిచేయడం లేదు. కొన్ని దేశాలను మరికొన్ని దోపిడీ చేయడం ద్వారా, సామ్రాజ్యవాద యుద్ధంలో ఓడిపోయిన మొదటి దేశాన్నీ, మొత్తం ప్రాచ్య దేశాలనూ దోపిడీ చేయడంద్వారా, అవి తమ అభివృద్ధిని పూర్తిచేస్తున్నాయి. మరోవైపున, సరిగ్గా మొదటి సామ్రాజ్యవాద యుద్ధ ఫలితంగానే, ప్రాచ్య దేశాలు నిశ్చయంగా విప్లవోద్యమంలో కలిసినాయి, ప్రపంచ విప్లవోద్యమం అనే సార్వత్రిక సుడిగుండంలోకి నిశ్చయంగా లాక్కోబడినాయి.

యీ సన్నివేశంలో మన దేశానికి తగిన యెత్తుగడలు యేమిటి? స్పష్టంగా యివి: మన కార్మిక ప్రభుత్వాన్ని నిలబెట్టుకోడానికీ, చిన్న రైతులమీదా, అతి చిన్న రైతులమీదా ఆ ప్రభుత్వం తన నాయకత్వాన్నీ, అర్హతనూ నిలుపుకునేటట్లు చేయడానికి మనం అత్యంత జాగరూకత ప్రదర్శించాలి. మనకున్న సౌకర్యం యేమిటంటే, యావత్ ప్రపంచమూ యిప్పటికే ప్రపంచ సోషలిస్టు విప్లవానికి దారితీయక తప్పని ఉద్యమంలోకి ప్రవేశిస్తున్నది. కానీ, మనకొక అసౌకర్యం కూడా వుంది. యేమిటంటే: సామ్రాజ్యవాదులు మొత్తం ప్రపంచాన్ని రెండు శిబిరాలుగా చీల్చగలిగినారు; నిజంగా పురోగామి, సంస్కృతీ సంపన్న, పెట్టుబడిదారీ అభివృద్ధి గల దేశమైన జర్మనీకి మళ్లీ లేచి నిలబడడం అత్యంత కష్టంగా వుండడం అనే పరిస్థితివల్ల యీ చీలిక మరింత జటిలం చేయబడింది. పాశ్చాత్య పెట్టుబడిదారీ రాజ్యాలన్నీ దాన్ని పొడుచుక తింటూ, లేవలేకుండా చేస్తున్నాయి. మరోవైపున, నరక యాతన అనుభవిస్తున్న కోటానుకోట్ల పీడిత శ్రమజీవులు గల ప్రాచ్య దేశాలు యావత్తూ యెలాంటి స్థితిలోకి నెట్టబడినాయంటే, వాటి భౌతిక, పాదార్థిక శక్తి పశ్చిమ యూరపియన్ రాజ్యాలలో చాలా చిన్నవాటిలో

యే ఒక్కదాని భౌతిక, పాదార్థిక, సైనిక శక్తితోనూ పోల్చడానికి వీలులేదు.

యీ సామ్రాజ్యవాద దేశాలతో రానున్న ఘర్షణను మనం నివారించగలమా? సంపన్నవౌతున్న ప్రాచ్య సామ్రాజ్యవాద దేశాలకూ సంపన్నవౌతున్న పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలకూ మధ్యగల ఆంతరంగిక వైరుధ్యాలూ, ఘర్షణలూ మనకు రెండవసారి విరామం యిస్తాయని ఆశించవచ్చునా — ప్రాక్ పశ్చిమాల విప్లవ ప్రతిఘాతుల శిబిరంలో, ప్రాచ్య పాశ్చాత్య దోపిడీదారుల శిబిరంలో, జపాన్ అమెరికాల శిబిరంలో, అంతర్వైరుధ్యాల మూలంగా, రష్యన్ ప్రతిఘాత విప్లవానికి సహాయం యివ్వడానికి పశ్చిమ యూరపియన్ ప్రతిఘాత విప్లవం చేసిన ప్రయత్నం భగ్నమైనప్పుడు మొదటిసారి విరామం లభించినట్లు?

దీనికి జవాబు చాలా చాలా విషయాలమీద ఆధారపడిందని చెప్పాలి. మొత్తం పోరాటంయొక్క పర్యవసానాన్ని యెలా జోస్యం చెప్పగలుగుతున్నామంటే, దీర్ఘకాలంమీద భూమండలంమీది జనాభాలో అత్యధిక భాగానికి పెట్టుబడిదారీ వ్యవస్థే పోరాటానికి కావలసిన జ్ఞానమూ, శిక్షణా యిస్తున్నది గనుక.

రష్యా, యిండియా, చైనా, వగైరా దేశాలలో ప్రపంచంలోని జనాభాలో అపారమైన మెజారిటీ వుందన్న విషయమే పోరాట ఫలితాన్ని నిర్ణయిస్తుంది, అంతిమ పరిశీలనలో. సరిగ్గా యీ మెజారిటీయే గత కొద్ది సంవత్సరాలలో అసాధారణ వేగంతో విమోచన పోరాటంలో ప్రవేశించింది; అందువల్ల ప్రపంచ పోరాటపు అంతిమ ఫలితం గురించి ఛాయామాత్రమైన సందేహం కూడా వుండజాలదు. యీ అర్థంలో, సోషలిజంయొక్క పరిపూర్ణ విజయం పూర్తిగా, నిర్నిబంధంగా నిశ్చిత వౌతుంది.

కానీ మనకు ఆసక్తి గల విషయం సోషలిజంయొక్క విజయం అనివార్యమనేది కాదు. పశ్చిమ యూరపియన్ విప్లవ ప్రతిఘాత రాజ్యాలు మనలను నలిపివేయకుండా వుండడానికి రష్యన్ కమ్యూనిస్టు పార్టీ అయిన మనం, రష్యా సోవియట్ ప్రభుత్వమైన మనం, అవలంబించవలసిన యెత్తుగడలు యేవి అన్నదే. విప్లవ ప్రతిఘాత సామ్రాజ్యవాద పశ్చిమానికీ, విప్లవకర జాతీయవాద ప్రాచ్యానికీ మధ్య, ప్రపంచంలోకెల్ల అత్యంత నాగరికమైన దేశాలకూ, ప్రాచ్య ధోరణిలో వెనుకబడిన, కానీ మెజారిటీగా వున్న, దేశాలకూ మధ్య జరుగనున్న సైనిక ఘర్షణ వరకూ మన ఉనికిని సందేహరహితం చేసుకోడానికి యీ మెజారిటీ దేశాలు నాగరికం కావాలి. సోషలిజంలోకి నేరుగా పోవడానికి మనకు రాజకీయంగా అవసరమైనవన్నీ వున్నప్పటికీ, తగినంత నాగరికత లేదు. మనల్ని మనం రక్షించుకోడానికి యీకింది విధానం అనుసరించాలి.

కార్మికులు రైతులమీద తమ నాయకత్వాన్ని నిలుపుకునే రాజ్యాన్ని, రైతుల విశ్వాసాన్ని నిలుపుకునే రాజ్యాన్ని, నిర్మించడానికి మనం కృషిచేయాలి; మిత వ్యయాన్ని

అమలులో పెట్టడంద్వారా మన సాంఘిక సంబంధాలనుండి దుబారాను పూర్తిగా తొల గించివేయాలి.

మన రాజ్యయంత్రాంగాన్ని కనీస వ్యయం అయ్యేటట్లు కుదించాలి. జారిస్టు రష్యానుండి, దాని బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ యంత్రాంగంనుండి, మనకు దుబారా ఖర్చు చాలా వచ్చింది; ఆ లక్షణాల నన్నిటినీ మనం తొలగించాలి.

యిది రైతు సంకుచితత్వపు రాజ్యం కాబోదా?

కాదు; రైతాంగంమీద కార్మికవర్గం తన నాయకత్వాన్ని నిలుపుకునేటట్టు మనం జాగ్రత్తపడితే, మన దేశ ఆర్థిక జీవితంలో సాధ్యమైనంత యెక్కువగా మితవ్యయం పాటించడంద్వారా, మనం మిగిలించే ప్రతి కోపెక్కునూ మన భారీ యంత్ర పరిశ్రమనూ, విద్యుదీకరణనూ అభివృద్ధి చేసుకోడానికీ, హైడ్రాలిక్ పద్ధతిద్వారా పీటును తవ్వి తీయడానికీ, వోల్‌హోవ్‌స్త్రోయ్* నిర్మాణం పూర్తిచేయడానికీ, మొదలైన పనులకు వినియోగించగలం.

దీనిమీద, దీనిమీద మాత్రమే, వుంది మన ఆశ. యీ పని చేసినప్పుడు మాత్రమే మనం, అలంకారికంగా చెప్పాలంటే, గుర్రాలు మార్చుకోగలం – రైతు బీదరికం అనే గుర్రాన్ని వదలి, ధ్వంసమైన వ్యవసాయ దేశానికి తగిన ఆర్థిక వ్యవస్థ అనే గుర్రాన్ని వదలి, కార్మికవర్గం కోరుతున్న, కోరక తప్పని, గుర్రానికి, భారీ యంత్ర పరిశ్రమ, విద్యుదీకరణ, వోల్‌హోవ్‌స్త్రోయ్, వగైరాల గుర్రానికి, మారగలం.

అదీ నేను పునర్నిర్మాణం చేయబడిన 'కార్మిక కర్షక తనిఖీ'యొక్క కర్తవ్యాలతో మన పనియొక్క, మన విధానంయొక్క, మన యెత్తుగడలయొక్క, మన వ్యూహంయొక్క సాధారణ పథకాన్ని నా మనసులో యెలా లంకె వేస్తున్నదీ. 'కార్మిక కర్షక తనిఖీ'ని అసాధారణమైన ఉన్నత స్థాయికి యెత్తడంలోనూ, కేంద్ర కమిటీ హక్కులతో దానికి నాయకత్వం యివ్వడంలోనూ, వగైరా, వగైరాలలోనూ మనం దానికి యివ్వవలసిన అసాధారణమైన జాగ్రత్తనూ, అసాధారణమైన శ్రద్ధనూ సమర్థించేది, నా అభిప్రాయంలో, యిదే.

యీ సమర్థన యేమిటంటే, మన ప్రభుత్వ యంత్రాన్ని సమగ్రంగా ప్రక్షాళన చేయడంద్వారా మాత్రమే, దానిలో పరమ అత్యవసరమైనది తప్ప ప్రతిదాన్నీ కనీస

---

*వోల్‌హోవ్‌స్త్రోయ్ – వోల్‌హోవ్ నదిమీద మొదటి పెద్ద సోవియట్ జలవిద్యుత్ స్థావర నిర్మాణం. యిది 1918లో ప్రారంభించబడింది; కానీ, 1921లో, అంత ర్యుద్ధం తర్వాత, మాత్రమే పని వేగంగా జరిగింది. వోల్‌హోవ్ జలవిద్యుత్ స్థావరం 1926లో ఉత్పత్తి ప్రారంభించింది. – సం.

స్థాయికి కుదించడంద్వారా మాత్రమే మనం నిలబడగలమని నిశ్చయంగా వుండడం. అంతేగాక, చిన్న రైతు దేశం స్థాయిలో కాక, సార్వత్రిక పరిమితి అనే స్థాయిలో కాక, భారీ యంత్ర పరిశ్రమలకు స్థిరంగా పురోగమించే స్థాయిలో మనం నిలబడగలం.

మన 'కార్మిక కర్షక తనిఖీ'ని గురించి నేను కనే ఉదాత్తమైన కలలు యివి. అందుకనే నేను దానికొరకు ఒక ''మామూలు'' ప్రజా కమిస్సారియట్‌తో అత్యంత అధికారయుత పార్టీ సంస్థయొక్క సమ్మేళనం జరగడానికి పథకంవేస్తున్నాను.

మార్చి 2, 1923

'ప్రావ్ద,' నం. 49, 1923 మార్చి 4

పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదాన్ని గూర్చి, కూర్పును గూర్చి మీ అభిప్రాయాలను ''ప్రగతి'' ప్రచురణాలయానికి తెలుపండి.

మీ అభిప్రాయాలను దయచేసి ఈకింది చిరునామాకు పంపండి:

Progress Publishers
17, Zubovsky Boulevard,
Moscow, USSR

**Маркс. Энгельс. Ленин**

О КОММУНИСТИЧЕСКОМ ОБЩЕСТВЕ

*на языке телугу*

**Marx. Engels. Lenin**

ON COMMUNIST SOCIETY

*in Telugu*